


పర్వతమార్గము

కళాకారుడు : శ్రీ దేవీప్రసాదరాయచౌదరి.



విరోధి సం.
శ్రావణము

భారతి

సంపుటము 26
సంచిక 8

స్వాతంత్ర్యసౌధము

శ్రీ కె. అన్నమరాజశర్మ

రాలగాదు - స్వీయకళేబరాల జేర్చి,
మట్టిగా - దాత్మమాంసముల్ గుట్టగూర్చి,
కలపగాదు - నిజానురాగముల జేర్చి,
కట్టినార మీ వెలలేని కట్టడమ్ము!

మరణమో! కాక, స్వాతంత్ర్యమందిరైక
రచనమో! యొండె ప్రాప్యధర్మములు గాగ,
అంతరాయసహస్రమ్ము లతిగమించి
పోరి, మావారు జయరమం బొందినారు.

సౌధనిర్మాణకౌశలస్వాంతులైన
స్వార్థరహితులు! త్యాగులు! సత్యరతులు!
దివ్యనక్షత్రతులితదీధితుల బరగి
కాలవీథి నేనాటికిం గానబడరె?

ఉజ్వలజ్జీవపాషాణ మొక్కటొకటి
తరుణహృదయాల వింతసౌధముల గట్ట
తీరని నిజప్రబోధవాక్ప్వార మెగచు
ప్రతినినాదమ్ము కావ్యశిల్పముల బరగె.

ఆత్మ దలపని దురవస్థ లనుభవించి,
వట్టిచేతుల పార్మ్యమ్ము వదలి చనగ
తచ్చరిత్రమ్ము భావిసంతానమునకు
విశ్వకళ్యాణబోధైకవేదమయ్యె!

ప్రాణమానధనమ్ములం బణము లొడ్డి,
చెరల - నురికంబముల జేర నురికి యురికి,
మాదు స్వాతంత్ర్యయోధులు మడిసి రకట!
తీరరాని తద్ఋణ మెట్లు తీర్చగలము?

నివేదన

•

"సాహితీవర్ధన"

దేవా ! నీ పదసన్నిధిన్ హృదయతంత్రీసంస్రవన్మంజుగీ
తివైదగ్ధ్యము చూపఁబోయెద మహాంధీభూతధీవాంఛ – ప్ర
జ్ఞావారాన్నిధివైన పారిషదలోకానన్ వినోదించుచున్
నీ వెన్నందును స్వీకరింప విట మస్మీ రాజనార్చావిధుల్.

ఏలా నీవె రచించి యిచ్చితివి ? నా కీ స్నిగ్ధశారీవ హే
లాలీలామహతీవిపంచి - అది యాలాపింప నేలా వినం
గా లేనప్పుడు ?-నీదు సృష్టియెడలన్ కానంత ఆత్మీయతల్
మేలే ? నీవె వహింపకుండుటలు స్వామీ ! ఆర్షవిద్యాగురూ !

సామామ్నాయమహాపవిత్రపథ భాస్వత్స్రోత గాంధర్వ వి
ద్యా మాహేశ్వరమూర్తులు స్నమిత నేత్రారంభవిక్షేప లీ
లామాత్రానతకచ్ఛపీనినదహేలాలత్మ్ము లో దేవ ! నీ
శ్రీమాంగళ్యపరీత పాదయుగళీ సేవాపరుల్ వైణికుల్.

స్వామీ ! గద్గదమద్గళ మ్ముపనిషద్భామాశిరోరత్నశో
భామందారుణితత్వదీయచరణాబ్జస్పర్శనల్ పొందెనా !!
సామోదాశ్రుపరంపరాకలితభాషారూపవచ్ఛ్రావ్యగీ
తీమాధుర్యఝురీతతిన్ పరువులెత్తింతున్ త్వదర్థమ్ముగన్.

ఈయర్థమ్ము ఫలింపజేయుటకు తండ్రీ ! నిన్ను ప్రార్థించెదన్
నీయాస్థానపు వృద్ధవైణికులు చాంద్రీప్రోదినీభూత త
ద్గేయాఘామృతవీచికాక్వణనమం దీముగ్ధవీణాస్వనిన్
నీ యాదేశమునన్ గ్రహించు విధమున్ - నిత్యార్చనావేళలన్.

తమిళ వాఙ్మయమునందలి

భక్తిసాహిత్యము

శ్రీ కోరాడ రామకృష్ణయ్య

మానవుడు సంఘజీవికదా! ఒక మనుష్యుడు, లేదా ఒక కుటుంబము ఇరుగుపొరుగువారితో సంబంధం లేకుండా ఏవిధంగా జీవింపలేడో ఆ విధంగానే ఒక జాతియొక్క భాష, భావాలు, సాహిత్యం మొదలైనవి ఇరుగు పొరుగున నున్న వారితో సంబంధం లేకుండా ఉంటాయనుకోడానికి ఏమాత్రం వీలులేదు. అయితే చారిత్రకదృష్ట్యా వీనిని పరిశీలించక పోవడముచేత, ఒక భాషవారు మరియొక భాషాసాహిత్యాలను గూర్చి తెలుసుకుందామనే ఉత్సాహం చూపకపోవడంచేత, ఆ సంబంధా లెప్పు డెల్లా కలిగి వారో అనే విషయాన్ని మనం సామాన్యంగా గమనించకపోవడమే తటస్థిస్తూ ఉంటుంది.

మన తెలుగుదేశానికి దక్షిణాన అరవదేశం, పశ్చిమాన కన్నడ మహారాష్ట్ర దేశాలు, ఉత్తరాన ఓఢ్రదేశం ఉన్నాయి. ఈ భాషలన్నిటిలోని సాహిత్య రీతులను గూర్చి మనం తెలుసుకొనవలసినదే. కాని వీనిలో ఓఢ్ర మహారాష్ట్ర భాషా సాహిత్యాలతో కంటె అరవ కన్నడ భాషా సాహిత్యాలతో మనకు సహజంగా ఎక్కువ సంబంధం ఉన్నది. కాబట్టి వాటినిగూర్చి తెలుసుకోవడం ఎక్కువ అవసరం. మనకు పొరుగున గల యీ భాషలన్నిటిలోను, మనకు దక్షిణాన గల అరవదేశ భాషా సాహిత్యమే చాలా ప్రాచీనమైనదిగా కనబడుతోంది. కన్నడాంధ్రములలో గూడా అట్టి సాహిత్యము లేదని చెప్పడానికి వీలులేదుగాని, ఇక్కడి చారిత్రక పరిస్థితులనుబట్టి, అనగా క్రీస్తు శకారంభ కాలమున నీదేశపు ప్రభువులైన ఆంధ్రరాజులు బౌద్ధమతాన్ని, ప్రాకృతభాషను విశేషంగా ఆదరించినవా రగుటచేత, ఈ భాషలలోని రచనలుకూడా అంతరించిపోయినవి. కాబట్టి యీ భాషలలో మనకు లభ్యమగుచున్న సాహిత్యం సహజమైన దేశి సాహిత్యము కాక, తరువాతి సంస్కృత భాషా సాహిత్య సంస్కారములతో గూడిన రచనలే అగుట తటస్థించినది. ప్రాచీన తమిళభాషాసాహిత్యముపైన, ఈ సంస్కృత భాషా సాహిత్య సంస్కారము కన్నడాంధ్రములపై వలె నంత గాఢముగా పని చేసిన ట్లగపడదు.

ప్రాచీన తమిళ వాఙ్మయాన్ని సంఘ వాఙ్మయమంటారు. ఈ తొలియుగము కొన్ని వేల యేళ్ల పరిమితి గలదని చెప్పే కథలు కలవుగాని, మొత్తముమీద నిది క్రీస్తు శకారంభమునాటి దని పలువురు పండితుల యభిప్రాయము. ఈ కాలపు రచనలలో జైన బౌద్ధ మతముల ప్రాబల్యమే హెచ్చుగా కనబడుతుంది. దీని తరువాతి యుగమే భక్తిసాహిత్య యుగము. ఇందు వైదిక మతాభినివేశముతోపాటు సంస్కృత ప్రాబల్యముకూడా కనబడుతుంది. జైన బౌద్ధమతములను ప్రతిఘటించుటకై శైవ వైష్ణవములు ప్రాధాన్యమును బొందుటచేత, తత్ప్రతిపాదకములై, భారత రామాయణాదులలోను, పురాణములలోను ప్రసిద్ధములైన కథలకు గాథలకు గూడ ప్రాధాన్యం కలిగింది. మత తత్త్వ భావములలో నార్య సంప్రదాయమే ప్రబలమైనను, ఛందస్సాహిత్యవిషయములలో మాత్రము దేశీయ సంప్రదాయములే నిలిచియున్నవి. తెలుగున నా కాల

ము వాటికి సంస్కృత సాహిత్య సంప్రదాయము ప్రబలి క్రీ. శ. ౬,౭ శతాబ్దుల వాటికి దీర్ఘ సంస్కృత సమాసములతో గూడిన స్రగ్ధరాది వృత్తరచన ప్రారంభమైనది. ఇక మన పొరుగునగల ఓఢ్ర మహారాష్ట్ర భాషలలోని సాహిత్యం ఇంకా అర్వాచీనము. అంతే కాదు. ఆ భాషలే ప్రాకృతభాషాజన్యములై సుమారు క్రీ. శ. ౧౦వ శతాబ్ది ప్రాంతమున ఏర్పడిన వగుటచే అందలి సాహిత్యములు కేవలము సంస్కృత ప్రాకృతభాషా సాహిత్యములపై నాధారపడి యేర్పడినవే యని వేరె చెప్పనక్కరలేదు. ఇక ఈ దక్షిణదేశ భాషలలో—సహజమై కనపడుచున్న దేశి శబ్దజాలము వలెనే, సాహిత్యంలో కూడా సహజంగా దేశి సంప్రదాయబద్ధమైన సాహిత్యం కొంత ఉన్నది. కన్నడాంధ్రములలో నిది కాలగతిని మరుగుపడిపోయినా, తమిళములో మట్టుకిది కొంతవరకు నిలిచి యున్నదని చెప్పవచ్చు. కాబట్టి మన పొరుగున గల తమిళ సాహిత్య లక్షణాలను మనము కొంతవరకైనా తెలుసుకున్నామంటే, మన సాహిత్యంలో దేశిరచనా లక్షణాలను కూడా గుర్తింప గలిగినవార మవుతాము. అయితే— ఏమిటా దేశి ఫక్కి అనేది! మన భారత రామాయణ హరివంశ విలాసాదులు, మన మనుచరిత్ర వసుచరిత్ర విజయ విలాసాదుల రచనకంటెను భిన్నమైనదా— అయితే దానిలో పెద్ద విశేష మేముంటుంది, అని మీ రడుగవచ్చును. ఇది మన భాషలో ఉద్గ్రంథములే కావచ్చును. కాని యివి సంస్కృత సాహిత్య రచనాఫక్కి ననుసరించి రచింపబడినవి. అంతకు పూర్వం మన దేశంలోకూడా, ప్రాచీన తమిళ వాఙ్మయంలో వలెనే, ఇప్పటికీ ఇంకా సామాన్య జనుల పదములు పాటలు మొదలగువానిలో కొంతవరకు నిలిచి యున్న దేశిరచనాఫక్కి, తెలుగు కన్నడాలలో నుండెడిదని తమిళ వాఙ్మయ లక్షణాలనుబట్టి మనము తెలుసుకో గలుగుటయే ఒక గొప్ప విశేషము. రచనా విషయంలో ప్రధానమైన వాటిలో నొకటి ఛందస్సుగదా. సంస్కృత శ్లోకాల అమరికకు మూలమైన గుణప్రస్తారము, అక్షర గణపద్ధతి గురులఘు నిర్ణయాదులకును, ప్రాచీన దక్షిణ దేశీయ సంప్రదాయసిద్ధములని చెప్పదగిన తమిళమునందలి సేర్, నిరైల లక్షణమునకును, వాని ప్రస్తారము, మాత్రా గణపద్ధతి, వాని మూలముగా ఏర్పడిన వెంబా, కలిప్పా, అగవల్‌పా మొదలగు పద్యముల రచనా రీతికిని చాలా భేదము కనబడుచున్నది. కన్నడాంధ్ర సాహిత్యములలో నిటీవల శార్దూల మత్తేభాలు, స్రగ్ధరలు ప్రవేశించినా, ప్రాచీన మనదగిన దేశి సాహిత్యం ఇనేంద్ర చంద్రాది మాత్రాగణ బద్ధములగు రచనలకే, అనగా రగడ, ద్విపద, షట్పది, అక్కర, గీతిక మొదలగు రచనలకే ప్రాధాన్యం ఉండేది. సంస్కృతమందువలె విచ్ఛేదరూప యతిగాక తెలుగులో వలెనే వర్ణసామ్యరూపమగు వడి, ప్రాస కూడా— మోనై, ఎదుగై అను పేర ఎనిమిదేసి భిన్నరీతులు గలవై తమిళ సాహిత్యంలో ప్రతిపాదింపబడుచు వచ్చినవి. పద్యములకు నాలుగేసి పాదముల నియమం కూడా ప్రాచీన దేశి సాహిత్యంలో లేదు. అది తెలుగు కన్నడాలలోవలె తమిళంకూడా విరుత్తం అను పేరుతో తరువాతి కాలమున వచ్చినదే. ఈ భాషలలోవలె శార్దూల మత్తేభాది సంస్కృత వృత్తాలు తమిళమున గ్రహింపబడనే లేదు. కావ్యవస్తువు విషయంలో కూడా జైన బౌద్ధమత సంప్రదాయములు కొన్ని వచ్చినా, వైదిక గాథలు, పౌరాణిక గాథలు తమిళమునందలి తొలియుగములోని సాహిత్యానికి కథావస్తువు కాలేదు. దేశీయ ప్రభువుల పరాక్రమాది సంకీర్తనము, వారి యుద్ధముల వర్ణనము, అందలి యువతీయువకుల ప్రేమకలాపాదికము, ఇవియే చాలవరకు కథావస్తువుగా నుండెడివి. ఇది తొలియుగమునందలి తమిళసంఘ వాఙ్మయ సామాన్య లక్షణములు—

క్రీ. శ. దశ శతాబ్ది మధ్యభాగములో జైన బౌద్ధములకు, బ్రాహ్మణ మతమునకును తమిళ దేశమున స్పర్ధలు పెరుగుట, కాలక్రమమున బ్రాహ్మణమత శాఖలే యగు శైవ, వైష్ణవ మతములు విజృంభించి వాని నణగ ద్రొక్కుటకు యత్నించుట సంభవించినది. క్రీ. శ. ౫, ౬ శతాబ్దముల ప్రాంతమునుండి బయలుదేరిన యీ శైవ వైష్ణవ మతావేశపరులగు నాయనారులు ఆళ్వారులు అను భక్తులు చేసిన రచనలు. తత్తద్దేవతాస్తుతి పరములగు సంకీర్తనలు మొదలగునవే

యీ తమిళవాఙ్మయమున రెండవ యుగమునందలి భక్తిసాహిత్య రూపమై వెలసినది.

ఈ భక్తి సాహిత్యమును పెంపొందించిన వారిలో వైష్ణవ భక్తులను ఆళ్వారులని, శైవభక్తులను నాయన్మారులని అంటారు. వైష్ణవ భక్తులలో ప్రసిద్ధులు ౧౨ గురు కాబట్టి పన్నిద్ద రాళ్వారులని, శైవ భక్తు ౬౩ రు అగుటచే అరుపత్తిమువ్వర్ నాయన్మారులని ప్రసిద్ధి. వీరందరు ఆ కాలమున నీ దక్షిణదేశమున తత్తన్మతాభినివేశముగల పాండ్యచోళాది ప్రభువులాయా దేశ పుణ్యక్షేత్రములందు విశేషముగా దేవాలయములను దర్శించి, ఆ యా స్థలములందలి దైవతములను కీర్తించుటచేత, తమిళ వాఙ్మయములో నాయా క్షేత్రములు ప్రఖ్యాతి వహించుటయేగాక, ఆయా భక్తుల కవితావేశముతోబాటు వారి నిరూఢభక్తి ప్రపత్తులు ఈ సాహిత్యములో స్థిరమైన స్థానము నాక్రమించు కొనగలిగినవి. ఈ భక్తులు జైన బౌద్ధ మతస్థులతో వాదము సల్పి, తమ మతముల యాధిక్యమును స్థాపించుచు ప్రభువుల యాదరమును సంపాదించుచు జైన బౌద్ధములను వెంటాడజొచ్చిరి. కంచి, చిదంబరం, మధుర ఆ కాలమున నీ వాదములకు ముఖ్యస్థానములు. ఈ మతములకు స్థాయి కలుగజేయుటకై యనేక ప్రకదేశములం దీ దేవతలకు నుల్ల గోపురములు కట్టించబడినవి. అప్పటి శైవభక్తులలో తిరునావుక్కరసు, తిరుజ్ఞాన సంబంధర్, సుందరర్, అప్పర్, మాణిక్యవాచకర్ అనువారు సుప్రసిద్ధులు. ఈ మాణిక్యవాచకర్ మధుర రాజునొద్ద మంత్రిగా నుండి, సాక్షాత్ శివరూపమే యగు గురునియొద్ద శైవాగమ దీక్ష నొంది, చిదంబరమున బౌద్ధుల నోడించి, శైవమత ప్రచారము విరివిగా జేసి తిరువాచక మను మహాకావ్యమును రచించినవాడు. శైవభక్తుల రచనలే ఆళ్వారుల రచనలకంటె నధిక సంఖ్యాకములై జనసామాన్యమున విశేష వ్యాప్తి గలవై యున్నవి. కాని అగ్రజాతులలో వైష్ణవమునకే ప్రాధాన్యము కలిగినది. శైవమతభక్తుల రచనలను తేవారము లందురు. వీని నన్నిటిని సుమారు ౧౦వ శతాబ్ది ప్రాంతమున ప్రోవుచేసి యొక గ్రంథముగా సమకూర్చినవాడు నంబియాండార్ నంబి యనువాడు. వీనినే పదునొకండు తిరుమురై లని అంటారు. వీని వలెనే వైష్ణవాళ్వారుల రచనలను ప్రోవుచేసినవాడు శ్రీ నాథముని అనువాడు. అందు నాలుగువేల రచన లుండుటచేత దానికి నాలాయిరప్రబంధమని పేరు వచ్చినది. ఇది వైష్ణవ మతస్థులకు వేదతుల్యమై, ద్రావిడవేదమని ప్రసిద్ధిగాంచినది. అందు నమ్మాళ్వార్ రచించిన ప్రబంధములు వేదములని, తిరుమంగై ఆళ్వార్ రచించిన షడ్విధరచనలు షడంగములవంటివని వైష్ణవభక్తుల నమ్మకము. ఆళ్వారు లందరిలోను వీరు ప్రసిద్ధులగుటయేగాక తక్కినవారికంటె ఎక్కువ పుణ్యక్షేత్రములను దర్శించి ఎక్కువ స్తోత్రములను రచించినవారు. నాలుగువేల ప్రబంధములలో సగము పైగా వీరి రచనలే. ఆళ్వార్ శబ్దమునకు జ్ఞానఖని యని యర్థము. విష్ణుభక్తులకు వీరిద్వారా మోక్షము సిద్ధింపగలదని, వీరు విష్ణువుయొక్క శంఖ చక్రాద్యాయుధముల యవతారములని వారి నమ్మకము. శైవభక్తుల చరిత్రమునుగూర్చి పెరియపురాణ మను గ్రంథము తెలుపుచున్నట్లే వైష్ణవాచార్యుల చరిత్రలు తెలిపేది గురుపరంపర అను గ్రంథము. అందు వీరినిగూర్చి అనేకములగు అద్భుతకథలు, గాథలు కలవు. వీరు యుగాంతర పురుషులుగా గూడ చెప్పబడుచుందురు.

తిరుమంగై ఆళ్వార్ చోళదేశమునందలి తిరుక్కురయలూర్ గ్రామవాసి. చోళరాజునొద్ద సేనాధిపత్యము వహించినవాడు. కొంతకాలమునకు దానిని వదలివేసి, దేశాటనపరుడై సుమారు ౮౦ పుణ్యస్థలములను దర్శించి విష్ణు సంకీర్తనములను చేసినాడు. పెరియ తిరుమొழி, తిరుక్కురుందాండకం, తిరునెడుందాండకం, చిరియ తిరుమడల్, పెరియ తిరుమడల్, తిరువేళు కూత్తిరుక్కై అను షట్ప్రబంధములను రచించి, మహాకవియై నాల్ కవి ప్పెరుమాన్, అనగా చతుర్విధకవితా చక్రవర్తి అను పేరొందినవాడు. జైన బౌద్ధమతాలను, శైవాన్నికూడా ప్రతిఘటించి వైష్ణవ మతవ్యాప్తిని హెచ్చుగా సాధించినవాడు. ఒక బౌద్ధాలయమందలి స్వర్ణవిగ్రహమును దొరిపించి, ఆ సొమ్ముతో శ్రీరంగనాథుని యాలయమునకు తృతీయ ప్రాకార నిర్మాణము చేయించినాడట. శైవులు శివ

పారమ్యాన్ని నిరూపించుటకై అతని దక్షిణ వామాంగములందు బ్రహ్మవిష్ణు లుద్భవించినారని చెప్పినట్లు గాకే, ఈతడు విష్ణువే సృజించి, మూర్తిత్రయ రూపములు దాల్చి విశ్వవ్యాపియై యున్నాడని, శమ దమాదులు గలిగి ధర్మమార్గమున నేకైకభక్తి సల్పువారే ముక్తి బడయగలరని యీతడు ప్రతిపాదించినాడు. ఈ తిరుమంగై ఆళ్వారు క్రీ. శ. ౮ వ శతాబ్ది ప్రాంతము వాడని తెలియుచున్నది.

ఇక వెంబాఛందస్సులో అన్తాది యను విష్ణుస్తోత్ర రూపములగు శతకములను రచించిన పొయ్‌గై యాళ్వార్, ప్రదమాళ్వార్, పెయ్యాళ్వార్ అనువారీతనికి పూర్వులు. పల్లవరాజ్యములోనివారు. అంతాది యనునది తమిళ వాఙ్మయములోని యొక విశేషరచన. ఇందు ప్రతిపద్యము తుదియక్షరమే తరువాతి పద్యమున కాద్యక్షరముగా గ్రహింపబడుతుంది. పెయ్యాళ్వార్ చేసిన తిరుపతి వెంకటేశ్వరుని స్తోత్రమును బట్టి యాతని కాలమున కాదైవతమునకు హరిహర రూపము లుండెనా యని కొందరు తలంతురు. తిరుచంద విరుత్తం, నన్ముగన్ తిరువన్తాది, కావ్యములను రచించిన తిరుమళిశై యాళ్వార్ కూడ పల్లవ దేశము వాడే. ద్వాపరయుగమువాడని గురుపరంపర గ్రంథము తెలుపుచున్నది. ఈతడు గొప్పకవి. ఈతని రచనలు మృదుమధురములై యాతని సంస్కృతభాషా పాండిత్యమును వ్యక్తపరచును. తిరుప్పాణాళ్వారు, పనర్, అను ఒక క్రిందిజాతివాడు. శైవులలో నందనార్ వలెనే వైష్ణవులలో నీతడు నొక మహాభక్తుడు. ఈతనిని శ్రీరంగ దేవాలయములోనికి రానీయకపోతే, రంగనాథ స్వామియాజ్ఞచే నొక మహాముని యీతనిని తన భుజములమీద నెక్కించుకొని దేవాలయప్రవేశము చేయించినాడట. కాబట్టి యీతనికి మునివాహనుడను పేరు కలదట. కులశేఖరాళ్వార్ చేరదేశమువాడు. చేరపాండ్య చోళదేశములకు ప్రభువులు మంచి సంస్కృతపండితులు. ముకుందమాలాస్తోత్రమును రచించినవాడు. తమిళమున నూటికి పైగా హృదయవేదనా సూచకములగు స్తోత్రములను రచించినాడు.

తొండరడిప్పొడియాళ్వార్, పెరియాళ్వార్ అనువారలు చోళపాండ్యదేశస్థులు. వీరికే క్రమముగా విప్రనారాయణుడని, విష్ణుచిత్తుడని నామాంతరములు. ఈ పేర్లతో వీరాంధ్రవైష్ణవులకే గాక, వైష్ణవేతరులగు నాంధ్రసాహిత్యపరులకు గూడా చదలవాడ మల్లయ్య, సారంగు తమ్మయ్యలు వ్రాసిన విప్రనారాయణచరిత్రముల మూలంగాను, శ్రీకృష్ణదేవరాయల విష్ణుచిత్తీయము మూలముగాను సుపరిచితులయ్యే యుంటారు. విప్రనారాయణునిలో విశేష మేమంటే ఈతడు శ్రీరంగనాథునితప్ప రే యితరవిష్ణుదైవతమును సేవింపలేదు. కీర్తింపలేదు. అతని చరిత్ర అంతా ఆదైవముతో సంబంధించినదే. విష్ణుచిత్తుడు పాండ్యదేశమునందలి శ్రీవిల్లిపుత్తూరు బ్రాహ్మణుడు. రంగనాథస్వామి ప్రోద్బలముచే ఆ కాలమున శైవమతానికి పట్టుకొమ్మయైన మధురలో శైవుడగు రాజు ఏర్పాటుచేసిన సభలో వాదించి శైవమతమును ఖండించి, విష్ణుమతాధిక్యమును స్థాపించి, రాజుకు వైష్ణవ మిప్పించిన కథ రాయల ఆముక్తమాల్యద మూలముగా మనకు తెలిసినదే. ఆ కాలపు శైవవైష్ణవమతముల స్పర్ధ అప్పటి తమిళదేశపరిస్థితులను తెలిసికొనినగాని ఆముక్తమాల్యదకథను మనము బాగా గ్రహింపలేము. తిరుప్పావై అను చక్కని వైష్ణవ ప్రబంధమును రచించి యావజ్జీవకన్యకాత్వముతో విష్ణుభక్తురాలై యుండిన ఆండాళ్ అనునామె యీ పెరియాళ్వార్ కూతురని చెప్పుదురు. ఈమె రచించిన వరణసహస్ర మను ప్రబంధము వైష్ణవకుటుంబములలోని వివాహములలో పాడుదురు. ఇది విష్ణువు నామె కలలో వరించిన కథను గూర్చి తెలుపునదైనను, జీవాత్మ పరమాత్మైక్యమును ప్రతిపాదించునదై యున్నది. ఇక సుప్రసిద్ధవైష్ణవభక్తులలో మిగిలినవాడు నమ్మాళ్వార్. ఈతనికి శఠగోపర్ అని మరియొక పేరు. వెల్లాలకుటుంబమువాడు. తిరువాయ్‌మొళి, తిరువాశిరం మొదలగు అంతాదిరచనలచే సుమారుముప్పది పుణ్యక్షేత్రములలోని దైవతములను కీర్తించినవాడు. యోగాభ్యాసపరుడు. నాథముని, మధురకవి అనువారలీతని శిష్యులు. ఈతడు విష్ణుపారమ్యమును, సర్వవ్యాపిత్వమును మోక్షదాయకత్వమును గూర్చి తన

రచనలలో హెచ్చుగా ప్రతిపాదించినాడు. ఈతని కాలమునకు దక్షిణదేశమున జైన బౌద్ధమతములు క్షీణదశనొంది శైవవైష్ణవములకు గల స్పర్థకూడ కొంత తగ్గిపోయిన ట్లగపడును.

దీనినిబట్టి క్రీ. శ. ౧౦ వ శతాబ్దిప్రాంతమున జైన బౌద్ధములు కన్నడదేశమువైపునకు తొలగిపోగా తెలుగుదేశమునకు కలిగిన చోళవంశసంబంధమునుబట్టి, వైదికమతమే తెలుగుదేశమున నెలకొనుటకు దగిన యవకాశ మేర్పడినదనియు, కావుననే నన్నయ పంచమవేదం బనబరగు భారతము రచించుటకు, అందు వేదత్రయమూర్తులగు త్రిపురుషులనే స్మరించి పూజించుటకు దగిన యవకాశము కలిగినదనియు తెలపదగియున్నది. తమిళదేశమునందలి భక్తిసాహిత్యములో వైష్ణవమతప్రతిపాదకములగు నాలాయిర ప్రబంధాదుల జాతులలోను, శైవసాహిత్యము జనసామాన్యములోని క్రిందిజాతులలోను విశేషవ్యాప్తి గాంచినట్లు అగపడుచున్నది.*

* ఆలిండియా రేడియో-మద్రాసు కేంద్రము వారి సౌజన్యముతో.

న మ స్తే

శ్రీ ముదిగొండ కోటయ్యశాస్త్రి

ఈ మాయామయక సృష్టిపేటికలో
కాలాంతరముల కల్పసంపుటుల
ద్వంద్వాత్మయక భావాభాసల
విచిత్రరచనా విన్యాస్త ఘటనల
అమరించి -కలయించి

కర్మవికారిత ఘటనైనందిన
ప్రవృత్తి పథక ప్రయోజ్యపథముల
అభ్యుదయ ప్రతిభాసశ్రీలను
దుర్భర నారక దౌర్భాగ్యంబుల
వెలయించి-కలిపించి

వాక్కుల కందని వాస్తవికస్థితి
మనసున కెక్కని మర్మవీథిలో
అప్రాకృతాద్భుత మనంతగుణమై
శక్తి శక్తిమయ జడచేతనముల

ఒక్కడవై నిక్కువమై
అవిరళజ్ఞానానందావాప్తి వి
కాసావాసవికాసయోగంబుల
జాడల తెలిపే శాస్త్రసాధనల
సాధకజీవన సంస్కృతియముగ
అమరించి-భ్రమ హరియించి

సోహంభావ విశుద్ధోపాసక
నేతి-నేతి పద నిశ్చయసిద్ధ
బ్రహ్మాత్మైక్యప్రాప్తి మూలమై
విశ్వరూపమును విరూపమును నా
శివుడవై-శివంకరుడవై

పంచకృత్యమయ ప్రపంచనాటక
రంగవినోద విభంగభంగిమగ
అఖండతాండవ ముఖప్రకాశిత
ప్రసన్నపావన పరమాత్ముడవగు
నటరాజా- నమస్తే

ప్రాణభిక్ష

శ్రీ మదివర్తి కొండమాచార్యులు

కాలాభ్రమ్ములు మ్రింగి త్రేన్చిన వహో కర్పూరఖండద్యుతుల్
పాలై పొంగెడు నాదు వ్యోమము; కరాళధ్వాంతపుఁ బందియం
దేలీలఁ గడద్రోతు నీ బ్రతుకు — న న్నీశూన్యవిశ్వక్షమా
గోళమ్మందున నిల్పి ఎందులకు సంక్షోభింపగా జేతువో !

౨

నా మేధస్సున విచ్చినట్టి నవమందారప్రసూన మ్మదే
దీ ? మాయ మ్మొనరించినా వటర ! మత్ హృత్ పుణ్యకేదారమం
దే మోసెత్తిన హర్ష సస్య మది యేదీ ? మాడ్చినావా ! — పరం
ధామా ! యెట్లు భరింతు నీ కడుపుకోతఁ, వేదనాతాపముఁ ?

౩

రమణీయమ్మయినట్టి మామకగృహారామ ప్రదేశాన ని
త్యము స్వీయామృతకంఠ మెత్తి హృదయ మ్మానందధారాభిషి
క్తముగా కూయు వనప్రియ మ్మెచట ? — స్తబ్ధమ్మైన యీ విశ్వవా
టి మనం జాలర — నిర్దయాత్మ నను తండ్రీ ! యెందు కేడ్పింతువో !

౪

దివ మెల్లగునో, రే యెటుల్ చనునో అఁ తీరంగబోనట్టి చిం
త విదారించెడి నెమ్మన; మ్మవధి లేదా తూఁటికిఁ ? నన్ను ఈ
నవవాసంత మహస్మహమ్ము దయ సందర్శింప నీ వేల ? సుం
త నచింతే — కనుదోయి యేమి అఘముఁ గావించె నయ్యా ప్రభూ !

౫

చివురాకుంగములఁ విదిల్చి, సుమరాజిఁ మట్టిపాల్సేసి, క్రొ
న్నవళమ్ముఁ జెడబాపి మ్రోడొనరుపఁ భావ్యమ్మె లేమావి ? నూ
త్నవధూరత్నముఖప్రహాసరుచులఁ స్వామీ కనఁ లేవ ? తీ
వ్రవిషాదాశ్రుజలమ్ము లోడ్చు నయనద్వంద్వమ్ము వీక్షింతువో ?

౬

తమముం జీల్చుచు వెల్గుచున్నయది స్నిగ్ధస్నేహసంపూర్ణహా
ప్రమిదఁ జ్యోతి: ఘటింతు నంజలిని — ఆర్పంబోకు ఝంఝసమీ
రము పై కొల్పి; తమస్సునం దెటుల నిర్వ్యాజప్రమోదాచ్ఛరే
ఖ మహాత్మా ! కనుగొందు ? త్రెంపకుర కాంతాసూత్రబంధమ్ములఁ !

నన్నయ్యగారి ప్రసన్న కథా కలితార్థయుక్తి

ప్రధాన కథ ౨

శ్రీ విశ్వనాథ సత్యనారాయణ

భీముని జంపుటకు చేసిన ప్రయత్నములు వ్యర్థమైనతర్వాత దుర్యోధనుడు మరల పాండవుల జోలికి పోలేదు. వారియందలి యతని యసూయ దినదినాభివృద్ధి బొందుచునే యుండెను. తరువాత ద్రోణాచార్యులు వచ్చుట, వీరందరకు విలువిద్య నేర్పుట, పైన కుమారాస్త్రవిద్యా ప్రదర్శనము జరుగు కథ యారకే జరుగును. ఈ యస్త్రవిద్యాప్రదర్శనము కథ పెరుగుటలో రెండవ ఘట్టము.

రాజకుమారు లందరు ప్రదర్శనారంభమందు ధనుస్సు లెక్కుపెట్టి వరుసగా నిలుచుండిరి. అపుడు వారు "ఉద్యద్ధ్వజశ్రేణీరమ్యులు."

ఈ నాటికి కౌరవపాండవులకు గల మాత్సర్యము పెద్దలందరకు దెలిసినది. రాజధానిలో నందరకు దెలిసినది. తెలిసినదని యెట్లు తెలియుననగా? ప్రదర్శనారంభమున భీము దుర్యోధనులు గదాయుద్ధము చేసిరి. వారిద్దరు పినతండ్రి పెదతండ్రి కొడుకుల వలె పోరాడలేదు. ఒకరి నొకరు సంహరింప వలయునన్నంతగా పోరాడిరి. ఈ సంగతిని నన్నయ్యగా రెంత విచిత్రముగా చెప్పిరో చూడుడు.
"పాండవ కౌరవ్య గదావిఘట్టన మహాకాండ ప్రోత్థమై భావిపాండవ కౌరవ్య రణాభిసూచనపటిష్ఠం బత్యుగ్ర ఘోరాకృతిన్."

ఇది యాశ్చర్యము. సామాన్యముగా జూచినచో భవిష్యత్తులో నెట్లును యుద్ధము జరుగబోవుచున్నది గాన నిట్లు వ్రాసెనని విచారించకుండ బోవలయును. కాని యర్థ మది కాదు. భీమదుర్యోధనుల పరస్పరవిజిగీషయు, వారి క్రోధములును నాటికే పండియున్నవి. అవియే భారతకథయంతయు నిట్లు జరుగుటకు కారణము.

వారి "గదా కోలంబు సూచు జనుల పక్షపాత జనిత పరస్పర క్రోధవచనంబులు విని ద్రోణుండు రంగభంగభయంబున నశ్వత్థామునంబంచి వారి నిద్దర వారించి" ఈ వచనమువలన పాండుకౌరవుల విరోధభావము, ఆ విరోధము తీవ్రమైయుండుట, ద్రోణాదుల కా సంగతి తెలియుట, లోకములోన పాండవులు గొప్పయని కొందరు, దుర్యోధనాదులయందే యభిమానముగలవారు కొందరు, వారు వీరు తీవ్రముగా వాదించుకొనుట, గురుపుత్రుడు గనుక నశ్వత్థామమాట కౌరవపాండవులు సమానముగా మన్నించుట యంతయు నూహ కందుచున్నది.

ఆ పద్యము చివరి రెండు చరణములలో నీ వచనములో నన్నయ్యగారు చేసిన చమత్కార మిది. ఆనాటికి పాండవులు కౌరవులతో సాటియైరి. ప్రజలలో చాలమంది వారిని రాజులుగా మన్నింప తొచ్చిరి. వారి పక్ష మొకటి బయలుదేరెను. వారి నేమి చేయుటకును వీలులేదు. ఇంతటి పరిస్థితిని నన్నయ్యగారు రెండు మాటలలో చెప్పెను.

పోయినంతవరకు నిట్లుండుచునే యుండును. అందుచేత ప్రధానమైనవే వ్రాసెదను. కొంతసేపటికి కర్ణుడు రంగద్వారమున నిలిచి భుజాస్ఫాలనము చేసెను. ఆ ధ్వని కొండమీద పిడుగుపడ్డట్లుండెను. అందరు భయపడిరి. పాండవులు ద్రోణాచార్యునొద్దకు పోయిరి. నూరుగురు తమ్ములు దుర్యోధనుని జుట్టు

కొనిరి. అందరును ద్వారమువంక జూచుచుండిరి. కౌరవులు సుయోధనుని బరివేష్టింపగా భీమార్జున యములు ధర్మరాజు నేల పరివేష్టింపరు? ఏమిటి యీ రహస్యము? దుర్యోధనుడు ధృతరాష్ట్రు నంతటివా డైనాడు. అతడే వారి కండ. పాండవుల కిచట నండ యెవ్వరును లేరు. భీష్ముడు రెండు పక్షములవారికి సమానుడు. ద్రోణు డర్జుననియందలి ప్రేమచేత పాండవులయం దభిమానము గలవాడు. వారి కేదైన భయము వేసినచో ద్రోణునితో పోయి చెప్పికొందురు. ద్రోణుని మరుగు పార్థుడు. పాండవుల యీ స్థితి దీనియందు వ్యంగ్యభూత మగుచున్నది.

నన్నయ్యగారు కథ చెప్పికొనిపోవుచు జరిగిన విషయ మేదో చెప్పును. ఆ పరిస్థితులలో నది యట్లే జరుగును గాన నా పరిస్థితులు నీవు గా పుకట్టవలయును. ఇది యాయన శిల్పముయొక్క పరమరహస్యము.

ఆ వచ్చిన కర్ణుడు బాల భానుడు. నిజోజ్జ్వల త్కవచుడు. శశ్వత్కుండలోద్భాసితుడు. ఇచట 'నిజ' 'శశ్వ'చ్ఛబ్దములు నన్నయ్యగారే వాడగలుగుదురు. ఆ కర్ణుడు "జగత్కర్ణపూర్ణాలోలగుణుడు". వానిని జూచి యందర రాశ్చర్యపోయిరి. అతడు జనుల నందర నదల్చి చొత్తెంచి రంగమధ్యంబున నిల్చి కలయజూచి కృప ద్రోణాచార్యులకు నమస్కరించి యర్జును నాక్షేపించి యిట్లనియె." ఈమాటలనుబట్టి యెన్నో విషయము లూహింపబడుచున్నవి. అతడు "జగత్కర్ణపూర్ణాలోలగుణుడు" అనుటచేత కర్ణుడు ధనుర్విద్యాపండితుడని యెరుగనివా రచట నెవరు లేరని యర్థము. ఎందు కెరుగరు? యమునవద్ద హస్తిపురము. గంగవద్ద సూతునియిల్లు. ఒక దేశములో నిద్దరొక విద్యయం దుత్తీర్ణులుండగా లోక మిద్దరను గురించియు జెప్పికొనును. శరవిద్యాల వారొకరి నొకరి గెరిగియుందురు. కనీసము దూరముగానైన నొకరి నొకరు చూచుకొనియుందురు. కర్ణు డుద్ధతుడు. అతడు జనులనందర నదల్చి చొత్తెంచె ననుటచేత వాని యౌద్ధత్యము ధ్వనితము. ఇతడు కృపుడు, ఇతడు ద్రోణుడు, ఇత డర్జును డని వాని కెవరును చెప్పలేదు. వానికే తెలియును. తెలియునవగా సన్నివేశము చూచి గుర్తింపవచ్చును. అర్జునుని గుర్తించుట కష్టము. అతని నెప్పుడో దూరముగానైన చూచి యుండవలయును. అతనిని రావలదని యెవరు ననలేదు. నీ వెవ్వరవని యెవరు నడుగలేదు. ఈవిద్యలన్నియు నేనును జేయుదునని యెవరే చూపించుమని ద్రోణు డనుజ్ఞ నిచ్చెను. ఇది యంతయు నొక విచిత్ర సన్నివేశము. ఒక ప్రాంతములో నావిద్యలో నారితేరినవా రిద్దరుండిరని తెలిసినపుడు జరిగినది సన్నివేశము.

ఆవిద్య లేవి? ఆగ్నేయ వారుణానిల మేఘభూమి శైలాదృశ్యాద్యస్త్రములు ప్రయోగించుట. ఆ విద్యలు [illegible] పద్యములయం దున్నవి. ఆవిద్య లర్జునుడు ప్రదర్శించినపుడు కర్ణుడు లేడు. వానిని తాను చేయుదు నని కర్ణుడెట్లనెను? సరే నని ద్రోణుడెట్లనెను? కర్ణుడవే యెట్లు చూచెను? నన్నయ్య యిట్లెందుకు వ్రాసెను?

ధనుర్విద్య రెండువిధములు. ఒకటి బాణములు ప్రయోగించుటలోని లాఘవమును నేర్చుట. రెండవది మంత్రాధిష్ఠితమైన యస్త్రములు ప్రయోగించుట. కర్ణుకు శరలాఘవ కౌశలము తెలిసినవా డని యందరకు తెలియును. అవినముగానే యతడు జగత్కర్ణపూర్ణాలోలగుణుడు. అతడు సూతకులజు డగుటచేత వాని కస్త్రప్రయోగము తెలియరాదు. అతడు క్షత్రియుడని వదంతి లేదు. అతడు కానీనుడని వదంతి గలదు. కుంతికి పుట్టెనని తెలియనక్కరలేదీ వదంతి. లోకములో నధర్మసంబంధముచేత పుట్టినవాని నెవరు చెప్పుకొనరు? సూతునిభార్య గర్భవతి కాలేదు. పిల్లవాడు వచ్చెను. ఆ పొందుగింటివా రందరకు నెవరో కని పారవేసిన బిడ్డ డని తెలియును. ఆనోట నానోట బహుమందికి దెలియును. ఈ సంగతి లోకజ్ఞులైనవా రందరికి సులభగ్రాహ్యమే. నన్నయ్యగారు "లోకజ్ఞుడు."

ఇతడు సూతుడగుటచేత నస్త్రవిద్య యెట్లు తెలియును? తెలిసిన నవియే యేల ప్రయోగింపవలయును? ఎవరు నేర్పిన యస్త్రవిద్యయైనను ప్రదర్శించెడునవి యివియే. యుద్ధభూమిలో ప్రదర్శించెడునవి వేరు కావచ్చును. విద్యాప్రదర్శనమాత్ర ప్రయోజనము

కలిసి యది ప్రయోగించుటవలన జనసంక్షోభము కలుగదు. వాడు విద్య నేర్చినట్లు తెలియును.

వెంటనే దుర్యోధనుడు వానితో స్నేహము చేసెను. అతి దెన్నాళ్లనుండియో భీమునకు తాను జోడు; అర్జునున కెవడున్నాడన్న విచారములో నున్నాడు.

వీ రిద్దఱు ద్వంద్వయుద్ధమాడిరి. అపుడు కృపుడు నడుమ నిలిచి వారించి ద్వంద్వయుద్ధము వారి నడుమ జరుగరాదన్న యుద్ధసమాచారమునందు నిపుణుడు గనుక కర్ణున కిట్లనియె.

"కురుకులజుండు పాండునకు
కుంతికి పుత్రుడు రాజధర్మ బం
ధుర చరితుండు నీ వితని
తోడ రణం బొనరించెదేని వి
స్తరముగ నీదువంశమును
దల్లిని దండ్రిని జెప్పు చెప్పినన్
దొరయగుదేని నీ కితని
దోర్బలశక్తి నితండు చూపెడిన్."

అని కృపుడు పలికెను. "కొరయగుదేని" దొర = సమానము, రాజు అని రెండర్థములు. నీవుకూడ నితని వలె ప్రఖ్యాతమైన రాజవంశమునందు బుట్టితివో, నీ తల్లిదండ్రులు కూడ రాజవంశీయు లైనచో నితనితో నీవు ద్వంద్వయుద్ధము చేయవచ్చునని యర్థము. దానికి కర్ణుడు సమాధానము చెప్పలేడు. చెప్పలేదు. దుర్యోధనుని నేర్పిక్కడ నున్నది. ఇతడు దొరయనగా 'సమాను' డన్న యర్థము దీసివేసి 'రాజు'ను నర్థము స్వీకరించి కులముగాని, శౌర్యముగాని, సేనగాని కలవాడు రాజని చెప్పి రాజైన యర్జునునితో రాజుగాని యుద్ధము చేయరాదా? అయినచో నే నీతని కంగరాజ్య మిచ్చి యిప్పుడే రాజును చేసెదనని భీష్మధృతరాష్ట్రులకుం జెప్పి వెంటనే బ్రాహ్మణాశీస్సు, సింహాసనము, మణిమకుటకేయూరాదిహారములు, ఛత్రచామరములు కల్పించెను.

కృపుడు నా మాటకీ యర్థము కాదని యనలేదు. మఱి యెవ్వరు ననలేదు. ఇదిగో నే నీతని కంగరాజ్య మిచ్చుచున్నానని భీష్మధృతరాష్ట్రులతో ననెను. వారు సరే నాయనా నీ యిష్ట మన్నారు. ఈ యంగ రాజ్య మిచ్చుట కాతడెవడు? యువరాజుకూడ కాడు. పాండవులు రాకముం దతడగు నేమోయన్న యనుమాన మున్నను పాండవులు వచ్చినతర్వాత ధర్మరాజే యువరాజునని యందరకు దెలియును. ఇట్టి స్థితిలో దానెట్లిచ్చెను? భీష్మధృతరాష్ట్రు లెట్లంగీకరించిరి? తన మాటకు వేరర్థము దీసి దుర్యోధను డిట్లు చేయుచుండగా కృపు డెందు కూరకుండెను?

'దొర'యన్న శబ్దము కృపు డుపయోగించుట, దానికి దుర్యోధనుడు వేరర్థ మిచ్చి మాటాడుట, నాల్గింటి పద్యములలో నున్నది. ఇది యొక యలంకారము. దీనిపేరు వక్రోక్తి. శ్లేషచేతగాని, కాకువు చేతగాని యన్యార్థకల్పనము చేయుట వక్రోక్తి. ఇది యనేకపద్యగతమై యున్నచో తేలికగా గుర్తుపట్ట వచ్చును. దీనిమీది కథ నడిచిన నన్నయ్యగారు గ్రంథమును నాటకాంగముగా రచించిన లక్షణకర్త వంటివారు. ఈరీతిగా వక్రోక్తి కథాశిల్పాంగ మైనది.

కాని దుర్యోధనుడు కర్ణున కంగరాజ్య మిచ్చుటలో నధికారము లేదు. ధర్మము లేదు. న్యాయము లేదు. అందఱు మాటాడకుండ నెందు కూరకుండిరి? దుర్యోధనుని మాట కాదనలేరు. అతడు తక్కువవాడు కాడు. తాను యువరాజు కాకపోయినను, ముందు యువరాజగుటకు వీలు లేకపోయినను రాజ్యాంగములో నతని పలుకుబడి పుట్టినది. అతని సామర్థ్య మట్టిది. ఒక సమర్థుడైన మంత్రి నే నొకపని చేయుదుననగా రాజైన కాదనలేడు. అందులో నితడు రాజు కొడుకు; మహాబలశాలి; గదాయుద్ధనిపుణుడు; రాజకార్యవేత్త; "దాన సమ్మానంబుల బ్రకృతి జనంబులకు సంతోషంబు సేయువాడు". తానట్లు చేయుదునని, తానే పాండవులను వారణావతమునకు బంపుమని చెప్పునప్పుడు చెప్పెను. ఈ తన పలుకుబడినంతయు నుపయోగించి కర్ణున కంగరాజ్య మిప్పించెను. ఇది పెద్ద రాజకీయపు టెత్తు. ఇది తానే యువరాజు తప్పకుండ నగునట్లు చేయుటకు చేసిన ప్రయత్నము. ఇందులో నింత ప్రయత్న మున్నదని నన్నయ్యగారే ధ్వనించెను. దివసావసానమున "దుర్యోధనుండు కర్ణుం దోడ్కొని కరదీపికాసహా

ప్రంబుతో నిజమందిరంబున కరిగె" కరదీపికా సహస్రముతో నడచుట రాజలక్షణము. కర్ణుడు రాజాగనక వెళ్లనచ్చును. నిజముగా వెళ్లినది తాను. ఇది యంతయు నీతి పుష్పించుట. ఈ కథయంతయు దుర్యోధనుని సామర్థ్యమే వెల్లడించుచున్నది. అతడు పాండవుల యందు దుష్టుడే తప్ప యతని సామర్థ్యము సర్వజన భయాసహముగా నున్నది. ఎదురాడరానిది. అప్పటి యతని సామర్థ్యమెట్టిదో యందరికంటె కర్ణున కెక్కువ తెలియును. దుర్యోధనుని ప్రతిభయంతయు నతడు ప్రత్యక్షముగా చూచెను.

అందుకనియే దుర్యోధనునితో నిట్లనెను.

"బృహదబ్ధి మేఖలాఖిల
మహీతలక్షత్ర వరసమక్షమున మహా
మహిమాన్వితుగా నన్ను న
మహీశుగా జేసిన స్థితిసమర్థత వెలయన్"

ఇది కర్ణుడు గ్రహించినది, చూచినది, తెలిసికొనినది, అందరకు తెలిపినది. అతి సమర్థత యున్న గాని యీ పని సాధ్యము కాదు. పరిస్థితు లట్టివి.

నన్నయ్యగారు 'అతి సమర్థత' యన్న యొక్క మాట వాడి యెంతటి పరిస్థితిని యెన్ని మహార్థములను సంగ్రహించెనో చూడుడు. ఇది నన్నయ్యగారి శిల్పము. 'సారమతిం గవీంద్రులు ప్రసన్నకథా కలితార్థ యుక్తిలో నారయ'వలసినది.

దుర్యోధను డిట్లు చేసినప్పుడు ప్రతివానికిని గంటగింపుగానే యున్నది. కాని యెవ్వడును మాటాడలేడు. పాండవులకు గంటగింపుగానే యున్నది. వారేమనుటకు వీలు లేదు. వారి మాట సాగదు. విదురుడు, కృపుడు, ద్రోణుడు, వీరు మువ్వురే వారి యండ.

విదురుడు శాంతుడు. అతనికి నీతి చెప్పెడు నేర్పే గాని చేయించెడు నేర్పు లేదు. కృప ద్రోణులు వింటి యొజ్జలు. వారిమాటకు విలువేమి? అయినవాడు భీష్ముడు. అతనికి వారెంతయో వీరు నంతయే. చేతనయి ధర్మరాజు కూడ మరి యొకడో రాజ్య మింకొకనికో యిత్తునన్నచో సరే యనెడువాడేమో!

ఈ స్థితిలో పాండవులకు ఎదురాడు పలుకుబడి లేదు. సామర్థ్యము లేదు. కుటుంబబలము లేదు. తండ్రి రాజగుట లేదు. వా రూరకుండిరి. లోపల మండుచునే యుండెను. సహజముగా గూడ వినయవంతులు. అయినను వారిలో భీముడు కొంచెము పెగసు. దుర్యోధనుని లెక్కచేయని దత డొకడే. వారు వినయముగా నుండి తగిన వేళ ధృతరాష్ట్రుడు ధర్మరాజును యువరాజునుగా చేయునేమో యని యెదురుచూడ వలసినవారే గాని నీకీ యధికారము లేదను స్థితిలో లేరు.

కర్ణుడంగరాజైన తర్వాత నతని తండ్రి సూతుడు వచ్చి కొడుకును కౌగలించుకొనెను. అప్పుడు భీమునకు తెలిసెను. "నీవు కులమునకు దగిన ప్రతోదము గొని రథము గడపబోవుము." అర్జునునితో నీకు యుద్ధ మెందుకు? పురోడాశము కుక్కకువలె నంగరాజ్యము నీ కెందుకనెను. కర్ణుడు తెల్లబోయెను.

"తగన ప్రతోదము" 'తగన్' మీద 'కాన్' ప్రత్యయము చేసి దానికి ప్రాధాన్యమిచ్చుటలో నాక్షేప మెంత ధ్వనిత మగుచున్నదో చూడవచ్చును. ఈ రస ధ్వనిని ఘట్టించు నన్నయ్యగారి మార్గము లనంతములు. అత్యాశ్చర్యకరమైన మహాకవులయొక్క శిరోభూషణ మైనవాడు మాత్రమే చేయదగిన ప్రయోగ మీ ఘట్టములోననే యున్నది. కర్ణుడు తన యస్త్రకౌశల్యము చూపించిన తర్వాత నా నర్జునునితో ద్వంద్వయుద్ధము చేయుదలతునని యన్నదనగా నర్జును డతనిని "పిలువంగబడక సభలకు బలిమిం జను" పాపులు పోవు లోకములకు బోయెదవని యాక్షేపించెను. అనగా పార్థునకు కర్ణు డిట్లనియె.

"అనిన విని పార్థునకు ని
ట్లనియె నినాత్మజుడు-దుర్బలాయాసక్షే
పనిబంధమ్ములు పలుకక
ఘననిశితాస్త్రముల పలుక గడగుము పార్థా"

ఈ పద్యములో "దుర్బలాయాసక్షేపమ్ము"లను మాట యున్నది. "దుర్బలాశ్వాసాక్షేప"యని పాఠాంతరము. ఇక్కడ నర్థ మెట్లు? విగ్రహవాక్య మేది? ఏకో చెప్పుటకు వీలు లేదని కాదు. దుర్బలుడైన వాని యొక్క ఆయాసముతో గూడిన యాక్షేపములో

గూడిన నిబంధములని చెప్పవలయును. నిబంధమనుట చేత దుర్బలు లిట్టివి కల్పింతురని యర్థము. ఈ సమాసము మధురమైనది కాదు. ఏదోయొక క్లిష్టతగల సమాసము. ఆ కూర్పులో నొక వైలక్షణ్య మున్నది. ఆ వైలక్షణ్యము రసధ్వనికొక్క ప్రాణము. ఇందా క్షేపముయొక్క గాఢత్వము వ్యజ్యమాన మగుచున్నది. ఇట్టి స్థలముల నిట్టి సమాసముల గూర్చుట రససిద్ధులైన మహాకవులే చేయగలరు. ఇదివరలి యసలు కథకు వచ్చి భీముడు కర్ణు నట్లదలించగా కర్ణుకు తెల్లమొగము వేయగా భ్రాతృ పద్మవనమధ్యమ్మున నుండి దుర్యోధన మదాంధగంధసింధురంబు వెలువడివచ్చి భీముని 'అనిలజ' యని సంబోధించి కొన్నిమాటలు చెప్పెను. నీవు వాయుదేవుని కొడుకవు. నీ వింకొకని పుట్టుకను గూర్చి యెట్లు ప్రశ్నింతువని యర్థము. అంతటితో నాగక "నీ కిట్లని పల్కను తలపను నగునే" యని యనెను. నీ విట్లని నోటితో ననుటకు వీలులేదు సరిగదా యూహించుటకు గూడ వీలులేదని యాక్షేపణ.

ఇంత విచిత్రముగా వ్రాయు నన్నయ్య యెందు కర్థముగుట లేదు. 'పల్కను తలపను నగునే' యన్న మాటలు తీసివేసి యిట్లనుటకు వీలులేదు సరిగదా నీవిట్లూహించుటకును వీలు లేదనియే వ్రాసినచో మన మీ నాడు మాటాడుకొనుమాటల కా పలుకుబడి దగ్గరగా నుండి మన కర్థమగును. ఆహా యనిపించును. నన్నయ్యగారి నాటి పలుకుబడి సుంతదవ్వు ఆ భావమే యాధునికులు చెప్పెడు పద్ధతి కొంచెము వేరుగా నుండును. అది మనకు సన్నిహితముగా నుండి శీఘ్రముగ గ్రహింతుము. నన్నయ్య యర్థము కాక పోవుట కిదియు నొక కారణము.

దుర్యోధను డేదో చెప్ప 'వానితో డికేమి' యని కర్ణుకు తానును పసలిపోయెను. పాండవుల కా సభలో నున్న గౌరవ మట్టిది. వారిని దుర్యోధనుడు రాజకీయముగా లెక్కచేయడు. చేయలేదని పట్టించుకొనువారును లేరు. భీముడైనను దుర్యోధనునితో ప్రత్యక్షముగా మాటలాడడు. తానచట పరగృహవాసమునం బలె నున్నాడని తెలియును.

ఒక చిన్న విషయముగూడ చెప్పి యీ వ్యాసము ముగింతును. భ్రాతృపద్మవనమధ్యమునుండి దుర్యోధన మదాంధగంధసింధుర మన్నమాట చిత్రముగా నున్నది. ఏనుగు తామర పూవులను త్రుంచును. లీలగా త్రుంచును. వానియందాదరము లేనిది కాదు. వానితో నాడుకొనుట దాని కాహ్లాదకరము. కాని యా పూవులు సర్వము నశించును దుర్యోధనుడు మదగజము; అతని తమ్ములు తామరపూలు. ఇతని సామర్థ్యలీల వారి నాశనహేతు వగుచున్నది.



ప్లేటో అనుకరణవాదము

శ్రీ జి. వి. కృష్ణరావు

కళల తత్త్వం తెలిపేదానిని అలంకారశాస్త్ర మంటారు. ఈ తత్త్వవిచారం అత్యంతప్రాచీన కాలంనుంచి కనిపిస్తున్నది. వేదంలోకూడ ఈ శాస్త్ర విచారస్పర్శ ఉన్నదంటున్నారు.

ఏది ఎలా ఉన్నా అలంకారశాస్త్రంలో మొట్టమొదట వచ్చినది అనుకరణవాదం. అంతకు ముందు వాదాలు లేవని కాదు. కాని శాస్త్రమార్గం అవలంబించి ప్రతిపాదించినవాటిలో అనుకరణవాదమే మొదటిది. ఈ అనుకరణవాదంలో అనేక భేదాలున్నాయి. ఒకటి ప్లేటో ప్రతిపాదించినది. రెండు అతని శిష్యుడైన అరిస్టోటల్ ప్రతిపాదించినది. మూడోది భరతుని మతం. భరతుని మతమే ప్రాచీనతమమని వాదించేవారు ఉన్నారు. కాని అది వివాదగ్రస్తం. భరతుని మతం వదిలిపెడితే మొట్టమొదటిది ప్లేటో వాదమే.

ఏ వాదమైనా సమగ్రంగా అర్థంచేసుకోవాలంటే ఆ వాదం బయలుదేరిన నాటి సామాజికస్థితిగతులు, రచయిత జీవితచరిత్ర, అతనిచే ప్రతిపాదితమైన జ్ఞానస్వరూపం, అతని ఇతరకృతులు, తరువాత అతని వాదం పరిశీలించాలి. లేకపోతే అపార్థం చేసికోటం జరుగుతుంది. ముఖ్యంగా ప్లేటో అనుకరణవాదవిషయంలో చాలమంది అపార్థం చేసుకొంటున్నారు. అతని వాక్యాలకు తమ ఇష్టమైన అర్థాలు ఆపాదించుకొని అతని అభిమతానికి కేవలం వ్యతిరేకమైన అర్థంలో ఉదహరించటం జరుగుతున్నది. ఇలాంటి పొరపాటు జరగకుండా ఉండాలంటే పైమార్గం ఒక్కటే శరణ్యం.

అయితే ఒక్క వ్యాసంలో అది సాధ్యం కాదు. అందువల్ల ఈ వాదాన్ని అర్థంచేసుకోటానికి అత్యంతముఖ్యములైన విషయాలనుమాత్రమే ఇచ్చట ఇస్తున్నాను. వీటిలో మొదటిది జ్ఞానస్వరూపం. జ్ఞానవిషయంలో అతని మతాన్ని యీవిధంగా చెప్పవచ్చును:—

కన్ను, చెవి, ముక్కు, చర్మము, నాలుక అన్న పంచేంద్రియాలతో ఈ జగత్తును తెలుసుకొంటున్నాము. సూర్యచంద్రాదులను చూస్తున్నాము. పక్షుల కలకలారావాలు వింటున్నాము. పుష్పాదుల గంధం ఆఘ్రాణిస్తున్నాము. చందనాదుల శైత్యాది స్పర్శజ్ఞానం పొందుతున్నాము. శర్కరాదుల మాధుర్యాదికం అనుభవిస్తున్నాము. ఈ యింద్రియాలే లేకపోతే మనకు జ్ఞానమెక్కడిది? వీనివల్లనే జీవితం చరితార్థమౌతున్నదని భావిస్తున్నారు.

ఇంద్రియాలవల్ల చరితార్థత కలుగుతున్నదో లేదో అలా ఉంచుదాము. వీనివల్ల కలుగుతున్న దొక్కటే జ్ఞానమనిపించవచ్చును. కాని కొంచెం పరిశీలిస్తే అది యథార్థం కాదని తేలిపోతుంది. అక్షరాలు రానివారికి పుస్తకం చేతికిస్తామనుకోండి. వారు ఆ పుస్తకం ఆసాంతం చూడవచ్చును, చూస్తారు. అంతమాత్రంచేతనే వారికి పుస్తకంలోని విషయం తెలుస్తున్నదా? అలా కాదు: మరొక యింద్రియానికి విషయమైనదానినే తీసుకొందాము. కొందరు పరదేశులు మనకు తెలియని భాషలో మాట్లాడుకొంటూవుంటే వింటూవుంటామనుకోండి. అప్పుడు మనకు వారు మాట్లాడుకొనేది తెలుస్తుందా? లేదు.

సరే, అది అలా ఉంచుదాము. కన్నుద్వారా రంగు, ఆకృతి తెలుస్తున్నవి. చెవిద్వారా శబ్దం, నాసికద్వారా గంధం, చర్మంద్వారా స్పర్శము, నాలుకద్వారా రసం తెలుస్తున్నవి. అంతేకాని కంటిద్వారా శబ్దంకాని, చెవిద్వారా రంగుకాని తెలియటంలేదు. ఒక ఇంద్రియం గ్రహించేదానిని మరొక యింద్రియం గ్రహించటంలేదు. అయినా మనకు రూపరసశబ్దస్పర్శగంధాలు వేరువేరని తెలుస్తున్నాయి. వేరువేరు ఇంద్రియాలతో వీటిని గ్రహిస్తున్నామని తెలుస్తున్నది. ఇలాగే సత్యం, ధర్మం, సౌందర్యం మొదలైన భావాలు తెలుస్తున్నాయి.

కాబట్టి ఇంద్రియాలవల్ల కలిగేది ఒక్కటే యథార్థజ్ఞానం, లేక ప్రమ అంటే అర్థంలేదు. పోనీ

యింద్రియాలవల్ల ఎలాంటి జ్ఞానం కలుగుతున్నదో చూదాము.

నేను ఇప్పుడు ఈ బల్లదగ్గర కూర్చుని వ్రాసుకొంటున్నాను.* ఈ బల్ల నల్లగా, నున్నగా నిగనిగలు తేలుతున్నది. ఆకారంలో నాలుగు కాళ్లు కలిగిన దీర్ఘ చతురస్రం.

ఈ బల్ల గుణాలను జాగ్రత్తగా పరిశీలింతాము. కంటికి దగ్గరగా ఎదురుగా ఉన్న ప్రాంతం మరీ నల్లగా నిగనిగలాడుతున్నది. దూరంగా ఏటవాలుగ కనిపించే ప్రాంతం వెలవెలపోతున్నది. దూరము వాటము ఎక్కువయినకొలదీ తెల్లదనం ఎక్కువగా కనిపిస్తున్నది. ఇందులో ఏరంగు యథార్థం? నల్లని నిగనిగలా, వెల వెలలా? కాక తెలుపా?

రంగుసంగతి అలా ఉంచుదాము. ఆకారం సంగతి చూద్దాము. బల్లకు ఎదురుగా దూరంగా నిలబడి చూస్తే ఒకవిధంగాను, ఇంకా దగ్గరకు వచ్చి చూస్తే మరొకవిధంగాను, ప్రక్కవాటునుంచి చూస్తే మరొక విధంగాను కనిపిస్తున్నది. ఈ భిన్న భిన్న ఆకారాలలో ఏఆకారం యథార్థం? నేను చూస్తున్నది ఒకే బల్ల కదా!

ఇది అలా ఉంచి స్పర్శజ్ఞానం సంగతి చూదాము. ఈ బల్లను చేతితో తడివిచూస్తే నున్నగా ఉన్నది. నా చేతికి బల్లమీద ఎక్కడా ఎగుడు దిగుడులు కనిపించటం లేదు. భూతద్దం పెట్టి చూస్తే అన్నీ ఎగుడు దిగుడులే. ఇంకా బలవత్తరమైన సూక్ష్మదర్శిని పెట్టి చూస్తే కొండలు లోయలు కనిపిస్తున్నాయి. ఇక కాఠిన్యంసంగతి అందామా, నేను చేతిని ఎంత గట్టిగా అదిమితే బల్ల అంత కఠినంగా నాకు కనిపిస్తున్నది. కాఠిన్యంలో నాకు గోచరిస్తున్న యీ అనంత తారతమ్యాలలో ఏది నిజం?

ఇలాగే ప్రతిఇంద్రియంవల్ల ఒకే విషయాన్ని గూర్చి పరస్పరవిరుద్ధాలైన అనేకజ్ఞానాలు కలుగుతున్నాయి. కాబట్టి ఇంద్రియాలవల్ల శాస్త్రీయంగా ఇది యింతే, ఇంతకుమించి వెంట్రుకవాసి అటు లేదు, ఇటు లేదు అని చెప్పటానికి వీలైన జ్ఞానం కలగటం లేదు. అసలు ఇది యథార్థమనటానికికూడా వీలులేదు.

ఎందుకంటే ఇంద్రియాలు వ్యక్తిగతాలు. మీ యింద్రియాలు మీవి, నా యింద్రియాలు నావి. మీ యింద్రియాలతో నేనుకాని, నా యింద్రియాలతో మీరుకాని అనుభవం పొందలేమన్న సంగతి తెలిసినదే. వ్యక్తిగతాలైన ఇంద్రియాలవల్ల వ్యక్తిగతమైన అనుభవమే కలుగుతున్నదికాని యథార్థమైన అనుభవం కలగటం లేదు. నాకు అందంగా కనిపించిన ముఖం మరొకరికి వికారంగా కనిపించవచ్చును. నాకు వేడిగా ఉన్న గాలి మీకు చల్లగా కనిపించవచ్చును. ఇలాంటి అనుభవాలు అనుదినం ఎన్నో తగులుతూనే ఉంటాయి.

ఇది అలా ఉంచి యింద్రియాలు దోషసహితాలుగా ఉన్నప్పుడు కలిగే అనుభవం విపరీతం. గుడ్డినేత్రానికి తెల్లని శంఖం పచ్చగా కనిపిస్తుంది. ఒక చంద్రునికి బదులు, ఇరువురు చంద్రులు కనిపిస్తారు. జ్వరంవచ్చినవానికి పంచదార చేదుగా ఉంటుంది. పిచ్చివానికి లోకమంతా మరొకవిధంగా కనిపిస్తుంది. స్వప్నావస్థలో కలిగే అనుభవాలనుగూర్చి చెప్పాలంటే అదొక మహాభారతం అవుతుంది. అసలు జాగ్రదవస్థకూడా స్వప్నవిశేషమే అని వాదించవచ్చును. పైగా ఇంద్రియదోషం ఎక్కడ ప్రారంభిస్తున్నది, ఎక్కడ అంతమౌతున్నది అన్న ప్రశ్నకు సమాధానం శాస్త్రీయంగా లేదు.

ఈవిధంగా ఇంద్రియజ్ఞానం వ్యక్తికమూ, దుష్టమూ అవుతున్నది. పైగా మరొక దోషంకూడా ఇందులో ఉన్నది. ఉదాహరణకు ఏనుగునే తీసుకొందాము. ఈ ఏనుగు కొండకన్నా చిన్నది. లేడికన్నా పెద్దది. ఒకే ఏనుగు ఇటు చిన్నదిగాను కనిపిస్తున్నది. అటు పెద్దదిగాను కనిపిస్తున్నది. అంటే మనకు కనిపించే ఏనుగు స్థూలత్వం సాపేక్షమవుతున్నది. అంటే ఒక దానినిబట్టి మరొకదానిని తెలియటం కాని, కొలవటం కాని జరుగుతున్నది.

ఉదాహరణకు గుడ్డతాను తీసుకొందాము. ఆ తాను పొడవెంతో తెల్సుకోవాలంటే ఏమి చేస్తున్నాము? గజంబద్దతో కొలుస్తున్నాము. గజంబద్ద సరియైనది అయితే సరియైన కొలతే వస్తుంది. సరియైన బద్ద కాకపోతే సరియైన కొలత రాదు. బద్దననుసరించి కొలత ఉంటున్నది. అంటే తానుకొలత సాపేక్షమన్నమాట. తానుకొలత సాపేక్షమైనట్లే గజంబద్దకొలతకూడా సాపేక్షమే.

ఈవిధంగా మనకు పంచేంద్రియాలద్వారా కలుగుతున్న జ్ఞానమంతా సాపేక్షంగా ఉంది.

* ఈ ఉదాహరణ బెర్ట్రాండ్‌రస్సెల్ వ్రాసిన ***The problems of philosophy*** నుంచి పుచ్చుకొన్నాను.

ఇలాంటి సాపేక్షజ్ఞానం యథార్థం ఎలా అవుతుంది? యథార్థజ్ఞానం అభిలషించేవారు ఇలాంటి పొరపాటు రాకుండా చూడాలి. అంటే వ్యక్తికము, సాపేక్షము అయిన ఇంద్రియజన్యజ్ఞానం యథార్థజ్ఞానంగా పరిగణించటానికి వీలులేదు.

ఈమాట అనగానే యం. యన్. పీలు, డి. యన్. పీలు "మీ సూత్రాన్ని కాస్త కట్టిపెట్టండి. జగత్తులో ప్రతిదీ సాపేక్షమే. ప్రతిదీ పరిణామి. ఈ సాపేక్షత్వం, యీ పరిణామిత్వం మాత్రమే యథార్థం. అందువల్ల పరిణామరహితమూ, నిరపేక్షమూ అయిన పారమార్థిక (*absolute*) జ్ఞానం అసంభవం. అలాంటిది సాధ్యం కాదు. యథార్థం అంతకన్నా కాదు. అసలు అలాంటి పారమార్థికజ్ఞానం మీ స్వకపోలకల్పితజగత్తులో లభించవచ్చునేమోకాని మనం నివసిస్తున్న జగత్తులో లభించదు" అనవచ్చును.

మీరు కోరుతున్నట్లే అనుదాము. పసిగట్టటం దేనికి? బోర్లబెట్టటం దేనికి? మనకు కావలసింది యాథార్థ్యం. మీరు చెప్పేదానిలో యాథార్థ్యం ఉంటే తప్పకుండా స్వీకరించాలి. అయితే మీరి వాదం ప్రకారం ప్రతిదీ మారుతుంటుంది. అందువల్ల పారమార్థికజ్ఞానం అసంభవం. ఈ వాదాన్ని అంగీకరిస్తే ఏ గొడవులో తేలుతామో చూదాము.

మార్పు ధారావాహికం; నిరంతరం మార్పు జరుగుతూనే ఉంటుంది. ఈ క్షణంలో తెల్లనిది కానిది తెల్లనిదై, *ఆ తెల్లనిది నల్లనిదగా ఇంకా మారుతూనే* ఉంటుంది. అంతేకాని ఎప్పుడూ స్థిమితంగా ఒకేరంగు ఉండదు. అదే నిజమైతే తెలుపనో, నలుపనో, మరొకరంగనో నిర్దిష్టంగా చెప్పటానికి ఎలా వీలవుతుంది? ఇలాగే వీక్షణశ్రవణాదులకూ సగదా! కాక యీ వీక్షణశ్రవణాదిక్రియలు ఆగిపోవటం జరుగుతుందా? లేదు. ఎందుకంటే అన్నీ నిరంతరం మార్పు చెందేవేగా! అయినప్పుడు చూస్తున్నారు అనికాని, చూడటం లేదు అనికాని చెప్పటానికి వీలులేదు. ఇలాగే ప్రత్యక్షజ్ఞానమనికాని, అప్రత్యక్షజ్ఞానమనికాని చెప్పటానికి వీలులేదు.

ఏదీ స్థిరంగా, పరిణామరహితంగా లేదు అంటే దేనినిగూర్చి ఏమిచెప్పినా ఒప్పుకోవాలి. ఒక వస్తువు ఇలా ఉన్నదనికాని, లేక ఇలా లేదనికాని, ఇలా మారుతున్నదనికాని అంటా మనుకోండి. ఈ వాక్యంలోని "ఇలా" అనే మాటలో మార్పు లేదే కాబట్టి పరిణామవాదులకు తమ అభిప్రాయాలను వెలడించుకోటానికి ఇంతవరకూ తగిన మాటలుకూడా లేవు. ఇక కొత్తభాష సృష్టించుకోవాలి.

ఈ పర్యవలోకనంతో తేలిన విషయాలను మరొకసారి జ్ఞాపకం చేసుకొందాము. I ప్రత్యక్షజ్ఞానం ఒక్కటిమాత్రమే ప్రమ అనటానికి వీలులేదు. ఎందుకంటే (౧) స్మృతిజన్యజ్ఞానం జ్ఞానం కాకపోతున్నది. (౨) ప్రత్యక్షమే ప్రమ అయితే వీక్షణశ్రవణాదులవల్ల అన్యభాషాగ్రంథాలు, అన్యభాషాభాషితాలు తెలియాలి. (౩) గోత్వసౌందర్యాది సామాన్యజ్ఞానం యథార్థజ్ఞానం కాకపోవాలి. (౪) కేవలం ప్రత్యక్షమే యథార్థజ్ఞానమైతే భ్రమకు తావు లేకపోవాలి. (౫) తద్ద్వారా జ్ఞానవిషయంలో గురుశిష్యభేదంకాని, మనుష్యపశ్వాదితారతమ్యంకాని లేక అందరూ అన్నీ ప్రామాణికులూ ప్రమాణికాలూ కావాలి. (౬) స్వప్నాద్యవస్థలందు కలుగుతున్న జ్ఞానం యథార్థం కావాలి.

II కనీసం ప్రత్యక్షంకూడా ప్రమ అని అనటానికైనా వీలులేదు. ఎందుకంటే ఇంద్రియజన్యజ్ఞానమంతా సాపేక్షం, వ్యక్తికం. సాపేక్షము, వ్యక్తికము అయినది యథార్థజ్ఞానం కాజాలదు.

ప్రమ

ప్రత్యక్షం ప్రమ కాదు. సరే, మరి ఏది *యథార్థజ్ఞానం? అసలు యథార్థజ్ఞానం అనేది ఒకటి* ఉన్నదా? ఉంటే దానిలక్షణ మేమిటి? అలాంటిది మానవునకు సాధ్యమా? ఇలాంటి ప్రశ్నలు వస్తాయి.

ఒకడు ఎరుగును అంటున్నాము అంటే, ఏదో ఒకటి ఎరిగిఉండాలి. ఆ ఏదో ఒకటి ఉన్నదే అయి ఉండాలి. లేనిదానిని ఎరగటం అసంభవం. పూర్ణంగా ఉన్నదానిని పూర్తిగా తెలియటానికి వీలున్నది. పూర్తిగా లేనిదానిని అసలు తెలియటానికే వీలులేదు. ఉన్నదానిని సత్ అనీ, లేనిదానిని అసత్ అనీ అందాము. అటు సత్తు, ఇటు అసత్తు కానిది ఒకటి ఉంటే అది యీరెంటిమధ్య ఉంటుంది. అలాంటి దానిని సదసద్విలక్షణ మందాము.

సత్తునకు సంబంధించినది జ్ఞానం. లేనిదానికి సంబంధించినది అజ్ఞానం. సదసద్విలక్షణానికి సంబంధించినది జ్ఞానమూ కాదు, అజ్ఞానమూ కాదు. ఈ

రెంటికంటె విలక్షణం. దానిని అభిప్రాయ మందాము. అయితే యీ అభిప్రాయమూ, జ్ఞానమూ ఒకటి కావు. అభిప్రాయానికి విషయం ఒకటి; జ్ఞానానికి విషయం మరొకటి. అభిప్రాయానికి విషయం సదసద్విలక్షణ పదార్థం. జ్ఞానానికి విషయం సత్పదార్థం. అజ్ఞానానికి విషయం అసత్పదార్థం. అందువల్ల అభిప్రాయం జ్ఞానంకంటె న్యూనం. అజ్ఞానంకంటె అధికం. అజ్ఞానం కటికచీకటి అయితే, అభిప్రాయం గ్రుడ్డివెలుగు; జ్ఞానం నిర్మలజ్యోతి. ఇంతకూ సదసద్విలక్షణపదార్థం ఒకటి ఉన్నదా? అంటే అటు ఉన్నదీకాక, ఇటు లేనిదీకాక ఈ రెంటికీ మధ్యస్థమైన వస్తువు ఉన్నదా అనే ప్రశ్న రావటం సహజం.

ఈ సదసద్విలక్షణమైన వస్తువులకోసం ఎక్కడికోపోయి వెదకనవసరంలేదు. పంచేంద్రియాలకు గోచరించే వ్యక్తి ప్రపంచమంతా యీ సదసద్విలక్షణపదార్థమే. ఇందులో ఆశ్చర్యపడవలసిన పని లేదు. లౌకికమైన ఏవిషయాన్ని తీసికొన్నా ఈ విషయం స్పష్టమౌతుంది. ఉదాహరణకు ఏనుగునే తీసుకుందాము. లేడికంటె ఏనుగు పెద్దది. పర్వతంకంటె చిన్నది. కాబట్టి ఏనుగు ఒక దృష్టిలో పెద్దది. ఆ ఏనుగే మరొక దృష్టిలో చిన్నది. ఇలా ఒకే ఏనుగులో స్థూలత్వం, అస్థూలత్వం అన్న కేవలపరస్పర విరుద్ధగుణాలు కనిపిస్తున్నవి. అంటే ఏనుగు సదసద్విలక్షణమౌతున్నది. ఇలాగే తతిమ్మా లౌకికవిషయాలు. పంచేంద్రియగోచరములైన వ్యక్తులన్నీ సదసద్విలక్షణాలే. అంటే వీటినిగూర్చి మనకు కలిగేది అభిప్రాయంమాత్రమేకాని జ్ఞానంమాత్రం కాదు.

రమణీయార్థాలు అనేకం, ధార్మికవిషయాలు అనేకం అని యీవిధంగా నానాత్వం చూచేవారివి అభిప్రాయాలేకాని జ్ఞానం కాదు. రామణీయకం ఒకటే, ధర్మం ఒకటే, సత్యం ఒకటే అని యీ విధంగా ఏకత్వం చూచేవారే జ్ఞానిశబ్దవాచ్యులు. అంతేకాని వ్యక్తులను చూచేవారు అభిప్రాయాలున్నవారేకాని జ్ఞానులు కాదు.

ఈవిధంగా జ్ఞానవిషయం పరిణామరహితం, నిరపేక్షం, అలౌకికం, పంచేంద్రియాగోచరం అయిన కేవలసత్పదార్థం. అయితే ఈ సత్పదార్థమేమిటి? దాని లక్షణా లేమిటి? ఈ సత్పదార్థం ఒకటా, రెండా? అనేకాలా? ఈ సత్పదార్థానికీ, పంచేంద్రియాలకు గోచరిస్తున్న భౌతికప్రపంచానికీ సంబంధమేమిటి? ఈప్రశ్నలకు సమాధానం చెప్పుకోవాలి.

భావవాదం

ఈ విషయాలనుగూర్చి చెప్పేవాదాన్నే భావవాదం అనవచ్చును. భావం అంటే ఏమిటో, ఏ అర్థంలో ఈ శబ్దం వాడటమౌతున్నదో చెబుతాను.

ఒక ఆవులమంద ఉందనుకోండి. అందులో తెల్లవి, నల్లవి, ఫుల్లవి, బట్లవి, మైలవి, చిన్నవి, పెద్దవి అనేకవ్యక్తు లుంటాయి. ప్రతిఒక వ్యక్తి రెండవదానికన్నా భిన్నంగా ఉన్నా గోవు అనే పదం అన్నిటికీ వర్తిస్తుంది. ఆ పదంలో వాచ్యంకానిది అందులో ఒకటీ ఉండదు. అంటే వాటన్నిటిలోను సామాన్యంలేక భావం (*Idea or form*) ఒకటి ఉంటుంది. ఈ భౌతికజగత్తులో శయ్యలు అనేకాలు ఉన్నాయి. అయితే శయ్యాభావంమాత్రం ఒకటే. అద్దంలో శయ్యాప్రతిబింబం కనిపిస్తున్నది. ఇలాంటి ప్రతిబింబాలు యథార్థాలు కావు. ఆభాసాలు. అలాగే వడ్రంగులు తయారుచేసిన, చేస్తున్న శయ్యలన్నీ శయ్యాభావానికి ప్రతిబింబాలు. అందువల్ల వ్యక్తులైన శయ్యలన్నీ ఆభాసాలు (Appearance) కాని యథార్థం కావు. ఈ వ్యక్తులైన శయ్యల ఈశ్వరసృష్టమైన శయ్యాభావానికి ప్రతులు. ఏకైకమైన శయ్యాభావాన్నిగూర్చి జ్ఞానం ఉండటానికి వీలున్నదికాని వ్యక్తులైన శయ్యలనుగూర్చి జ్ఞానం కలగటానికి వీలు లేదు. వీటినిగూర్చి అభిప్రాయంమాత్రమే ఏర్పడటానికి వీలున్నది.

కాగా శయ్యాభావం యథార్థం. ఇది వ్యక్తి అయిన శయ్యతో పుట్టటంలేదు. దీనితో నాశం పొందటం లేదు. ఈ భావం దేశకాలబద్ధం కాదు. మనఃకల్పితమూ కాదు. ఇది నిత్యం. జ్ఞానానికి విషయం. ఈ భావమే వ్యక్తులైన శయ్యలకు మూలం.

అయితే యీ శయ్యాభావం ఒక్కటే భావం కాదు. భౌతికప్రపంచంలో ఎన్నిజాతు లున్నాయో అన్నిభావాలున్నాయి. అంటే విభిన్నవ్యక్తులలో ఎన్ని సామాన్యగుణాలు కనిపిస్తున్నవో వానిలో ఒక్కొక్కదానికి ఒకభావం ఉన్నది. గోభావం, స్థూలత్వభావం, ఋజుత్వభావం, వక్రతాభావం ఇలా అనేకం ఉన్నాయి. ఈ భావసముదాయమే ఆధ్యాత్మికజగత్తు. ఈ జగత్తే భౌతికజగత్తుకు మూలం. భౌతిక

జగత్తులో అనేకవస్తువులు ఉన్నట్లే, ఆధ్యాత్మికజగత్తులోకూడ తారతమ్యా లున్నాయి. ఈ భావాలలో ప్రతిఒక్కటీ యథార్థమూ, నిత్యమూ అయినా సత్యము, ధర్మము, రామణీయకమూ ఉత్తమాలు. ఈ మూటిలోను ధర్మం అత్యంత ఉదాత్తం.

ఈ విధంగా రెండు జగత్తు లేర్పడుతున్నవి. ఒకటి ఆధ్యాత్మికమైన భావజగత్తు. రెండు, వ్యక్తులతో కూడిన భౌతికజగత్తు. ఈ భౌతికజగత్తుకు ఆధ్యాత్మికజగత్తు మూల మన్నాము. భౌతికజగత్తు ఆభాసికము, ఆధ్యాత్మికజగత్తు యథార్థము అన్నాము. ఆ పక్షంలో ఈ రెండుజగత్తులకు సంబంధ మేమిటి? వ్యక్తి ఇంద్రియగోచరమూ, నశ్వరమూ, అభిప్రాయానికి విషయమూ కదా? భావము ఇంద్రియాలకు అగోచరము, నిత్యము, జ్ఞానానికి విషయమూ కదా. ఇలాంటి భావం తనకు కేవలం వ్యతిరేకమైన వ్యక్తికి ఎలా మూల మౌతున్నది. ఈ రెంటిమధ్య ఎలాటి సంబంధ మున్నది?

ఇక్కడ ప్లేటో అభిమత మేమిటో స్పష్టంగా పండితులు తేల్చి చెప్పలేకుండా ఉన్నారు. అసలు అతనికే నిశ్చితాభిప్రాయం లేదేమో ననిపిస్తుంది. ఎందుకంటే యీ విషయం వివరించవలసివచ్చినప్పుడు అతడు ఇదమిత్థమని చెప్పకుండా పట్టి దృష్టాంతాలతో దాటవేశాడు. ఈ దృష్టాంతాలుకూడ భిన్నభిన్నంగా ఉన్నాయి. రిపబ్లిక్ అనే గ్రంథంలోని ఆ రేడు అధ్యాయాలలో భావం బింబమైతే వ్యక్తి ప్రతిబింబమనీ, ఆ అధ్యాయాలలోనే మరొక చోట భావం వస్తువైతే వ్యక్తి ఛాయ అనీ, ఎనిమిదో అధ్యాయం ప్రారంభంలో ఇచ్చిన గుహాదృష్టాంతాన్ని బట్టికూడ భావం వస్తువనీ, వ్యక్తి ఛాయ అనీ పేర్కొన్నాడు. పదో అధ్యాయంలో ఈ విషయమే వచ్చినప్పుడు ఈశ్వర సృష్టమైన శయ్యాభావం వడ్రంగి అనుకరిస్తున్నా డన్నాడు. కవిసంగతి చెప్పవలసివచ్చినప్పుడు అద్దంలో భౌతికవస్తువులు ప్రతిబింబిస్తున్నట్లే అతని రచనలలో అన్ని వస్తువులూ ప్రతిబింబిస్తున్న వన్నాడు. ఆ తరువాతనే లలితకళలకున్న స్థానాన్ని గూర్చి చెబుతూ భావాలు అయావృత్తులవారిచే అనుకరింపబడుతున్నవి. ఈ అనుకృతాలు తిరిగి కవిచిత్రకారాదులచే అనుకరింపబడుతున్న వన్నాడు. ఆ అధ్యాయంలోనే మరొకచోట భావానికీ, వ్యక్తికీ మాతా పుత్రికల (*Original ane Copy*) సంబంధం చెప్పబడ్డది. ఈ విధంగా బింబప్రతిబింబ భావము, వస్తుచ్ఛాయా భావము, అనుకార్యానుకృతి భావము, మాతాపుత్రికా భావము మాత్రమేకాక వ్యంగ్య వ్యంజక భావంకూడా చెప్పబడ్డది. ఎందుకంటే ధర్మము, సత్యము, రామణీయకమూ అన్న భావాలను గూర్చి చెప్పే సందర్భంలో అభివ్యక్తి పొందటం వాని లక్షణమని ప్లేటో పేర్కొన్నాడు. మరి కొందరు ముద్రాముద్రిత భావం ప్లేటో కున్నట్లు చెబుతున్నారు. సృష్టి విధానాన్ని గూర్చి వ్రాసిన సందర్భంలో ఈశ్వరుడు భావాలను సృష్టించినట్లుగా టిమాయస్ (*Timaius*) లో ప్లేటో పేర్కొన్నాడు. ఇక్కడ సృష్టి అనే పదానికి అభివ్యక్తి అని కొందరు వ్యాఖ్యాతలు అర్థం చెబుతున్నారు.

ఏది ఎలా ఉన్నా, ప్లేటోరచనలో సాధారణంగా భావాలలో వ్యక్తులు భాగస్వామ్యం* పొందటానికి యత్నిస్తాయనీ, ఏ ఒకవ్యక్తి భావంయొక్క లక్షణాలను పూర్తిగా పొందలేకపోవటంవల్ల వ్యక్తులు అనేకాలుగా ఉంటున్నాయనీ కనిపిస్తుంది. "పర్మనైడ్స్†" లో భావసిద్ధాంతం చర్చకు వస్తుంది. వివిధయుక్తులు చర్చితము లౌతాయి. అందులో ఏ ఒకటీ నిలవదు.

భావవాదంతో రెండు జగత్తులు ఏర్పడుతున్నవి. ఒకటి భౌతిక జగత్తు, రెండు ఆధ్యాత్మికజగత్తు. ఇలా ఏర్పడే రెండు జగత్తులలో ఒక్కొక్క దానిని ప్లేటో మళ్ళీ రెండు విభాగాలు చేస్తాడు. ఈవిధంగా మొత్తం జగత్తు నాలుగుభాగా లౌతున్నది. మొదటిది వ్యక్తి ప్రపంచం, అంటే పంచేంద్రియగోచరమైన జగత్తు. పుట్టి పెరిగి నశించే వస్తుకోటి అంతా ఈ జగత్తులోనిది. రెండవది ఇంద్రియజన్యానుభూతి ప్రపంచం. ఇంద్రియ అర్థసంయోగంవల్ల కలుగుతున్న అనుభూతి అంతా ఇందులోకి వస్తుంది. మూడోది సోపాధికజగత్తు. తత్త్వవిచారంతప్ప మిగిలిన గణితాదిశాస్త్ర విషయమంతా ఈజగత్తు క్రిందికి వస్తుంది. నాలుగోది కేవలం వివేకం (*Reason*) జగత్తు ఇక్కడ తర్కంద్వారా మూలసూత్రం తెలిసికోవట మౌతుంది. ఈ నాలుగు జగత్తులలో పూర్వ పూర్వములకంటె ఉత్తరోత్తరాలు యథార్థతరాలు. మొదటిది ఛాయ అయితే రెండవది మణిదర్పణాదులందు కనిపించే ప్రతిబింబం. రెండవ భాగం ఛాయ అయితే మూడోది ప్రతిబింబం. మూడోది ప్రతిబింబమైతే నాలుగోది బింబం. ఈ విధ

---

* ***Partake of or participate in***

† ***Plato and parmonides by F. M. Cornford.***

ముగా నాలుగోది ఒక్కటే యథార్థం. తక్కినవన్నీ ఆభాసాలు.

మొదటి జగత్తులో విశేష మేమీ లేదు. మూడోది నాలుగోది కొంచెం జాగ్రత్తగా అర్థంచేసుకోవాలి. మూడో జగత్తయిన మానసిక ప్రపంచంలో రెండవ జగత్తువల్ల లభిస్తున్న ఛాయలను ఆధారంచేసుకొని విచారం సాగుతుందంటాడు ప్లేటో. దీనికి రేఖాగణితజ్ఞుల విచారం ఉదాహరణగా ఇస్తాడు. రేఖాగణితజ్ఞులు త్రిభుజం, చతురస్రం, దీర్ఘచతురస్రం మొదలైనవి గీసి వాటిని ఆధారంచేసుకొని విచారం సాగిస్తారు. ఆ యాకృతులు కేవలం ఆధారాలుమాత్రమే. అంతేకాని వారి కవి పరమార్థాలు కావు. అలాంటి ఆకృతులను ఆధారంచేసుకొని రేఖాగణితజ్ఞులు విచారం సాగిస్తారు. అయితే యీ విచారం, ఈ ఆధారాలు, ఉపాధులు వదలి మూలసూత్రంవద్దకు పోవు. గణితశాస్త్రంకాని, మరేతత్త్వశాస్త్రంకాని ఇది ఇలా ఉంటే అది అలా ఉంటుందని చెబుతుందేకాని ఇది ఇలా ఎందుకున్నదని విచారించదు. బెర్‌ట్రాండ్ రస్సెల్ విమర్శించినట్లుగా, "భౌతిక ప్రపంచంలో సరళరేఖలు లేవు. గణితశాస్త్రం సోపాధికం (*Hypothetical*) కాని సత్యం చెప్పాలంటే, అతీంద్రియజగత్తులో అతీంద్రియ సరళరేఖ లున్నట్లు ఉపపత్తులు చూపించాలి. ఈపని బుద్ధివల్లకాదు. కేవలం వివేకం (**Reason**) వల్ల జరుగుతుంది." అని ప్లేటో భావన. అంటే అతని మతం ప్రకారం వివేక మొక్కటే నిరుపాధిక సరళరేఖలు స్వర్గంలో ఉన్నవనీ, దీనినిబట్టి గణితాదిశాస్త్రార్థాలు సోపాధికాలు కాక నిరుపాధికాలనీ తేలుతుంది.

ఈవాదం జాగ్రత్తగా పరిశీలిస్తే, తత్త్వేతర శాస్త్రాలు జగత్తులోని సంఘటనలు ఎలా జరుగుతున్నాయి (*How*) అన్న ప్రశ్నకు సమాధానం చెబుతున్నవేకాని ఎందుకు (*Why*) జరుగుతున్నాయి అన్న ప్రశ్నకు సమాధానం చెప్పవంటాడు ప్లేటో. వివేక మొక్కటే ఎందుకు అన్న ప్రశ్నకు సమాధానం చెబుతుందని అతనివాదన.

ఇక నాలుగోజగత్తు. ఈజగత్తులో ఉపాధులను మూలసూత్రంగా కాక, ఉపాధులనుగానే వినియోగించుకొని తర్కంద్వారా వివేకం మూలసూత్రాభిముఖంగా పోతుంది. ఒక్కొక్క మెట్టే ఎక్కి చివరికి మేడలోకి చేరుకొంటున్నట్లుగా ఒక్కొక్క భావాన్నే అవలంబంచేసుకొని పైకి చేరుకొంటుంది. ఆ భావ ప్రపంచంలో వివేకం భౌతిక విషయావలంబనం అపేక్షించక ఒక భావంనుంచి మరొకభావానికి పోతుంది. ఇలా వివేకం అక్కడే విహరిస్తుంది.

ఇలా ఏర్పడుతున్న నాలుగు జగత్తులను గ్రహించటానికి అనుగుణంగా ఆత్మకు నాలుగు శక్తు లున్నాయి. మొదటి జగత్తుకు అనుగుణమైనది ఐంద్రియకశక్తి. రెండోదానికి అనుగుణమైనది విశ్వాసశక్తి (**Faith**). మూడోదానికి అనుగుణమైనది బుద్ధి. నాలుగోదానికి అనుగుణమైనది వివేకం. పూర్వపూర్వాలకంటె ఉత్తరోత్తరాలు లోగడ చెప్పినట్లు యథార్థతరాలు, ఉత్తమోత్తమాలు.

ఈవిభాగాలను సుస్పష్టం చేయటానికి ప్లేటో ఈక్రింది దృష్టాంత మిచ్చాడు* :—

ఒక పర్వతగుహ. గుహాద్వారానికి ఎదురుగా గోడ. గోడకు అభిముఖులై గుహలో ఖైదీలు. వారి అవయవాలు బంధించి ఉంటాయి. అందువల్ల గోడ ముందరిభాగం, ఆ భాగంమీద ఏమైనా ఉంటే అవీ తప్ప మరేవీ కనిపించవు. వారి వెనక పెద్దఎత్తున మంట వెలుగుతూ ఉంటుంది. ఖైదీలకు గోడమీద తమ నీడలు కనిపిస్తుంటాయి. అవి కదులుతున్నట్లు ఇంకా ఏమేమో చేస్తున్నట్లు ఉంటాయి.

ఆ గుహ ప్రతిధ్వనించేదయి ఆ ప్రతిధ్వని గోడ ప్రక్కనుంచి వస్తుందేమో, అప్పుడు ఖైదీలు ఏమనుకొంటారు? ఆ నీడలు నిజంగా కదులుతున్నవనీ, నిజంగా మాట్లాడుతున్నవనీ అనుకొంటారు. వారికి ఆ బొమ్మలే యథార్థా లనిపిస్తాయి.

ఆ ఖైదీలలో ఒకరిని బంధవిముక్తునిచేసి వెనుదిరిగి చూడమంటామేమో, వెనకనుంచి కనిపించే ఆ తీవ్రతేజం మొదట్లో అతడు చూడలేడు. అది అతని కన్నులకు మిరుమిట్లు కొలుపుతుంది. తేజస్సువస్తున్న దిశలో మొదట అతనికి ఏమీ కనిపించదు. గోడమీద అంతకుమున్ను తాను చూచిన బొమ్మలే ఆ క్షణంలో ఎక్కువ యథార్థాలుగా కనిపిస్తాయి. అందువల్ల మొదట్లో తేజోభిముఖంగా నడచి యాథార్థ్యం చూడటానికి ఇష్టపడక తా నంతకుముందు చూస్తూవచ్చిన ఛాయాప్రపంచమే యథార్థ మనుకొంటాడు.

అతన్ని అంతటితో వదలక పట్టి బలవంతాన తేజోఽభిముఖంగా గుహ వెలుపలికి తీసుకువస్తామేమో;

* రిపబ్లిక్, ౭ వ అధ్యాయం.

అతని కన్నులు మిరుమిట్లు గొంటాయి. మొదట్లో అంతా అంధకారబంధురంగా ఉంటుంది. తరువాత తరువాత కొంచెం అలవాటుపడతాడు. మొదట్లో నీడలు, తరువాత జలదర్పణాదులలో కనిపించే ప్రతిబింబాలు, ఆపైని రాత్రివేళ ప్రకాశించే తారకలను, చంద్రుణ్ణి, ఆ పిమ్మట పగటివేళ ప్రకాశించే సూర్యుణ్ణి చూడగలుగుతాడు.

చిట్టచివరికి జలాదులందు కాకుండా నేరుగా యథాస్థానంలో సూర్యుణ్ణి చూడగలుగుతాడు. యథారూపంలో అతన్ని ధ్యానింపగలుగుతాడు. ఆ పిమ్మట సూర్యునివలననే ఋతువులు, సంవత్సరాలు కలుగుతున్నవనీ, అతడే దృశ్యప్రపంచానికి అంతటా రక్షకుడనీ, పూర్వం గుహాభిత్తికపై కనిపించిన ఛాయా ప్రపంచానికి కూడా అతడే కారణమనీ వాదిస్తాడు.

అతనికి గుహ, అక్కడ తనకు ఏర్పడిన అనుభవం, అక్కడి సహచరుల జ్ఞానం జ్ఞప్తికి రాగానే తనలో వచ్చినమార్పునకు సంతోషిస్తూ గుహానిబద్ధులపై జాలిపడడా? ఖైదీల జ్ఞానాన్ని జ్ఞానమంటాడా? వారి ఆదర గౌరవాలకు వాంఛిస్తాడా? లేదు. అది జ్ఞానమని ఒప్పుకోడు. వారి ఆదర గౌరవాలకు తాపత్రయ పడడు.

ఆ విముక్తుడు తిరిగి గుహాలోనికి వెళ్లుతాడే అనుకొందాము. గుహాలో మొదటినుంచీ ఉంటున్నవారికి కనిపిస్తున్నంత స్పష్టంగా, తొందరగా తిరిగి వెళ్లిన విముక్తునికి ఛాయలు కనిపిస్తాయా? కనిపించవు. గుహాలోని ఖైదీలు ఏమనుకుంటారు? వీడు విముక్తుడై పైకిపోయి ఉన్నకళ్లు పోగొట్టుకొనివచ్చాడంటారు. అతడు వీరిని విముక్తులను చేసి తేజోభిముఖంగా కొనిరావటానికి ప్రయత్నిస్తే, వారు ఎదురు తిరుగుతారు. నీకు కళ్లుపోయినవి పోగా మాకళ్లుకూడా ఎందుకు పోగొట్టుతావని తీవ్రంగా ప్రతిఘటిస్తారు. అతడు ఇంకా తీవ్రంగా యత్నిస్తే, అతన్ని చంపి వేయనుకూడా చంపివేస్తారు.

ఈ దృశ్యమాన ప్రపంచమే ఆగుహ. అందలి ఖైదీలే మానవులు. ఆతేజస్సే సూర్యుడు. ఆ ఊర్ధ్వగమనమే ఆత్మయొక్క జ్ఞానప్రపంచాభిముఖగమనం.

ఇంతవరకు చెప్పుకొన్నదానినిబట్టి ఏమి తేలుతున్నది? మన ఇంద్రియాలతో చూస్తూ, అనుభవిస్తూ, వ్యవహరిస్తూఉన్న యీ భౌతిక ప్రపంచం యథార్థం కాదు. దీనినిగూర్చి పంచేంద్రియాల ద్వారా కలుగుతున్న ప్రత్యక్షజ్ఞానం జ్ఞానం కాదు. కేవలం సత్పదార్థంమాత్రమే జ్ఞానానికి విషయం. అంతేకాని భౌతికప్రపంచం జ్ఞానానికి విషయం కాదు. జ్ఞానవిషయం పరిణామి కాదు. కేవలం సత్పదార్థం. కాబట్టి జ్ఞానంకూడ పరిణామి కాదు. ఎప్పుడూ ఒకటిగా ఉంటుంది. పరిణామి కాక ఎప్పుడూ ఒకటిగా పారమార్థికంగా (*Absolute*) ఉండేదానికి ఉత్పత్తి, అభివృద్ధి, వినాశాలు ఉంటాయి. కాబట్టి జ్ఞానం ఉత్పాద్యం కాజాలదు. అందువల్ల అది అపౌరుషేయం. ముమ్మున్నెన్నడూ తెలియనిదానిని క్రొత్తగా నేర్చుకోటానికి వీలులేదు. జ్ఞానం కేవలం అభివ్యజ్యం మాత్రమే. లేదా స్మర్తవ్యం. అంతేకాని ఉత్పాద్యంకాదని తేలుతుంది.

జ్ఞానం అభివ్యజ్యం, లేదా స్మర్తవ్యం

ఇలాంటి తర్కంలో సిద్ధిస్తున్న జ్ఞానవాదమే ప్లేటో ప్రతిపాదిస్తున్నాడు. అతని మతంప్రకారం ఆత్మకు జ్ఞానం స్వతస్సిద్ధంగా ఉంటుంది. దేవతాబృందపరివృతమై కామసంకల్పాలనే రెక్కల గుర్రాలుపూన్చిన రథ మెక్కి స్వర్గపరిభాగమందున్న గమ్యస్థానానికి పోతూ ఆత్మ ఆ గుర్రాలను అదుపులో ఉంచుకోలేక పడిపోయినప్పుడు ఉన్న జ్ఞానం మరచిపోతుందని ప్లేటో "ఫీడ్రస్" (*Phaedrus*) లో చిత్రించాడు.

జ్ఞానం అభివ్యజ్యం లేదా, స్మర్తవ్యం అనేవాదం "మినో" లో ఈవిధంగా నిరూపిత మౌతుంది: సోక్రటిస్ మినో సేవకుణ్ణి పిలిపిస్తాడు. వాడు చిన్నవాడు. చదువుసంధ్యలు రావు. సోక్రటిస్ ఒకబల్లమీద ఒక చతురస్రాన్ని గీసి దానికి రెట్టింపు విస్తీర్ణతకల చతురపు తత్త్వం ఎలా ఉంటుంది? దాని భుజంపొడవు ఎంత? అని అడుగుతాడు. వాడు ముందు చెప్పలేడు. సోక్రటిస్ పై ప్రశ్నలకు సమాధానం తాను చెప్పకుండానే ఒక్కొక్క ప్రశ్నే వేస్తూపోతాడు. ఆ సేవకుడు వరసగా సమాధానాలు చెప్పుకుంటూ పోతూ, చివరికి మొదటి చతురస్రకర్ణం (*Diagonal*) రెండవదానికి భుజమైతే ద్వితీయ చతురస్ర విస్తీర్ణత రెట్టింపు ఉంటుందని చెబుతాడు.

చదువు సంధ్యలులేని ఆ సేవకుడు ఎలా సరియైన సమాధానం చెప్పాడు? కాబట్టి జ్ఞానం అభివ్యజ్యం, లేక స్మర్తవ్యమే కాని ఉత్పాద్యం కాదు.

ఈ వాదానికే ఫీడోలో (*Phaedo*) ప్లేటో మరొక ఉపపత్తి చూపించాడు.

మనకు ధర్మం, రామణీయకం, సమానత్వం మొదలైన భావాలజ్ఞానం ఉన్నది. భావాలంటే ఏమిటో చూచాము. భావాలజ్ఞానం ప్రత్యక్షంవల్ల లభించేది కాదు. భౌతికజగత్తులో ఎక్కడా పారమార్థిక ధర్మంగాని, సమానత్వం కాని, రామణీయకం కాని గోచరించటం లేదు. భౌతికలోకంలో సమానంగా, ధార్మికంగా, రమణీయంగా ఉన్న వస్తువులలో సమానత్వం, ధర్మం, రామణీయకం, అసమగ్రాలు కాని పూర్ణాలు కావు. అంటే భౌతికవిషయాలలో గోచరించే ఈ సమానత్వం మొదలైనవి పారమార్థికాలు కావు. అయినా పారమార్థిక భావాలు మనకు ఉంటున్నాయి. ఇది ఎలా సంభవిస్తున్నది?

సాహచర్య, సాదృశ్య, అసాదృశ్యాదుల వల్ల ఒకవస్తువును చూడగానే రెండో వస్తువు జ్ఞాపకం వస్తుంది. మన మిత్రుడు ఎప్పుడూ భారతం చదువుతుంటా డనుకోండి. భారతం కనిపించగానే మిత్రుడు జ్ఞప్తికి వస్తాడు. ఇలాగే వికారవస్తువులను చూచినప్పుడు రమణీయ వస్తువులు, రమణీయ వస్తువులు చూచినప్పుడు వికృతవస్తువులు జ్ఞాపకం వస్తాయి. అసలు వీనిని చూచి ఉండకపోతే తరువాత జ్ఞప్తికి రావటం అసంభవం.

అలాగే అసమగ్రాలైన భౌతిక సమానత్వాది భావాలను చూడటంవల్ల పారమార్థిక సమానత్వాదులు తెలుస్తున్నవి. అంటే స్మృతికి వస్తున్నవి. అంటే పూర్వం వీటిని చూచి ఉండాలి. కాబట్టి జ్ఞానం స్మర్తవ్యమే కాని ఉత్పాద్యం కాదు.

పునరుక్తిదోషం లేదనుకొంటే ప్లేటో తాత్పర్యం మరొక విధంగా సుబోధం చెయ్యవచ్చు. మనం ఒక కావ్యాన్ని చదివా మనుకోండి. అది బాగున్నదనో, లేదనో అనుకొంటాము. మన మనుకొనే ఆ బాగోగులను మనలోని ఒకానొక ప్రమాణాన్ని అనుసరించి కొలుస్తున్నామా, లేదా? అంటే, నిజమే. మనలోని ఒక ప్రమాణాన్ని బట్టి కొలుస్తున్నమాట వాస్తవం. అయితే యీ ప్రమాణం ఇతర కావ్యాలను చదవటంవల్ల, అంటే భూతపూర్వ ఇంద్రియానుభవంవల్ల ఈ ప్రమాణం ఏర్పడుతున్నదని అనవచ్చును. సరే, అలాగే నందాము. ఏ కాళిదాసు అభిజ్ఞాన శాకుంతలమో, ఏ షేక్స్పియర్ నాటకమో, ఏ డాంటే కావ్యమో చదువుతాము. అది చాలా బాగున్నదంటాము. అంటే ఏదో ఒక ప్రమాణంతో కొలిచామన్నమాట. అయితే యీ ప్రమాణంకూడా భూతపూర్వ ప్రత్యక్షానుభవంవల్ల ఏర్పడిందేనా? అంటే కాళిదాసు, షేక్స్పియర్, డాంటేల రచనలకంటె ఉత్తమమైన రచనలను ఈ జన్మలో చూడటం జరిగిందా? అసంభవం. ఇలాంటి ప్రమాణం మనలో ఉన్నమాట యథార్థం. అది ఈ లోకంలో ప్రత్యక్షానుభవంవల్ల సంపాదించలేదన్నమాట కూడా యథార్థం. కాబట్టి ఈ ప్రమాణం పూర్వం భౌతికంలో కాకుండా సంపాదించి ఉండాలి. అందువల్లనే అది జ్ఞాపకంవస్తున్నది.

ఈవిధంగా జ్ఞానం అభివ్యక్త్యం, లేక స్మర్తవ్యమే కాని ఉత్పాద్యం కాదన్న సిద్ధాంతంతో చారిత్రాత్మకజ్ఞానం మొదలైన వ్యావహారికజ్ఞానమంతా జ్ఞానం కాకుండా పోతున్నది. అంటే ప్లేటో ఫలానప్పుడు ఫలానిదేశంలో పుట్టాడు, ఫలాని పుస్తకాలు వ్రాశాడు, ఫలాన ఫలాన సిద్ధాంతాలు ప్రతిపాదించాడు, అన్నది జ్ఞానం కాకుండా పోతున్నది. ప్లేటోసిద్ధాంతం ప్రకారం తర్కగణితశాస్త్రజన్యజ్ఞానము, యోగజన్యజ్ఞానము (*Mystic in sight*) మాత్రమే జ్ఞానం. తతిమ్మా దేదీ జ్ఞానం కాదు.

ఆత్మస్వరూపం — జన్మపరంపర

ప్లేటో ప్రతిపాదించిన జ్ఞానస్వరూపాన్ని బట్టి రెండు జగత్తు లేర్పడుతున్నవి. మొదటిది ఆధ్యాత్మిక జగత్తు; రెండవది భౌతికజగత్తు. మొదటిదాని ఛాయ రెండవది. ఇలా రెండంకణాల మిద్దమేడ ఏర్పడిన తరువాత ఈ రెంటినీ కలిపే నిచ్చెన ఒకటి ఉండాలి. లేకపోతే రెండో అంతస్తు ఉండి ప్రయోజనం లేదు. అసలు పై అంతస్తులో ఏమున్నదో తెలియదు. కాబట్టి నిశ్రేణి అవసరం. అదే ఆత్మ. ఈ ఆత్మ తన పుణ్యపాపాలనుబట్టి పైకీ క్రిందికీ ఆసులోనిక్రోవిలాగా తిరుగుతుంటుంది. అందువల్ల రెండు జగత్తుల తత్త్వం అర్థంచేసుకొంటుంది.

ఈ పైని పేర్కొన్న నిశ్రేణీదృష్టాంతాన్ని బట్టి ఆత్మ జడపదార్థమని కాని, తనకుతాను ఉపయోగపడేది కాదనికాని అర్థం చేసుకోరాదు. కేవలం ఆవశ్యకత ఒక్కటే ఆత్మనిశ్రేణుల కున్న సమానధర్మం. ఆత్మ అనేది లేకపోతే ఆధ్యాత్మికజగత్తు లేకపోవలసివస్తుంది. ప్లేటోమతం ప్రకారం ఆధ్యాత్మిక జగత్తు లేక పోతే భౌతికజగత్తు లేకపోతుంది. అందువల్ల అతని మతానికి ఆత్మ ఉండటం అవసరం.

ఆత్మ ఉన్నదనటానికి ఫీడోలో (*Phaedo*) అతడు ముఖ్యంగా ఈరెండు ఉపపత్తులను చూపిస్తాడు. భౌతికాలైన ద్వంద్వాలనుండిత్ప్రతిద్వంద్వాలు పుడుతున్నాయి. ఉదాహరణకు పగలు తీసుకొందాము. దీనికి ప్రతిద్వంది రాత్రి. రాత్రినుంచి పగలు, పగటినుంచి రాత్రి పుడుతున్నాయి. అలాగే జాగ్రదవస్థనుంచి సుషుప్త్యవస్థ, సుషుప్త్యవస్థనుంచి జాగ్రదవస్థ కలుగుతున్నాయి. అలాగే జీవంనుంచి మరణం, మరణం నుంచి జీవం కలుగుతున్నాయి. అలా కాక పుట్టినవన్నీ శాశ్వతంగా మరణిస్తూ ఉంటే ఒక కాలానికి అన్నీ మృతి పొందటం సజీవమైనది లేకపోవటం, జరగాలి. అంటే మృతి ఒక్కటే శేషించి సర్వం కబళితమై పోవాలి. అందువల్ల మృతినుండి జీవం విధిగా పుడుతున్నదని అంగీకరించాలి. ఇది నిజమైతే శరీరపతనం జరగగానే ఆత్మ మరొక లోకంలో చావకుండా ఉండాలి. లేని పక్షములో అది తిరిగి జన్మించటం అసంభవం. కాబట్టి నిత్యమై ఆత్మ ఉండాలి.

జ్ఞానం స్మర్తవ్యమే కాని ఉత్పాద్యం కాదని ప్లేటో ఎలా నిరూపించాడో చూచాము. ఈ జన్మలో ప్రత్యక్షజ్ఞానంవల్ల పొందజాలని పారమార్థిక భావాలను మానవుడు నిర్మించగలుగుతున్నాడు అంటే ఆత్మ ఈ జన్మకు పూర్వం ఉండి ఉండాలి.

ఈ రెండు ఉపపత్తులనుబట్టి ఆత్మ ఉన్నదని తేలుతున్నది. ఈ ఆత్మ దివ్యం, అమర్త్యం, చేతనం, సమం (*Uniform*) అచ్ఛేద్యం. శరీరం దీనికి కేవలం విరుద్ధం. ఇది భౌతికం, మర్త్యం, జడం, విషమం, (*Multiform*), ఛేద్యం, పరిణామి.

ఆత్మ సామరస్యం (*Harmoy*) కాదు. ఎందుకంటే సామరస్యం ఏ ద్రవ్యాలవల్ల ఏర్పడుతున్నదో వాని స్థితిలోనే ఆ సామరస్యం ఉంటుంది. అంగాలు కుంటుపడితే, సామరస్యం కుంటుపడుతుంది. లేకపోతే లేదు. కాబట్టి అంగాల ననుసరించి సామరస్యం ఉంటున్నది. కాని సామరస్యం ననుసరించి అంగాలు ఉండటంలేదు. అవయవాలకంటె విరుద్ధమైన గతికాని, ధ్వని కాని, మరొకగుణంకాని సామరస్యాని కుండదు. సామరస్యస్వభావం అంగముల సమరసభావంపై ఆధారపడి ఉంటుంది. అంటే ఈ సామరస్యంలో తరతమాది భావా లుంటున్నాయి.

ఇలాంటి తరతమ భావాలు ఆత్మలో లేవు ఆత్మలలో ఎచ్చులొచ్చులు లేవు. అన్ని ఆత్మలు ఒక్కటే. ఆత్మసామరస్యమైతే శరీరాన్ని అనుశాసించక శరీర అనుశాసన ననుసరించి ఆత్మ పోవాలి. పైగా అవయవి నశిస్తుంది. నిరవయవ నశించదు. ఆత్మనశించనిది కాబట్టి నిరవయవము.

ఆత్మ స్వయంగతికము. అంతేకాని మరొక పదార్థంవల్ల దీనికి గతి ఏర్పడటం లేదు. ఈగతి ఉత్పన్నంకాదు కాబట్టి నష్టము కాదు.

ఆత్మ ఉనికివల్లనే దేహాలు జడాలయ్యూ చేతనాలవలె కనిపిస్తున్నవి. రెక్కలగుర్రాలజంట. రౌతు వంటిది ఆత్మ. దీనినిబట్టి గుర్రాలు వేరుగా ఉంటాయి, రౌతు వేరుగా ఉంటా డనుకో రాదు. గుర్రాలజంట, రౌతు అవిభాజ్యాలు. ఇలాంటిది ఆత్మ. దేవతాత్మకు, జీవాత్మకు పెద్ద తేడా లేదు. దేవతాత్మ గుర్రాలు ఉత్తమాలు. జీవాత్మ గుర్రాలు పొగరుబోతులు. దేవతాత్మ తన గుర్రాలను చక్కగా అదుపులో ఉంచుకొని నడపగలుగుతుంది. జీవాత్మ తనగుర్రాలను అదుపులో ఉంచుకొని నడపటం అతి కష్టసాధ్యం. ఆత్మలోని సారథి శబ్దవాచ్యం, వివేకం (*Reason*); అశ్వ శబ్దవాచ్యాలు సంకల్పము, కామము. ఈ మూడంశాలు జీవితంలోనే కాక దేవతాత్మలోకూడా ఉంటాయి. ఈ ఉపమానం కేవలం అర్థస్ఫురణకు ఇచ్చినదే కాని సంపూర్ణసాధర్మ్యం కోసం ఇచ్చినది కాదు. జగత్తులోని అధర్మానికి మూలం ఆత్మలోని దుష్టాంశమే నని ప్లేటో సిద్ధాంతం.

ఆత్మలు మూడురకాలు:—(౧) జీవాత్మ, (౨) దేవతాత్మ, (౩) పరమాత్మ. ఈ మూడూ ఆత్మలే. అయితే ఆ ఆత్మలు వేరు, భావాలు వేరు. వ్యక్తిలో భావం అభివ్యక్తం కావటానికి ఈపరమాత్మ, లేక ఈశ్వరుడు కారణం. ప్లేటో ఈశ్వరుడు ఒక్కడనీ, ఆత్మలు అనేకాలనీ స్పష్టంగా సూచించాడు. అయితే ఈశ్వరునకూ, తదుత్పాద్యమానజగత్తునకూ ఏలాంటి సంబంధమున్నదో మాత్రం నిర్దిష్టంగా చెప్పలేదు.

ఆత్మకు జన్మ ఎలా ప్రాప్తిస్తున్నది? అది దేవతల వెంట స్వర్గోపరిభాగమందున్న భావ ప్రపంచ సందర్శనానికి బయలుదేరుతుంది. దేవతలు తమ రెక్కలగుర్రాల జంటలను అవలీలగా నడుపుకొని పోతుంటారు. ఈ ఆత్మలకు తమ గుర్రాల జంటలను అదుపులో ఉంచుకోవటం కష్టసాధ్య మౌతుంది. తన గుర్రాలను అదుపులో ఉంచుకొని నడపలేని ఆత్మ స్వర్గభ్రష్ట మౌతుంది. ఇలా భ్రష్టమయ్యేటప్పుడు

రెక్కలు పోతాయి. తుదికి భూమిమీద పడుతుంది. అలా పడినప్పుడు భౌతికశరీర మేర్పడుతుంది. ఈశరీరం నిజానికి జడమైనా ఆత్మసంసర్గంవల్ల చేతనంవలె భాసిస్తుంది. ఇలా శరీరసహితమయ్యే ఆత్మయే మానవుడు. "అయితే అమర్త్యమైన ఆత్మకు నశ్వరమై పదార్థంతో సంసర్గ మేర్పడదని సహేతుకంగా నిరూపించ వీలులేదు. నిజానికి ఈశ్వరునిస్వభావం మనం చూడలేదు. గట్టిగా తెలియదుకూడా. అయినా అమర్త్యమైన ఆత్మలకు శరీరం ఉంటుందని ఊహించవచ్చును."

స్వర్గభ్రష్టతకు పూర్వం ఎక్కువ సత్యంచూచిన ఆత్మ తత్త్వవేత్తగా జన్మిస్తుంది. లేదా రామణీయక తత్త్వపరుడుగానో, కాక సంగీతప్రియుడుగానో, కాక ప్రణయశీలుడుగానో జన్మిస్తుంది. ౨. అంతకన్నా తక్కువ సత్యంచూచినది ఉత్తమ భూపాలుడుగానో, సేనాధిపతిగానో జన్మిస్తుంది. ౩. అంతకన్నా తక్కువ చూచినది రాజకీయవేత్తగానో, వణిజుడుగానో జన్మిస్తుంది. ౪. అంతకన్నా తక్కువ చూచినది వ్యాయామాభిమానిగానో, వైద్యుడుగానో జన్మిస్తుంది. ౫. అంతకన్నా తక్కువ చూచినది ప్రవక్తగానో, మతగురువుగానో పుడుతుంది. ౬. అంతకన్నా తక్కువ చూచినది కవిగానో, చిత్రకారుడుగానో, లేక మరొక లలితకళాస్రష్టగానో పుడుతుంది. ౭. అంతకన్నా తక్కువ చూచినది ఏ రైతుగానో పుడుతుంది. ౮. అంతకన్నా తక్కువ చూచినది వైతండికుడుగానో లేక *Demageguo* గానో పుడుతుంది. ౯. అంతకన్నా తక్కువ చూచినది ఘోరచండశాసనుడుగా పుడుతుంది.

ఇహలోకంలో పుణ్యంచేస్తే ఆత్మ మరుజన్మంలో పూర్వంకంటె ఉత్తమజీవిగా పుడుతుంది. ఇలా పుణ్య మెక్కువగా సంపాదిస్తూపోతే తుదికి ఆత్మ జన్మరాహిత్యం పొంది జ్ఞానసిద్ధి పొందుతుంది. అలా కాక పాపం ఎక్కువచేసినకొలదీ అధఃపతనం చెందుతుంటుంది.

సృష్టిక్రమం

సృష్టిక్రమాన్ని గూర్చి ప్లేటో టిమాయస్ (***Timaius***) లో వ్రాశాడు. ఇందలి విషయనిర్ణయంలో వ్యాఖ్యాతలందు అభిప్రాయభేదా లున్నాయి. పైగా ఈ అంశాలలో ఎంతవరకు కట్టుకథలో, ఎంతవరకు అతని అభిమత ముందో చెప్పలేము. ఏది ఎలా ఉన్నా అతని మతం స్థూలంగా చెప్పాలంటే ఇలా ఉంటుంది:

మారనిదానిని బుద్ధి వివేకం గ్రహిస్తాయి. మారేదానిని అభిప్రాయం గ్రహిస్తుంది. జగత్తు భౌతికం; కాబట్టి నిత్యం కాజాలదు. దీనిని ఈశ్వరుడు సృజించాడు. ఈశ్వరుడు ధర్మమయుడు. అతడు నిత్యపదార్థాన్ని అనుసరించి ఈ జగత్తును నిర్మించాడు. అతడు ఈర్ష్యారహితుడు. అందువల్ల ప్రతిదీ సాధ్యమైనంతవరకు తనవలె ఉండాలని అతని అభిలాష. భౌతికపదార్థం నామరూపరహితంగా, వ్యవస్థారహితంగా ఉంటే, ఈశ్వరుడు వ్యవస్థ కల్పించాడు. ఆత్మలో బుద్ధినుంచి దానిని శరీర నిహితం చేశాడు. అతడు ఈ జగత్తును ఒక జీవిగా సృష్టించాడు. ఈ జీవికి ఆత్మ బుద్ధి ఉన్నాయి. అయితే ఈ జగత్తు ఒక్కటే కాని అనేకాలు కావు. ఎందువల్లనంటే నిత్య భావానికి సాధ్యమైనంత సన్నిహితంగా ఉండాలన్న దృష్టితో ఈశ్వరుడు ఈ ప్రతిని సృష్టించాడు. అందువల్ల జగత్తు ఒక్కటే. ఇది ఒక గోళం. అసాదృశ్యంకంటె సాదృశ్యం మనోజ్ఞం. సర్వత్ర ఒకేవిధంగా ఉండేది గోళ మొక్కటే. అందువల్ల జగత్తు ఒక గోళం. అది భ్రమిస్తుంది. ఎందువల్లనంటే గతులన్నిటిలోను భ్రమణాత్మకగతి నిర్దుష్టం.

ఈశ్వరుడు అగ్ని, వాయువు, జలము, పృథ్వి అన్న నాలుగు భూతాలతో ఈ జగత్తును సృష్టించాడు. గ్రీకులకు భూతాలు నాలుగే కాని అయిదు కావు. (వారి మతం ప్రకారం ఆకాశం లేదు.) సమర స్వభావ మేర్పడేటట్లుగా ఈ నాలుగుభూతాలను తగిన నిష్పత్తిలో కలిపి సృష్టించటంవల్ల ఈ జగత్తు జరావ్యాధులకు గురికాదు. భగవంతుడు సంకల్పిస్తే తప్ప ఇది విలయం పొందదు.

ఈశ్వరుడు మొట్టమొదట ఆత్మ, తరువాత శరీరం సృష్టించాడు. ఆత్మ అవిభాజ్యం. అది పరిణామ రహితమైన పదార్థంతో నిర్మితం. శరీరం విభాజ్యం. పరిణామియైన ఒకానొక పదార్థంతో సృష్టింపబడ్డది. ఇది భౌతికంకంటె ఆత్మలకంటె భిన్నం.

చరము, సజీవము అయిన ఈ జగత్తును చూచి ఈశ్వరుడు హృష్టుడై దీనిని మూలానికి, అంటే జగద్భావానికి సాధ్యమైనంత సన్నిహితంగా

ఉంచాలని సంకల్పించాడు. మూలము నిత్యం కాబట్టి ఈజగత్తును కూడా వీలైనంత నిత్యంగా ఉండేటట్లు చేయాలనుకొన్నాడు. ఈనిత్యతను సమగ్రంగా జగత్తుకు ప్రసాదించటం అసంభవం. అందువల్ల ఈనిత్యత్వానికి చరచ్ఛాయ కల్పించటానికి నిశ్చయించాడు. ఆకాశంలో వ్యవస్థ నెలకొల్పి ఈ చరన్నిత్యత్వం కల్పించాడు. ఈ ఛాయయే కాలం.

ఈకాలానికి పూర్వం పగళ్లు లేవు. రేలు లేవు. నిత్యత్వభావాన్ని గూర్చి చెప్పవలసి వచ్చినప్పుడు ఉండెను అని కాని, ఉండెగలను అని కాని చెప్పటానికి వీలులేదు. ఉన్నది అని మాత్రమే చెప్పాలి.

కాలం, ఆకాశం ఒకేసారి సృజింపబడ్డాయి. జీవులు గణితం నేర్చుకోటానికి ఈశ్వరుడు సూర్యుణ్ణి సృష్టించాడు. దివారాత్రాలు, మాసాలు, సంవత్సరాలు చూడటంవల్ల సంఖ్యాజ్ఞానం, దానివల్ల కాలజ్ఞానం, దానివల్ల తత్త్వజ్ఞానం ఏర్పడ్డాయి. ఇది ఒక్కచే ప్రత్యక్షంవల్ల కలుగుతున్న మహోపకారం.

జగత్తువినా నాలుగు రకాల జీవులున్నాయి. (౧) దేవతలు, (౨) పక్షులు, (౩) జలచరాలు, (౪) భూచరాలు. దేవతలు ప్రధానంగా అగ్నిమయులు. నిశ్చలతారలు దివ్యాలు. ఇవి నిత్యాలు. ఈదేవతలకు "మిమ్ము ధ్వంసంచేయగలను." అని యీశ్వరుడు చెప్పాడు. కాని వీరిని ధ్వంసం చేయడు. ఇతర జీవులలోని నిత్యాంశాలను భగవంతుడు సృష్టించాడు. అనిత్యాంశాలను భగవంతుడు సృష్టించాడు. అనిత్యాంశాలను దేవతలు సృష్టించారు.

ప్రతితారకు ఈశ్వరుడు ఒక ఆత్మను ఇచ్చాడు. ఆత్మలకు ఇంద్రియానుభవజ్ఞానం, ప్రేమ, భయం, కోపం ఉంటాయి. వీటిని దమించగలిగితే ఇవి పవిత్ర జీవనాలు. లేకపోతే కావు. మానవుడు సత్పథాన వర్తిస్తే మరణానంతరం తన నక్షత్రం లోకిపోయి శాశ్వతంగా సుఖంగా జీవిస్తాడు. దుష్టమార్గానువర్తి అయితే మరుజన్మంలో స్త్రీగా జన్మిస్తాడు. అప్పటికీ సన్మార్గం అనుసరించకపోతే, అది జంతువై పుడుతుంది. ఇలా వివేకం కలిగేటంతవరకు జన్మలు ప్రాప్తిస్తూనే ఉంటాయి. ఈశ్వరుడు ఆత్మలను కొన్ని భూలోకంలోను, కొన్ని చంద్రలోకంలోను, కొన్ని ఇతర గ్రహనక్షత్రాలలోను ఉంచాడు. వాటి శరీరనిర్మాణం దేవతలకు వదలిపెట్టాడు.

మానవునిలో రెండు ఆత్మలున్నాయి. ఒకటి నిత్యం. దీనిని ఈశ్వరుడు సృష్టించాడు. రెండోది అనిత్యం. దీనిని దేవతలు సృష్టించారు. అనిత్యమైన ఆత్మ అనివార్యం భయంకరము అయిన సంవేదాలకు (*Affections*) లోనౌతుంది. సుఖం పాపకృత్యాలకు ప్రోత్సహిస్తుంది. దుఃఖం ధర్మం విముఖం చేస్తుంది. ఉద్వేగం, భీతి గ్రుడ్డివి. క్రోధం సంతృప్తి అభిలషిస్తుంది. ఆశ పెడమార్గానికి ఈడుస్తుంది. ఇలాంటి సుఖాదికం అవివేకం ప్రేమలతో జోడించి దేవతలు అనిత్యాత్మను నిర్మించారు.

నిత్యాత్మ శీర్షం. అనిత్యాత్మ హృదయం. పిరికి పందలు, వక్రమార్గులు మరుజన్మంలో స్త్రీలై పుడతారు. అమాయకులు, లఘుబుద్ధులు, గణితశాస్త్రజ్ఞానం లేకుండానే నక్షత్రాలవంక చూచినంతమాత్రాన ఖగోళశాస్త్రం నేర్చుకోవచ్చుననుకొనేవారు పక్షులై జన్మిస్తారు. తత్త్వజ్ఞానం లేనివారు వన్యమృగాలై పుడతారు. మరీ మూఢులు చేపలై పుడతారు.

(సశేషము)

కథానిక:

నమశ్శివాయ

శ్రీ వేలూరి శివరామశాస్త్రి

అర్చకత్వ మారంభించిన మొదటి దినములలో నమశ్శివాయ గుడిలోనికి వెళ్లి ఎపుడు బయటికి వచ్చునో ఎవరికిని దెలిసెడిది కాదు. సంధ్యాకాలమున దేవదర్శనమునకు వచ్చిన భక్తులు లింగము ముందు నందివలె మేలుకనియే నిదుర పోవుచున్న తనను లేపకముందే అతడు లేచి సాయంకాలపూజ ఆరంభించుచుండెడివాడు. కోడలు వచ్చువరకు అతని భార్య పార్వతి పూలమొక్కలు పెంచి శివునకు పుష్పలావికగా నుండెడిది.

మల్లేశ్వరుడీ నమశ్శివాయను ఎంతోకాల మీ ధ్యానయోగమున నిలిపియుంచలేదు. కొబ్బరికాయలో, అరటిపండ్లో, పసపుకుంకుమలో, పప్పుబెల్లములో మ్రొక్కుబడులు రప్పించి అడ్డగించుచుండెడివాడు. నమశ్శివాయ హస్త మమృతహస్త మని బవాళా మోగెను. రోగు లందరు నతని చేతి మాత్రల కాసించుచుండెడివారు. అతడు పురాణము చెప్పుచుండగా కోకిల లాలకించుచుండెడివి. అతని గురుత్వమున గ్రామములో పలువు రుభయభాషలకును అంటె వేసిరి.

నమశ్శివాయ తనకు పురుడుపున్నెములు వచ్చినపుడు అర్చన కడ్డురాకుండ అల్లుని గొని వచ్చి యిల్లరిక ముంచుకొని అతనికి భాగము పంచిపెట్టెను.

నమశ్శివాయ కిపుడు కొడుకు చేతి కంది వచ్చెను. అతని పేరు మల్లయ్య. అతడును చదువరి. పయిగా మంచి సేద్యగాడు. అతని బావమరది లింగయ్యయు వ్యవసాయమున గట్టివాడు.

ఈ రీతిగా నమశ్శివాయకు సంసారపు జంజాటము ముక్కాలు మువ్వీసము తగ్గిపోయెను. అతని కిపుడు దాదా పరువదేండ్లు. ఇట్టి మేలు తనకు కలిగినందులకు నమశ్శివాయ మిగుల సంతసించి మల్లేశ్వరున కొక మొక్కు మొక్కి తన యింటిలో ప్రవేశించినటులు గుడిలో ప్రవేశించెను. అల్లుగొడుకులలో నెవరో యొక రిపుడు మొక్కుబడులు మొదలగువానిని గొని దేవరకు నివేదించుచు నమశ్శివాయకు మేలుకొలుపులు లేకుండ జూచుచుండెడివారు.

'మనసే దేవళ మయినవానికి గుడి యయినను బడి యయిన నొకటే.' యని యతని కిపుడు తోచెను. ఆత్మలింగము తెలియని యెడల లింగము రుబ్బు పత్రమే యను నొక యెరుక అతనికి కలిగెను.

నమశ్శివాయ నిత్యమును గ్రామ ప్రదక్షిణము చేయుచు ఊరి నడుమ నున్న రావిచెట్టు చుట్టు గూడ తిరుగును. ఆ ప్రదక్షిణములో కుక్కయేని గాడిదయేని గాన బడినచో—

"మంచివాడెవండు మల్లయ్యకంటెను
కుక్కయందు రేవుగుజ్జమందు
దివ్వటనిల్చి మాకు దేహాభిమానంబు
మాంపువాడయా నమశ్శివాయ"

అని వానిచుట్టును ప్రదక్షిణము చేసి వచ్చుచుండును.

కొందరు నమశ్శివాయకు వెఱ్ఱి యెత్తిన దని అనుకొనిరి. మరికొంద రతని వాక్యములను మహావాక్యములనుగా తలపోసిరి. అట్టి సమయమున అత డింటిబరు వంతయు కొడుకుబుజముల మీది కెత్తి శ్రీశైలము మొదలగు క్షేత్రములకు పోయెను.

నమశ్శివాయ పొల మించుమిం చిరువ దెకరములు. ఆ పొల మంతయు పోటు మెరక. నమశ్శివాయ తన భుజబలము వలన దాన సాబాలు మాత్రమే మాగాణి చేయ గలిగెను. మిగులు సాబా లిప్పు డతని కొడుకును, అల్లుడును ఆయకట్టులో చేర్పించి సొంత కమతము చేయ దొడగిరి.

వారి పాటు చక్కగా అక్కరకు వచ్చెను. పొల మంతయు జదరమై వచ్చిన కొలది పంటంతయు క్రమముగా పెరుగుచు వచ్చెను. నమశ్శివాయ కొడుకున కొక కొడుకును, కూతున కొక కూతును గలిగిరి. ఇటులు సంసారమును, తమ కృషియును ఫలించినందులకు బావమరదు లిరువురకును శివునిమీద భక్తి యెక్కు డగుచు వచ్చెను.

ఇటులు తన సంసారవృక్షము చిలవలు పలవలు వేసి పూచి కాచి పండుచుండగా నమశ్శివాయకు అది యంతయు జూచికొని ఆనందించుభాగ్యము లేకపోయెగా యని పార్వతి వగచుచువచ్చెను.

౨

ఎండోమెంట్స్ బోర్డువారి ఇన్స్పెక్టరు ఈలపల్లిలో దిగెను. బస్సు బుస్సు మనుచు వెళ్లిపోయిన తరువాత అతడు తన చుట్టు తా నొక ప్రదక్షిణము చేసి ఊరంతయు కలయగాంచెను. పది పండ్రెండు డాబాలును,నలుబది యేబది పెంకుటిండ్లును, ఇన్నూరు మున్నూరు పూరిండ్లును, వాని నడుమ దేవాలయమును అతనికిగానబడెను.

అర్చకుడును, అతని వెనువెనుక కరణము మునసబులును వచ్చి ఆతిథ్య మిచ్చి అతనిని రచ్చసావడిలోనికి దీసికొనిపోయి అచట విడియించిరి. అతడు ప్రయాణపు బడలికను నడలించుకొనుటకు బలె అర్చకునకు సెల వొసగి మంచముమీద మేను వాల్చెను.

అంతట కరణము మునసబులుగూడ— 'మాకుగూడ సెలవు దయచేయింపు' డని వేడుకొనిరి.

'ఉండు డుండుడు. మీతో మాటలాడుటకే అర్చకుని బంపివైచితిని.'

'చిత్తము చిత్తము.'

'మీ యూరిలో దేవాలయ మే స్థితిలో నున్నది?'

'మంచి స్థితిలోనే యున్నది.'

'పూజారి?'

'చెడ్డవాడు కాడు.'

'మీ దేవాలయమునకు ట్రస్టీ నేర్పాటు చేయుటకు వచ్చితిని' అని ఇన్స్పెక్టరు చెప్పుచుండగా నచటికి ఇరువురు వచ్చి కూరుచుండిరి.

'వీ రెవరు?'

'ఈ ఆలయము కట్టించిన ఈలపల్లి వారి వంశములోనివారు. వీరు చలమయ్య గారు. వారు మల్లికార్జునుడుగారు' అని కరణము చూపి చెప్పెను.

'మంచిది. మీ దేవళమునకు ట్రస్టీ నేర్పాటు చేయవచ్చితిని.'

'అంతయు తిన్నగా నున్నపుడు ట్రస్టీ లెందులకండీ?' యని చలమయ్య అనెను.

'నేను తిన్నగా ఉండవచ్చును. రేపు ఉండకపోవచ్చును.'

'ట్రస్టీ తిన్నగా నుండకపోయినచో?' అని మల్లికార్జును డనెను.

'బోర్డువారే యున్నారు.'

'ఇది మాటసొంపే కాని పని కుంపు. ఎక్కడి ఈలపల్లి? ఎక్కడి చెన్నపట్నము? కాసుగొడ్డుకు రూకబండె.' అని చలమయ్య అనెను.

'ధర్మకర్తలే యిటు లనినచో నెటు లయ్యా? పొరుగింటివాడు పాడిగేదె అంటే ఇంటివాడు గొడ్డుగేదె అన్నట్లు!'

'దేవళమున అర్చన తిన్నగా జరగని యెడల ఊరివారే పూజారికిచెప్పి తిన్నగా జరిపింతురు. ఉత్సవములు ఊరేగింపులు వారే జరిపించుకొనుటలేదా? ఉన్నది ఊదివేయుటకా ట్రస్టీలును గ్రస్టీలును?' అని మల్లికార్జును డనెను.

'మీ అందరిదియు ఒకటే కూత యేమయ్యా? ఏవాడ చిలుక ఆవాడ పలుకు.'

'పెద్ద రాబడి గల దేవళములకు సర్కారువారి అద్దారీ ఉండిన ఉండవచ్చు'అని చలమయ్య అనెను.

'ధర్మాదాయముల నన్నిటిని ఒక మేరలోనికి తెచ్చుటకు ఈ ఎండోమెంట్సు బోర్డు ఏర్పడెను. దానికి చిన్న పెద్దలు లేవు. దాని కీలపల్లిలో ఈశ్వరాలయమును, తిరుపతిలో వెంకటేశ్వరాలయము నొకటే. దానికిని ట్రస్టీ లున్నారు, దీనికిని ఉందురు. అది లా.'

'ఏమి లా అండీ? తిరుపతికి లక్షల కొలది రాబడి. ఈలపల్లి మీ కంట్రిబ్యూషన్‌తో నఫా. ఈ యూరి జనాభా రెండువేల పైచిలుకు. ఇందులో రెండు పార్టీలు. ఈ స్థితిలో తమరు ట్రస్టీల నేర్పాటు చేసినచో ఇక చెప్పవలెనా సౌభాగ్యము?' అని మల్లికార్జును డనెను.

'పార్టీ లున్నపుడే మజా. ఆ పార్టీలో కొందరను, ఈ పార్టీలో కొందరను దేవళము లోనికి పిలిపింపుము.'

మోతాదు గ్రామములోనికి వెళ్లెను. కొలది సేపటిలోనే యిరువాగుల వారును ఒక నూరుమంది దేవళమున జేరిరి. ఇన్స్పెక్టరుగారి రాకకు కారణ మందరకు నెరుకపడెను.

రెండు పక్షములవారును కరణమును ట్రస్టీగా నెన్నుకొనిరి. అంతట ఇన్స్పెక్టరు

లేచి దేవళములను అర్చకులను ట్రస్టీలను పంచాయతీలను ధర్మాదాయములను గూర్చి ఒక చిన్న యుపన్యాస మిచ్చెను.

ఆ యాలయముమీదను, ఆ యర్చకుని మీదను, ఆ యాదాయము మీదను తమలో ప్రతివానికిని హక్కు కలదని ఆ సభలోనివారి కందరకును ఒక క్రొత్త స్వత్వ ముద్బుద్ధమాయెను. తమ కింతకంటె భారమగు నొక విధి యున్నదని వారి కెవరికిని తోపలేదు.

3

కరణముయాజమాన్యమున నొక ఏడాది తిన్నగనే గడచిపోయెను. మరుసటి యేడు గూడ మునసబుయాజమాన్యమున ప్రశాంత ముగనే గడవవచ్చుచుండెను. అట్టి సమయమున మల్లయ్యకును, అతని పొరుగున ఆసాము లిరువురకును పశువుల 'పాక' గోడకాలు గూర్చి ఒక చిన్న తగవు వచ్చెను. ఆ తగ విది :

సమశ్శివాయపసులపాకగోడ మురికి వానలవలన పడిపోయెను. వెంటనే క్రొత్త గోడ పెట్టినయెడల నిలువజాలదని మల్లయ్య దాని నటులనే ఉంచెను. అతడు తండ్రి సంగతిసందర్భములు కనుగొనుటకు సుదూరము వెళ్లినతరుణమున ప్రక్క ఆసాము లిరువురును ఆగోడ తమ భాగములోనికి వచ్చునటులు చిళ్లకంప తెచ్చి పాతిపెట్టిరి. మల్లయ్య నూహూరినుండి తిరిగి వచ్చి చూచునరి కాచిళ్లకంప చిళ్లలుపెట్టి పవనవలాడుచు పెరుగుచుండెను. ఈ కంటకములను శోధించుచో తనచేతులకేకాక తన ఆస్తికిని కంటకములు గ్రుచ్చుకొనగల వని పారజూచి మల్లయ్య కరణముమునసబులకు విన్నవించుకొన నేగెను.

ప్రక్క ఆసాములకు అది తెలిసి తమతమ వాదములను తెలుపుటకు రచ్చసావడి కేగిరి.

కరణము మునసబులు వచ్చి చూచి మల్లయ్య పక్షముననే తీరుపుచెప్పిరి. తగవు చూడవచ్చిన గ్రామస్థులు — 'ఇంకను ఊరక చూచెద వేమయ్యా? పీకు, చిళ్లకంప పీకు. నీ వొకటి పీకుటయే తరవాయి. ఇది నీ నట్టిల్లు' అని మల్లయ్యకు మెల్లగా చెప్పిరి. అది విని మల్లయ్య చేయి చేసికొనెను. పిదప వేయి చేతులు పడెను. ఆ రంగమును జూడలేక ప్రక్క ఆసాము లిద్దరును అట నుండి తప్పుకొనిరి.

అది జరిగిన కొన్ని దినములకు....— 'ట్రస్టీయును అర్చకులును కలిసి దేవద్రవ్యమును అపహరించుచున్నా' రని బోర్డువారికి కొన్ని విన్నపములు చేరెను. ఆ విన్నపము లాలించి అసిస్టెంట్ కమిషనరుగారు వీరాచారిగారిని, వెంకునాయడుగారిని, సారథి జియ్యర్ గారిని ట్రస్టీలగా నియమించెను.

ఇది జరిగిన కొన్నాళ్లతరువాత వీరాచారి జిల్లాకోర్టువారి కొక విన్నప మిటులు చేసికొనెను:—

'ఈలపల్లి మల్లేశ్వరస్వామివారి దేవాలయపు ట్రస్టీలు కొలువు తీరి నన్ను మేనేజింగ్ ట్రస్టీగా ఎన్నుకొనిరిగావున హిందూ రెలిజియస్ ఎండోమెంట్స్ ఆక్టు ౭౨ వ సెక్షన్ చొప్పున సదరు మల్లేశ్వరుని మాన్యములను అన్నిటిని దేవాలయముతో సహా నాకు పొజిషన్ చేయగోరుచున్నాను.'

ఈ విన్నపము కోర్టువారి పరిశీలనములో నుండగా పంటకాలమున వీరాచారి మరి యొక విన్నప మిటులు చేసెను:—

'పంటకోయు తరుణము సమీపించుచున్నది. ఈ దేవుని మాన్యముల కొక రిసీవరు నేర్పాటుచేసి యీ పంటమీద వచ్చు ఆయమును కోర్టులో నిలువ ఉంచగోరుచున్నాను. ప్రతివాదులు బలవంతులు. వారికి లోగడ ట్రస్టీలుగా వ్యవహరించిన కరణము మునసబుల అండ కలదు. ఈ బలముతో వారు పంటనంతయు నపహరింపగలరు. కావున వెంటనే పోలీసుమద్దతు ఇప్పించగోరుచున్నాను.'

వీరాచారి యీ రెండవవిన్నపము ప్రకారము రిసీవరు విచ్చేసెను. పోలీసు బందోబస్తుతో పంట వేలమువేసి వచ్చిన సొమ్మును కోర్టు కప్పజెప్పెను.

ఇది జరిగిన కొలదికాలమునకు కోర్టువారు వీరాచారి మొదటివిన్నపము నాలించి యిటులు తీరుపు వ్రాసిరి:—

'ఈ దేవమాన్యము లన్నియు మల్లేశ్వర స్వామివారివే యని శ్రీ వీరాచారిగారు ఎండోమెంట్స్ బోర్డువారి ప్రమాణపత్రమును జూపి సదరు దేవమాన్యములను దేవాదాయమును దేవాలయమును స్వాధీన పరచుకొనవచ్చును.'

కోర్టువారి యీతీరుపు చూచినవెంటనే వీరాచారి ఎండోమెంట్స్ బోర్డువారి ఉల్లాకు చూపి కోర్టులో నిలువయున్న ధనమును తన నిలువడబ్బును తీసికొనినటులు తీసికొనెను. మాన్యములను దేవాలయమును స్వాధీనపరచుకొనెను.

'చిళ్లకంప పీకినటులు కాదు. ఇపుడు దాని సంగతి తెలిసివచ్చునులే' అని మల్లయ్య హంసాయి వెంకునాయ డనెను.

'పిల్లకాకి కేమి తెలుసురా ఉండేలు దెబ్బ' అని రెండవ హంసాయి వీరాచారి యనెను.

౪

నమశ్శివాయ ఎచట నుండెనో ఎవరికి తెలియదు. వీలయినపు డెల్ల మల్లయ్య అతని యునికిని గురించి పెద్ద పెద్ద శివక్షేత్రము లన్నియు గాలించి వచ్చుచునేయుండెను. విఫలుడై మల్లయ్య యింటికి జేరిన తరువాత మామగారిని వెతకి తెచ్చుటకు లింగయ్య దేశము లన్నియు తిరిగి వృథాగా వచ్చుచుండెను. ఇటు లీయిరువురకును అనుకొనకుండగా దేవదర్శనము చేయించి చేయించి ఒకానొకనాడు నమశ్శివాయ ఏడనుండియో ఊడిపడెను. పార్వతి ఆ నాడు మరల పెండ్లికూతురై సిగ్గుతో భర్తకు పరిచర్యచేసెను. మల్లయ్య తండ్రిపాదములు కడిగి తడి యొత్తెను. అల్లు గూతుండ్రును పరుగులెత్తుచు వచ్చి సాష్టాంగప్రణామము చేసి దవుదవుల గూరుచుండిరి.

ఏయే క్షేత్రములం దేయే మహాత్తులు చెప్పెనో యని గ్రామవృద్ధులు పలువు రతనికడకు వచ్చి కూరుచుండిరి. వారికంటె ముం దతనికడ చదివికొనినవారు పలువురు బిలబిల మూగిరి.

'ఊరి మాక్సేకాని మల్లయ్య మార్పు లేదు' అనినటులు నమశ్శివాయ మాటలాడక చూపుకు వ్రేల మల్లేశ్వరుని జూపుచు కూరుచుండెను.

అతడు కొన్నాళ్లనుండియు మౌనవ్రతములో నుండెను. అది ఎవరికిని తెలియదు. నమశ్శివాయకు పిచ్చియేకాక మూగతనము గూడ వచ్చెనని అందరు ననుకొని దుఃఖించుచు బోయిరి.

తాము తినుటకుగాని, దేవునకు బెట్టుటకుగాని యింట గింజలు లేవు.

'గుడిమణితము చేయరా దనియా మల్లయా మేము నీ కిచ్చిన మా పొలము లాగుకొంటివి ?' అని మల్లయలింగయలు మల్లయముందు గూర్చుండి ఆలోచించి ఆలోచించి ఎల్లనమ్మి అప్పుసొప్పులు తీర్చి మిగిలిన కొలది పైకము పెట్టి గింజలు కొనిరి.

గ్రామములో రైతు లందరును పొలములలో మెరకలు తీసి ముంగిళ్లవలె సమపరచుచుండిరి. తమ కింతకు పదిరెట్లు పంటకుప్పలీయవలయు ననునటులుగా ఎరువు కుప్పలు కుప్పలుగా బోయుచుండిరి. దప్పికి నోరు విప్పినచందముగా భూమి బల్లునపగిలి బీటికలు విచ్చెను. గొడ్లకాపరులు గబగబ పరువిడుచు ఆ బీటలలో దిగబడి అనూరు లగుచుండిరి. పాడి పసరములు తక్క మిగులు పసరము లన్నియు చేలలోనే నిలిచి తాము తినిన పచ్చులకుబదులుగా నీలము లొసగుచుండెను.

వీరాచారి చిన్ననాటినుండియు కోర్టుపక్షి. అతడు వ్యాజ్యములు కొనుచు అమ్ముచు బేరములు చేసిచేసి దివాలాలు తీసితీసి లా యంతయు తెలిసికొనెను. అతనికి సెంటుపొలము లేదు. అతడు సేద్యమునకు పుట్టుగ్రుడ్డి. ఎద్దు లేదు. తాడు లేదు. ఇంట విస్తరియు, నీరు తక్క మరి యేమియు లేదు. ఇట్టి స్థితిలో కోర్టువారి దయవలన ఈ యిరువ దెకరముల దేవమాన్యమును తన యాజమాన్యమునకు వచ్చెను. మిడిసిపడి సేద్యము చేసెనా మిగులునది విత్తనములకేని సరిపోదు. మల్లయ్య తనచేతిలో బడినను తన యాజమాన్యమున కాయు వెంతో తనకు తెలియదు. ఇది యంతయు సాంగోపాంగముగా నాలోచించి వీరాచారి లోపాయకారిగా దేవమాన్యములను వెంకునాయుడుకును, [illegible] జియ్యరుకును కౌలుకిచ్చెను.

ఏరువాక పున్నమ దాపురించెను. అందరును నారులు పోసి పెంచుకొనుచుండిరి. మల్లయ్యకును లింగయ్యకును ఏమిచేయను పాలుపోలేదు. గ్రామము విడనాడి మరియొక గ్రామము చేరుటకా ధైర్యము చాలదు. గ్రామములోనే యున్నచో దేవుని నైవేద్య దీపారాధనలకును, తమ తిండితిప్పలకును ఆధారము లేదు. మల్లయ్యమ్రోల ఎంత మొత్తుకొన్నను అత డులుకడు, పలుకడు.

వారిరువురును ఆలోచించుకొని ఒక దారికి వచ్చిరి. ఆరు మూడయినను గ్రామము విడనాడరాదు. మల్లయ్యను మరవరాదు. వ్యాజ్య మాడరాదు. ఈ యభిసంధితో మల్లయ్య కరణముగారి యింటికిని, లింగయ్య మునసబుగారి యింటికిని వెళ్లిరి. కరణము ఇంట లేడు. మునసబుగారును ఇంట లేరు. వారిరువురును రచ్చసావడిలో నుండిరి. మల్లయలింగయలు రచ్చసావడికే పోయిరి.

'ఇటు ఇటు' అని కరణము మునసబు లిరువురును ఆ యిరువుర నాహ్వానించిరి. మల్లయలింగయలు వారి యిరువురికడ చేతులు కట్టుకొని నిలువబడి 'మే మిరువుర

మును మీ యిరువురకడ పాలేళ్లుగా ఉండ దలచి వచ్చితిమి' అని ఏకగ్రీవముగా మనవి చేసిరి.

కరణము మునసబు లిరువురును తెల్ల బోయిరి. మరునిమిషమునకే యథాప్రకార మునకు వచ్చి—'మాకు పాలేళ్లు లోగడనే కుదిరిరి' అని కరణ మనెను. మునసబు కరణముమనస్సు పసికట్టి చిరునవ్వు నవ్వెను.

'మేమొక బస్తా తక్కువకే ఉందుము' అని లింగయ్య అనెను.

'రెండు తక్కువ ఐనను ఉందుము' అని మల్లయ్య అనెను.

'రేపు మాయింటికి రండు, ఆలోచింతము' అని కరణ మనెను.

గ్రామము ప్రదక్షిణించుచున్న నమశ్శివాయ చెవులలో ఈ మాటలు గంట కొట్టినటులు వినబడెను.

౫

కరణము మునసబు లిరువురును అడంగులు బాడంగులు తీసి చూచి యిటు లొక కాకితము వ్రాసిరి:—

'నమశ్శివాయగారు ఈలపల్లిలో వేంచేసియున్న శ్రీ మల్లేశ్వరుల వారికి వారసుగా ఉన్న అర్చకులు. వీరి తాతముత్తాత లందరదియు ఈలపల్లియే నివాసము. వీరి వంశకర్తలే ఈ యాలయము పుట్టిననాటి నుండియు నేటివరకును విడువక అర్చన చేసికొనుచు వచ్చుచున్నారు.

'ఇచట వీరికి పొలము పుట్ర ఉన్నది.

'ఈ యాలయము సుమారు నూరేండ్ల నాటిది. శివభక్తులును మంత్రిశేఖరులును అగు ఈలపల్లి వియ్యన్న మంత్రిగారు దీనిని కట్టించిరి. వీరు జమీందారుకడ తమకు గల పలుకుబడి నుపయోగించి నిత్య నైవేద్య దీపారాధనములను చేయుకొరకు అర్చకునకు గల పొలములమీద శిస్తును మాపు చేయించిరి. ఆ శిస్తు నూటరెండు రూపాయలు.

'ఇవి దరిమిలా యీనాము లని జమీందారీ లెక్కలలో గలదు. ప్రతిపొలమునకును శేరీ శిస్తు లెక్కయు దాని మాపీయు ఈ లెక్కలలో నున్నది. ఈ యాలయముగాని యీ యీనాములుగాని యీనాం కమిషనర్ వారి జూరిస్‌డిక్షన్ కిందికి రాలేదు. ఈ పొలములగురించి యీనాంస్టేట్‌మెంట్ లేదు. ఈనాముల ఫెయిర్ రిజిస్టర్లో వీని పత్తాలేదు.

'కాబట్టి ఎండోమెంట్సు బోర్డువారి కధికారము లేదు. ఒకవేళ అధికార మున్న యెడల అది నూటరెండు రూపాయల శిస్తు మీదనే.'

మల్లయలింగయలు వచ్చి యీ కాగితము చూచిరి. దీనిలోని ముఖ్య విషయములు మల్లయకును తెలియును. మల్లయ్య తాత మల్లయ్య యీ విషయములు నమశ్శివాయకు అతని యిరువదవయేట చెప్పెను. నమశ్శివాయ తనకు తన యిరువదవ యేట చెప్పెను.

'ఏమి సెలవు?' అని లింగయ్య తమ కమత ముందుటను గూర్చి అడిగెను.

'మీరు ట్రస్టీలమీద దావా దాఖలు చేయుడు. ధనము లేనిచో మేము పెట్టుబడి పెట్టెదము. దానిని మెల్లగా తీర్చుకొనవచ్చును. పొలములకు బోయి వారు దున్నుచున్న నాగళ్లను విప్పివేయుడు. మీరు మీ పొలమునంతయు మీ స్వాధీనములోనికి తెచ్చుకొనుడు. మీరు నాగళ్లు కట్టి దున్నుడు. ఊడ్పుడుడు.' అని కరణము మునసబు లేకకంఠముగా అనిరి.

'మా నాగళ్లను వా రూడదీయుచో?' అని మల్లయ్య అనెను.

'కొంత మందిని కూర్చుకొని దున్నుంపుడు.' అని కరణ మనెను.

'దొమ్మి జరుగుచో?'

'నిర్వహింపవలెను'

'ఇంత నైనను దావా ఓడుచో ?'

'ఓడరు ఓడరు. సరి యగు ఆధారము లేనిచో మఠములకుగాని, దేవాలయములకుగాని పూర్వమునుండియు వచ్చుచున్న ఏర్పాటులనుగాని, హక్కులనుగాని, మరియాదలనుగాని, వచ్చుబడులనుగాని, మామూళ్లనుగాని హిందూ ధర్మాదాయపుచట్టమును బట్టి తోసివేయరాదు' అని ౭౯ వ సెక్షన్‌లో విస్పష్టముగా వ్రాసియున్నది. ఈ యాలయము పుట్టినప్పటినుండియు మీకు పన్ను మాఫీ చేయబడినది. ఆ పన్నుమాఫీకి మింజుమలె మీరు అర్చనచేయుచుంటిరి. ఈరీతిగా మీకు కాగితపుబల మున్నది. అంగబల మున్నది. అర్థబల మున్నది.' అని యిటులు కరణము చెప్పుచుండగా ఆ పక్షమువారిలో నొకడును, ఈ పక్షము వారిలో నొకడునుగా ఉభయపక్షములలో నున్న పెంకెతలకాయ లన్నియు పోగు పడెను.

మల్లయ్య యిటు లనెను:—' యుద్ధమును వ్యాజ్యమును ఒకటి. ఈ రెంటను జయాపజయములు తెలియరావు. జర్మనీ జయించు నని అంద రనిరి. అదియే ఓడెను. అటులు మే మోడుదుమేని మా ఆస్తియంతయు ఋణములో వీసపాలుకును రాదు. అటులు ఋణమున పడిపోవుటకంటె మీ కొడ లమ్ముకొని కాలము వేలుపును కొలుచుచు మే మింత తిన బడయగలుగుట మేలుకదా.'

'కరణమువారు కావలసినంత ఉసియీయగా నీ కెందులకయ్యా యీ అనుమానము ?' అని ఒక డనెను.

'మాదిగవాని మాట విని మాలవాడు మల్ల చిప్ప పగుల గొట్టుకొన్న సామెతగా చెడిపోకు' అని యింకొక డనెను.

ఈ మాటల కెదిరిపక్షమువారి కనులెఱ్ఱబడెను.

'రేపు రండయ్యా మాటాడుకొందము' అని కరణము పలుకగనే మల్లయలింగయలు సెలవు తీసికొనిరి.

'పూజారి వద్దు మొఱ్ఱో అనుచుండగా కరణాని కెందుకురా అదిరిపాటు?' అని సారథిజియ్యరు లేచెను. కరణముగారి మోతాదు 'వారును వారును ఏదోమాటలాడుకొనుచుండగా సాతాని జియ్యరు కెందుకురా ఉలికిపాటు?' అని లేచెను. అంతట అందరకును రోసములు పెరిగెను. ఆకాశమున కఱ్ఱలు లేచెను. కఱ్ఱలును బుఱ్ఱలును కసకసలాడునంతలో 'దారి. దారి' అని నమ

శ్శివాయ మేఘ గంభీరధ్వని అందరకును వినవచ్చెను. చిరపరిచితమైన ఆ నూతన ధ్వని నందరు నాదరించి పాయదొలగి కజ్జలు వాల్చి ఆశ్చర్యముగా జూచిరి. నమశ్శివాయ డాచేతిని, వలపల చేతిని ఎత్తి ఎక్కడివారి నక్కడ కూరుచుండజేసి సూటిగా కరణము మునసబుల ముంగలికి వెళ్లి—'అయ్యా, లోకుల వంకరను మీ రెటులు దిద్దగలరు? మల్లయ్యయే తనమీది చంద్రవంకను దిద్దుకొనలేకపోయెనే! ఇంత మంది అన్నపూర్ణలుండగా మల్లయ్య కుపవాస ముండదు.' అని తన వెనుక వచ్చిన అల్లుగొడుకులను జూచి—'నా యనా, మీ పాత్రయు అక్షయ మగుగాక. మీరు నావలెనే జోలెలు గొని ప్రక్క-యూళ్లకు పోయి భిక్ష గొనివత్తురుగాక' అని తనమీది ఉత్తరీయమును రెండుగా చించి యిరువురిమీదను బడవయిచి రెం డడుగులు ముందులకు నడచి ముంగిలి లోనికి జని 'భవతి భిక్షాం దేహి' అని జోలె పట్టెను.



గాడ్సేజాతకములో ప్రారబ్ధపరిపాకము

శ్రీ రాళ్లపల్లి గోపాలకృష్ణమాచార్యులు

కురుకులపితామహుండగు భీష్మాచార్యుని వధించుటకై శిఖండి జనించినట్లు, అఖిలభారత పితామహుండగు మహాత్ముని జంపుటకై నాథూరాం వినాయక గాడ్సే అవతరించెనని జాతకసామగ్రియాధారమున గత 'భారతి' సంచికలో కనుగొంటిమి. పాండవకౌరవులు రెండు పాయలై కురుక్షేత్రయుద్ధములో కౌరవులకు రక్షకుడుగా భీష్మాచార్యుడు పనిచేయుదాక శిఖండి వేచియుండవలసినట్లు, ఇండియాపాకిస్థానములు విడిబడిన తరువాత పాకిస్థానక్షేమార్థమై మహాత్ముడు శ్రద్ధవహించి పనిచేయుచుండెనను నమ్మకము తనకు వచ్చునందాక గాడ్సే వేచియుండవలసివచ్చినది. అనగా, జన్మకాలమందు జాతకగర్భమున లీనమైయున్న శక్తులు ఉద్బోధితములై కార్యరూపము దాల్చుటకు తగిన సమయము ౧౯౪౮ వ సంవత్సరము జనవరి మాసాంతములో వచ్చినదనుట !.

"యోగాస్తే కిం కరిష్యంతి స్వదశానా మనాగమే".

అనురీతి, యోగము పరిపక్వమగుటకు దశా సౌకర్యము రావలసియున్నదిగదా ?

'మామూలు' పద్ధతి చొప్పున వింశోత్తరీ (ఉడు) దశను సాధించి అది యే మనుచున్నదో చూతము.

సాయనచంద్రుడు ...	౧-౫౪	తుల
'జ్యోతిర్గణిత' రీత్యా అయనాంశలు	౨౨-౩౫	
కాగా, నిరయనచంద్రుడు	౯-౧౯	కన్య
అగుటచే, ఉత్తరానక్షత్రశేషము	౦-౪౧	

	ది.	మా.	సం
కనుక, జన్మకాల రవిదశాశేషము	౨౧	౩	౦
జన్మదినము ...	౧౯	౫	౧౯౧౦
రవిదశాంతము ...	౧౦	౯	౧౯౧౦
చంద్ర, కుజ, రాహు దశలు...	౦	౦	౩౫
గురుదశారంభము ...	౧౦	౯	౧౯౪౫
గుర్వంతరము ...	౧౭	౧	౨
శన్యంతరారంభము ...	౨౭	౧౦	౧౯౪౭

అగుటచే, మహాత్ముని నిధనదినమునకు గాడ్సే గారికి గురుమహాదశలో శన్యంతరము జరుగుచుండునని తేలును.


"ఆయుర్దాయవిభాగశ్చ, ప్రాయశ్చిత్త క్రియాతథా,
సావనేనైవ కర్తవ్యా, శత్రూణా మప్యుపాసనం"

అని 'పితామహ' వాక్యమట ! దీని ననుసరించి సౌర (౩౬౫¼ దినముల) సంవత్సరములకు మారుగా, సావన (౩౬౦ దినముల) సంవత్సరములు దశలలో లెక్కవేయుపద్ధతి కొందరు శాస్త్రవేత్తలలో కలదు. ఈపద్ధతిచే అవలంబించి లెక్కించినచో, సుమారు ఆరున్నర నెలలకు పూర్వమే శన్యంతరము ఆరంభించుచున్నది. కాని ఏ సంప్రదాయము ప్రకారమైనా, నిధనకాలమునకు దశాంతర్దశలలో భేదము రాదు. ఈ జాతకమున నిరయనముగా గురువు సప్తమరాజ్యాధిపతి; శని అష్టమభాగ్యాధిపతి. ఉద్యోగాధిపతిదశలో, మృత్యుస్థానాధిపతి అంతరము వచ్చిన దనవచ్చును. కుజరాశియగు నిరయనమేషములో శని యుండి నీచుడైనాడు. ఈశనితో దశానాథుడగు గురువునకు షష్టాష్టకసంబంధ మున్నది. ఈ సామగ్రి ఇప్పటి దశ గాడ్సేగారికి చెడ్డదని సూచించవచ్చును. కాని ఈదశ ఇట్టి ఘోరహత్యాకార్యము చేయించునని చెప్పుట కష్ట మనుకొందును. 'వచ్చిన దశ చెడ్డది; చేసిన కార్యము చెడ్డది' అని

ఈ రెండింటికిని సంబంధము సాధించినచో, అది 'బాదరాయణ' సంబంధమువంటిదగును.

పోనిండు. ఈదశాభుక్తి గాడ్సేతో ఈ ఘోర కార్యము చేయించగలదే యని మాటవరుసకు ఒప్పుకొనినా, మహాత్ముని జీవితమే దీనికి గురికావలె ననుప్రశ్న ఇంకను మిగిలియుండును. ఈదశాపద్ధతిలో దీనికి ప్రత్యుత్తరమును సంపాదించుట, నాదృష్టిలో, అసాధ్యకార్యము.

అది యట్లుండె. దేవమానదశాపద్ధతి ఏమి సూచించునో చూతముగాక. ఈక్రిందిచక్రములలో గాడ్సేజన్మకుండలికి తోడు ౧౯౪౮, జనవరి నెలకు చలితగ్రహాదులు సయితము చూపబడినవి:—



పైచలితకుండలియందలి గ్రహస్థానాదుల నొక్కమారు పాఠకమహాశయులు తిలకించిరేని, జన్మకాలిక గ్రహయోగాదులు సూచించిన ప్రారబ్ధకర్మ ఏరీతిగా పరిపాకమునకు వచ్చినదో సులభముగా బోధపడగలదు. ఇందలి ముఖ్యాంశము లివి:

(i) ఈజాతకమున ఉద్యోగ(దశమ)స్థానాధిపతి కుజుడు. ఈకుజ డుండుట లగ్నమందే. నీచత్వము మాత్రముకాక, ఇంద్రుని దుస్సహావాసదోషము సయితము వీని కబ్బినది. ఇట్టి కుజు డిపుడు చలనవశమున సంపూర్ణకేంద్ర (౯౦ భాగల విషమదృష్టి) సంబంధమును చలితశనితో సంపాదించుకొన్నాడు! ఈ శని అష్టమ(మృత్యు)స్థానాధిపతి!

"ఏకైకమపూర్వనర్థాయ" అనురీతిగా, ప్రబలములగు దోషములన్నియు నొక్కచోట కేంద్రీకరించినవి. కుజు డగ్నిగోళము; శని మంచుకొండ. వీరి ఘర్షణవలన క్రౌర్యము, కాఠిన్యము, దయాశూన్యత

హింసాతత్పరత ఇత్యాదిగుణములు కలుగును. తాము చేయు కార్యములవలన తమకుగాని, ఇతరులకుగాని క్లేశము కలుగుచేమో యను చింత ఈ రోగమున్న దశలో జాతకులకు రానేరాదు.

"అక్కటా! లాతులైన పగ
రైనను చంపన కోరజేల, యొం
డొక్క తెరంగు లేదె! అది
యొప్పదె!..........."

అని ధర్మరాజు చెప్పిన నీతిమాత్రము కనికుజాల రాజాంగములో గవ్యకైనా తరము కాదు. ఈ రోగము గలవారికి ఇతరులవిషయమున ఎంత నిర్దయయో, స్వవిషయమున సయితము వారి కంతే! ఇట్టి యీ రెండుగ్రహముల ఘర్షణ హత్యాకార్యమును ఉత్ప్రేరించుట వింత కాదు. "మహాత్ముని ప్రాణములపై నేను దయ చూపలేను; నాప్రాణములపై ఎవరు కాని దయమాపు నక్కరయు లేదు." అని న్యాయస్థానములో నిశ్శంకముగా, ఘంటాఘోషముగా, గాడ్సే వాదం చేనట!! ఇంతకన్న కాఠిన్యమా?

(*ii*) మే ష రా శి లో 'చావు—బ్రతుకులు' (*Life and death*) సూచించు ౭౨ భాగల ప్రదేశములో గాడ్సేజన్మకాలమున ఉద్యోగ (దశమ) భావమున్నది కదా? ఇది చలించి ఇప్పుడు వృషభరాశిలో ౧౭ వ భాగకు వచ్చియుండుట! ఈ రాశిలో ౧౬-౧౭ భాగల ప్రాంతమునకు హత్య (*Homicide*) విషయమున గొప్ప సంబంధముకలదని పాశ్చాత్యశాస్త్రవేత్తల మతము. అగుటచే, ప్రస్తుతదశలో జాతకుని ఉద్యోగము హత్యాకార్యమునకు సిద్ధపడుట వింత కాదు. చలితశనికుజుల కేంద్రఘర్షణకు ఈ చలితదశను కేంద్రవ్యాపారము వ్యాఖ్యానము చేయుచున్నది. ఉద్రిక్త స్వభావముతో, సాహసగారితనమును మేళవించుకొనియున్న ఉద్యోగాధిపతి కుజుడు మృత్యుస్థానాధిపతియగు శని: కేంద్రసంబంధమువలన దయాదాక్షిణ్యముల తోడ ప్రాపంచికవివేకమును సయితము కోలుపోయి క్రూరుడైన కాలములో, దశమభావము హింసాసూచకమైన భచక్రభాగ నాశ్రయించినది. దశాఫల మేమార్గమున వక్త్యమయినదో చదువరులు గమనించగలరు. జాతకుడు హత్యాకార్యమునకు ఉద్యోగించుటలో విశేష మేమి?

(*iii*) ఉద్యోగ (దశమ) భావములో నన్న గ్రహము మృదుమధురకోమలస్వభావము కల శుక్రుడు. ఈ గ్రహము సయితము ఘోరహత్యాకార్యమున కెట్లు సాయపడెను? అని శంకించువా రుందురేమో? ఇచట ఒక సూక్ష్మధర్మ మున్నది. భావముయొక్క ఫలము ఏధర్మమున నడువవలయునో, దాని పద్ధతిని నిర్ధరించి శాసించుట భావాధిపతికి చెందిన అధికారము. ఆ ధర్మమును నిర్వహించు కార్యముమాత్రమే భావస్థగ్రహము చేయవలసియుండుట. అనగా, భావాధిపతి శాసనకర్త (*Law-maker*). భావస్థగ్రహము కార్యనిర్వాహకుడు (*Executive*). అగుటచే, భావఫల స్వరూపమును నిర్ణయించువాడు భావాధిపతియే. ఆ కార్యభారమును నిర్వహించవలసియున్న భావస్థగ్రహము ఆ కార్యమునే తన స్వభావము ననుసరించి నెరవేర్చును. ప్రకృతసందర్భమున, జాతకుని ఉద్యోగధర్మమును కుజుడు నిర్ణయించగా, శుక్రుడు దానిని నిర్వహించవలసి యున్నదనుట! హింసాత్మకమైన ఘోరకార్యమును నెమ్మదిగా, ప్రశాంతముగా, భక్తునివలె ఈశుక్రుడు జరిపించునని యర్థము.

ఎంత ప్రశాంత పరిస్థితులలో జరిపినా, ఇట్టి ఘోరకృత్యమా శుక్రునివంటి శుభగ్రహము చేయవలసినది? అందురేమో? నియమించిన కార్యము నిర్వహించి తీరవలెనని అధికారి పట్టుబట్టి చూచుచుండుచున్నప్పుడు సేవకు డేమి చేయగలడు? చూడుడు! చలితశుక్రు డిప్పు డున్న స్థానము జన్మకుజునినుండి నికరముగా అర్ధకేంద్ర (౯౦ భాగల) క్రూరదృష్టిపాలయియున్నదని పాఠకమహాశయులు గమనించియుందురు. యజమానుని మన స్తత్వ మెట్టిదో మన మెరుగుదుము. ఇట్టి సన్నివేశములో కుజుని ఆజ్ఞను నెరవేర్చక శుక్రు డేమి చేయగలడు?

(*iv*) జన్మకాలమున వరుణగ్రహమున్న భచక్రభాగ స్వార్థత్యాగబుద్ధిని సూచించునట్టిదని మనము కనుగొనియున్నాముకదా? చలితశుక్రు డిపుడు అవరుణునికి పరిపూర్ణకోణ (౧౮౦ భాగల) దృష్టికి వచ్చి

యున్నాడు. ఈయోగమునకు హత్యచేయుటేనా ఫల మనవచ్చును. క్రొత్తఫక్కిలో స్వార్థత్యాగరూపమైన మహాత్కార్య మొక్కటి చేయుమని వరుణమహో శయుడు శుక్రుని కుపదేశము చేసినా డనుట సత్యము.

"అట్లే కానిమ్ము. నాయజమానుని (కుజుని) కార్యమును ఈ దృష్టితోనే నిర్వహింతును లెమ్ము." అని శుక్రుడు ప్రత్యుత్తర మిచ్చుచున్నట్లు చూపట్టు చున్నది. మరియొక విశేషము! చలితహత్యా సహామ యిప్పుడు చలితవరుణుని త్రికోణదృష్టికే వచ్చి యున్నదని చదువరులు గుర్తించగలరు. చలితశుక్రునికి సయితము ఈ చలితహత్యాసహమము కోణ దృష్టికే వచ్చినది. వరుణుని ఉపదేశమును శుక్రు డేరీతిగా ఆదరిం చుచున్నాడో, స్పష్టమగుచున్న దికదా!

(v) చలితచంద్రుడు ఏభావములో సంచరించుచుం డునో, ఆభావమునకు సంబంధించిన విషయములు ఆ వయస్సులో ప్రాధాన్యము వహించు ననుట చలిత కుండలియొక్క ధర్మము. గాడ్సే చలితకుండలిలో ఇపుడు చంద్రుడు అష్టమ (మృత్యు) భావములో నుండుట. ఆకారణమువలన ప్రకృతదశలో మరణ సమస్య ప్రధానాంశముగా నుండగలదని దీనిసూచన. అనగా,మరణము తనదైనా, లేక మరెవరిదైనా కావ చ్చును. సామాన్యముగా, ఇతరదశాసామగ్రి ననుస రించి జాతకునికో, ఇతరులకో ఈఫలము అన్వయించ వలసియుండును. ప్రకృతచలిత గ్రహాదిసామగ్రినంతయు పరిశీలించితిమేని, చలితచంద్రుని అష్టమభావసంచార ఫలమునకు ఉభయత్ర అన్వయ మున్నదేమో అన వచ్చును. జరిగిన కార్యము, దానికి తరువాతి ఫలము, ఈ రెండును దశకు తగినట్టివేకదా ?

(vi) జాతకములో 'కార్యసిద్ధిసహమము' అను ప్రత్యేకబిందు వొకటి కలదు. ఇది మీనరాశిలో వృశ్చిక (కుజ) నవాంశలో నున్నది. ఇంద్రకుజుల త్రికోణదృష్టి దీనిపై కలదు. మృత్యు (అష్టమ) స్థానాధి పతియగు శనితో దీనికి అర్ధకేంద్ర (౪౫ భాగలదృష్టి) సంబంధ మున్నది. శనియొక్క క్రూరకార్యమును ఇంద్రకుజుల సాహాయ్యమున నిర్వహించుటే ఈ జాతక మునకు జన్మసార్థకత యని దీని అర్థమేమో ? ఏలందురా ? చూడుడు. చలితకుండలిలో ఈసహమ మిప్పుడు వృషభరాశిలో ౪వ భాగకు పోయియుండుట గమనించదగినది. అనగా, చలితశనితో ఐక్యము చెంది ఈ సహమము చలితకుజుని కేంద్రసంబంధము సార్జిం చిన దన్నమాట. మృత్యుస్థానాధిపతి యగు శనియు, ఉద్యోగస్థానాధిపతియగు కుజుడును ఏకార్యమును తల పెట్టిరో, అదే జన్మసార్థకత యని ఈబిందువుయొక్క చలితస్థానము చాటుచున్నది.


(vii) లగ్నాధిపతియగు చంద్రునికి గురు సంయోగ మున్నది. అనగా, జాతకునికి గురువుయొక్క సాహాయ్యసంపత్తి కలదనుట. ధనికులో, సనాతన ధర్మాభిమానులో, శాసనకర్తలో, న్యాయవాదులో, ఇతనికి సాయమని అర్థము. చలితరవి ఇప్పుడు కటక రాశిలో 3 భాగలు ౩౦ కలలకు వచ్చినాడు. అనుటచే, ఈచలితరవియొక్క కేంద్రదృష్టివలన గురుచంద్ర సంయోగస్థానపు మధ్యబిందువు ఉద్బోధితమైనది. చలిత శనికిని, చలితకార్యసిద్ధిసహమమునకును ఈ చలితరవి నుండి సప్తమిత్రదృష్టియే (౬౦ భాగలు) కలదు. ఉన్న సహాయసంపత్తిని తలచిన కార్యసిద్ధికై వినియోగించు కొమ్మని లగ్నాధిపతియగు చంద్రుని జాతకుని రవి (సంకల్పము) ప్రేరేపించుచున్నాడు. ఇంతే కాదు. చలితకుజు డిపుడు జన్మగురువుయొక్క అర్థకోణ (౬౦ భాగల) మిత్రదృష్టి సార్జించుటచే పైయర్థ మునకు ప్రోదియగుచున్నది. గురువు సూచించు సహాయ సంపత్తు వాస్తవముగా కుజుడు తన ఉద్యమముకై సంపాదించుకొన్నట్లే చూపట్టుచుండలేదా ?

(viii) జాతకములో రాహువుండు భచక్ర ప్రదేశము దృఢమూలమగు ప్రారబ్ధఫలపరిపాకమును తెలుపునట్టిది. ఈ రాహువు చలనవశమున జన్మరవి నతిక్రమించి ఇపుడు వృషభరాశిలో ౨౬ భాగలు ౨౫ కలలలో నుండుట. అనగా, ఈ రాహువు చలితశుక్రుని కెదురుగా నడచి ఆత్రముతో అతని కౌగలించుకొన బోవుచున్నాడని చదువరులు గమనించగలరు. ఈ శుక్రుడు నాటకరంగములో కార్యనిర్వాహకుడని మన

మెరుగుదురు. శుక్రుని కార్యములో రాహువుఫలము మిళితమైనది. హత్యానంతర మొక సంవత్సరము గడచినచో, చలితరాహుశుక్రసంయోగము పరిపూర్ణమగును. అప్పటికే హత్యావిషయమున న్యాయాధిపతుల తీర్పు! కర్మఫలపరిపాక మెంత ముచ్చటగా కానవచ్చుచున్నదో, వేరువ్యాఖ్యాన మనవసరముకదా?

పై చలితజాతకసామగ్రివలన సూచితమగు సమష్టిఫలము ఉడుదశాంతర్దశల మూలముగా ఊహించుటకు సాధ్యమైన ఫలముకంటె స్పష్టతరముగా నున్నదని సహృదయులగు పాఠకమహాశయులు విశ్వసించగలరు. కాని, ఈ దశాపరికరము లన్నియు ఆత్మహత్యపరముగానే అన్వయించవచ్చునుగదా? అనవచ్చును. సత్యమే! గాడ్సే చేసిన కార్యము ఆత్మహత్యవంటిదే అన్నతో తప్పుకాదు; ప్రత్యక్షముగా కాకుండినా ప్రకారాంతరముగానైనా, ఆఫలమును సంపాదించి ఇచ్చునట్టిదే కదా? "నేను హత్యచేసితిని. దాని ఫలము నా మరణమే. అదే నేను కోరునది." అని గాడ్సే చెప్పెనట! ఇది ఆత్మహత్య కాదా? న్యాయాధిపతి చెప్పిన తీర్మానముతోనే ఇతని చరమశ్లోకము సిద్ధమైనది. ఒకవేళ శిక్షాస్మృతియందలి మార్పువలననేమి, రాజనీతిఫలముగానైననేమి, ఉరిశిక్షను తప్పించుకోగలిగినా, గాడ్సే మృతప్రాయుడే కదా?

ప్రకృతాంశమునకు వత్తము. హత్యపాలు కావలయునని మహాత్మునికి, హత్యాదోషమును సంపా



దించవలెనని గాడ్సేమహాశయునికి జన్మకాల గ్రహ యోగముల వాగ్దాన మున్నదని కనుగొంటిమి. ఆ వాగ్దానము ఫలించుటకు కావలసినన్ని అనుకూల పరిస్థితులు ప్రత్యేకముగా వారి చలితజాతకములలో ఎట్లు వక్వత నందినవో, సమగ్రముగా పరిశీలించితిమి. ఇక, ౧౯౪౮ వ సంవత్సరమున జనవరి మాసాంతమునకు గాడ్సే జాతకమునుండి మహాత్ముని జాతకమునకు దుష్ఫల మేరీతిగా వ్యాపించెనో, విమర్శించుట ప్రయోజనకారి. మహాత్ముని జాతకములో దోషదూషితములగు స్థానములపై గాడ్సేగారి దుష్టగ్రహముల తీవ్రవ్యాప్తి వచ్చినచేతప్ప జన్మకాలిక వాగ్దానము ఫలించుట కవకాశముండదు! ఇదే జ్యోతిశ్శాస్త్రము తెలుపునట్టి విచిత్రమైన సృష్టి ధర్మము!

ప్రక్క చక్రములో మహాత్ముని జన్మగ్రహాదులతో చలితగ్రహాదులుసయితము చూపబడినవి. గాడ్సేచలిత గ్రహములతో వీని నొక్కమారు పోల్చి చూడుడు. ప్రధానాంశములు మాత్రము ఈ క్రింద చూపబడినవి :–

(౧) మహాత్ముని జాతకములో మారకలక్షణ లక్షితుడు మహారాహు వనుట చదువరులు మరచియుండరు. ఈ రాహు వుండు స్థానము సింహరాశిలో ౪ వ భాగ. అనగా, మహాత్ముని మరణమునకు కారణభూత మగు ప్రచండశక్తి ఈ భాగలో ఇమిడియున్నదనుట! గాడ్సే జాతకమందలి క్రూరగ్రహములు ఈశక్తిని రగుల్కొల్పవేని, అతనిచే మహాత్మునకు హత్యకావింపబడుట అసంభవము. గాడ్సేయొక్క చలితకుజుడు చలితశని కేంద్రయోగమును సంపాదించుకొని దుష్టుడైనాడని మన మెరుగుదుము. నిధనకాలమునకు ఈ చలిత కుజుడు వచ్చి నిలుచుట ఆ సింహరాశిలో ౪ వ భాగ యందే! అగుటచే, ఈచలితకుజుడు మహాత్ముని జన్మ రాహువును మేలుకొలిపినా డనుట కాక వేరేమి? పాము పడగ విప్పి 'భుస్సు' మన్నది. మారకశక్తి రగుల్కొన్నది. చలితకుజా డాశక్తిని తన కార్యమునకై ఉపయోగించు కొన్నాడు. గాడ్సేనుండి శస్త్రాగ్ని బయలుదేరి మహాత్ముని దేహమును ప్రవేశించినది. తుపాకిగుండ్లు మహాత్ముని ఉదరభాగమున తగిలెనట! దేహములో సింహరాశి ఆ ప్రదేశమే!

"కాలాంగాని వరాంగ మాననమురో
హృత్క్రోడవాసోభృతో
వస్తిర్వ్యంజన మూరుజానుయుగళే
జంఘే తథాంఘ్రిద్వయం." (బృహజ్జాతకము)

(౨) మృత్యుసహమము చలనవశమున నిధన కాలమునకు వృశ్చికరాశిలో అష్టమ భావాధిపతియగు బుధుని ఆలింగనమొనర్చుచు జన్మలగ్నమును చేరుకొన్నదని చదువరులు మరచియుండరు. గాడ్సేగారి చలిత కుజుడు మహాత్మునిజన్మలగ్నమును కేంద్రవిషమదృష్టితో చూడగల్గుట సైతము విప్పుడే. ఆకారణమున అచటనే వేచియున్న మహాత్ముని చలితహత్యాసహమమును ఈ చలితకుజుడు చెలరేగించినాడు. హత్య జరిగినది!

(౩) గాడ్సేజాతకమున చలితకార్యసిద్ధి సహమము వృషభరాశిలో ౪ వ భాగకు వచ్చినదికదా! ఆ భాగలోనే అతని చలితశని యున్నాడనుట మరువరాదు. ఆ శని మృత్యు (అష్టమ) స్థానాధిపతి యగుటచే, కార్యసిద్ధి మరణవిషయములో ప్రవర్తించవలసి యున్నదని ఊహించుట కష్టము కాదు. మరి, ఎవరి మరణము? ఈ చలితశనియొక్క పరిపూర్ణకృపాకటాక్షమునకు ఏ ప్రదేశము పాత్రమగుచున్నదో, అచటనే మన కీప్రశ్నకు ప్రత్యుత్తరము పుట్టవలసియున్నది. ఈ శనియొక్క సమసప్తకదృష్టి పరిపూర్ణముగా వృశ్చిక రాశి ౪ వ భాగకే ప్రసరించుచున్నదని చదువరులు స్పష్టముగా చూడగలరు. ఆభాగలో మహాత్ముని లగ్నమున్నది. అచటనే అతని మృత్యు స్థానాధిపతి యుండుట! మరియు చలితమృత్యుసహమము ఇపుడచటికే చేరుకొన్నది. గ్రహచారఫలము నెవ్వరికి తప్పింపగలరు?

(౪) మహాత్ముని జాతకములో మృత్యుసహమము సింహరాశిలో ౧౭ వ భాగలో నున్నదికదా! నిధనకాలమునకు గాడ్సే జన్మలగ్నము చలించి ఆభాగకే పోయియున్నదని చదువరులు గుర్తింపగలరు. అనగా, ఇతని భౌతికదేహము, అతని మృత్యువు ఈ రెండును ఒకేచోట ఐక్యమందినవి. మహాత్ముని మృత్యువునకు గాడ్సే కారణమైనాడు.

(౫) మహాత్ముని జాతకములో 'రుచక' మహాపురుషయోగము నిచ్చి "శస్త్రాస్త్రవలకృత మృత్యువు" రావలయునని సూచించు గ్రహము కుజుడు కదా? ఈ కుజుని స్థానమునకు గాడ్సేజాతకమునుండి ఇప్పటికి ప్రబలవేధ రానిదే, అతని చేతినుండి మహాత్మునికి శస్త్రాగ్ని ప్రయోగ మెట్లు జరుగును? అని శంకింతు రేమో? వాస్తవమునకు అట్టి వేధ రానిచో, ఈరూపముగా మహాత్మునికి మృత్యువు వచ్చియేయుండదని నిష్కర్షగా చెప్పవచ్చును. చూడుడు! మహాత్ముని చలితచంద్రుడు జన్మకుజునితో ఇపుడు పార్ధ కేంద్ర (౧౩౫ భాగల) క్రూరదృష్టికి లోనై యున్నాడు గదా? గాడ్సేజాతకమందు చలితరవి ఇప్పటికి మహాత్ముని చలితచంద్రస్థానమునే చేరుకొనుటచే, అతని (మహాత్ముని) జన్మకుజునిపై ఈచలితరవినుండి పార్ధకేంద్రదృష్టివేధ స్పష్టముగా వచ్చినది. ఇంతే కాక, ఈచలితరవినుండియే పార్ధకేంద్రదృష్టివేధ నికరముగా ఇప్పటికే గాడ్సేపుణ్యసహమమునకు సైతము తగులుట! గాడ్సేయొక్కయు, మహాత్మునియొక్కయు జాతకగర్భములయం దణగియున్న గ్రహావాస్థానమును గాడ్సేచలితరవియు, మహాత్ముని చలితచంద్రుడును ఒకచోట చేరుకొని కార్యరూపమునకు తెచ్చినారు. ఖగోళరంగమున కాలపురుషుకు సూత్రము లాడించగా, భౌతికరంగమున బొమ్మపొత్తికలు నాటకమాడినట్లు మనకు దృగ్గోచరమగు చుండ లేదా?

(౬) మహాత్ముని జాతకమునందు అష్టమభావముపై అర్ధకేంద్రవిషమదృష్టిని బరపుచు, చలితకుజుని (లగ్నాధిపతిని) పరిపూర్ణకేంద్ర వేధపాలు గావించిన మాయావి ఇంద్రు డున్నాడే? ప్రకృతపరిస్థితులలో ఆగ్రహపు కైవాటము కానరావలదా? అందురేమో? గాడ్సే చలితజాతకములో ఇంద్రుడు కర్కాటకరాశిలో ౧౮ భాగలు ౫౯ కలలకు వచ్చియున్నాడు. విశేష మేమందురా? మహాత్ముని మృత్యు (అష్టమ) భావము మిథునములో 3 భాగలు 3౮ కలలలో నున్నదని స్మరణకు తెచ్చుకొనుడు. దానికి ఎడమవైపున అర్ధకేంద్రవిషమదృష్టిస్థానములో మహాత్ముని జాతకములో ఇంద్రు డున్నాడని మనకు తెలిసియేయున్నది. ఇప్పటికి గాడ్సేగారి చలితేంద్రుని స్థానము మహాత్ముని అష్టమభావబిందువునకు కుడివైపున అర్ధకేంద్రముగు చున్నది. అనగా, మహాత్ముని మృత్యుభావమునకు అతని ఇంద్రు డొకవైపున, గాడ్సేగారి ఇంద్రుడు మరియొకవైపున నిలిచి చిందులు త్రొక్కుచున్నారట! ఇంద్రమాయ అన్నివైపుల వ్యాపించినది!

(౭) గాడ్సేజాతకమున చలిత దశమభావము (ఉద్యోగము) ఇపుడు వృషభరాశిలో ౧౭ వ భాగకు వచ్చినది. ఇది మహాత్ముని జాతకసామగ్రితో ఏమి సంబంధమును సంపాదించుకొన్నదో చిత్తగింపుడు. ఆ జాతకమున హత్యాసహమమునకు అధికారి శుక్రుడు కదా? ఆ శుక్రునికి ముఖాముఖిగా ఇప్పుడు ఈ చలితదశమస్థానము వచ్చినిలిచి ఆ శుక్రుని శక్తి నాకర్షించుకొన్నది. అంతటితో పోక, ఈ చలితదశమము మహాత్ముని మృత్యుసహమబిందువునకు ఆశక్తిని కేంద్రదృష్టిచే అందిచ్చినది. జన్మకాలికగ్రహావాస్థానము నెరవేరుటకు గాడ్సేచలితదశమభావము ఏ రీతిగా సాయపడినదో ఇంతకంటె స్పష్టముగా ఎట్లు చూపగలము?

(౮) మహాత్ముని పూర్వపుణ్యసహమము చలనవశమున నిధనకాలమునకు వృశ్చికరాశియందలి మీననవాంశలో గండసంధికి వచ్చి అపమృత్యువును సూచించినదికదా?

"నిమిత్తమాత్రం భవ సవ్యసాచిన్" అనురీతి, ఆ అపమృత్యువుకు కారణము గాడ్సే జాతకము నుండి రావలసియున్నది. ఇతని జన్మరాహువు దుష్కర్మ పరిపాకమును తెలుపు ప్రదేశములో నున్నదని కనుగొన్నాము. ఈ రెండింటికి అన్యోన్యసమసప్తక సంబంధము ఈ వయస్సులోనే సంభవించుట చిత్రము.

(౯) "బుద్ధిః కర్మానుసారిణీ" అని పెద్ద లనిరి. గాడ్సే జాతకమున బుద్ధి ఇట్టి ప్రవర్తనము చూపగలదా? అని శంకించుట సహజము. జన్మకాలమున కుజుని అధికారములో (వృశ్చికరాశిలో) నున్న బుద్ధిసహమబిందువు చలించి ఇప్పటికి ధనుస్సులో ౨౬ వ భాగకు వచ్చియున్నది. ఈ జాతకమున అష్టమ(మరణ) భావము కుంభరాశిలో ౧౧ భాగలు ౫౦ కలలలో నుండుట. దానికి ఈ సహమ మిప్పుడు అర్ధకేంద్రవిషమదృష్టికే వచ్చినది. బుద్ధి మరణవిషయమందే పనిచేయ సాగిన దనుట! ఇక, మహాత్ముని

జాతకములో అష్టమభావమునకు కార్యనిర్వాహకుడు బృహస్పతికదా! ఆ బృహస్పతి చలనవశమున ఇపుడు వృషభరాశిలో ౧౧ భాగలు ౩౭ కలలలో నున్నాడు. అగుటచే ఈ బృహస్పతి సార్ధకేంద్రక్రూరదృష్టిచే గాడ్సేగారి చలితబుద్ధిసహామటిందవును ప్రేరేపించుచుండుట స్పష్టముగా మనము చూడవచ్చును. సారాంశ మేమనగా, పైరెండుజాతకములలో మృత్యువిషయములోనే ఇప్పటికి కర్మానుగుణముగా గాడ్సే బుద్ధి ప్రసరించినదనుట వ్యక్తము. ఇంతకన్న దైవచిత్రమా? దైవ మనగా పూర్వజన్మకర్మఫలమనియే మన ప్రాచీనులు నిర్వచించిరి.

"పూర్వజన్మజనితం పురావిదః
కర్మ దైవ మితి సంప్రచక్షతే" అనియు,
"పూర్వజన్మార్జితం కర్మ దైవ మిత్యభిధీయతే."

అనియు మున్నగా ప్రాచీనసూత్రములు. మహాత్ముడు హత్యపాలగుట, నాథూరాం వినాయక గాడ్సే హంతకుడగుట ఇవి వారి ప్రారబ్ధపరిపాకపు ఫలము. గాడ్సే జాతక గ్రహములు క్రూరములని, మహాత్ముని దశ మారకదోషదూషితమని, ఒకరి జాతకగ్రహముల నుండి మరియొకరి జాతకగ్రహాదులకు వేధ వచ్చినదని, మున్నగా మన మాడుకొనుట సామాన్యలోక వ్యవహార విషయము.

"కేవలం గ్రహనక్షత్రం నదదాతి ఫలం నృణాం,
సర్వ మాత్మకృతం కర్మ, లోకవాదో గ్రహా ఇతి."

అను మహర్షి వాక్య మమూల్యమైనది. గ్రహములు ఒకరిని చెరచుట కాని, మరియొకరికి హితము చేయుటకాని లేదు. మానవులకు శుభాశుభములు కల్గించుటకై గ్రహములు ఖగోళమున సంచరించుచునవుట కల్ల. సృష్టిసర్గము ననుసరించి తదేకనిష్ఠతో తమతమ కక్షామార్గములలో నియమబద్ధములుగా గ్రహములు సంచరించుచున్నవే కాని, మనపై అసూయాభిమానముల వలన కాదు. ఆ సంచారక్రమములో వానికి సంయోగ వియోగాది సంబంధములు పరస్పరముగా సిద్ధించువట్లు మనకు తోచుట సహజము. క్షేత్రగణిత మందలి రేఖల వలె, ఖగోళమునందు మనకు దృగ్గోచరమగునట్టి ఆ గ్రహసంబంధములు ఒక విశిష్టమైన 'దైవలిపి'గా మనము భావించవచ్చును. అదే "తలవ్రాత". తల అనగా మన శిరస్సని కాదు; శివశిరస్సని అర్థము. ఆ పరమశివుని శిరస్సు ఆకాశమే యనుట ప్రాచీన సంప్రదాయము. ఆకాశరంగమందలి యీ గ్రహగతి రేఖలే 'తలవ్రాత.' చలనకారణమువల్లగాని, చారవశముచేగాని గ్రహస్థితులలో కలుగుమార్పులు సూచించునట్టి రేఖలు వ్యక్తుల ప్రారబ్ధపరిపాక మే మార్గమున నడచునో, దానిని తెలుపునట్టి లిపిగా భావించి, అనేకశతాబ్దముల అనుభవమును క్రోడీకరించి ప్రాచీన మహర్షులు చెప్పిన సూత్రముల ఆధారమున, ఆ లిపికి అర్థము నూహించి జీవితసమన్వయము చేయుటే జాతకశాస్త్రపు ఫలము.

ఇచట ఒక చిన్న మనవి. ప్రారబ్ధానుసారముగా ఫలము జరుగు ననుటచే, హత్యాదోషమునకు హంతకుడు బాధ్యుడు కాడనుటకై ఈ చర్చ అనుకొనరాదు. ఏవిధముగా చూచినా, హత్యకు బాధ్యత హంతకునికి తప్పదు. మన విమర్శ అంతయు దైవఫలమును గూర్చి మాత్రమే. దైవ మెట్టిదయినా పురుషకారపు సాహాయ్యము లేక ఫలించదు.

"దైవం జన్మఫలం ప్రోక్తం
కర్మాంగం ఫల ముద్యమః,
ఉభయో స్సానుకూలత్వే
ఫలం సిద్ధ్యతి; నాన్యథా."

అను ప్రాచీనసూక్తిని మరువరాదు. దైవమునకు మాత్రమే జాతకము బాధ్యత వహించగలదు. పురుషకారమునకు వ్యక్తులదే బాధ్యత. ఈ రెండింటి తారతమ్య విచారము గొప్ప చిక్కుసమస్య. తత్త్వశాస్త్రమునకు చెందిన విషయ మది.

ప్రకృత మనుసరింతము. మహాత్ముని యొక్కయు, గాడ్సే యొక్కయు ప్రారబ్ధపరిపాకమును విమర్శించితిమి. కాని, ఇంకొక్క విశేష మున్నది. నిప్పు తగిలించినచో రగులుకొని, ప్రేలి, సర్వనాశ మొనరించు శక్తి గల మందుసామానుల కొటారు సిద్ధముగా నున్నదనుకొనుడు. ధైర్యసాహసములు గల వ్యక్తి యొకడు కొరవిని చేతబట్టుకొని సమీపమందే సిద్ధముగా నున్నాడనుకొందము. అయిననేమి! ఆ కొరవితో ఆ మందుసామానునకు సన్నిహితసంబంధము కలుగుదాక, మందు ప్రేలదుగదా! అట్లే, ఈ జాతకద్వయమందలి గ్రహయోగసామగ్రిని ఒక దానితో మరియొక దానిని చేర్చి రగులుకొలుపజాలిన ప్రబలశక్తికల గ్రహయోగము ఆకాశములో వచ్చుదాక, ప్రారబ్ధము వేచియుండవలసినదే. అట్టి అవకాశ మెపుడు వచ్చినదో, మరొకసారి పరిశీలింతము.

భారతీయశిల్పము - దాని పుట్టుపూర్వోత్తరాలు

౨. శుంగుల శిల్పం

'కృష్ణశ్రీ'

మౌర్యుల తర్వాత మగధసామ్రాజ్యాన్ని ఏలిన వారు శుంగవంశస్థులు. వీరు బ్రాహ్మణులు. వీరికి బౌద్ధమత మంటే కిట్టదు. బౌద్ధమత ప్రచారానికి స్తూపాలు ముఖ్యంగా దోహదం చేస్తున్నాయని స్తూపాల్ని తవ్వించేశారు కూడాను కొందరు శుంగ రాజులు. కాని ఇంతమాత్రంతో బౌద్ధమతం అణగారి పోలేదు. బౌద్ధసన్యాసుల త్యాగశక్తి, బౌద్ధభాష (పాలీ) జీవశక్తి, బౌద్ధశిల్పపు చైతన్యశక్తి రాజుల అధికారబలాన్ని తలదన్ని సాగిపోయాయి. ప్రజా బాహుళ్యానికి బౌద్ధమతాభినివేశం కలిగించే స్తూప నిర్మాణము జరగకపోయినా, కుటుంబాల్లోనూ గ్రామాల్లోనూ వ్యాపించిపోయి తెలియకుండా మనస్సుల్ని మార్చేసే జాతకకథలూ, ప్రతీయింటా వినోదం కోసమో, విజ్ఞానం కోసమో వెలిసిన బౌద్ధశిల్పాలూ, వీటిని రెండింటినీ మించి వధ్యపశువుకీ కసాయికత్తికీ నడుమ మెడచాచే బౌద్ధశ్రమణుల త్యాగబలమూ బౌద్ధ ధర్మచక్రాన్ని నడుపుతు పోయాయి. శుంగులలోని మొదటిరాజులు బౌద్ధవిజృంభణాన్ని కానకపోయినా తరవాతవారికి దాన్ని గుర్తించడమూ తప్పలేదూ, స్తూప నిర్మాణము చేయించడమూ తప్పలేదు. ఈ కాలంలో బయల్దేరినదే బార్హుత్ స్తూపం. శుంగులకాలపు శిల్పాన్ని చూపించడాని కిది ఏకైక బృహన్నిదర్శనం.


బార్హుతు నర్మదకీ ప్రయాగకీ నడుమ నుంది. ఇళ్లకీ వాకిళ్లకీ కావలిసిన 'రాళ్లు' గ్రామస్థులు తీసుకు పోయినవి పోగా, ఈ స్తూపంతాలూకు మిగిలిన శిల్పాలు కలకత్తా మ్యూజియములో ఉన్నాయి. ఇవన్నీ ఎఱ్ఱ ఇసకరాయిమీద చెక్కినవి. స్తూపంమాత్రం ఇటుకతో తయారయిన అర్ధగోళమే. దాని చుట్టూ ఉండిన రాతి కంచెయొక్క నిలువు కంబాలమీదా, అడ్డదూలాల మీదా చెక్కినవే బార్హుతుచిత్రాలు. స్తూపపు ద్వార తోరణంమీదా, స్తంభాల మీదాకూడా సున్నితమైన చెక్కడపు పని వుంది.

బార్హుతు ద్వారతోరణాలే మనకి తెలిసిన తొలి రాతితోరణాలు. అతిప్రాచీన కాలంనించీ దారు తోరణాలు నిర్మిస్తూనే ఉండేవారు శిల్పులు. కాని అవన్నీ అవి చెక్కిన కర్రతోబాటు నశించిపోయాయి. బార్హుతూ, సాంచీ, ఓరుగల్లు తోరణాలు మాత్రమే నేటివరకూ నిలిచివున్నాయి. ఈ తోరణాలు నాలుగు దిక్కులా నాలుగు. బార్హుతులో వీటికి మధ్యని వర్తులాకారంగా నిలిపిన రాతికంచెల మీదివే మనము ప్రశంసించే చిత్రాలు.

వీటిని జాతకకథలనీ, బుద్ధజీవిత చిత్రాలనీ, యక్షులచిత్రాలనీ, అలంకారశిల్పాలనీ నాలుగు భాగాలుగా చూసుకోవచ్చును. బుద్ధజీవిత చిత్రాలు చరిత్రనీ, పంచనికాయాల్లోని వర్ణనల్నీ కూడా చిత్రించాయి. బుద్ధుడుమాత్రం అదృశ్యుడు. కనబడితే పాదాలుమాత్రం కనబడతాయి. ప్రసేనజిత్తూ, అజాతశత్రువూ బుద్ధుణ్ణి దర్శించబోవడమూ, గౌతముడు బుద్ధుడవడమూ, ధనభూతి బోధివృక్షాన్ని పూజించడమూ, మాయాదేవి స్వప్నమూ, బుద్ధుని జన్మమూ, మారవిజయమూ, వైజయంత రత్నచంక్రమ ప్రాసాదములూ, ధర్మ చక్ర పూజా, అనాథపిండకుని జేతవనప్రదానమూ, శ్రావస్తిలో బుద్ధుని లీల, తుషిత స్వర్గములో అభిధర్మబోధా, తుషితస్వర్గావరోహణమూ, విరుదాభుని కపిలవస్తు దండయాత్రా, బుద్ధనిర్యాణమూ అనే చిత్రాలు ఈరకం. బుద్ధుని పూర్వజన్మగాథలు జాతకకథలు. బార్హుతు ముఖ్యంగా జాతకకథలకోసమే వెలిసిందా అనే సందేహము పుడుతోంది. ఏమంటారా? అసంఖ్యాకాలుగా చెక్కారు. నిలువు కంబాలూ, అడ్డు



బార్హూతులో నున్న బుద్ధశాక్యముని బోధివృక్షము.



బార్హూతులో చిత్రితమైయున్న ఒకానొక జాతకకథా సన్నివేశము.

కంబాలూ, కప్పుదూలమూ—అన్నిటిమీదా వున్నాయి జాతకకథలు.

యక్షులు ప్రత్యేకంగా కనపడతారు బార్హుతులో. మానవులకంటె పైమెట్టులోనివారు వీరు. కిన్నరులూ కనబడుతున్నారు బార్హుతులో. కిన్నరులు చైత్యములకూ, బోధివృక్షానికీ పూలమాల లర్పిస్తూ ఇద్దరేసి రెక్కలూ పుచ్ఛాలూతో కనబడతారు. యక్షుల్ని చెక్కడంలో బార్హుత శిల్పులు ప్రత్యేక శ్రద్ధ చూపించారు. వీరు కొంచెంతక్కువగా మనంత పొడవూ ఉన్నారు. తక్కినరూపాల్లో లేని నున్నదనమూ, సౌందర్యమూ వీరిలో కనబడుతున్నాయి. తలపాగాలూ, ఆభరణాలూ, వస్త్రాలూ, స్థానగౌరవమూ వీరి కున్నట్లు మరొకరికి లేవు. వీరందరికీ పేర్లు కూడా చెక్కివున్నాయి.

సుప్రవాసయక్షుడు దర్శనీయుడు. అలంకార శిల్పానికి గిరి అంటూ లేదు. ప్రకృతిలో ఏ పదార్థమైనా సరే అలంకరణంలో పనికి వస్తుందని బార్హుతు శిల్పులకీ అజంతా చిత్రకారులకీ మాత్రమే తెలుసునేమో. యజ్ఞవేదికలూ, చెట్లూ, లతలూ, ఆకులూ, పువ్వులూ, దండలూ, కాయలూ, జంతువులూ, హార్మ్యములూ, గంటలూ, పక్షులూ, పడవలూ, మకరాలూ, మబ్బులూ, విచిత్రమృగాలూ, బౌద్ధచిహ్నాలూ, కుబ్జులూ, మనుష్యులూ, దేవతలూ, అందరూ వీరికి అలంకారానికి పనికివస్తారు. సైజుమాత్రం మారిపోతుంది, అంతే.

బార్హుతుశిల్పము స్థూలదృష్టికి కథనం లాగ కనపడుతుంది. కప్పుదూలాల మీదా, నిలువుకంబాల మీదా, అడ్డదూలాల మీదా వున్న వర్తులాల్లోనూ జాతకకథలూ, బుద్ధుని జీవితఘట్టాలూ అపరిమితంగా వున్నాయి. బౌద్ధగాథల ప్రచారం బాగా జరగడం కోసం బార్హుతుశిల్పులు వీటికి పేర్లుకూడా చెక్కారు. ఆ కాలమువారు నమ్మిన సూర్యుడూ, చంద్రదేవతా (!), శ్రీదేవి, కాకోల నిరయమూ వంటి చిత్రాలేకాక, బౌద్ధగ్రంథాల్లో వున్న గాథల్ని కూడా సరిగ్గా సరిపోయేటట్టు చెక్కడము చూస్తే బార్హుతుశిల్పులు చిత్రాలతోనే కథలు చెప్పే రన బుద్ధి వేస్తోంది. ఈ కథన చిత్రాల్లో సమ్మర్దము జోరుగా కనబడుతుంది. బుద్ధగయశిల్పాల్లో ఒకరూ ఇద్దరూ, తప్పితే ముగ్గురూ, అంతే వుంటారు వ్యక్తులు. బార్హుతుచిత్రాల్లో ఈ మితి లేదు. బుద్ధుని సింహాసనానికి వెనక వేపునించీ, ఇద్దరు దేవతల తలల మధ్యనించీ, హార్మ్యాల రెండో అంతస్తు కిటికీలలోంచి ముఖాలు తొంగిచూస్తూనే వుంటాయి. శుంగుల కాలానికి బౌద్ధమతపు వేడి అందరికీ అంటుకుంది. "బ్రాహ్మణజాతిలో జన్మించిన కొద్దిమందికే కాదు, మోక్షము అందరికీ వుంది. రండోయి జనులారా" అని జనసామాన్యాన్ని పిలిచింది తథాగతుడి ధర్మచక్రము. తండోపతండాలుగా వచ్చారు బుద్ధోపాసకులు. ఈ దృశ్యం చూచిన బార్హుతుశిల్పులు తండోప తండాలుగా వ్యక్తుల్ని విరజిమ్మేశారు తమచిత్రాల్లో. కప్పుదూలాలమీది జాతక కథల్లోని వ్యక్తులు మాత్రం పరిమిత సంఖ్యలోనే వుంటారు. కారణము : అక్కడ చోటు తక్కువ ఒకటి. జాతకకథల్లో అంతకంటె ఎక్కువమందిని చెప్పలేదు రెండు. బార్హుతుశిల్పులు జాతకకథల్ని బొమ్మలతో చెప్పారు.

బుద్ధగయలో రూపప్రదర్శనం చేసిన భారతీయ శిల్పం బార్హుతులో కథనం ప్రారంభించింది. బార్హుతులో వున్న శాక్యముని బోధివృక్షం బుద్ధగయలో కూడా సరిగ్గా అనుకరించబడిం దన్న సంగతిని పురస్కరించుకొని వేణీమాధవబారువా, బుద్ధగయ బార్హుతు తరువాతిదే అంటాడు. ఇదే నిజమైతే "బార్హుతులో కథనం నడిపిన శిల్పం బుద్ధగయలో రూపప్రదర్శనం చేసింది, భారతీయ శిల్పాన్ని కథనంచేసే దశనించి రూపకల్పన చేసే ఉచ్చదశకి బుద్ధగయశిల్పులు తెచ్చారు." అన్న ఆయనమాటలుకూడా నిజమే అవుతాయి. నాకేమో ఈ మాటలు నమ్మకం పుట్టించలేదు. చూడగా చూడగా బార్హుతులోనే శిల్పం పరిణతస్థితికి వచ్చినట్లు కనబడింది. బుద్ధగయలోని రాతి కంచెమీది పనికంటె బార్హుతు కంచెమీది పని అపారము. అలంకారశిల్పం కూడా బుద్ధగయలో చాలా తక్కువ. అశోకుడి కాలానికే బోధివృక్షము తీర్థమైంది. బౌద్ధుడైన అశోక మహారాజు బోధివృక్షం చుట్టూ ఆలయం కట్టించడా? పైన చెప్పిన 'శాక్యముని బోధివృక్షం' చిత్రంలో అశోకుని స్తంభంకూడా కనబడుతోంది. బుద్ధుని జీవితంలో సన్నిహిత సంబంధం కల బుద్ధగయలోకంటె, అలాంటి సంబంధమేమీ లేని బార్హుతులోనే శిల్పఖేలనం ముందు ప్రారంభించి వుండదేమో అనిపిస్తోంది. బుద్ధగయలోని శిల్పాలు అన్నీ ఒక కాలం నాటివి అయివుండడము కూడా సంభవం కాదేమో. ఎంతమంది శ్రీమంతు లా పుణ్యక్షేత్రాన్ని దర్శించారో! వారందరి కానుకలూ అక్కడ పోగుపడి ఉండవా? ఆ కానుకల్లో ఈ బోధివృక్షచిత్రం ఒకటై యుంటుందేమో అని ఊహించి, శిల్పపరిణతి హెచ్చు

స్థాయిలో ఉన్న భార్హుతే రెండింటిలో అర్వాచీన నుంటున్నాను.

బుద్ధగయలో భార్హుతులోకంటె ప్రశంసార్హమైన రూపకల్పన ఏదీ కాలేదు. కాగా రూపప్రదర్శనం మాత్రమే (రూపకల్పన కాదు) బుద్ధగయలో జరిగిందంటాను. బుద్ధగయనాటి రూపప్రదర్శనం నించి భార్హుతునాటి కథనానికి భారతీయశిల్పకళ పురోగమనమే చేసిందిగాని తిరోగమనం చెయ్యలేదంటాను. భార్హుతు ప్రారంభించిన అర్ధశిల్ప కథనపద్ధతి గాంధారంలోనూ సాంచీలోనూ, అమరావతిలోనూ, నాగార్జునకొండలోనూ, పల్లవశిల్పంలోనూ వృద్ధిఅయి బృహత్తర భారతానికికూడా వ్యాపించింది. బౌద్ధశిల్పం యొక్క శక్తి ముఖ్యంగా అర్ధశిల్ప కథనంలోనే వుండేమో అంటాను.

దక్షిణదేశపు లోహశిల్పులు నటరాజస్వామి, శ్రీరామమూర్తి, అప్పార్ వంటి విగ్రహాల్ని నిర్మించే దాకా రూపకల్పన భారతదేశంలో పరిణతికి రాలేదు. కాని అమరావతిలో అర్ధశిల్పం పరిణతికి వచ్చింది. ఈ శిల్పానికి శుభప్రారంభం భార్హుతుశిల్పులు చేశారు.

భార్హుతుశిల్పులు అలంకారాభిమానులు. వీరు అలంకార శిల్పానికి వేసిన పునాది అజంతావరకూ ఏ శిల్పులూ మించలేక పోయారు. అజంతా చిత్రకారులూ, ఆ పైన హొయసల చిత్రకారులూ వీరి రుచిని ఆమోదించారు. భార్హుతులోని వ్యక్తిశిల్పం కంటె అలంకారశిల్పం ఘనమైనది. కప్పుదూలము మొత్తం వెడల్పు పదిహేను అంగుళాలలోనూ, నడుమ సుమారు సగముమాత్రమే జాతకశిల్పాలకి వదిలి, పైన పాతికా, కింద పాతికా మొత్తం సగంవరకూ అలంకారం కోసం ఉపయోగించుకున్నారు. వారు నిలువుకంబాలమీదా, అడ్డుదూలాలమీదా చోటున్నప్పుడల్లా లతల్నీ, పువ్వుల్నీ, వ్యక్తుల్నీ చెక్కారు. ఈ వ్యక్తుల చెవులు ఆభరణాల బరువుకి సాగిపోతాయి. యక్షిణీలు ఏడువారాల నగలూ పెట్టుకున్నట్టుంటారు.

వస్త్రాలువారికి చిహ్నమాత్రంగానే వున్నాయి. అలంకారాలు మాత్రం నిజమైనవే. భార్హుతుశిల్పులు ఇచ్చినన్ని పండ్లగుత్తులు ఇతరు లెవరూ ఇవ్వలేదు. వీరి లతలకు ఆకులూ, పువ్వులూ, పళ్లే కాదు, మణిమాలలూ, సువర్ణాభరణాలూ, తారహారాలూ కూడా కాస్తాయి! తీగలికి పాకడానికి పనికొచ్చే మెలి తీగల్ని కూడా వీ రుపయోగించేసు కున్నారు. ఇంక చైత్యాల మీదా, బోధివృక్షాలమీదా పూలమాలలు వర్ణించారు. బుద్ధుడు కూర్చున్న బల్లమీద విడిపూవులు చెక్కారు. అలంకారంమీద వీరి కున్న అభిమానాన్ని నిరూపించుకోడానికి, చివరకి ఒక్క ఉదాహరణం చాలు. శిల్పంలో మొదటిసారి వర్తులాకారంగా వున్న (చుక్క కాదు) తిలకం వాడేరు భార్హుతుశిల్పులు. వీరి కాలానికి గాంధారబుద్ధుడు 'ఊర్ణ' (నుదుటికాయ)తో ఇంకా తయారు కాలేదు. కనుక శిల్పంలో తిలకం భార్హుతుశిల్పుల ఉపజ్ఞే. పిమ్మట అజంతాశిల్పులు మాత్రం '9' వలె ఉన్న తిలకం మొదటి (రెండవపులకేశికాలము నాటి) గుహలో వాడేరు.

భార్హుతుశిల్పులు మనుష్యుల్లోకంటె మృగాల్లో చైతన్యం ఎక్కువ పెట్టారు. లేళ్లూ (*Plate XIII*, 118; *LXXX* 108;) ఏనుగులూ (ధనభూతి ద్వారమ్మీదివి) ప్రత్యేకంగా చెప్పాలి. ఏనుగుల కుంభస్థలమ్మీద చుక్కలూ, గండస్థలమ్మీద ఆకారపు గీతచెక్కడమూ భార్హుతులో మాత్రమే కనబడుతుంది. తోకచివర వెంట్రుకలు విరిచిన ఈతరెమ్మ ఆకారంగా వుంటాయి!

భార్హుతులో లోహపు ఊదుగొట్టాం అమర్చిన శంఖం కనబడుతోంది. అమరావతిలోకూడా వుంది ఇది. సాంచీలో శంఖం కాదుగాని శ్రుతి బూరాలూ, శృంగనాదాలూ కనబడుతున్నాయి. భార్హుతుశంఖం నేటి నాగస్వరానికి బాల్యదశేమో అని నా కనిపిస్తోంది. శిల్పంలో నాగస్వరం (సన్నాయి) నా కింకా కనబడలేదు.

భార్హుతుచిత్రాలు ఆకాశమ్మీదినుంచి చూస్తే కిందవాళ్లు ఎలాగు కనిపిస్తారో ఆరీతిగా వుంటాయి. చిత్రములో దూరము చూపించడము శుంగశిల్పులు అలవాటు చేసుకోలేదు. దూరంనించి కొంచెం పక్కవాటుగావున్న తోరణద్వారం చూపించడానికి యత్నించారుగాని సఫలులు కాలేదు. ఇంటి కప్పు వెనక్కి మడిగిపోయింది. (*Plate* XC 184) భార్హుతులో భారతీయశిల్పం కథనం ప్రారంభించింది. సౌందర్యానికింకా స్థాయి రాలేదు. ధనభూతి ద్వారమ్మీది యక్షులు అందంగానే వున్నప్పటికీ, కాళ్లో, నడుమో, ముఖాలసరులో శిల్పుల సంస్కారలోపాన్ని పట్టిఇచ్చేస్తాయి. జాతకకథలు మాటలతో కాక రూపాలతో సూచించారు; అంతే. కాగా, భారతీయ శిల్పానికి కథనము నేర్పినది భార్హుతుశిల్పులే.

కోడెత్రాచు

[కథానిక]

•

'శ్రీ వాత్సవ'

"మరిగంటేను తాతా! పాము కలలోకి వస్తే మంచిదంటావా?"

"పాము కలలోకి రావడం మంచిది కాదంటారు. అయితే అది యెలాగ వచ్చిందేమిటి మోహన్ సింగ్? నీలాంటి పడుచోళ్లకి మరి కలలు గిలలు లేకుండా, మూసిన కన్ను తెరకుండా నిద్రబోవాలిగాని కలలేమిటి?"

"సరేననుకో! ఈ ఒక్కసారే కాదు; వారం రోజులనించి పాములు కలలోకి వస్తున్నాయి. ఒక్క పాము కాదు; ఒకోసారి పెద్ద పాములవందు తరుము కొచ్చినట్టు, ఒకొక్కసారి పడగ ఎత్తినట్టు, ఒకొక్కసారి నిలువెత్తి లేచి పైకి ఉరికినట్టు యిలాగ యెన్నో రకాలు."

"ఎప్పుడైనా పాము కరచినట్టయిందా?"

"లేదు—వాటిని చూచినవెంటనే నాకు భయంవేసి పారిపోయినట్టూ, కేకలు వేసినట్టూ అవ్వడం, మధ్యలో మెలకువ రావడం-యిలాగ జరుగుతోంది!"

"అయితే, సింగ్, మీ అయ్యకి ఏదైనా మొక్కుబడి ఉందేమో! తీర్చుకోమని చెప్పు."

"మా అయ్యకి అలాంటి వేవీ లేవు. వాడు రంగం వెళ్లి రావడంతోటే పోయాయి అవన్నీ; పైగా మిలిటరీలోకికూడా వెళ్ళొచ్చాడా మరి."

"అవునులే—అతను గుండెలు తీసిన గండు సిపాయే! మీఅమ్మ మాంచి యిల్లాలు; వాడు ఇన్ని తిరిగొచ్చినందుకు నమ్ముకుని విన్న గ్రుడ్డు అప్పటి నించి పెంచి పెద్దవాణ్ణి చేసింది. ఆవిడకు పూజలూ పునస్కారాలు చాదస్తం ఉంది!"

"ఉన్నాయి. కాని దానికీ, నాకు కల్లో పాము కనిపించడానికీ సంబంధం ఏముంది?"

"ఉన్నది. చెబుతున్నాగానూ! ఎవరో నాగేంద్రుడు పగబట్టి ఉన్నాడు. నాగుల చవితికి పుట్టలో పాలేసుకున్నారా?"

"నాకు ఈ యింజనీరుగారి దగ్గర నౌకరీ దొరికి నప్పటినించీ యింక తీరికేదీ? పూజా లేదు; నాగుల చవితీ లేదు."

"పెద్ద చిక్కే వచ్చింది. నీకు మరి యింత నౌకరీ దొరికింది. బంట్రోతువైనా పదిరాళ్లు కళ్ల చూస్తున్నావు—మరి ఆ మొక్కుబడులూ అవీ తీర్చుకో వలసింది."

"ఆమధ్య నో బైరాగి చెయ్యిచూచి, నీకు పాము గండం ఉంది, వేరుముక్క యిస్తాను కట్టుకో మన్నాడు. నేను నమ్మకంలేక కట్టించుకో లేదు."

"అయ్యో! ఏపుట్టలో ఏమహాత్యం ఉందో! అదీ చూడవలసింది. ఇంతకీ యీ పీడ పోవడానికి ఓ పామునైనా చంపిచూడు. ఒక్కసారి పామును చంపితే ఇంక పామువల్ల భయపడవక్కరలేదంటారు."

"ఛే ఛే! పామును చంపడమే!! నా వయస్సుకి!!"

"నీవయస్సు కేం? మంచి పహిలా వచ్చీసులో ఉన్నావు! పెళ్లి కాలేదుగాని యీపాటికి బిడ్డ తండ్రివి కావలసినవాడవు."

"దానికేంగాని—పామును చంపగలనంటావా?"

"ఎందుకు చంపలేవు? మొండివాడు రాజు కంటె బలవంతుడు."

"మొండికెత్తాలంటావు?"

"అంతే మరి; మొండి కెత్తితేనే వెర్రిభయాలు పోయేది"

౨

తాత చెప్పిన మాటలు మోహన్ సింగుకు బుఱ్ఱ కెక్కాయి. తాత అల్లాటప్పయ్య కాడు. ఎంతమంది దొరలక్రిందో పనిచేశాడు. జీవితం ఆరుపువ్వులూ మూడుకాయలూగా నడిపించాడు. ఇప్పటికీ సర్వీసులో ఉండి డబ్బు గడిస్తున్నాడు. అతనికి తెలియని విషయం లేదు. ఈ పాముభయం పోగొట్టడానికి తాత చెప్పిన ఉపాయమే మంచిదేమో! మోహన్ సింగ్ మొండి కెత్తాడు; పాము కనిపిస్తే భయపడకుండా చంపి తీరతాడు. ఇంక భయంలేదు. తన కేంలోటు? నెలకి అరవై ఎనిమిదిరూపాయలు సర్కారు ఇస్తున్నారు. ఇంజనీరు గారు పిలిచినపుడల్లా పలకడం, వారియింటివద్ద కావలసిన సరకులు పంపించడం తప్ప తన కేం పనిలేదు. బట్టలూ అవీ వాళ్లే యిచ్చారు. ఇంజనీరును చూడడానికి వచ్చిన ప్రతివాడూ తృణమో, పణమో తనచేతిలో వేస్తున్నాడు. ఈ సంపాదన అంతా వాళ్ల అమ్మచేతిలోనే వేస్తేగాక, తానుకూడా ఒక ప్రయోజనపరు డయ్యాడు! ఇన్నాళ్లూ తనూ ఒక స్వతంత్రవ్యక్తి అనిపించలేదు. ఆఫీసులో ఉన్నంతసేపూ ఇంజనీరు చెప్పిన పని చెయ్యాలి; లేకపోతే తాత చెప్పినట్టు వినాలి. ఇంటి దగ్గర ఉన్నంతసేపూ అమ్మచెప్పినట్టు. తనకి జత గాళ్లూ లేరు. తిండి తినడం, ఆఫీసుకెళ్లడం, ఇంజనీరు ఇంటికెళ్లడం—ఇదే జీవితం. ఎప్పుడైనా సినిమాకు వెళ్లడం తప్ప, ఆ రోజువారీజీవితంలో మార్పు లేదు. ఇలాగే గడచిపోతోంది. ఎప్పుడైనా తీరిక ఉంటే తాను మదనకామరాజుకథలు, కాశీమజిలీ కథలు ఒకడిదగ్గర ఎరువుతెచ్చి చదువుకొనేవాడు. అవి బాగానే ఉండేవి. నాగకన్యలు, దేవకన్యలు, రాజకుమార్తెలు, కీలుగుఱ్ఱాలు, ఇవన్నీ తమాషాగా ఉండేవి. సినిమాలో కూడా అలాంటి కథలే. ఎప్పుడైనా తనకి అలాంటిది జరుగుతుందా అని ఒకోసారి అనుకుంటూ నిద్రపోయేవాడు. అప్పుడు రకరకాల కలలు వచ్చేవి. ఎక్కువసారులు పాముకలలే. ఒకోసారి కలల్లో ఆడవాళ్లు కూడా కనిపించేవారు. వాళ్లు దెయ్యాలు గానూ, రాక్షసులుగానూ ముసలమ్మలుగానూ వచ్చి భయపెట్టేవారు. అందుకే ఆడవాళ్లంటే సింగుకి మరీ భయం; సిగ్గుకూడాను. రెండుమూడుసారులు అతని కలలో ఎదిరింటి అచ్చమ్మ కనిపించింది. కూరగాయ లమ్మే అచ్చమ్మ తాటకలాగు ఉంటుంది. పగలు చూస్తే నిజంగా రాత్రి కలలోకి వచ్చితీరుతుంది. ఈమధ్య నాలుగుడబ్బులు కూరగాయల అమ్మకంవల్ల సంపాదించినప్పటినించీ, అచ్చమ్మ 'అథారటీ' ఎక్కువయింది.

తరచు అచ్చమ్మకీ, తనతల్లికీ, వాగ్యుద్ధాలు జరుగుతూఉండటం చూచి, హడలిపోయి మోహన్ సింగ్ పారిపోతూఉండేవాడు. ఆమెను చూస్తే నిలువెల్లా భయమే! అటువంటి అచ్చమ్మ తన కలలోకి రావడం' తనని దగ్గరగా చేరదీసి కౌగిలించుకొన్నట్టు అయితే సిగ్గుతో నీరైపోయేవాడు. మన్నాడు ఆ పాపపరిహారార్థం స్నానం చేసేవాడు. అలాంటి సమయాలలో, అచ్చమ్మబదులు దాని కూతురు లక్ష్మి కలలోకి వచ్చినా బాగుండుననిపించేది. లక్ష్మి అంత అందమైందికాదుకాని పదుమూడు పద్దాలు గేండ్ల లేబ్రాయం. చామనచాయ. పిట్ట చిన్నదైనా కూత ఘనం. కూరగాయలు అమ్మడంలో వాళ్ల అమ్మకంటె నాలుగాకు లెక్కువ చదివింది.

లక్ష్మికీ, మోహన్ సింగుకీ అట్టే పరిచయం లేదు. ఉద్యోగంలో చేరని క్రితం, చిన్న పరికిణీ రవిక వేసుకొనివచ్చి, సింగును కథలుచెప్పమని అడిగేది. వాళ్లిద్దరూ పక్క చెరువుగట్టున పొగడచెట్టుక్రింద కూర్చుని వెళ్లిపోయేవారు. లక్ష్మిని వాళ్ల అమ్మ వాలు గైదుసారులు సింగుతో మాటలాడవద్దని చావచంపింది. అయినా ఆ పిల్ల మానేదికాదు. సింగుతల్లి కూడా యీలాంటి చెడుసావాసం చెయ్యవద్దని కొడుకుని ఖండలించింది. దానితో సింగు మాట్లాడ్డం మానేశాడు. ఆఫీసులో ఉద్యోగం ఒకటి వచ్చింది. పిల్లతో సహవాసం మానుకున్నాడు.

కాని రోజూ ప్రొద్దున్న వేళ సింగు తన బంట్రోతు డవాలీవేషం వేసుకొని వెళ్లేసమయానికి, లక్ష్మి ముస్తిపోయి కూరగాయలగంప ప్రక్కనెట్టు

కొని 'సింగూ! కొంచెం గంపెత్తవూ?' అని అడిగేది. సింగు మాటాడకుండా గంప యెత్తేటప్పుడు, ఆ పిల్ల కొంటెనవ్వులు చూచి కోపపడేవాడు. అంతే. పోనీ ఆ పిల్ల కలలోకి వచ్చినా బాగుండును; పాముల పీడ పట్టుకుంది! ఏమైనా సరే వదుల్చుకోవాలి యీ పాడు కలలు!" తాత చెప్పినట్టు. అనుకొని అవకాశంకోసం ఎదురుచూస్తూ ఉన్నాడు మోహన్ సింగ్.

3

ఆవేళ మధ్యాహ్నం భోజనం చేసినతరవాత దొరగారి స్వంతటపా యింటిలో ఆడవారి కిచ్చివేసి తిరిగి ఆఫీసుఆవరణలోకి వచ్చాడు సింగు. జనం క్రిక్కిరిసి బయటికి వచ్చి నిలుచున్నారు; ఆఫీసరుగారు, గుమాస్తాలు, బంట్రోతులు అందరూ విస్తుపోయి చూస్తున్నారు. సింగు పరుగెత్తుకొనివచ్చాడు. చూచేటప్పటికి ఏముంది? ఆఫీసుచుట్టూ వున్న పొదలలోంచి వెను శాటుగా ఆవరణలోకి వచ్చినదేమో ఆ పాము! నాలుగుమూరల పొడవు పెద్దపాము. సాక్షాత్తు ఆ నాగేంద్రుడు వచ్చినట్టే ఉన్నది. బరిమీదికి వచ్చి కదలకుండా ఉన్నది. అన్నివైపులా జనం క్రమ్మేసి ఉన్నారు. ఆడపాము, పడగలేదుఅని కేకలేస్తున్నాడు తాత. 'మాస్తారేమిటి? చంపేఉపాయం చూడండి' అని ఆఫీసరుగారు అంటూంటే అక్కడఉన్న హేమాహేమీలంతా ఎవరిమొగాలు వారు చూచుకొంటున్నారు. మోహన్ సింగుకి ఒక్కపెట్టున లేని ధైర్యం వచ్చింది. ఇంతకంటె అదను లేదనుకున్నాడు. చట్టున లోపలికి వెళ్లి, మూలగదిలో గోడకు చేరవేసి ఉన్న పొడుగుపాటి కొలతబద్ద తెచ్చి నిలువెత్తుపాము మీద హఠాత్తుగా వేసికొట్టాడు. తన్నుకొంటూ ఉన్న ఆ పాముమీద తన పగ తీర్చుకోవడానికి ఎన్ని దెబ్బలో కొట్టి, ఆఖరికి ప్రాణం పోయిం దనిపించాడు. తన కలల్లో చూచిన భయహేతువులన్నిటికీ దీనితో సరి అన్నట్టు ఆపాముశరీరశేషాలకు దహనసంస్కారం కూడా మోహనసింగే స్వయంగా తన చేతులమీదుగా జరిపించాడు.

ఇలాంటి సాహసకృత్యం చేసినందుకు మోహన్ సింగ్ అంటే జనం అందరికీ అభిప్రాయం మారిపోయింది. ఇంజనీరుగారు మొదట్లో నమ్మలేదు. ఇంత పిరికిగా, ఇంత భోలాభోలీగా కనిపించే తన స్వంతనౌకరు మోహన్ సింగ్ పెద్ద పామును చంపగలిగిన సాహస వీరుడనే మాట సులువుగా నమ్మలేకపోయాడు. ఆ క్రతు సమాప్తి జయప్రదంగా జరగడం చూచి దొరగారు ఆనందించి మోహన్ సింగ్ కు అయిదురూపాయలు బహుమతి యిచ్చారు. మిగతాజనం మోహన్ సింగ్ సాహసాన్ని మెచ్చుకున్నారు. తాతమాత్రం సింగును లోపాయికారీగా పిలిచి మరోభయం పెట్టాడు. "నువ్వు చేసిన పని మంచిదే! కాని, ఒరేయి సింగూ! భార్యాభర్తలకి ఎడబాపులు పెట్టావురా బాబూ! పూర్వం ఒక కిరాతుడు యిలాంటి ఘోరం చెయ్యడం చూచే ఆవాడు వాల్మీకివారు శపిస్తే అది రామాయణం అయిందట. ఆడపాము ఉన్నచోట మగపాము ఉండి తీరుతుంది. దాని భార్యను చంపినపగ కోడెత్రాచు తీర్చుకుని తీరుతుంది. అందుచేత నీవు ఆ మగపామును కూడా చంపేవరకూ జాగ్రత్తగా ఉండాలి" అని చెవిని వేశాడు.

మోహన్ సింగ్ పామును చంపిన కీర్తి సంపాదించినవీరుడు, ధీరుడు, విక్రమార్కుడుఅయ్యేడుగాని మనస్సులో మరోభయం మరింత చొక్కవయింది. ఇది వరకు ఒక్క స్వప్నావస్థలోనే సర్పభయం ఉండేది. ఇపుడు జాగ్రత్, సుషుప్తిస్వప్నావస్థలు మూడింటి యందూ భయం తప్పలేదు. చిటుక్కుమంటే పామనే భయం; కదిలితే, తాకితే, పలికితే పాముభయం. ఆ భయంతో చివరికి జ్వరం కూడా వచ్చివేసింది. తల్లి, దండ్రి ఒకటే గోల! పుట్టలో పాలు పోశారు; శివాలయంలో అభిషేకం చేశారు; సుబ్బారాయుడి గుడిలో కొబ్బరికాయలు కొట్టారు. ఏమీ లాభం లేదు. మోహన్ సింగ్ ఒళ్లు మాడుతోంది జాలూ నిప్పులు చెరిగింది. జ్వరంలో క్షణంక్షణం పరాకుమాటలు. 'అదుగో, పాము పడగ ఎత్తుకొని వస్తోంది పట్టుకోండి పట్టుకోండి' అని కేకలు వేస్తున్నాడు. ఆఖరికి మూడో రోజున తాత చూడటానికి వచ్చి, మోహన్ సింగ్ భయం పోగొట్టడానికి ఆకోడెత్రాచును పట్టించడమే ఉపాయమని అన్నాడు.

"అయితే, తాతా! ఆపాము పట్టితే దొరుకుతుందా?"

"ఎందుకు దొరకదు? తప్పకుండా దొరుకుతుంది!"

"అక్కడే ఉంటుందని రూఢి యెలాగ?"

"పాముకి మనుష్యులకంటె ప్రేమ యెక్కువ. చనిపోయిన తన భార్యకోసం వెదకుతూ అక్కడే తచ్చాడుతూ ఉంటుంది. వాళ్లకి అటువంటి అనుబంధం! అందుకే నాగబంధం అంటారు."

"ఎలాగ పట్టుకోవడం మరి?"

"పాములవాడిని తీసుకొస్తే వాడే చూస్తాడు ఆపని"

"అయితే తాతా! మీరే చూడాలి వాడిని రప్పించే ఉపాయం"

తాత చెప్పిన యీ యుపాయంతో మన్నాడు పొద్దున్న మోహన్‌సింగుకి వచ్చిన కొత్త ధైర్యం వల్ల జ్వరం తగ్గిపోయింది. ప్రక్కపల్లెటూరులో ఒక గొప్పపాములవాడు వచ్చాడంటేను కబురు పెట్టారు. అతగాడు నాగస్వరంకాయ, బుట్ట వేసుకొని మళ్లీ మధ్యాహ్నం మూడుగంటలవేళకు వచ్చాడు. కొంచెం చల్లబాటువేళ అయితేగాని సమయం కాదన్నాడు. ఈలోపున రెండు తెల్లమడతలు తెప్పించమన్నాడు. ఇంజనీరుగారు కూడా సమయానికి ఆఫీసులోనే వున్నారు కాబట్టి రెండుజతల తెల్లదుప్పట్లు, చాకలి తెచ్చిన మడతలు తెప్పించారు. పాములవాడికి కడుపునిండా అన్నంకూడా పెట్టించారు. అతగాడు కొంచెముసేపు విశ్రమించి మోహన్‌సింగును వెంటబెట్టుకొని ఆడపాము వచ్చిన చోటు, చంపిన స్థలం, దహనపరచిన ప్రదేశం ఇవన్నీ గుర్తుగా చూచుకొన్నాడు. చివరికి యీ మైదానంలో ప్రక్కవెయ్యండని తెల్లమడతలు విప్పి పరపించాడు. చుట్టూ పచ్చని బయలు; దూరంగా పొదలు, గురివెందచెట్లు, సంపెంగ, తేరాణి, దొంకమల్లె, పురుగుడుచెట్లు వ్యాపించిఉన్నవి. పచ్చని పట్టుతివాచీ లాగున గరిక పోచలు మొలిచిన మైదానం మృదువుగా, సొగసుగా ఉంది. సాయంకాలం ఆరుగంటలు కావస్తోంది. సూర్యాస్తమానం కాలేదు; నీరెండ బంగారు కాంతులు ఆకీసుగోడల మీద పడి పసుపుముద్దలలాగు కనిపిస్తున్నాయి. పాములవాడు తన నాగస్వరం కాయ పట్టుకొని, రెండుబుగ్గలూ పూరించి ఊదివేస్తున్నాడు. ఆనందభైరవిలో రాగాలాపన చేసి ఆవరణచుట్టూ తిరిగాడు. ఏమీ పనిబట్టలేదు. జనం కిమన్నాస్తి- మాటలాడటం లేదు. 'శంకరాభరణం' ఎత్తుకొన్నాడు; పలికించి వేస్తుంటే, అరమూతపడిన కన్నులలో ఆశ్చర్యచకితులై అక్కడ ఉన్న ఆబాలగోపాలం చూస్తున్నారు. పాము అలికిడి లేదు. మోహన్‌సింగ్ భయంతో వణకిపోతున్నాడు. తాతకి దగ్గరగా చేరి, పాములవాడు ఎక్కడికి వస్తే అటువైపు వేయికన్నులతో పరికిస్తున్నాడు. పత్తా లేదు. ఆ నిశ్శబ్దాన్ని చీల్చుకుని చిన్న చిన్న వంశీరంధ్రాలనించి స్వరాలు వాహినులై ప్రవహిస్తున్నవి. ఈమాటు వినిపిస్తున్నది 'పున్నాగవరాళి'. భువనమోహనమైన ఆ గానప్రవంతికి అక్కడ జనమంతా తమ శిరస్సులను అప్రయత్నంగా కంపింపజేస్తూ ఉన్నారు.

'నాళి'వాద్యం ప్రారంభమైంది; పదునాలుగులోకాలూ చేరువకు వస్తున్నవా అనిపిస్తున్నది. 'శిశుర్వేత్తి, పశుర్వేత్తి, వేత్తి గానరసం ఫణీ' గానామృతంతో ఒక వినూతనగంధర్వలోకమే సృష్టిఅవుతోందేమో! ఆ పాటలో ఏదో పిలుపు! దేశకాల పాత్రలకు అతీతమైన విశ్వజనీనమైన ఆహ్వానం అది. ప్రియునకు ప్రేయసిలాగున, మాతకు శిశువులాగున, పురుషునకు ప్రకృతిలాగున ఆక్రందనం ఆ వినిపించే పిలుపు. ఈ పిలుపు వినే ఆదికవి కరుణ అశ్రుధారగా ప్రవహిస్తే ఆ యమృతాశ్రువులు మహాకావ్యమైనవి. ఇది వినడానికే యమునాతీరసైకతస్థలాలు గోపగోపికాగణాలతో లజ్జావిహీనములైనవి. ఇది వినడానికే సౌందర్యఖనియైన మన్మథుడు లోకభయంకరమూర్తి శంకరుని శాపానికి గురియై అనంగుడైనాడు.

"రారా" అనే పిలుపుతో మారుమోగుచున్న 'పున్నాగవరాళి' త్రిస్థాయిలోనూ ప్రతిధ్వనిస్తున్నది. భ్రమిస్తూవున్న రోదసి, కంపించే తలలూ యీ గాన

వాహినిలో మునిగి తన్మయత్వములో నున్నవి. మెఱిసి పోయే దేహకాంతితో, విప్పిన పడగతో రాజఠీవితో సంపెంగపొదనించి కదల్తూ చ్చాడు నాగరాజు. లావణ్యనిధి! నాగస్వరంపలికే ప్రతిస్వరం ఆ నాగసర్పం మీద పులకలు కలిగించిందేమో! అపలేని ఆనందంతో పైకి లేచి ఒయ్యారముగా తెల్లటి పాన్పుమీదికి చేరి తల ఆడిస్తూ ఉన్నాడు ఆ త్రాచు.

గానతన్మయత్వంలో సఖీవియోగంమాట మరచి పోయాడో ఏమిటో తోకపైన లేచి, నిలువునా పద్మము వలె పడగవిప్పి నాట్యంచేస్తున్నాడు. పాములవాడు స్వరం ఆపక ఒక చేతితో బుట్ట చూపుచు, రెండవ చేతితో గళం పట్టుకొన్నాడు. గానం ఆగిపోయింది. కాని అందరి చెవుల్లోనూ మారుమ్రోగుతూవుంది. పాము బుట్టలో బందీ అయిపోయింది. పాములవానికి కొత్త బట్టలు, బహుమతులు లెక్కలేవు. బరిమీద యింత పరువైన పాము ఎన్నడూ పట్టలేదని ఆ పాములవాడు సంతోషించి ఇంజనీరుగారివద్ద బహుమతులు పొందాడు. తనపీడ విరగడి అయినందుకు మోహన్ సింగ్ స్వయంగా ఒక అయిదురూపాయలు ఆ పాములవాడిచేతులో పెట్టాడు.

౪

అంతటితో కథ పూర్తికాలేదు. మోహనసింగ్ సర్పపీడ ఆ పామును పట్టుకోవడంతో వదలలేదు. ఇంకా అతని స్వప్నాలలో పాములు కనిపించి భయపెట్తూనే ఉన్నవి. మళ్లీ తాతను అడిగితే అత నేమీ కారణం చెప్పలేక పోయాడు. బహుశః పామును చంపిన పాపం, పట్టించిన పాపం అంతగా వ్యథపెట్తూఉన్న దేమో అని పూజలు పునస్కారాలు చెయ్యమన్నాడు తాత. అవి అంటే ఇదివరకు సింగుకు నమ్మకం లేకపోయినా ఎన్నో చేశాడు; కాని లాభంలేకపోయింది. యథా ప్రకారంగా కలల్లో పాములు తప్పలేదు.

ఇంకొక కొత్త భయంకూడా ప్రారంభమయింది. ఏ ఆడది కనిపించినా పాములాగ కనిపిస్తోంది. ఆ తళ తళలు, ఆ చూపులు, ఆ పెలికలు తిరగడం, ఆ బుస కొట్టడం, ఆ మెల్లిగా నడవడం అంతా పామువడుపే. లేన తల్లియినవో, ఎవరు కనిపించినా సరే, ఆ స్త్రీలో తాను చంపివేసిన ఆడపాము కనిపిస్తోంది ఇంక ఇటువంటి బాధలు వాళ్లతోటీ వీళ్లతోటీ చెప్పుకొంటే లాభంలేదని లోలోపల దిగమ్రింగుతున్నాడు. ఇంజనీరుగారి భార్యను చూస్తే ఒక కెత్తికొడ్డులాగున ఉంటుంది. మరీ భయపడిపోతున్నాడు. చెప్పిన పని సరిగా చెయ్యలేకపోతున్నాడు. రోజా అయ్యగారిపిల్ల చీవాట్లే!! ఎదురింటి అచ్చమ్మ కొండచిలువలాగ కనిపిస్తూ ఉంటుంది; దానిని చూస్తే అసహ్యంతో కూడిన భయం. రోడ్లమీద కంకరకొట్టే ఆడవాళ్లు ఇదివరకు చూస్తూవుంటే బాగానే వుండేవాళ్లు; ఇపుడు వాళ్లంతా నాగుబాములలాగ .కాళ్లల్లో పడుతూ ఉన్నట్టు కనిపిస్తున్నారు. ఇదంతా తెలివిగా ఉన్నప్పటి అనుభవం. కలల్లో కనిపించే పాముల రకం వేరు. అవన్నీ తాను పట్టించిన త్రాచుపాములలాగు ఉంటాయి. కోడెత్రాచులు. పడగలు విప్పుకొని వస్తాయి. చేతితో పట్టుకోబోతాడు; చెయ్యే పాము అయిపోతుంది. బాబోయి అని కేకవేసి లేస్తాడు. కునుకువేస్తే కలవస్తుందని పాడికళ్లతో రాత్రిళ్లు జాగరణం చేస్తూకొంటాడు.

మోహన్ సింగ్ నానాటికీ చిక్కి శల్యమై పోతున్నాడు. సరిగా నిద్రలేదు; తిండి లేదు. పరధ్యానం. తల్లి వేరుముక్కలు కట్టించింది; రక్షరేకులు పెట్టించింది. తండ్రి డాక్టర్లకు చూపించాడు. వాళ్లు త్వరగా పెళ్లి చేయమని సలహా యిచ్చారు. ఈ నీరస స్థితిలో పెళ్లి ఏమిటని తల్లి ఒప్పుకోలేదు. సంబంధాలు వస్తూనే ఉన్నవి; సింగుకా ఇష్టంలేదు. చూచిన ఆడదల్లా పామై కూర్చుంటే ఇంక పెళ్లి చేసుకొని ఏమి సుఖపడతాడు? సింగు ఆఫీసుకి వెళ్లడం, ఇంట్లో తనగదిలో పడిఉండటంతప్ప ఆ రొందరింటి పిల్ల లక్ష్మివంకయినా చూడటంలేదు. ఆపిల్ల రెండు మూడుసారులు వచ్చి పలకరించబోయిందికాని చూడగానే పడగెత్తిన తాచుపాములాగున కనిపించి మోహన్ సింగు తలుపులు బిగాయించి గదిలోపలికి రానీయలేదు.

౫

ఆరోజు హోళీపూర్ణిమ. మోహన్‌సింగుకు సెలవు. తల్లి, దండ్రి మేనమామయింటికి పోయారు. జబ్బుమనిషి అని సింగును తీసుకెళ్లలేదు. సింగుమీద ప్రొద్దుటినించి ఎందరో వచ్చి కిటికీలోంచే రంగులు వేసిపోయారు. సంధ్యవేళ లక్ష్మికూడా వచ్చి తలుపు తీయించి ఊపిరిసలపకుండా రంగు కొట్టి వెళ్లింది. అద్దంలో తన ముఖం చూచి మోహన్‌సింగు ఆ రంగుల వికృతస్వరూపానికి అసహ్యించుకొన్నాడు.

వేడినీళ్లతో శుభ్రంగా స్నానంచేసి, తెల్లనిమడత లుం కట్టుకొని పండుగభోజనం మస్తుగా చేశాడు. ఏదో సినిమా ఉంటే తొలిఆటకి వెళ్లివచ్చాడు. పున్నపువ్వులాంటి వెన్నెల. తనయింట్లో ఉక్కగా ఉంది. ఎదురుగా చెరువుగట్టుమీద పొగడ చెట్టు క్రింద కూర్చుంటే బాగానే ఉంటుంది. చెరువులో నీరు అంతగా లేదు. పచ్చిరిబారిపోయిన ఆనీళ్లలోనూ, నాచులోనూ వెన్నెల మసకమసకగా ఉంది. రాలిన పొగడపూలు మత్తుగా వాసనలు విరజల్లుతూ ఉన్నాయి. చెరువుకి ఎదురుగానే అచ్చమ్మ ఉన్న పూరిల్లు. దీపంలేదు గాని, వెన్నెలలో ఒక మనిషి లాగ తెల్లని బట్టలతో సుమ్మంలో అనుతూవుంది. పరకాయించి చూచాడు; తలలో మల్లిపూలు, తెల్లటి పరికిణీ, తెల్లటి గోరంచుఖండువా, చిలకాకుపచ్చ రంగురవిక; లక్ష్మి! పదిగంటల రాత్రి అవుతుందేమో! ఒక్కర్తె కూర్చుని ఉందేమో! లేదు; చెరువుగట్టుమీదకే వస్తూఉంది.

ఇందాకా అంత ఘోరంగా వంటినిండా రంగు కొట్టిపోయింది. ఈ ఆడదానికి ఎంత కండకావరం! ఊచ్చి తన్నేవాడు లేక! ఇది ఎవడిని కట్టుకుంటుందో కాని వాడిపని అంతే!! తనే కట్టుకుంటేనో? ఎలాగ కట్టుకుంటాడు? వాళ్లు బొందిలీలు; లక్ష్మి మరి యెవ్వళ్లో కూరలు అమ్ముకుపేవాళ్లున్నూ. అదీగాక అచ్చమ్మ—ఆ దెయ్యం యిష్టపడుతుందా? ఆ అచ్చమ్మతో యిష్టంగా ఉంటాడు పోలీసుఆయన—అతనికి తెలిస్తే చంపెయ్యడూ? అసలు ఎవరినో ఒకళ్లను పెళ్లిచేసుకొంటే మంచిదేమో! ఈమాట అమ్మతో చెప్పివెయ్యాలి. కాని ఆడదంటే భయం పట్టుకుందేమిటి? ప్రతీ ఆడదీ పాములాగ కనిపిస్తుందేమిటి? లక్ష్మికూడా పాములాగే కనిపిస్తుంది. ఈమాటు ఈ పామును పట్టేసుకోవాలి. రానీ, దగ్గరకు రానీ! లక్ష్మి దగ్గరకు వచ్చేసింది.

"ఎవరు వారు? రాత్రికాడ చెరువుగట్టుమీద కూకున్నారు?"

సింగు మాటాడలేదు. చాలాసార్లు లక్ష్మీ, తానూ కలిసి ఆ చెట్టుక్రిందే కథలు చెప్పుకున్నారు. అపుడు తప్పులేదు. భయం లేదు. ఇపుడు లక్ష్మి పెద్దదయింది. ఆడది. చూస్తే భయం; పాములాగ కనిపిస్తోంది. ఆవెన్నెల, పున్నమి, పొగడపూలు, లక్ష్మి ఇవన్నీ కలిసి నాగస్వరం పలికిస్తూఉన్నట్టు అయింది: 'రారా' అనే పిలుపు. తనలో ఉన్న పాము ఆనాగస్వరానికి పైకిలేచి ఆడుతున్నట్టు అయింది. తనో పాము; లక్ష్మి ఒకపాము—రెండుపాములు కలిసిపోతాయి ఈ సంగీతంలో; అదే నాగస్వరం; కాదు, తాను పామును పట్టుకోవాలి. లక్ష్మిచేసిన దౌర్జన్యానికి బుద్ధిచెప్పాలి.

దగ్గరకు వచ్చిన లక్ష్మిని మోహన్‌సింగ్ తన బాహువుల్లో బంధించాడు. అతనిలో చెప్పలేని, ఇదివరకు చూడని కొత్త శక్తులు మేల్కొన్నాయి. ఏమి చేశాడో! ఏమైపోయాడో! కొంతసేపటికి పెడేద్పుతో లక్ష్మి యింటిముఖంపట్టింది. మోహన్‌సింగ్ తాను చేసిన అకార్యానికి మొగంచూపకుండా తన గదిలోకి పోయి తలుపులు బంధించుకొన్నాడు.

౬

మోహన్‌సింగ్ ఇండియన్‌పీనల్ కోడు ౩౭౬ సెక్షను క్రిందనో, మరి దేనిక్రిందనో బాలికా బలాత్కారనేరానికి అరెస్టుచేయబడ్డాడన్నమాట ఇంజనీరుగారు వినేటప్పటికి ఆయన మెదట్లో నమ్మలేదు. వాడు అటువంటివాడు కానేకాడు. ఎంతో సాధువు; అమాయకుడు. ఇలాంటి అఘాయిత్యం అతనివల్ల కానే కాదు. సింగ్ తల్లి, తండ్రి ఆయనకాళ్లమీద పడి ఏడుకొన్నారు. ఇదంతా ఆ అచ్చమ్మముండా, ఆ పోలీసు



'లడఖ్' రైతువనిత

చార్లీచాప్లిన్  కళాసృష్టి

శ్రీ తెన్నేటి సూరి

అధునాతనపాశ్చాత్యప్రపంచం ఉక్కుగోరల పిశాచి పట్లకరుచుకున్న, ఊపిరిసలుపని చీకటి ఖైదు. ఈ చీకటిఖైదులో, మానవజాతిసర్వస్వం, ఎటూ మెసలటానికి వీలులేనివిధంగా, ఉక్కిరిబిక్కిరిగా బంధించబడి, పీడించబడుతోంది. ఫాసిజం, సామ్రాజ్యవాదం, ధనికవాదం, అధికారక్రౌర్యం ఒకదానితో ఒకటి చేతులుకలిపి, విచ్చలవిడిగా జడలువిరియబోసుకుని, వికృతరూపాల్తో తాండవిస్తూ, గంగళివాలాడుతున్నయ్. కూటికీ గుడ్డకూ ముఖంవాచి యేడుస్తూ, ఆ మహాదంధకార కర్కశపాషాణశిలాశిఖరకోటరాలలో అల్లాడుతున్న అమాయికులూ, నిస్సహాయులూ అయిన ఆ ప్రజానీకాన్ని, తుపాకిమొనలతోనూ సన్నీలతోనూ పొడిచి, అనంతమైన హింసాకాండ జెరుపుతున్నయ్. అనంతమైన అబద్ధప్రచారాలను పారించుతూ విజ్ఞానప్రపంచాన్నంతా కన్నుకప్పి మోసం చెయ్యాలని చూస్తున్నయ్. కుంచితమైన జాతీయతత్వాన్నీ, జాతిమతవిద్వేషాలనూ రెచ్చగొట్టి ప్రజానీకంలో పెంపొందుతున్న విప్లవచైతన్యాన్ని పెడమార్గాలు పట్టించి కాలదొయ్యటానికి ఈదుష్ప్రచారాల దుమారాలను సర్వత్రా పొగతెరలుగా సృష్టించుతూ, వాస్తవపరిస్థితులు అర్థం కాకుండా అయోమయస్థితిని కల్పించటానికిగాను వీలైన ఇంద్రజాలమంతా పన్నుతున్నయ్.

ఈ కిరాతాన్నంతా యెదుర్కొని పాశ్చాత్య కళారంగంలోని ముగ్గురు మహామూర్తులు, మూలమూలల నుంచీ, తమ విశిష్టశిల్పవిన్యాసాలతో విచ్చలవిడి, సవ్యసాచుల్లా వీరవిహారం చేస్తూ, ఆ కిరాతులు నిర్మించిన సామ్రాజ్యవాద కఠోరశిఖరాలపైకి బాంబులు దూకించి విధ్వంసంచేస్తూ మానవజాతికి స్వాతంత్ర్యభిక్ష పెడుతున్నారు.

ఈ మహాపురుషుల దివ్యనామాలు జగద్విదితాలు—బెర్నార్డ్‌షా, అప్టన్‌సింక్లర్, చార్లీచాప్లిన్. ఒకరు నాటకరచయిత; రెండవవారు నవలాకారులు; మూడవవ్యక్తి ఫిలింనిర్మాత, నటుడు.

నాటకం, నవల, ఫిలిం—ఈమూడుకళలకు అత్యంతసన్నిహితత్వం వుంది. నేడు ఈ మూడు

కళలూ ఒకదాని పరిమితావకాశాలను రెండవది పూరించుతూ ఒకదానికొకటి తోడై ముందుకు నడుస్తున్నై.

నాటకం చాలా ఉజ్వలమైన శిల్పరూపమే— కాని చాలా పరిమితమైన ప్రకాశనావకాశాలు కలది. మానవజీవితాన్ని, సప్రాణరూపాలలో రంగం మీద ప్రదర్శింపగల సావకాశాలున్న కారణంగా దీనికి ఉజ్వలత వున్నమాట వాస్తవమే; కాని ప్రతిభావమునూ, కేవలం, వాచారూపంలో మాత్రమే ప్రకాశనం చేసుకోవలసినదిగా వుండటంచేత చాలా పరిమితావకాశాలు కలదిగా వుంది. వాస్తవిక జీవితంలో వాచ్యమైన శబ్దానికి యెక్కువ ప్రాధాన్యత వుండదు. తరచు పేలవంగానూ, అసత్యంగానూ వుండటం కూడా కద్దు. గంభీరమైన అనేక ప్రధాన విషయాలు మాటల్లో చెప్పబడకుండానే జరిగిపోతూవుంటై. అందుచేతనే ఉన్న వాస్తవాన్నంతా ప్రదర్శించటానికి నాటకశిల్పం స్వగతాలూ వగైరా కృత్రిమమైన శిల్పసాధనాల నుపయోగించి పాత్రల ఆంతరంగిక భావముల నన్నింటినీ బహిర్గతం చేయవలసివస్తున్నది. ఈ అవసరాన్ని గుర్తించే నేటి అధునాతనవచన రూపకంలోకి కూడా యూజనీ స్వగతాదులను పునరుద్ధరించుకున్నాడు. ఈ లోపాన్ని క్రమ్మరు రావటానికే బెర్నార్డ్‌షా తన నాటకాలన్నిటిలో నవలా శిల్పాన్ని అనుసరించుతూ వచ్చాడు.

మానవవాస్తవిక జీవితసర్వస్వాన్ని యథాతథంగా ప్రతిబింబింపచేయటానికి నవలారూపం సర్వవిధాలా తగివుంది. స్వతంత్రమైన విస్తృతచిత్రాన్ని ప్రదర్శించటానికి సువిశాలమైన సావకాశాలు కలిగివుంది. స్థలకాలపరిమితులను అతిక్రమించి పూర్వాపర సమన్వయసహితంగా మానవజాతియొక్క సమగ్రచిత్రాన్ని ప్రతిబింబింపచేయవచ్చు. మానవహృదయంలోని అంతరాంతరాలనూ తరచితరచి మానవమనోభావనల నన్నింటినీ చిత్రణంచేయటానికి నవలారూపంలో సావకాశమున్నట్టు మరేకళలోనూ లేదు.

సినిమాకళ నవలకూ నాటకానికీ మధ్యేమార్గంగా వుంది. ఆదిలో నాటకకళనుంచి ఉద్భవించినదే అయినా, సినిమాకళ యీనాడు నవలాశిల్పంయొక్క అవధులవరకూ పెంపొందివున్నది. మానవహృదయాంతరాలలోని భావాలను వ్యక్తంచేయటంలో గల అంతరాయాలను కొంతవరకు అతిక్రమించగలిగింది.

వాచ్యానికంటే నటనకు యెక్కువ ప్రాధాన్యత నిచ్చి ఈలోపాన్ని కొంతవరకు పూరించుకోగలిగింది. అదీగాక, కెమెరాకుగల అనేకమహావకాశాలను పురస్కరించుకుని యెంతో విజయవంతంగా ముందుకు సాగిపోగలిగింది. ఏ చిన్ని అభినయరేఖనైనా, ఏ చిన్ని నేత్రాంచలవిన్యాసాన్నైనా విస్తృతపరిచి చిత్రించి పాత్రయొక్క మనోభావననంతా ద్యోతమానం చేయటానికి యెంతో సావకాశం కలిగింది.

నవలాశిల్పం సినిమాకళకు యెంత దోహదం చేసిందో, సినిమాకళ నవలాశిల్పానికి అంత చేయూతనూ ఇచ్చింది. ఆల్డస్‌హక్స్లీ, ఎర్నెస్ట్ హెమింగ్‌వే వంటి నవలాకారుల రచనలలో యీవిషయం విస్పష్టంగా కనుపించుతుంది. ఈ రెండుకళలూ పరస్పరం యెలా సహకారం చేసుకున్నాయో పరిశీలించటం ఈ వ్యాసంయొక్క ఉద్దేశం కాదు. సినిమాకళలోకి నవలాశిల్పాన్ని జ్వలింపజేసిన మహాశిల్పి చార్లీచాప్లిన్ కళాకౌశలాన్ని సంక్షిప్తంగా పరిశీలించటంమాత్రమే ఈ వ్యాసంయొక్క పరమాశయం. సినిమాప్రపంచంలో నేడు ఇంతటి ప్రధానస్థాన మాక్రమించివున్న వ్యక్తి మరొకరెవ్వరూ లేరు. ఈయనకు ఇంతటి అగ్రస్థానాన్ని సమకూర్చిపెట్టిన మహాశక్తి లేమిటి?

పూర్వాపరసమన్వయంగా మానవజాతియొక్క పరిస్థితులనూ, స్వభావపరిణామాలనూ ఈయన యెంతో సమగ్రంగా అర్థంచేసుకోగలిగాడు. చార్లీ యేది చెప్పదలచినా అది తన వ్యక్తిగతమైన స్వంత అభిప్రాయం. ఎరువుసొమ్ము కాదు. ఆదినుంచీ యిప్పటివరకూ చాప్లిన్ చిత్రాలన్నీ సర్వాంగ పరిపూర్ణములూ, సృజనాత్మకములూ అయిన సజీవసంపూర్ణచిత్రాలే గాని అయాభావాల అతుకుల బొంతలు కావు. చాప్లిన్ చిత్రం ముమ్మూర్తులా చాప్లిన్ మానసిక స్వరూపమే. చార్లీ చాలనం చేసే ప్రతిభావమూ ఒక

కావ్యరేఖ. మొత్తం చిత్రం మానవప్రపంచ స్వరూపాన్ని గూర్చి ఆయన ఊహించిన వ్యక్తిగత భావనా చిత్రం. శిల్పసాంకేతిక సాధనాలను సేకరించటంలో అనూచానంగా వస్తూన్న సంప్రదాయాలనన్నిటినీ అంగీకరించి సేకరించుకున్నాడు. అయితే వాటినన్నిటినీ జీర్ణించుకుని స్వంతంచేసుకుని తన వ్యక్తిత్వాన్ని ఉజ్వలంగా ప్రకాశనంచేయటానికి పరమసాధనంగా వాడుకుని ప్రయోజనాన్ని సాధించుకున్నాడు; హాలీవుడ్ సాధించిన సాంకేతిక సంప్రదాయాలను విరివిగా సేకరించుకున్నాడు. కాని వీటిని ప్రయోగించే పద్ధతులూ, ఊహించే చిత్రం కేవలం తన స్వంతం—ఆత్మీయవ్యక్తిత్వం. సాంకేతికసాధనాసంపత్తిమీద విప్లవం తీసుకురాడు; కాని వాటి ప్రయోగంలో మాత్రం ఆత్మీయమైన వ్యక్తిగతవిశిష్టతను నిర్మించి ప్రకాశనం చేస్తాడు. ఈవిషయంలో మహాకవి షేక్స్పియరుకూ, చార్లీకీ ఎంతో పోలిక వుంది. అందుచేతనే, షేక్స్పియర్‌వలెనే చార్లీకూడా ప్రజాబాహుళ్యంలోని యే అంతరం ప్రజలకు ఆ అంతరంలో ఆనందాన్ని చేకూర్చుతూ, సర్వులకూ సమానప్రతిపత్తిలో అర్థంచేసుకోదగిన ఒక ప్రధానవిషయాన్ని ప్రతిపాదించుతూ చైతన్యాన్ని కలుగజేస్తూవుంటాడు.

అంతటి సర్వతోముఖమైన సాధనసంపత్తి కలిగి వుండికూడా హాలీవుడ్ యే మహత్తరస్థితిని సాధించలేకపోయిందో దాన్ని చార్లీ తన పరిమితావకాశాలలో సాధించగలిగాడు. ఇందుకు చార్లీ ఆత్మీయమైన ప్రతిభాసంపత్తులే కారణం.

చార్లీచాప్లిన్ అనగానే ఒక విచిత్రమైన వికారస్వరూపం మన కట్టెదుట ప్రత్యక్షమౌతుంది. ఎక్కడికక్కడ చినిగి చింపులు వేళ్లాడుతున్న ఒక బొంతలాగూ, చాలీచాలక పైకి ఎగబీక్కుపోయిన ఒక వికారమైన కోటు, మెళ్ళో ఎందుకు వేళ్లాడుతున్నదో కూడా అర్థంకాని ఒక వికారమైన నెక్‌టై, నెత్తిన యేరూపమూ లేక యెటు బడితే అటు మణిగిపోయే ఒక పిచ్చిటోపీ, ఈ టోపీలోనుంచి వాటి యిష్టం వచ్చినట్టు బయటికి నిర్లక్ష్యంగా జారుతుంటూ రిబ్బన్ పీలికలూ, ఆ టోపీ ఇలా తీస్తే, ఏదో తుపానుదెబ్బతిని గిజాటయిపోయినట్టు, ఏ దువ్వెన్నకూ అంకెకురాని చిటిజడల క్రాపింగ్ జుట్టూ! ఇక, ముఖం: మూడే మూడు బండగీతలు—కనుబొమలు రెండూ, ఒక అధరరేఖ. తక్కిన యితర ఉద్రేకాలు వేటికీ ఆ ముఖంలో తావులేదు. నల్లటి గుబురుమీసం; ప్రపంచంలోవున్న అసమర్థనైరాశ్యమంతా వ్యక్తంచేస్తూ, పెలవులు పట్టుతప్పి విచ్చులుకుపోయిన అధరరేఖ. ఆత్మవ్యక్తిత్వానికి ప్రతిరూపంగా చేతిలో ఒక చేతికర్ర; కాని అది తేలికగా వంగిపోతూ మెలికలు తిరిగివుంటుంది. రవ్వంత అధికారదౌర్జన్యం ఎదురుతగలగానే ఆ వ్యక్తి దాన్ని దూరంగా పారవేస్తాడు. లేదా అది ఆ శత్రువు మీద పడటానికి బదులు అతని వెన్నుమీదనే అడ్డంగా పడుతుంది. పోలీసుటోపీ అంటే అతనికి పరమఅసహ్యం. అధికారాహంకారానికి అతని మూర్తి ఒక ప్రతిక్రియారూపం. సంకల్పమాత్రంలో యేదో చేసి శత్రువును చేలకు కరుచుకునేలా చేస్తాడు. కాని యీ అధికారం అతని శక్తికి మించి సంఘటితపడి వుంది.

రానున్న ప్రమాదాన్ని గుర్తించి చెప్పన తప్పుకుని చకచకా కాళ్లు పంగటించుకుంటూ ఏదో రోడ్డు అందిపుచ్చుకుని దిక్కు తెలియని యేదో అజ్ఞాతంలోకి నిష్క్రమించుతాడు—కర్ర వీపున అడ్డంగా వేసుకుని. ఆ పోవటం యెక్కడికి?—ఏమో, ఏదో, ఎక్కడికో—ఏదో దిక్కు తెలియని అజ్ఞాతంలోకి—నైరాశ్యాంధతమసంలోకి—

ఎవ రీవిచిత్రమూర్తి?—చార్లీ ఈ మూర్తి ద్వారా మనకి చెప్పదలచిందేమిటి?—మానవజాతి విషాదచరిత్రకంతా ఈరూపం ప్రతిమూర్తి. మానవత్వం యొక్క దౌర్భాగ్యస్థితినంతా చార్లీ ఈ మూర్తిద్వారా ప్రతిబింబించివేస్తున్నాడు. మానవజాతిని కళ్యాణపథానికి యెక్కించామని డప్పీలుకొట్టేవారంతా మానవప్రతిబింబరూపమైన ఈ వ్యక్తిని చూసి సిగ్గుతో బుర్ర కరుచుకోవలసివుంటుంది. ఈ వ్యక్తిని చూసి, మనం నవ్వుతాం. కారణమేమంటే, ఆ రూపంలో మనం మన ప్రతిబింబాన్నే చూసుకోగలుగుతున్నాం. తన చుట్టూ వున్న హాస్యాస్పదమైన ఈ అసంగతప్రపం



దిక్కు తెలియని ఏదో అజ్ఞాతంలోకి అంగలు వేసుకొంటూ వెళ్లుతున్న
చిన్నమనిషిని పరకాయించి చూస్తూకూర్చున్న పెద్దమనిషి

దాన్నంతా లెక్క చేయకుండా అతను నిర్లక్ష్యంగా మెసలుతూవుండటం చూస్తుంటే మనలో దేమూలనో అణగిపడివున్న విప్లవాభిలాషంతా ఉత్కంఠ కలిగేలా పైకి ఉరకలు వేస్తుంది.

ఈ కథావస్తువులో ఎన్నో సమస్యలు ఇమిడుకుని ఉన్నాయని చార్లీకి తెలుసు. కాని వాటిని విడివిడిగా విడదీసి అర్థం చెయ్యటానికి అతి యెప్పుడూ ప్రయత్నించలేదు. ప్రపంచంయొక్క హాస్యాస్పదమైన అసంగతవికారరూపం, దాని అడుగున సాగిపోతున్న కిరాతకాండా, వీటినే ఆయన మన దృక్పథానికి తేవటానికి ప్రయత్నించారు.

ఈయనచిత్రాల్లో ఈ విషాదరేఖ ద్యోతమానం

కాకుండా వుండటం అసంభవం. కారణ మేమంటే, అది చార్లీ జీవితానుభవం; దాన్నే ఆయన చిత్రించుతున్నాడు. అరక్షితమూ, దారిద్ర్యభూయిష్ఠమూ అయిన తన బాల్యజీవితమంతా యెప్పటికప్పుడు చార్లీ కళ్ళెదుట మెదులుతూవుంటుంది. బాల్యంలో కొంతకాలం, కెన్నింగ్‌టన్‌లో బట్టలకు సబ్బుపెట్టే కుర్రవాడుగా పనిచేశాడు. ఒకనాడు రాత్రివేళ వర్షంలో, నదివొడ్డునపడి ఒక్కడే యింటికి తిరిగివస్తున్నాడు. అతనికి కొంతదూరంలో బీదలు నివసించే ఒక కుటీరం వైపు చేరుకుంటూ ఒకవ్యక్తి కనుపించాడు. కాళ్ళీడ్చుకుంటూ నడుస్తున్న ఆవ్యక్తి, ఒంగిపోయిన ఆ నడుమూ, వెలిసిపోయిన ఆ పచ్చకోటూ చార్లీమనస్సులో ఆనాటినుంచీ హత్తుకుని, మరుగుపడివుంది. ఆ బిచ్చగాని దుర్భరజీవితం అవగతంచేసుకొని చార్లీ ఎంతో పరివేదన చెందాడు. దారిద్ర్యాన్నిగురించి చెప్పవలసివచ్చినప్పుడల్లా చార్లీ యాక్రోశాన్నంతా కచ్చగా వెళ్లగ్రక్కుతాడు. దారిద్ర్యకిరాతం కళ్ళెదుట కనుపించినప్పుడు అతని అభినయంలో బెబ్బులి విభీత బీభత్సగర్జన వినిపిస్తుంది. తీవ్రమైన యేదో మనోవేదనతో కంపిల్లి పోతున్న ప్రాణిలా కోపంతో కలవరంగా మండిపోతాడు. ఈ బీభత్సరసాన్నంతా విసుగెత్తకుండా ప్రహసనరూపంలో చిత్రించుకు పోతూవుంటాడు.

చార్లీచాప్లిన్ స్వాతంత్ర్య ప్రతిరూపం; కాని కఠోరమైన అధికారయంత్రంలో నలిగిపోతూ విచ్ఛిత్తి పొంది, పరిణామంలో నిరాశాస్వరూపంగా ద్యోతకమవుతూ వుంటాడు.

అధునాతన యాంత్రికయుగం మానవుణ్ణి సమగ్రంగా కూలదోసి ఎలా ఒక నిర్జీవయంత్రంగా మార్చివేసిందో నిరూపించటానికి చార్లీ 'మాడరన్ టైమ్స్' అనే చిత్రాన్ని తయారుచేశాడు. ఆ చిత్రంలో చార్లీ ఒక ఫ్యాక్టరీలో కార్మికుడుగా పనిచేస్తూవుంటాడు. అతని జీవితమంతా ఒకటే పని. అతను ఒకతావున నిల్చునివుంటాడు. కరుసని మేకులుపాతివున్న ఒక పట్టా అతని ముందునుంచి రివ్వున ఎడతెగనివరుసగా అనంతంగా సాగిపోతూవుంటుంది. అతను ఒక రెంచి తీసుకుని తనముందుకు వచ్చిన ప్రతిమేకునూ రెంచితో గవ్వున బిగించి వదులుతూవుంటాడు. అతని ప్రపంచమంతా ఆ మేకుగుబ్బ. కొంతకాలమయ్యేసరికి అతని మనస్సు ఆలోచనాజ్ఞానాన్ని పూర్తిగా చంపేసుకుని యంత్రంక్రింద మారిపోయింది. ఆ మేకులుతిప్పే పని అతనిలో ఒక యాంత్రికప్రవర్తనగా పరిణమించుతుంది. ఒకరోజున హఠాత్తుగా ఫ్యాక్టరీలో ఒక ఇనపచక్రం పట్టా అతని కోటుకు చుట్టుకుని గవ్వున బయటికి విసిరివేస్తుంది. చేతిలో వున్న రెంచితో సహా అతను వీథిలో పడిపోతాడు. వెంటనే అతని ముందు రోడ్డున పోతున్న ఒక స్త్రీ కనుపించుతుంది. ఆ స్త్రీ తొడుక్కున్న వోవర్‌కోటుకు వెన్నువైపున రెండువరుసల గుండీలు తళతళా మెరుస్తూ కనుపించుతై. ఇవి మేకులే ననుకుంటాడు; తనకు తగిలిన దెబ్బనైనా చూసుకోకుండా, అదుర్దాగా లేచి ఆ మేకులను రెంచితో బిగించటానికి ఆస్త్రీవైపు పరుగెత్తుతాడు. ఆ స్త్రీ హడలి కేకలువేస్తూ పరుగెత్తుతుంది. ఒక పోలీసు అడ్డంవచ్చి చార్లీని అరెస్టుచేస్తాడు. చార్లీ తాను చిక్కుబడివున్న ప్రమాదాన్నికూడా గుర్తించకుండా, ఆ పోలీసుకాన్‌స్టేబుల్ కోటున వున్న గుండీలను మేకులనుకుని చకచకా రెంచితో బిగించబోతాడు. ఈ యాంత్రికయుగం మానవుణ్ణి యెంత దుంపనాశనం చేసిందో చూపించటానికి ఇంతకంటే మరో తీవ్రమైన ప్రహసనాన్ని చిత్రించగలగటం అసంభవం.

ఇటీవల చార్లీ 'మాన్‌సియర్ వెర్‌డూ' అనే క్రొత్తచిత్రాన్ని తయారుచేశాడు. ఈ చిత్రం చార్లీ తీసిన పూర్వపుచిత్రాలన్నిటికీ సంపూర్తిగా మార్పు. చార్లీ వేషభాషలన్నీ సంపూర్ణంగా పరిక్రాంత. చార్లీ యీచిత్రంలో మధ్యవయసు పారిస్‌నివాసి—మధ్యమతరగతిలోని అగ్రవర్గాలకు చెందిన వేషభాషలు—నలభయ్యోపడిలో వున్న మాజీ బ్యాంకుగుమాస్తా. మానవజాతిని సర్వనాశనం చెయ్యటంలో వడ్డీవ్యాపారానికి మించిన మరోకిరాతం ప్రపంచంలో లేదని అతనికి తోస్తుంది. ఈ వ్యవస్థను కూలదొయ్యాలని పోరాడతాడు. పైవర్గాలు బలవత్తరంగా సంఘటితపడివున్నయ్. తను కేవలం ఒకేఒక వ్యక్తి. తాను తానా

వ్యవస్థనేమీ చేయలేనని తన అసమర్థతను తాను తెలుసుకుంటాడు. న్యాయంగానూ, ధర్మంగానూ, నెమ్మదిగానూ బ్రతికే సౌమ్యజీవితాన్ని విదిలించి అవతల పారవేసి తనూ అదేరకం తోడేలు జీవితానికి ప్రారంభించుతాడు. బలహీనుడు తనకన్నా బలహీనుణ్ణి నమిలివేస్తాడు. కాని తననూ యెప్పుడో పైవాడు తినివేయటం ఖాయమనే సంగతి నిర్ణయించుకునే వుంటాడు. ఈపాత్రకు వరుసను అనేక మంది భార్యలు; వచ్చిన భార్యను వచ్చినట్టు ఖూనీ చేసి మరోదాన్ని చేపడుతూ వుంటాడు. ఇన్ని ఖూనీలూ ఇతను వరుసను చేస్తూనే వుంటాడు. కాని ఖూనీచేయబడుతున్నవాడు కర్టోయేవనీ, ఖూనీచేస్తున్నది అతని చుట్టూతావున్న ప్రపంచమనీ మనకు యే నిమిషానికి అనిమిషం తెలిసిపోతూవుంటుంది.

ఈ ప్రపంచంలో అనంతంగా సాగిపోతున్న హింసాకాండనంతా యీ చిత్రం కళ్లకుకట్టినట్టు చూపించుతుంది. కళాసాంకేతికవిన్యాసంలో ఈ చిత్రం ఒక మహావిజయం. ఒక్క రైలుచక్రం కదలికలో, చార్లీ, జగత్తులో వున్న యావత్తు బీభత్స కాండనూ సూచించివేస్తాడు.

ఈ చిత్రాన్ని అధికారవర్గాలన్నీ దూయబట్టినై. ఇటు రష్యనులూ విమర్శించారు—అటు అమెరికావారూ అమెరికాలో ఈచిత్రం ప్రదర్శితం కాకుండా వుండటానికి యెన్నిచెయ్యాలో అన్నీ చేశారు.

వీటికన్నిటికీ చార్లీ చెప్పిన సమాధానమల్లా ఒకటే:

"నేను చెప్పదలచిన దేదో చెప్పివేశాను!"



మధురపండితరాజము

గంగాలహరి

•

శ్రీ పింగళి లక్ష్మీకాంతం

కలుములపంట భూమికి, జగత్ప్రభు శర్వుని భాగ్యరేఖ, ప్రా
బలుకుల యర్థసారము, సుపర్వుల పుణ్యము తాల్చు రూపు, నె
చ్చెలి సుధకున్, బురాణకవిశేఖరవాక్యవిహారవాటి, నీ
సలిలము నా పొనర్చు కలుషమ్ముల నెల్లఁ దొలంచు జాహ్నవీ!

సకృదవలోకనశ్రవణ సంస్మరణంబుల, దుష్టవాసనా
నికర తమఃప్రసారమలినీకృతబోధమనోవిమోహముల్
వికల మొనర్చు గాంగజలవీచిపరంపర యస్మదీయ పా
తకము లడంచి శాంతియును దాంతియు నిచ్చి సుఖాత్ముఁ జేయుతన్.

హరుశిరమందు నిన్నుఁ గని యంబిక పట్టగరాని యీసునన్
జురచుర లాడుచున్ గలకుచూపులు నీదెసఁ బర్వఁజేయగా
ఉరిమియుఁ బొంగియున్ బొరలియున్ నురుగుల్ వెలిగ్రక్కియున్ భయం
కరముగఁ దాండవించు తరగల్ భవతాప మడంచు జాహ్నవీ!

దురితము లెన్ని చేసినను తోడనె నీవు భరింతువన్న ని
బ్బరమున గర్వితుండ నయి పద్మభవాదుల ధిక్కరించితిన్
తటియగు నిప్డు నిష్కృతి యొనర్పక నీవె యుపేక్షసేయ నె
వ్వరి నిక వేడుకొందు వినువా రెవ రుందురు నన్ను, జాహ్నవీ!

ప్రాజ్యరాజ్యమ్ము నొక గడ్డిపరకవోలె-వ్రేల్మిడిఁ ద్యజించి నీదరి విశ్రమించి
అమృతరుచి మించు నీ సలిలములుగ్రోలు-వారు కోరరు వేఱ నిర్వాణపదము.

అంత యేటికి, నేతీరమందుఁ దిరుగు-కాకములకైనఁ గల్గదు నాకవాంఛ
జననమరణవిపద్దుఃఖశమనధీర-జాహ్నవీతీర మడచు నా శ్రమభరంబు.

ప్రాతరవగాహములు సల్పు రాచచెలుల-మేని కస్తూరి నీనీట మిళిత మగుచుఁ
గస్తురిమృగమ్ములకు నిచ్చుఁ గల్పవాటి-సమరరమణీసమేతవిహారసుఖము.

వేదవాక్యమ్ములకు, శాస్త్రవాదములకు-దూరమై, వాఙ్మనోతీతమై రహించు
నిత్యశుద్ధనిరంజననిర్వికార-తత్వ మన నీవె, యిదియె సిద్ధాంత మంబ!

దానములుగా వితానములు ధర్మములుగా జపముల్ తపమ్ములుగా
ధ్యానములుగా వ్రతమ్ములుఁ బ్రయాసకరమ్ములు, నిత్యనిర్వృతి
స్థానముఁ జేర్పఁ జాలని వృథాయతనమ్ములు, సర్వజంతుసం
తానము నుద్ధరింపఁగల తల్లికి నీకెనగావు జాహ్నవీ!

శిశిర కటాక్షవీక్షణముచేత నె సంసృతితాప మార్పు నీ
కుశలత యుగ్గడింపఁగల కోవిదు డెవ్వడు, దాననేకదా
పశుపతి యుత్తమాంగమునఁ బ్రాణపదమ్ముగ మోయు నిన్ను, అ
ర్ధశివకు భ్రూవికారమును రక్తదృగంచలముగా జనింపగా.

పతితులకైన లజ్జయును, వ్రాత్యులకైనను రోతయుగా, నిరా
కృతులకునైన భీతిఁ గలిగించు జగజ్జనకిల్బిషంబులగా
సతము హరింపగా విసువు శ్రాంతి యెఱుంగని తల్లి వీవె, దై
వతకులవర్ధనీ! భువనపావని! నీకు జయమ్ము గావుతగా.

[సశేషము]



"....యమునాతీరే-"

శ్రీ రామగోపాల్

ఉత్తరాన హిమాచలాగ్రం, తూర్పున బంగాళా ఖాతం, అంతటా కటికదరిద్రం—అదీ మన నవీన భారతం.

రాజధాని ఢిల్లీ అంటే, దూరపు మనస్సులలో

[illegible]

కాని వచ్చిచూస్తే మామూలే—మేడలలో చీకటీ, అజీర్తీ; గోడ మీద గుడ్లగూబల గ్రుడ్డి దర్బారు; వీధులనిండా కలీ, చలీ, దుమ్మూ ధూళీ, వడగాడుపులూ! ఎటొచ్చీ, అక్కడక్కడ ఒక్కొక్క నవాబు నవాబుహుక్కా పీలుస్తుంటాడు. వందమంది ఫకీరులు కుక్కలతో కొట్లాడుతూ వుంటారు. మస్తు నున్న వల్లకాళ్ల గోరీల మస్తమస్తుల, అతినిశీథ సమాధి అంతరాలనించి నక్కలు ఎప్పటిమాటలో చెప్పాలని ఏడుస్తూ వుంటాయి.

అది ఢిల్లీ —

కాని రామున్నాయరు కాసంగతి యింకా అవగాహన అయినట్టు లేదు. అసలది ఢిల్లీ అయినా, మరో పల్లే అయినా ఒకటే నన్న నిర్లిప్తత అతని దృష్టిలలో కెరటు గట్టింది. రెండు నెలల క్రితం, మలబారుమారుమూల తన పల్లెలో—ఆ గుడిసెలో, తెల్లారుఝామునే తిన్న చలిదికూడే అతను తృప్తిగా తిన్న ఆఖరుభోజనం! అప్పటినించీ ఏమేమి తిని బ్రతికాడో, ఏయే వూళ్లు తిరిగాడో, అతనికే తెలియదు. రైలు కనిపిస్తే ఎక్కాడు. అది తీసుకెళ్ళినంత దూరం వెళ్లడం, టికెట్టు లేదని దింపేస్తే దిగడం, అక్కడ మళ్లీ రైలు బయలుదేరుతుంటే అందులో ఒక మూల దొబగడం, యిలాగ ఎక్కడెక్కడికో తిరిగాడు. మాటతెలిసిన చోటులలో కానీ అర్ధనా

[illegible]

కాని—చచ్చిపోలేదు. ఒకసారి, రెండురోజులేమీ తిండికి లేక, టిక్కెట్టు లేదని రైలు దింపేస్తే, బాధ భరించలేక రైలుపట్టాలమీద పడబోయాడు. పోలీసులు చూసి, లాగి యివతల పడేశారు. కాని, చావనివ్వలేదు. అప్పటినించీ నాయరుకి చచ్చిపోవచ్చు ననే ఆఖరిఆశకూడా పోయింది. బ్రతకాలని కాకుండా, కేవలం చావలేకనే బ్రతుకుతూ వచ్చాడు.

"ఎక్కడికి కెడుతున్నావ్ ?" అన్నాడొక సారి, అతని మొక్కలు విరగబొడిచిన ఒక 'రక్షకా భటుడు. నాయరు వెర్రినవ్వు నవ్వాడు. దానితో పోలీసు బూటుతో మరో రెండు తన్ని పోయాడు. ఎక్కడికి వెడుతున్నదీ అతనికిమాత్రం తెలుసునా చెప్పడానికి ?

పదేళ్లక్రితం, అదే ప్రశ్న ఎవరన్నా అడిగితే, "యింటికి" అనో, "పొలానికి" అనో చిరునవ్వుతో సమాధానం చెప్పివుండేవాడు నాయరు. ఇంటికీ, పొలానికీ తప్ప, మరోచోటుకి అతను వెళ్లి ఎరుగడు. పక్క వూరు సంతకయినా, జ్ఞానం తెలిశాక మూడునాలుగు సార్లకంటె ఎక్కువ వెళ్లలేదు.

ఇల్లుమాట తలుచుకుంటేనే, నాయరుకి వళ్లు ఝల్లుమంటుంది. ఏ పూర్వజన్మవృత్తాంతం లాగో ఆ కథంతా అతని ఆకలి పేగులలో బొగులుబొగులుమంటుంది. కాని, తిండీ నిద్రా లేకపోయినా, అతని కింకా ఆ పాతిభావనల నెమరువేత ఒక్కటే ఆధారంగా మిగిలింది.

* * *

అతను తల్లి నెరగడు. తండ్రి అంతకుముందే పోయాడు. గంజికాచి పోస్తూండే ముసలి మేనత్తనే "తాయీ" అని పిలుస్తూవుండేవాడు. కామందు రామసాధనుగారి సేవలో, యింటిదగ్గర పశువులూ, పొలంలో పక్షులూ తప్ప, వేరే మనుష్యుల ఆలంబన యేమీ లేకుండానే అతని బ్రతుకు గడిచింది.

బొగులుమనే ఆ బ్రతుకులో వుప్పెనలాగ వచ్చింది మంగ—ప్రక్కవూరిలో ఎవరో దూరపు బంధువుల పిల్ల అని, తాయే ఆమనువు కుదిర్చింది. అప్పుడప్పుడు దాచిపెట్టిన డబ్బూ, రామున్నాయరు తల్లి బాపతు వెండికడియాలూ, ముక్కుపుడకా అమ్మగా చేరిన డబ్బూ కూడా చాలకపోతే, కామందుగారిని ప్రాధేయపడి వోలి మూడువందలూ ఎల్లాగో పూర్తి చేసింది. "ఏదో, నే చచ్చిపోతే, నిన్ను కనిపెట్టే దిక్కు వుండాలా? అయినా రత్నంలాంటి పిల్ల రామూ, నీ అదృష్టం—"అని అతనికి నచ్చజెప్పింది తాయి.

నిజానికి, మంగ రత్నంలాంటి పిల్లే. వూరిగుడిసెలో యిమడక వూరంతా గుబాళించిన సౌందర్యం మంగది. మొదట చూడబోయినప్పుడే నాయరుకి కన్ను చెదిరింది. అప్పటినించీ చెప్పలేని గుబులేదో పుట్టింది. ఎర్రని యిమిటేషన్ పట్టుపరికిణీ, ఆరంగుదే బిగువైన రవికా, పైన మిలమిలలాడే వుత్తరీయం, అన్నింటినీ అలముకొని ప్రసరిస్తున్న ఆ చారెడేసి కళ్లూ—ఆ స్త్రీమూర్తిని చూసి రామున్నాయరు విస్తుపోయాడు. కామందుల ఆడంగులు కట్టే ఫాయాలో వున్న ఆ దుస్తులన్నీ ఎక్కడివా అని ఆశ్చర్యపడ్డాడు. ఎవరో ఆపిల్ల బంధువు—కాస్త కలిగివున్న వాడు—ఎప్పుడో బహుమానం యిచ్చిన బాపతని, యింటి కొచ్చినతర్వాత తాయి చెప్పగా విన్నాడు.

రెండేళ్లు!—ఇంగితం తెలిశాక ఎవరి ఆదరణా ఎరగని ఆహృదయం మంగచుట్టూ పెనవేసుకుపోయింది. ఆ వుప్పెనలో వుక్కిరిబిక్కిరవుతూనే వుర్రూత లూగాడు.

తన చేతులతోటే వేరే పాక వేశాడు. అన్ని ఏళ్లు పనిచేసిన కామందు, ఏవో అగావులేసి పాలేరుతనం తీసేస్తే, కూలిపనులకి వెళ్లి సంపాదించాడు. నోటి మంచి చేత, ఒక కాడిగిత్తలని ఎరువుతెచ్చి కొంత కవులు వ్యవసాయంకూడా సాగించాడు. పొలమే యిల్లుగా రాత్రింబగళ్లు వొళ్లు హూనంచేసుకున్నాడు. మంగని తన జీవితంలో అమర్చుకోవాలని—మంగకి తన జీవితం అమర్చాలని—ఎప్పటికప్పుడే ఆరాటపడ్డాడు.

ఆ ఏడు పొలం బాగా పండింది. పాత కామందు మనసు మళ్లి అతనికే కొంత భూమి అమరకంకూడా యిచ్చాడు. అతను ఒక కాడి గిత్తలని కొనా లనుకున్నాడు. మంగకి ఆడపిల్ల కలిగింది. 'వోనం'పండగ వచ్చింది. రామున్నాయరుహృదయం ఆనందంతో నిండి నిట్టూర్చింది!—పండగకి మంగ పుట్టింటికి వెళ్లివచ్చింది!—

రెండోఏడు అతని స్థితి మరింత బాగుపడింది. మొదట వెటకారాలు చేసిన ఆసాములుకూడా క్రమంగా శ్రద్ధగా అతనికి గౌరవం చూపించారు. నాయరుకూడా కొంత స్థిరపడ్డాడు. పొలంపనీ, యిల్లూ—అతని జీవితమంతా ఒక దినపరిక్రమానికి వస్తోంది.

మంగబంధువు, ఒకతను, చూడడానికి వచ్చాడు. పెళ్లి మాపులప్పుడు మంగ వేసుకున్న వుడుపులు అతను యిచ్చినవేనని నాయరుకి తర్వాత తెలిసింది. అతని పేరు 'వేలూ'ట. మళ్లీ మంగకి ఒక విలువైన చీర తెచ్చాడు. పంట్లామూ, కోటూ వేసుకుని, 'వేలూ' ఆపాకలో వున్న ఒక్క ముక్కాలిపీటమీద కూర్చుని, మంగతో మాట్లాడుతూంటే, వీధినిపోయే వాళ్లు ఒకళ్లిద్దరు అక్కడే నిలబడిపోయి వెటకారంగా

చూశారు. నాయరుకూడా, వొళ్లంతా పొలం మట్టి తోటి యింటికి వచ్చేటప్పటికి—మంగనీ, వేలూనీ చూసి విస్తుపోయాడు. తర్వాత మంగ—వరసకి తన బావ అవుతాడనీ, వాళ్లింత వున్నవాళ్లనీ, అత నేదో చదువుకుంటూ సెలవలకి వచ్చాడనీ వేలూనిగురించి చెబుతుంటే రామున్నాయరుఆశ్చర్యం క్రమంగా మంచులాగ కరిగిపోయింది. మళ్లీ రెండుమూడుసార్లు వేలూ వచ్చినప్పుడు నాయరు గుర్తించనేలేదు.

కాని, వూరివారు గుర్తించారు. మంగకి వేలూతో సంబంధం అంటగట్టారు. రామున్నాయరు వెర్రిబాగులవాడని కొందరు కొంటెకోణంగిపద్దులు అతడిని చూసి వ్యంగ్యంగా వెటకారాలుకూడా ప్రారంభించారు. నాయరు మనస్సులో ఏమనుకున్నా, మంగను చూసి మాట్లాడలేకపోయేవాడు. ఎప్పటి కప్పుడే ఏదో అడగబోయి, చప్పరించేసేవాడు. ఇలాగ నాలుగునెలలయేసరికి, వేలూ వచ్చిపోతుండడం పరిపాటయిపోయింది. పుకారుకారుల నోళ్లుకూడా నొప్పిపెట్టి చప్పబడిపోయాయి. నాయరుకికూడా పొలంపని ఎక్కువయి, మనస్సులో యీ గొడవ మెలగడం తగ్గింది.

ఒకనాడు, సంజచీకటులు పడుతుండగా, అతను, పొలంనించి వచ్చేసరికి, మంగ ఎదురుపడలేదు. తాయి మాత్రం తన గుడిసెలో చంటిపిల్లని జోకొడుతోంది. మధ్యాహ్నమే వేలూ వచ్చాడని తాయీ చెప్పింది. అప్పటినించీ, మంగ వప్పజెప్పిన చంటిపిల్ల అవిడదగ్గరే వుండిపోయింది.

మంగపాకంతా చూశాడు నాయరు. అప్పుడప్పుడు తాను కొన్న చీరెలూ, రవికెలూ అలాగే పడివున్నాయి. మంగ తెచ్చుకున్న దుస్తులు—అప్పుడప్పుడు మురిపెంగా కట్టుకుని ముచ్చటపడుతూవుండే వేలూబహుమానాలు మాత్రమే ఎక్కడా కనిపించలేదు.

ఊరంతా వెతికాడు. తెల్లారుఝామునే అత్త వారి వూరుకూడా వెళ్లాడు. కాని, మంగ కనిపించలేదు. వేలూకూడా పత్తా లేదు!

పిడుగు నెత్తిని బడ్డట్టు నాయరు కూలిపోయాడు. వారంరోజులవరకూ మళ్లీ యిల్లు దాటి వెళ్లలేక పోయాడు.

తాయి ఎంతో చెప్పింది. చంటిగుడ్డుని చూసుకోవా లంది. ఆఖరికి, "అది చచ్చిపోయిం దనుకో—" అనికూడా అనేసింది.

"మంగ చచ్చిపోయిం దంటావా?—కాదు, తాయీ—"అని చెప్పలేని మాట లెన్నో కళ్లమ్మట నీళ్లుగా రాల్చాడు నాయరు.

ఆ రోజు లగాయితు నాయరుబ్రతుకు యింకో సుడి తిరిగింది. అతని మనఃస్థితీ, పరిస్థితీకూడా నానాటికీ నాదారయిపోయాయి. అయినా ఆబిడ్డని చూసుకుంటూ, ఆ బిడ్డకోసమనే బ్రతుకుతూ వచ్చాడు.

ఎంతలేని చరిత్రలనో యిట్టే దిగమింగే కాలం కడుపున, క్రమంగా ఆ చిన్నభూఖండంకూడా హరాయిం పయిపోయింది. ఇదివరకులాగే, మళ్లీ తాయీ, అతనూ మిగిలారు. ఆ ఏకాకిజీవితంలో అడ్డుకాపుకో అన్నట్టు కొత్తగా ఒక కుంపటిమాత్రం వదిలిపోయింది మంగ.

ఏళ్లు గడిచాయి. ఎరకలు విరిగి పోతున్న పక్షి గిజగిజే నాయరులో మిగిలింది. చాలాసార్లు ఆవూరు వదిలి ఎక్కడకో పోవా లనుకున్నాడు. కాని, తాయీ అక్కడే చచ్చిపోవా లంది. అతనికీ, 'చిన్నిమంగ' కీ తాయీయే తల్లీ, సంరక్షకురాలూ అయింది. 'చిన్ని మంగ' అనే పిలిచేవా డతను. తాయీమాత్రం 'కన్నమ్మ' అని వేరే నామకరణం చేసింది.

మంగ సంగతే క్రమంగా మరిచి పోయారు వూళ్లోవాళ్లు. ఎగతాళి జాలిగానూ, జాలి క్రమంగా స్నేహంగానూ అయి, మళ్లీ నాయరు కొత్త మనిషయి తిరిగాడు— మనుషులలో పడ్డాడు. కన్నమ్మకి ఎనిమిదో ఏడొచ్చింది. నాయ రింక 'మంగా' అనే ఆ పిల్లని పిలుచుకు నేవాడు. కూటిగింజలకోసం కూలికి వెళ్లి నప్పుడు తప్పితే, ఎప్పుడూ ఆపిల్లతోటే అతనికి కాలక్షేపము అయేది. 'మంగ' కూడా తాయీకి చిన్న పనీ పెద్దపనీ సహాయంచేస్తూ వుండేది.

రోజు లలాగ, ఒక మోస్తరుగా వెళ్లి పోతున్న ప్పుడే, ముగ్గిపోయిన పండులాగ తాయీ ఆకస్తినించి రాలిపోయింది. తల్లి నెరగని నాయరు చంటివాడిలాగ గోలెత్తి పోయాడు. కాని, ఒక గాలివానకి వొరిగిన వృక్షాన్ని తర్వాత తుపాను లంతగా బాధించనట్టు, తాయీ పోయిన దుఃఖంలోనించి అతను త్వరగానే తెప్పరిల్లాడు. అదీగాక, అనుభవాని కింకా చిన్నదే అయినా, అవసరానికి పెద్దదే అయింది 'మంగ'. అన్ని పనులూ అందుకు చేస్తూ, తండ్రికి తాయీపోయిన లోటు కొంత కనిపించకుండా చేసింది. మొదట కష్ట మనిపించినా, విధిలేక చివరకి, యిల్లంతా ఆపిల్లమీదనే వదిలి పెట్టాడు నాయరు. ఏమి వున్నదీ లేనిదీ మంగని అడగాలి. ఏది ఎక్కడ వున్నదీ మంగకే ఆకళింపు. మంచికీ, చెడ్డకీ మంగదే అతనికి పెద్ద సలహా అయింది. పెద్ద మంగలో అత నొకప్పుడు ఆశించి పొందలేక పోయిన ఆప్యాయతా, ఆదరణా పూర్తిగా యీ చిన్న మంగలో చూసుకుని అతను పరిపరివిధాల మురిసి పోయాడు.

పొడు చివురించినట్టు అతను మళ్లీ కొత్తగా జీవితం ప్రారంభించాడు. మొహంలో కళా, పనిలో చురుకూ, మాటలో వుత్సాహం అంకురించాయి. పై వాళ్లకి యీ మార్పు ఆశ్చర్యంగా కనిపించింది. చూస్తూ వుండగానే ముసలివా డయిపోయిన నాయరు మళ్లీ నవయువ్వను డవుతున్నాడా అనిపించింది. కాని, కాని—

కునికే ముందు దీపం మినుకు మాత్రమే అయిం దామార్పు: ప్రళయం ముందరి ప్రశాంతతే అయిం దతని కౌతుకం—

అదేమి రోగమో అని యింకా వూళ్లో ఆశ్చర్యం తగ్గనేలేదు. 'బర్మా జ్వర'మని తర్వాత కొంద రన్నారు. గంటలమీద కొన్ని ప్రాణాలు బలి అయి పోయాయి. వాళ్ల పెడ మరీని—ఏడకని కొంపే లేకుండా పోయింది. పొద్దున్న పదిగంటలకి అంకురించింది— అంతే, చీకటి పడేలోపునే చిన్నమంగని కాజేసింది.

ఆ రాత్రి నాయరు కింక తెల్లారలేదు— మర్నాడు చూస్తే, ఆవూరి వాళ్లకి మంగతోపాటే నాయరు కూడా మాయమై పోయాడు. అతని కొంప లోకి ఎన్నడూ తొంగిచూడని వాళ్లుకూడా అతని శవం కోసం నూతులూ, గోతులూ గాలించారు.

ఒకరోజు, రెండురోజులు— ఊరిలోని చిత్రపు చావులతో బాటు నాయరు వుదంతం కూడా చిలవలూ, పలవలూ అల్లి చెప్పుకున్నారు. మూడోరోజుకల్లా, ఎవరి పనుల్లో వాళ్లు పడి, యీ గొడవే మరిచిపోయారు— ఆవూళ్లో నాయరు బతుకు ఆ విధంగా మాటుమణిగి పోయింది—

కాని, నాయరుమాత్రం మాటు మణగలేదు. చిన్నమంగదాకా వచ్చిన ఆజ్వరం నాయరుని చంప లేకపోయింది. మతి చెదిరి అతను అలాగే బికారిలాగ వారంపదిరోజులు వూరూరా తిరిగాడు. మనుషులని చూడగానే బెదిరి దూరానికి పరుగెత్తేవాడు. ఎక్కు వగా పొలాలమ్మటే తిరిగేవాడు. ఆఖరి కొకనాడు పంటకాలవగట్టున పడివుంటే, పొలంనుంచీ వస్తున్న రైతు లెవరో ఇంత గంజిపోసి బ్రతికించారు. కాని అతని వూరేమిటో పేరేమిటో—పత్తా తెలుసుకోలేక పోయారు. అన్నిటికీ ఒకటే సమాధానం. అతని వెర్రి నవ్వు చూసి, పిచ్చివా డని వదిలేశారు.

కాని అతను పిచ్చివాడు కాలేదు. అప్పటిమట్టుకు అణగారిపోయిన జ్ఞాపకశక్తి క్రమంగా మళ్లీ అతనిలో కొలుకుని అగ్నిపర్వతాలు లేపింది. ఆకలి దప్పులు రగిలించింది. అలాగే, చావలేక బ్రతుకుతూ, బ్రతక డానికి బాధలుపడుతూ రాముస్నాయరు దేశాలు పట్టాడు.

యుద్ధపురోజులు. రైలుపెట్టెలు బట్టల పెట్టెల లాగ తలుపులు పడటం లేదు. బెంచీకింద పరుపుచుట్ట పక్కనే దుమ్మూ, బీడీపీకలూ మధ్య యిరికాడు నాయరు. ఆఖరికి పెట్టె అంతా ఖాళీఅయినా, అక్కడే పడుకున్నాడు. కడుపు మండుతోందికాని కాళ్లూ చేతులూ నిస్త్రాణచేత కదలడానికి బద్ధకిస్తు న్నాయి. అడుక్కున్న బాపతు అరణాల డబ్బుల తోటీ ఏదైనా కొనుక్కుతినా లని మనస్సులోమాత్రం. ఆశ గిజగిజ లాడింది. రైలువాళ్లే వచ్చి లేవగొట్టారు.

స్టేషను చూస్తే, అదేదో పెద్ద పట్టణమే నని అతనికి తోచింది. టికెట్టుకలెక్టరు ఒక గంటన్నరసేపు అతడిని ఏడ్పించాడు. ఆరణాలకంటె అతనిదగ్గర ఏమీ లేవని తెలుసుకుని స్టేషనుఅవతలకి తరిమించేశాడు—ఆ డబ్బులుమాత్రం లాక్కొని!

స్టేషనుఎదురుగానే ఉన్న రిక్రూటింగు మకాములో నాయరుకి రెండురోజులు గంజిపోశారు. మూడోరోజుని వైద్యపరీక్ష. డాక్టరు అతడిని పీకాడు, గోకాడు, పొడిచాడు. బాగా బయటపడ్డ అతని రొమ్ము ఎముకలనిండా—ఎరుపూ, వూదా, ఆకుపచ్చా పెన్సిళ్ల పెట్టి, ఏమిటో గీతలు గీశాడు. అవన్నీ తర్వాత ఒక గుమాస్తా తర్జుమాచేసి, కాగితం మీదికి ఎక్కించాడు. అంతా అయాక, సైన్యంలోకి పనికిరావు పొమ్మన్నారు.

మేడలలో కలీ, పేగులనిండా చలీ, ఆకలీ. చచ్చి బ్రతకడానికి తగడని బ్రతికిచావమని వదిలేశారు.

అది ఢిల్లీరాజధాని అని నాయరు అప్పుడే తెలుసుకున్నాడు. కాళ్లు ఎటు తీసుకువెడితే అటు వెళ్లాడు.

డిశెంబరు నెల. సాయంకాలం నాలుగు గంటలు అయింది. అంతవరకు అగుపించని సూర్యుడు, అప్పుడే చలిచేత చంద్రుడై, వణుకుతూ ఇవతలకి వచ్చాడు. యమునానది ఎప్పటెప్పటివో రాజుల, రాజ్యాల రక్తములు తళతళ లాడించుకుంటూ ప్రవహించుకుపోతోంది. నాయరు తిన్నగా "కాశ్మీర దర్వాజా" చేరుకున్నాడు. మొదటి స్వతంత్ర యుద్ధం అని చెప్పే, స్వదేశ రాజుల ఆఖరి తిరుగుబాటులో, ఆ కోటగుమ్మముమీదనే యింగ్లీషుసైన్యాలు ముట్టడి చేశాయని అతనికి తెలియదు. అగోడకవతలే వున్న మైదానంలో కొంచెం సేపు విశ్రమించి, తిన్నగా తిమారుపూరు వేపు వెళ్లాడు—

తిమారుపూరు కేవలం సర్కారు గుమాస్తాలుండే పేట. యమున వొడ్డునే వుంది. వరదలొచ్చినప్పుడు, కొంత యమునలో కూడా వుండటం కద్దు. కొత్త ఢిల్లీ కట్టక పూర్వం, తెల్లరాజువైస్రాయి దర్బారంతా ఆ పేట వున్నప్పుడు వెలిసింది తిమారుపూరు. అదరిమిలా, పశువులకి పనికిరాకపోవటం చేత, గుమాస్తాలకే యింకా ఇస్తున్నారుట. ఆయిళ్లు అన్నీ ఒకలాగే అచ్చోసినట్టు చీవర కొడుతూ వుంటాయి. కైదీలకి మల్లే నెంబర్లని బట్టే వాటికి గుర్తు. అలాగ నెంబరువారీ కానీ కట్టడాలు ఆచుట్టుప్రక్కల కల్లా రెండే కనుపిస్తాయి. ఒకటి పాడడ్డ మసీదు. ఒకప్పుడది దేవాలయం అయినట్లు కాస్త పరకాయిస్తే తెలుస్తుంది. మొగలు దర్బారుకి తెచ్చినప్పుడు శివాజీని అందులోనే బంధించివుంచారని ఒక కథ కూడా చెబుతారు. రెండోది యమునగట్టున రేవులోనే వున్న మఠం. అక్కడే ఒక చిన్న శివాలయం కూడాను. అర్చకుడంటూ లేకపోవడంచేత, అన్ని వేళలా దేముడు కనిపిస్తూ ఉంటాడు. కాని భక్తులకంటె బైరాగులే అక్కడ ఎక్కువ. ప్రక్కనేవున్న ఆవరణతాలింఖానాలో, ముఖ్యంగా శిక్కుల కుర్రవాళ్లు సాయంత్రాలప్పుడుమాత్రం కసరత్తులు చేస్తూ ఉంటారు.

అప్పటికి బాగా చీకటిపడింది. అతి సుతారం అయిన పొగమంచు మేలిముసుగుమాటున యమున ఆవలిస్తోంది. మఠంముందు రావిచెట్టుదిమ్మమీద నెగడి మండుతోంది. ఆ నెగడితాలూకు బైరాగికి బదులు రామున్నాయ రక్కడ చలికాగుతున్నాడు—కొయ్యబారిన వళ్లు కాస్త వెచ్చగిల్లడంతోటి, కడుపులో నెమ్మకొన్న ఆకలి కరిగినట్లు రగలడం మొదలు పెట్టింది. కూర్చున్నకొద్దీ మరింత మండిపోయింది. రేవులోకి దిగి యిన్ని యముననీళ్లు తాగాడు. లోపలిమంట కది ఆజ్యంపోసినట్లు అయింది. వణుకుతూ మళ్లీ నెగడిదగ్గరకి వెళ్లేసరికి బైరాగికూడా ఎటునించో అక్కడికి చేరుకున్నాడు. తెచ్చుకున్న రొట్టెలదొంతర ముందరపెట్టుకుని కిం దారగిస్తున్నాడు.

నాయరు దిమ్మకిందనే నిలబడిపోయాడు. అతని వళ్లూ కళ్లూ అంతా ఏకంగా ఒకలాగే ఆకలితో దహించుకుపోతోంది. కసరత్తుకుర్రాళ్లు యిద్దరు యింటికెడుతూ, అప్పుడే ఆ రేవులోకి వచ్చారు. ఎవరిని అడుగుదామన్నా, అతనికి, మాట తెలియదు. కాని

జంతువులాగ ఏదో శబ్దం చేశాడు. బైరాగి ఒక రొట్టెలో కొంచెంభాగం విరిచి అతనికి పడేశాడు.

నాయరది యిట్టే మింగేశాడు. ఆరోజుకి పరిపడా పెద్దసత్కర్మం చేసేసినట్లు, బైరాగి, ఏవూరనో, ఏమిటో అతడిని పలకరించబోయాడు. "మద్రాసీ" అని ఏవో నాలుగుమాట లంటూనే, కసరత్తుకుర్రాళ్లు వాళ్లలో వాళ్లు అని వెళ్లి పోయారు. బైరాగి సంతృప్తి పడియింక పలకరించకుండానే రొట్టెలు పూర్తిచేశాడు. ఈదురుగాలికి వెగటు పెద్దమంట అయింది. తిన్న రొట్టెతునకతో నాయరుఆకలి మరింత దుర్భరం అయిపోయింది.

కడుపు మండితే జంతువు కట్టుతాడు తెంపుకు పోతుంది. మనిషికి కట్టుతాళ్లు వుక్కువి—అవి తెంప బోతే వూచలై బిగుస్తాయి, కత్తులై చంపుతాయి.

బైరాగి రొట్టెలు తింటున్నంతసేపూ, రాము న్నాయరు అవి తీసుకోవాలనే అనుకున్నాడు. కాని మొదట చేతులు కలిసిరాలేదు. కొద్ది సేపటికి, ఆకలి వేళ్ల చివళ్లని వంచేటప్పటికి, కాళ్లు వెనక్కి తీశాయి. చివరికి, అతను చేతులు సవరించుకుంటూ అటు రెండు అడుగులు వేశాడు. కాని అప్పటికి రొట్టెలు అయి పోయాయి!—

అక్కడనుంచీ కదిలాడు నాయరు. ఒకవేపు యమున, చంపి రక్షింపగల దాక్షిణ్యంకూడా నీరసించి మోకాలులోతునే తేకుతోంది. గట్టుఎగువకే కదిలాడు నాయరు. చలి, ఆకలి, గాలి అతని ఎముకలు మెలేసి విరిచేస్తున్నాయి.

గమ్మున దేవాలయంవేపు తిరిగింది అతని తల. తలుపు తెరిచే ఉంది.

కళ్లంతా కడుపుచేసుకుని చూస్తున్న అతనికి ఒక పెద్ద పళ్లెంనిండా పళ్లూ, పిండివంటలూ కనిపించాయి. మెరుస్తున్న ఆవెండిపళ్లెం ప్రక్కనే ప్రమిదలో బాదంపలుకులాగ దీపం, దీపంవెలుగులో పెద్దతాటి పండులాగ విగ్రహం ఆనాయి.

దడదడలాడుతూనే అటు పరుగెత్తాడు. సుమ్మం దగ్గిర ఒక్కక్షణం సాష్టాంగపడ్డాడు. కణతలు నొక్కు కున్నాడు. తిన్నగా లోపలికి వెళ్లి, పళ్లెంలో పండు ఒకటి తీసి మింగేశాడు. కూచుని పళ్లెం ఒళ్లో పెట్టు కున్నాడు. కళ్ళుమూని ఆడలేక గర్భగుడి రింగత్తింది. గమ్మున సుమ్మంకేసి చూశాడు-

అది కలా?

ఒక్కసారి కళ్లు గట్టిగా చిట్లించి చూశాడు.

నమ్మలేక పోయాడు- గ్రామంలో భూమందుల యింట్లో చూచిన లక్ష్మి బొమ్మపోలిక తోచింది. అతనికి చలి చచ్చింది. ఆకలిని మింగేసిన మంట ఏదో వళ్లంతా పొగలూ, సెగలూ రేగింది.

ఒక చేతిలో పళ్లెం, యింకో చేతిలో సగం తిన్న అరటిపండు—అతను అలాగే నిలువునా లేచాడు!

చెనారసు చీరె గరగరమంది; వడ్డాణం తళుక్కు మంది.

అదంతా ఒక్కక్షణం!—

ఆవిడ తిరిగింది. వెళ్లిపోతోంది.

"నేనూ!—" అరిచాడు.

ఒక అడుగు అవతలకి వేసింది.

"నేనూ, నేనూ,"—

చటుక్కున ఆగింది.

"మీ... మీరు— భయపడవద్దు."

ఆవిడ అలాగే నిలిచిపోయింది.

"వెళ్లిపోతాను మళ్లీ—వూళ్లో యింక వుండ లేక వచ్చేశాను..."

ఆవిడ అతనివైపు తిరిగింది. ఆ ముఖంలో అతనికి వురుములూ, మెరుపులూ కనుపించాయి.

"అక్క దెవ్వరూ లే రింక—తాయీ చచ్చి పోయింది."

తనువంతా ఒకటే ప్రశ్నగా ఆవిడ పెదిమలపైన వణికింది.

"చిన్న—?"అంది సన్నగా.

అతను నిర్ఘాంతపోయాడు!

అది కలకాదు. కళ్లు దగా చెయ్యలేదు. ఆమె మాట మారలేదు. ఏమిటో అదటు, ఆగ్రహం ఒక్క

పాతే అతని మనస్సులో దుమారం రేపాయి. ఎన్నో ప్రశ్నలూ, మాటలూ అతని గొంతుకలోనే బిగుసుకు పోయాయి.

"మంగా!"—అన్నది ఒక్కటే పెదిమలు దాటింది.

ఆవిడ ఒక్క అడుగు ముందుకు వేసింది.

"చిన్నది?—"అంది మళ్లీ, కఠినంగా.

"చిన్నమంగ—"అంటూ అత నిక మాటాడ లేకపోయాడు. చంటివాడిలాగ వెక్కి వెక్కి ఏడి చేశాడు.

"చిన్నమంగ అంటే—"అని ఆర్థోక్తిలోనే ఆవిడ ఒక పెద్దనిట్టూర్పు విడిచింది. యింకో అడుగు ముందు కొచ్చి గుమ్మంమీద వొరిగింది.

"మూడుమూర్తులా నువ్వే మళ్లీ ని. 'చిన్న మంగ' అనే పిలుచుకునేవాడిని. దానికికూడా నేను తగననిపించిందికాబోసు దేముడికి. ఆకాస్త ఆస్కారం కూడా లేకుండాచేశాడు—యింక నే నొక్కడినే మిగిలాను. చావలేక, యిలా దేశాలుపట్టి బ్రతుకు తున్నాను."

పైటకొంగుతో ఆవిడ కళ్లు వొత్తుకుంటూంది. సముద్రకెరటంలాగ ఆవిడరొమ్ము పైకి లేచి పడు తూంది. తుపానులో మల్లెతీగలాగ ఆపాదమస్తకం కంపించిపోయింది!

"మాయజ్వరం...ఒక్క రోజులోనే మింగే సింది. నేనేం చెయ్యలేకపోయాను—"అతని గొంతుక మళ్లీ నొక్కుకుపోయింది.

"వెధవపూరు!...ఆ బ్రతుకు—నువ్వు—నువ్వు నాచిన్నని—"అని ప్రళయకంపంతో ఆవిడ వురి మింది.

"కాదుకాదు...నా చిన్నమంగ కేమీ అప రాధం చెయ్యలేదు. ఎనిమిదేళ్లు పెంచాను...... అయినా...అయినా...అవును!...నాది కూలీ బ్రతుకు. మొదటినుంచీ అంతే...కూటికే గింజులాట... నీ ఆశలూ...కోరికలూ...అందుకోలేక పోయాను... ప్రయత్నించాను...కష్టపడ్డాను...కాని, ఎల్లాగ?... భవనాలలో ఉండవల్సినదానవు...పాకలలో తప్ప బుట్టావు...అక్క డెల్లాగ వుండగలవు?...నే ననుకుంటూనేవుండేవాడిని...అదే నిజం అయింది... కాని, నాచిన్నమంగకయినా నాబ్రతుకు పనికొచ్చే టట్టు చెయ్యాలనుకున్నాను...కాని కష్టమేపడింది నాకోసం...అంతే...నేనూ......నా దిక్కుమాలిన బ్రతుకూ...నీకు సరిపడలేదు...నాచిన్నమంగకీ సరి పడలేదు...అందుకే...అందుకే!...అవును......నా బరువు నేనే మొయ్యాలి?..."

అతని కన్నీళ్లు ఎండిపోయాయి. గుమ్మందగ్గిర ఆవిడ కుప్పగా కూలివుందని చూశాడు!—

"మంగా!..."

ఆవిడ పలకలేదు.

"నీసుఖం, ఆనందం...కళ్లారా చూశాను!... అంతకంటె నాకింకేమీ అక్కర్లేదు!...యిక్కడుం... యిలాగ...చూస్తాను అనుకోలేదు...బ్రతుకికంతా యీ ఒక్క అదృష్టం కలిగింది..."

"అబ్బా—!" నిట్టూరుస్తూ ఆవిడ ముఖం పైకెత్తింది...

అత నేదో మళ్లీ చెప్పబోయాడు. అంత మాట లాడిన ఆవేగంతో, ఆయాసంతో వొగర్చాడు.

"ఈ ముష్టిబ్రతుకుకి...తగినదే ఒక్క వరం... నామీద...కోపంలేకుండా...దయ......కాస్త దయ తలనమని..."

"దయా?—"తుపాకీ పేల్చినట్లు ఆమాటకి అతను దద్దరిల్లాడు. భూకంపంలోనుంచి క్రొత్తసృష్టి లాగ, ఆవిడ నిలువునా లేచింది!—

"మం...గా!—"

"బికారీ! ఎవరిని పిలుస్తున్నావు?—"

"ఆ...ఆ... అదేమిటి?—మీ...ను...వ్వు— యింతసేపటినుంచీ—మంగ—"

"మంగ చచ్చిపోయింది—నాపేరు నీకు చెప్పి ఏమిలాభం?—"

అంటూ ఆవిడ గిర్రున తిరిగింది. అవతలకి రెం డడుగులు చకచకా వేసి అంధకారంలోకి

చూసింది—ఆవిడ ఎదురుచూస్తున్న నౌకరుజాడ యింకా కనుపించలేదు. ప్రతిశుక్రవారం సాయంకాలం ఆ దేవాలయం దర్శించడానికి ఆవిడ ప్రత్యేకంగా సన్నాహంచేసేది. ప్రతి ఏడాదీ, అదేరోజున, పూజాద్రవ్యాలతోబాటు ఒక పరికిణీ, గౌనూకూడా పళ్లెంలో ఉండేవి. దేవుడికి నివేదన అయాక ఆ దుస్తులు ఏపిల్లకో తొడిగి చూచుకుంటుండడం ఆనువాయితీ అయింది. ఆరేటికాయేడు దుస్తుల కొలతలు పెరుగుతూవుండేవి. ఆసంవత్సరం ఎనిమిదేళ్లపిల్లకి సరిపడేటట్లుగా వున్నాయి పరికిణీ. గౌనూ. సగందూరం వచ్చాక అవి ఇంటిదగ్గిర మఱచిపోయినట్లు గుర్తించి, ఎన్నడూ లేని దీ అపశకునం ఏమి టన్న శంకతోటే వాటికోసం నౌకరుని యింటికి పంపి, తాను దేవాలయం చేరుకుంది—

ఆకతేల పొగమంచు, ఎదుట మనిషి కనుపించనంత దట్టంగా వుంది.

త్రోవ ఆవిడకి బాగా తెలిసిందే. పదిగజాలు నడిచింది. అక్కడ ఆగి రెండునిముషాలపాటు ఏమిటో యోచించింది. మళ్లీ వెనకకు వచ్చింది. గుడిమెట్లమీద కొంచెంసేపు తచ్చాడింది.

తిరిగి తొందరగా గుడిగుమ్మం చేరుకుంది.

విగ్రహవేదికకి అడ్డంగా అతను పడిఉన్నాడు—

శిరస్సుదగ్గిర కిందగా వెండిపళ్లెం అలాగే ఉంది—

దేముడుదగ్గిర దీపం కొండెక్కతోంది. గమ్మున వెళ్లి ఆవిడ వొత్తి కాస్త సవరించింది—భళ్లున గర్భగుడి ఒక్కసారి కాంతివంతం అయింది. ఆ వెలుగులో అతని నుదురుమీద నెత్తురు ఆవిడ చూచింది.

దగ్గిరగా వంగి, పరకాయించింది. చిన్న గాయం—మంటపం తగిలివుంటుంది. రక్తం అప్పుడే గడ్డకట్టుకుపోయింది.

ఏదో ఆవేదనపడుతూవున్నట్లు ఆవిడ ఒక్క క్షణం వేళ్లు కరుచుకుంది—నిట్టూర్చింది.

చివరికి పైటలోపల వున్న బాడీసులోపల ఉన్న బంగారుగొలుసు పైకి తీసింది.

పాలగచ్చుమీద రెండుతలల పాముకిమల్లే అస్పష్టమయిన దీపపువెలుగులో అది మిలమిలలాడింది.

ఆవిడ యింక తటపటాయించలేదు. మెల్లగా వెళ్లి అతని చిరుగులచొక్కా వొత్తిగించింది.

లోపల యింకో చిరుగులచొక్కా జేబులో ఆ గొలుసు పడేసింది. తలెత్తి ముందున్న విగ్రహానికి ఒక్కసారి చేతులుజోడించి మొక్కింది. మరుక్షణంలో, గర్భగుడిదాటి, గుమ్మందాటి, ఆవిడ బయట మెట్లు చేరుకుంది. నైవేద్యంపళ్లెం ఆవిడచేతులో ఉంది.

"అమ్మా!"—

ఆవిడ వులిక్కిపడింది. వెనక్కి చూస్తే—నౌఖరు!—

"వంటింట్లో లేవండి—యిల్లంతా వెతికాను. మీ మంచంమీద తలగడాకింద దొరికాయి—"అంటూ పరికిణీ, గౌనూ అందిచ్చాడు.

"మంచిపనేలే!— యింత ఆలస్యమా దానికోసం?—"

"యిల్లంతా వెతగడంతోటి—"

"యీలోగా వాడు, యిక్కడ వాటిక నొక్కేసినా అంతేనా?"

"వాడెవడండీ?—"

"దొంగ!—నామెళ్లో గొలుసు తెంపుకుపోయాడు!—"


"అమ్మో, అమ్మో, కొంపముంచేశాడు! ఏదండి, ఏడీ?—ఎటు వెళ్లాడు!—"

"చాల్లే, నడు త్వరగా!—యింకా నువ్వొచ్చి పట్టుకుంటావని, యిక్కడ కూర్చుంటా డనుకొన్నావా?—


యింతకీ రోజు బాగుంది—ప్రాణం దక్కింది—నీజాప్యం, నువ్వూను!—బాబూజీ వచ్చారా?—

"లేదండి యింకాను—అమ్మా, మీపాదాలు పట్టుకుంటాను—"

అని త్రోవపొడుగునా బావురుమంటూనే వచ్చాడు. వాడు అఫీసునౌఖరు.



కాశ్మీరులోని లిడ్డరు నదిలోయ



కాశ్మీరులో ఆరోగ్య నిలయముగా ప్రసిద్ధిపొందిన సోనామార్గ్

యీనాడవల్లో తనపని ఎక్కడ పూడిపోతుందో అని భయపడ్డాడు. ఆవిడ అనేకవిధాల అభయం యిచ్చినా, అతగాడి అదటుమాత్రం పూర్తిగా తగ్గిపోలేదు.

ఆవిడ యిల్లు చేరిన కొద్దిసేపటికే 'బాబూజీ' కూడా వచ్చాడు. ఉన్నిసూటు, ఓవరుకోటు, ఫెల్టుహేటూ—అతి అట్టహాసంగా వున్న ఆ విష్టరు తంగళాలో వెనకటి వేలూపోలికలు ఎంతో వెతికితేనే కాని కనిపించనివిగా వున్నాయి.

"లీలా !...లీలా—"

లీల వచ్చి నిలిచింది. అతి మౌనంగా చూసింది.

"అవును, నేను రాలేదనేనా ? వద్దామనే అనుకున్నాను. ఆ ఆఫీసరూ ఈవేళే రావాలా ?...ఏం చెయ్యమన్నావు చెప్పు !—" అని ఆవిడకళ్లకి అతను సంజాయిషీ చెప్పుకున్నాడు.

ఆవిడ ఇంకా మౌనంగానే నిలిచింది...

"నాఖరు రాలేదూ ?...గుడికి వెళ్లి వచ్చావు కదా ?—ఏదీ ప్రసాదం ?" ..అంటూనే తంగళ్ళ వుడుపులు మార్చుకున్నాడు.

ప్రతిశుక్రవారం గుడినుంచి తెచ్చిన ప్రసాదం ముందుగా అతనికి పెట్టడం అనువాయితీ. అతను అరగిస్తూఉంటే ఆవిడ ప్రక్కని కూర్చుని చిన్నా, పెద్దా అనేకవిషయాలు చెప్పుకుంటూ వుండేవారు.

నాలుగైదువారాలుగా వారి సంభాషణలు సంతానంగురించే ఎక్కువగా జరుగుతూవచ్చాయి.

ఒకసారి మగశిశువు కలిగి మర్నాడే చనిపోవడం, తరువాత రెండుసార్లు గర్భవిచ్ఛిత్తీ, క్రమంగా యింక తమకి సంతానం కలగదనే చింతా—తలపోసుకొని విచారించేవారు.

ఎన్నోవ్రతాలూ, పూజలూ చేశారు. చివరికి ఆవిడఆశలన్నీ గ్రామంలో వదలివచ్చిన తన చంటిగ్రుడ్డుమీదికే పారడం మొదలెట్టాయి. అతను మొదట్లో అయిష్టత ప్రకటించినా, అహోరాత్రాలూ ఆవిడ అదే స్మరణగా వుంటూవుండటం, తేలేపలేక పోవడం, అతనుకూడా చివరికి సరే ననక తప్పింది కాదు.

అతను సరేననడం, ఆవిడ పిల్ల వచ్చినట్లుగానే సంతోషించింది. గ్రామంలో అతని బంధువులకి వుత్తరం వ్రాయించింది. ఏరోజుకారోజే జవాబు వస్తుందని ఎదురుచూసింది. బజారుకి వెళ్లినప్పుడల్లా ఏవో బొమ్మలూ, లక్కపిడతలూ కొనిపోసింది. ఆ ఏడు గౌనూ, పరికిణీ వున్నివి తయారుచేసింది. "చలికాలమూ, అదే తొడుక్కుంటుంది ఈసారి" అని అతి నిర్ధారణగా ఆవిడ అన్నమాటలకి, అతనికి ఆశ్చర్యం, విచారం ఒక్కసారిగానే కలిగాయి. ఏమయినా - ఆశుక్రవారం సాయంకాలం, తనుకూడా తప్పకుండా గుడికి వస్తానని వాగ్దానం చేశాడు.

కాని తలవనితలంపుగా పైఅధికారి తనిఖీకి రావడంచేత రాలేకపోయాడు.

ఆవిడను వెళ్లిరావలసినదని కబురుపెట్టాడు. కబురట్టుకెళ్లిన నౌఖరునే, ఆవిడతోకూడా వుండవలసిందని నియోగించాడు. ప్రసాదం యింటికి పట్టుకొచ్చేటప్పటికైనా అక్కడ వుండాలని అధికారి వెళ్లిపోగానే ఆఫీసునుంచి బయలుదేరాడు. బస్సులో చోటు సాధించి యిల్లు చేరుకునేసరికి యింకా కొంత ఆలస్యం అవకతప్పిందికాదు. ఉడుపులు మార్చి, వుడుకునీళ్లతో కాళ్లూ చేతులూ కడుక్కుని వచ్చే సరికికూడా ఆవిడ అల్లాగే అతిమౌనంగా నిలిచిఉండడం అతనికి ఆశ్చర్యం వేసింది. అప్పుడు పరకాయించిచూశాడు—ఆవిడ చెక్కిళ్ల మీద కన్నీళ్లు !—

"లీలా, ఏమిటది ? ఏమయింది ?—"

ఆవిడ వెక్కివెక్కి ఏడుస్తూంది!—

పదేపదే అతను అదే ప్రశ్న వేశాడు. ఎన్నో విధాల బుజ్జగించాడు. చివరికి—

"ఇవేళ పూజ జరిగిందా ?" అని మొదటికి వచ్చాడు.

"నా పాపానికి యింక పూజలేదు".

"ఏమిటి లీలా నీమాటలు!—ఒక్కసారిగా ఈదుఃఖానికి కారణం కాస్త చెప్పకూడదా నాతో? చూడు, లీలా!"

"నాచిన్న—నాచిన్న—"

"ఏమయింది?—ఏమన్నా వుత్తరం వచ్చిందా? చెప్పవేం మరీ—"

"వుత్తరం లేదు. నాకు తెలుసు. ఇంక నా చిన్న రాదు—"

"అదేమిటి లీలా, ఉత్తరము లేందే—అసలు సంగతి తెలియందే—"

"తెలిసింది, ఈవేళతో అంతా తెలిసింది. నాపాపానికింక పూజ లేదు. నాచిన్న యింక రాదు—"

అని ఆలోచన ఆగానూ వరికిణీ, నైవేద్యం వేళకి అందకుండా యింటిదగ్గిర వుండిపోయిన వృత్తాంతం చెప్పింది. అన్ని ఏళ్లనుంచీ లేని యీ అపశకునం అశుభం సూచిస్తోందని తన అనుమానంగా నివేదించింది.

ఆకథ అంతా విని అతను ఫక్కున నవ్వాడు! "చంపేశావు! ఈమాత్రానికేనా" అంటూ, ఆవిడ వేలతనానికి ఆశ్చర్యపోయాడు.

"ఈమాత్రమే కాదు—యింకో అపశకునం—చిన్నకని చేయించిన ఆ చిన్న గొలుసు—"

"ఆ, ఆ, ఆగొలుసు—?"

"పోయింది!—అదీ యీ వేళే—ఆగుడిలోనే—"

అని నాఖరుతో చెప్పినదే దొంగకథ అతనికి కూడా చెప్పింది.

"నయమే యింకా!—ప్రాణం దక్కింది, అంతే చాలు. నే నిప్పుడే వెళ్లి పోలీసులకి రిపోర్టు యిస్తాను—"

"యీ చలిలో ఇప్పుడేమిటి? ప్రొద్దున్న చూచుకోవచ్చు—"

"కాదు, కాదు, వెంటనే రిపోర్టుచెయ్యాలి—ఇప్పుడే వచ్చేస్తాను—" అంటూ అతను లేచాడు.

"ప్రసాదం"—

"వచ్చేస్తానుగా—?"

"పుచ్చుకుని వెళ్లండి, యిప్పుడే తెస్తాను—" అని ఆవిడ బలవంతం చేసింది. సరేనని అతను మళ్లీ చతికిలపడ్డాడు. వంటయింట్లో పెట్టిన వెండిపళ్లెం ఆపళంగానే ఆవిడ తీసుకొచ్చింది. హడావిడిగా అతను మాట్లాడుతూనే తింటున్నాడు!

"ఎంతపని జరిగింది!—అయినా అదో పాడు గుడి! పగలే మనుష్యు లుండరు!—ఒక్కత్తెవు అక్కడ—లీలా?—"అతను కవ్వమన్నాడు!

పళ్లెంలో పళ్లమధ్య పామో, తేలో వేళ్లకి తగిలినట్లు, భయంతో గభాల్న లేచిపోయాడు. భళ్లున పళ్లెం నేలమీద మ్రోగింది.

"ఏమిటి, ఏమిటి?" అంటూ ఆవిడ దగ్గిరకు పరుగెత్తింది. పడిన పళ్లెం తీసి బల్లమీద పెట్టింది. చెదిరిపోయిన పళ్లూ, ప్రసాదం ఏరి అందులో సర్దింది. సగం కొరికిన అరటిపండు అతని చేతులో వణుకుతోంది.

"అదేమిటి—అల్లా వులిక్కిపడ్డారు?—"

"చూడు ఆపళ్లెంలో—"

"పళ్లెంలోనా—?" అని ఆవిడ పళ్లెంలో వెతికి చూసింది.

"ఏమిటి మీ రనేది?—యివేళ అన్నీ యిల్లాగే, అపశకునాలు—"

"యింకోటి యిది—"

"ఏదీ—?"

"నెత్తురు!"

"నెత్తురా! ఎక్కడ—"

"అదేం. పళ్లెంలో!—యిదిగో, యీ అరటిపండంతా అదే—"

"కుంకం ఏమో! తడిసి అలాగ—"

"కాదు, కాదు—నెత్తురే!—యీ నైవేద్యం అంతా నెత్తురు!—"

ఆవిడ చూసింది. నిజమే, నెత్తురు!

ఒక్కక్షణం ఆవిడ కంగారుపడింది. గుడిలో పూరపాళంమీద పడివున్న శరీరాన్నా, ఆ నుదుట గాయం

గమ్మున ఆవిడమనస్సంతా ఆవరించాయి—నరనరాలా సలుపెట్టాయి—ఏవేవో పూర్వస్మృతులలో కొట్టుకు పోతూ, ఆవిడ అలాగే స్మృతివిహీనలాగ నిలబడి పోయింది!—

"లీలా, యిదంతా ఏమిటో—నాకు కలలాగ వుంది—యీ పీడకల—నెత్తురు—సైకేద్యం—" చటుక్కున ఆవిడ మేలుకుంది. పెద్దగా ఒక్కసారి నిట్టూర్చింది. ఆ పూర్వ పుమస్సంధ్యలో ఒకశకం ఏదో మళ్లీ పోయినట్లు, ఆవిడకళ్లు రెపరెపలాడాయి. ముఖం జేవురించింది.

"అవును-యిప్పుడు గుర్తు వస్తోంది. గొలుసు లాక్కోడంలో ఆ దొంగ దేవుడుమండపంమీద తూలి పడ్డాడు. తల రాతిమీద కొట్టుకుంది. ఆ నెత్తురు చిందులు కొన్ని కిందనే వున్న సైకేద్యంపళ్లెంలో పడివుంటాయి—"అని ఆవిడ చాలా ధీమాతో సంజా యిషీ చెప్పింది.

శంకర్ కొంతసేపు తరిచితరిచి ఏదో ప్రశ్న లడిగాడు. ఆఖరికి ఆ గొడవంతా ఒకమాదిరిగా అర గాహనచేసుకున్నట్లు సంతృప్తిపడ్డాక—

"సరే, నేను వెళ్లి రిపోర్టు ఇచ్చివస్తాను—"అని లేచాడు—"

"యింక రిపోర్టుఇచ్చి ఏమిలాభం, అవిధి తప్ప?—అయినా, యిప్పు డింతరాత్రివేళ వెళ్లేదేమిటి, ప్రొద్దున్న చూసుకోవచ్చును—"

"అదేమిటి లీలా—యింతగొడవ జరిగాక రిపో ర్టివ్వకుండానా?— ఎంతసేపు, యిక్కడేగా తాణా?—" అంటూ శంకర్ బయటకు బయలు దేరాడు.

* * *

ఆరోజు ఆదివారం. ఉదయం ఎనిమిదయినా, రాజధాని ఢిల్లీ యింకా నిద్రలేవలేదు. పొగమంచు మాటున గడ్డకట్టివున్న తరతరాల గాథలతో, బాధ లతో, కలలు దులుపుకుంటూ యమున అప్పుడప్పుడే బద్ధకంగా లేచి తూలుతూ పోతోంది. ఆమె కళ్లలో అక్కడక్కడ ఎర్రజీర లగుపిస్తున్నాయి. ఆవేళటి దినపత్రికమడతలలో యుద్ధాలూ, మతకలహాలతో బాటు ఎన్నో చిల్లరసమాచారాలుకూడా యిరు కుక్కని శంకర్ యింటివరండామూల పడివున్నాయి.

శంకర్ అప్పుడే లేచాడు. కాఫీతోబాటే పత్రికకూడా తెచ్చి బల్లమీద పెట్టాడు నౌకరు. కాఫీ త్రాగుతూ, పత్రిక మాస్తున్న శంకర్ అమాం తంగా లేచి నిలుచున్నాడు.

"లీలా—!...లీలా—!"

"వస్తున్నా—" అని ఆవిడ వచ్చేలోపుగానే, అత నా పత్రికతో సహా అల్లాగే వంటింట్లోకి పరుగెత్తాడు.

"చూశావా, పేపరులో పడింది—"

"ఏమిటి?—మీ పేరా?"

"ఉహ్, ఎగతాళికాదు, నిజం! మన గొలుసు —నీ నానుపేటలు—"

"ఏ నానుపేటలండీ? చెప్పు కేమిటో సరిగ్గా—"

"భలే బాగుంది! అప్పుడే మరిచిపోయావూ? గుడిలో—ఆ దొంగాడు తీసుకుపోయిన గొలుసు—"

"ఓ, అదా!—అప్పటికిప్పుడు ఆకథంతా పేప రులో వేయించారా?"

"ఆ కథ కాదు, దానితర్వాతి గాథ! దొంగని పట్టుకున్నారు! గొలుసు దొరికింది!"

"ఎక్కడ?—ఏం చేశా రా—దొం—గని?"

"ఏం చెయ్యనక్కరలేకుండానే, వాడి ఖర్మాన వాడు పోయాడు!"

"పారిపోయాడా!—"

"అబ్బె, అది కాదు! విను, చదువుతాను—

'ఢిల్లీ, డిసెంబరు ౨౧—

నిన్న సాయంకాలం రెడ్‌ఫోర్టుదగ్గిర మైదా నంలో కమ్యూనిస్టులు ఏర్పాటుచేసిన సభ ఒకటి పోలీసులు చెదరగొట్టాల్సివచ్చింది. ఆ సందర్భంలోనే అయిదుగురు గూండాలనికూడా అరెస్టుచేశారు.

అందులో ఒక ఆసామీని సోదాచెయ్యగా, లోగడ తిమారుపూరుశివాలయంలో చోరీఅయిన నగలు కొన్ని దొరికాయి. క్షయరోగంతో తీసుకుంటున్న అతను— పేరేమిటో ఊరేమిటో—ఎంత ప్రయత్నించినా, చెప్పడానికి నిరాకరించాడు. రాత్రి డాక్టరు వచ్చి చూసిన కొద్దిసేపటికే అతను సబుజైలులో మరణించాడు.''—

అవిడకళ్లు చీకట్లు కమ్మాయి. తల తిరిగింది. పేపరునించి తల పైకెత్తి, అతను ఒక్కవుదుటున ఆమె ప్రక్కని ఆదుకున్నాడు.

"అదేమిటి—లీలా!"

క్షణం తప్పితే, కింద, మండుతున్న కుంపటి— ప్రమాదం తప్పి, అతని చేతులలోకి వొరిగింది. పైన పడిన కన్నీటిచుక్కలవేమో, నిప్పులు కస్సుమన్నాయి. 'అదేమిటు'న్న అతని ప్రశ్నమాత్రం, అలాగే సమాధానం లేకుండా మాటుమణిగిపోయింది. యదను దాచుకున్న కథలకి యింకోగాథ జతపడింది.

పికవంది

శ్రీ దిగుమర్తి సీతారామస్వామి

హృదయమే లేని భువికొర కేగుదెంచి
నది వసంతము—దివిజనందనమునుండి
సీమసీమల బలిసి విచ్చినవి పూలు
కాని తేటికి కరవయ్యె తేనెచినుకు.

ప్రథమ యౌవన దృఢపరిష్వంగమందు
తావియే సర్వమయి జగ మావరింప
కైపుగొని చూచు నరమోడ్పు కనులయందు
ప్రతిఫలించి వసంతమ్ము భవ్యమయ్యె.

అతడు ఋతురాజు కౌగిలి కడుగకుండ
వచ్చి వాలని లత లేదు మచ్చు కనుచు
పరభృతంబు వాగనీ—సరస జాతి
జాతి పూదరి రాణివాసమున గలదె ?

కృష్ణదేవరాయలు

౫. కృష్ణదేవరాయలు - మహమ్మదీయులు

(గత సంచిక తరువాయి)

●

శ్రీ నేలటూరి వెంకటరమణయ్య

అనుబంధము ౧

ఇమ్మడి మహమూదుశాహు కడపటివాడు

రాయవాచకమునందు ఉమ్మత్తూరు శివసముద్రములను జయించిన పిమ్మట కృష్ణదేవరాయలు శ్రీరంగపట్టణమునకు పోయి యచటినుండి ఇక్కేరి ఆరంగాలకును దరువాత విజాపురపరదు స్థలాలమీదుగ గోలకొండ పరదు స్థలాలకును జేరగా అచ్చట మూడు తెగల రౌతులున్న ఎదిరించి యేరు దాటి వచ్చి మోర్చా వేసి పాళెము దిగిరనియు, వారిని రాయలు భీకర సంగరమున నోడించి విజయము గాంచెననియు చెప్పియున్నది[1]. కృష్ణరాయవిజయమున రాయవాచకమునందు పేర్కొనబడిన మూడు తెగల రౌతు లెవ్వరై నదియు వివరింపబడియున్నది.

"అ-హా గణుతింపశక్యమె!
యవార్ణిశముల్ భయమందియుండి ర
య్యాశ్రగరహాముదానగరియందు
విజాపురి గోలకొండలోన్."

"లక్షగుఱ్ఱంబులోడను లక్షణంబు
మెఱయదీరాన మూడింట్ల తురకదొరలు
కృష్ణవేణికి నీవల కృష్ణరాయ
నృపునకెదురుగ జనుదెంచి నిలిచిరపుడు."

కావున కృష్ణరాయలు గోలకొండ పరదుస్థలములయందు యుద్ధము చేసినది అహమదానగర గోలకొండ విజాపుర సైన్యములతో నని తెలియుచున్నది.

ఈ యుద్ధము జరిగిన కాలమెప్పుడో మొదట నిశ్చయింపవలసి యున్నది. రాయవాచకమునను కృష్ణరాయవిజయమునను కృష్ణరాయ లుమ్మత్తూరు శివసముద్రములను సాధించిన పిమ్మట శ్రీరంగపట్టణమునకును దరువాత ఇక్కేరియారంగలకును నచటినుండి కృష్ణా తుంగభద్రల యంతర్వేదిలోని ముదుగల్లు రాయచూరు దుర్గములమీదుగ గోలకొండ పరదు స్థలములకును పోయి చేరె ననియున్నది. కృష్ణరాయవిజయమున గూడ నిట్లే కలదు. ఉమ్మత్తూరు జైత్రయాత్ర క్రీ. శ. ౧౫౧౨-౧౩ లో ముగిసెనని ఇంతకుముందు చెప్పబడియున్నది. దీనినిబట్టి కృష్ణరాయలు కృష్ణాతీరమున గోలకొండ పరదు స్థలములందు మూడు తెగల తురక రౌతులతో యుద్ధము చేసినది క్రీ. శ. ౧౫౧౨-౧౩ నకు తరువాత నని తోచగలదు; కాని ఈ యూహ సరియైనది కాదు. ఏలన, రాయవాచక రచయిత కాని యతని గ్రంథమును పద్యకావ్యముగ వ్రాసిన కుమార ధూర్జటి కాని తమ గ్రంథములయందు పేర్కొనిన రాయల విజయములన్నిటిని పూర్వాపర కాలక్రమమును దప్పనీయక వర్ణించిరని విశ్వసించుటకు వలనుపడదు. వారు కావ్యసరణి ననుసరించి కృష్ణరాయల దిగ్విజయ వర్ణనను బశ్చిమదిశయం దారంభించి ప్రదక్షిణముగ నుత్తర పూర్వ దక్షిణవిజయములను వర్ణించి యుండ వచ్చును. ఈ యనుమానము కేవలము నిరాధారము గాదు. ఉమ్మత్తూరు దండయాత్ర నడచుచుండిన సమయముననే కృష్ణరాయలు 'దక్కనురాజు'తో ననగా బహమనీ సుల్తానుతో పోరుచుండెనని సమకాలిక పోర్చుగీసు రచయితల వ్రాతలవలన దెలియుచున్నది. క్రీ. శ. ౧౫౧౦ జనవరి నెలలో కృష్ణరాయలు దక్కను

---

1. *Sources of Vijayanagara History.* pp 118-119.

రాజుతో పోరుచుండెనని యల్బూకెర్కు కామెంటరీసులో వ్రాసియున్నది[2]. క్రీ. శ. ౧౫౧౦ జనవరి తే ౨౮ ది నాటి కృష్ణదేవరాయల హంపీశాసనమున నతఁడు సుల్తానును బరాభూతుని గావించిన ట్లున్నది[3]. ఇదిగాక, క్రీ. శ. ౧౫౬౬లో రచింపబడిన డి బ్యారాసనువతని 'డికాడా' యను చరిత్రగ్రంథమున, సవాయి యనగా విజాపురసంస్థానస్థాపకుఁడగు యూసుపు ఆదిల్ ఖానుఁడు మృతినందిన వెంటనే నరిసింగ (విజయనగర) రాజ్యాధిపతి విజాపురముపై దండు వెడలెననియు, నాల్బూకెర్కు అదియె యదనని యెంచిగి గోవాపట్టణముపై నెత్తిపోయి దానిని జయించెననియు వ్రాసియున్నాఁడు. డి బ్యారాసు కృష్ణరాయల కాలమున విజయనగరమునకు వచ్చియుండిన పోర్చుగీసులు వ్రాసి పంపిన వృత్తాంతముల నాధారపఱచుకొని చరిత్రను రచియించియుండుటవలన నందు వివరింపబడిన విజయనగర దక్కను రాజ్యములకు సంబంధించిన చరిత్రాంశములన్నియు విశ్వాసపాత్రములని పరిశోధకపండితుల యభిప్రాయము. కావున కృష్ణరాయలు రాజ్యాభిషిక్తుఁడైన వెంటనే బహమనీసుల్తానుతో నొక ప్రక్కను ఉమ్మత్తూరి ప్రభువులతో మఱియొక ప్రక్కను నేకకాలమున యుద్ధము సేయుచుండెనని తెల్లమగుచున్నది. మఱియు క్రీ. శ. ౧౫౦౯ - ౧౦ వ సంవత్సరమునకు దరువాత బహమనీసామంతులు—వారియందును ముఖ్యముగ నేదులఖాన నిజాముననులక కుతుపనములకలు—మత్సరగ్రస్తులై పరస్పరము పోట్లాడుచుండిరి. లభించిన మహమ్మదీయచరిత్రల నన్నిటిని బరిశీలించి చూడగా క్రీ. శ. ౧౫౦౯ - ౧౦, ౧౫౧౪ వ సంవత్సరముల మధ్య మూడింఢ్ల తురకలును నేకమై విజయనగరముతో యుద్ధముచేసినట్లు కానరాదు. కావున రాయవాచకమున జెప్పినట్లు గోలకొండ సరదు స్థలములలో గృష్ణరాయలు మూడింఢ్ల తురకలతో పోరాడియుండిన, నది క్రీ. శ. ౧౫౦౯ - ౧౦ న బహమనీ సుల్తానుతో జేసిన యుద్ధమునందై యుండవలయును.

అగుచేని హంపీశాసనమున జెప్పబడిన సుల్తానుపరాజయమీ యుద్ధమునందే సంఘటిల్లెనని యనుకొనవచ్చును. రాయవాచకము బడి యీ యుద్ధవృత్తాంతమును సంగ్రహముగ నిట్లు చెప్పవచ్చును.

"గోలకొండవారి సరదుస్థలాలకై నడవంగా అక్కడ మూడుతెగల రౌతులున్ను, మోర్చావేసి పాళ్యము దిగినారు. వేగర్లువచ్చి రాయలదేవునితో తురకలు లక్షసుత్తాలతోడట్టున్ను వెయ్యియేనుగులతోడట్టున్ను కృష్ణదాటివచ్చి పాళ్యం దిగినారని విన్నపంసేయంగా రాయలవారు విని 'తురకలు కృష్ణవేణి దాంటివచ్చి డేరిజావేసి దిగేట్లా?' అని ఆగ్రహించుకొని అమరనాయకంవారలలో పెంమ్మసాని రామలింగమనాయణ్ణి భిలిచి, 'తురకలు కృష్ణవేణి దాంటి వచ్చి డేరిజావేసి పాళ్యం దిగినారట. ఇందులకు యేరీతున నడవవలెనో?' అని అడిగినందులకు, 'తురకల కార్యమనంగా యెంతమాత్రం? దేవరవారి ప్రతాపంవల్ల డేరిజాతాళ్లు తెగకోసేను. అప్పుడు భేరితాడనంచేసి నడిస్తేను తురకలు మూడుతెగలున్నూ విరిగి యథాయథలై తమతమ స్థలాదులకు పారేట్టట్టు చేసేను' అని విన్నపం శాయగా రాయలవారు చాల సంతోషపడి రామలింగమనాయనికి పట్టీలు యిచ్చి అంపగా రామలింగమనాయఁడు వెలువడిని వచ్చెను.

"తురకలు ఈ వార్తలువిని డేరిజావద్ద జీరా సంజ్ఞోగంత్తో విద్చుకత్తులరౌతులు అరవై వేలున్ను వారిని చుట్టుకనిండు సంజ్ఞోకం సుత్తాలు పదివేలున్ను వార్లను అనుసరించ్చుక యుండే మదహత్తులు, వెయ్యింటికిన్ని యీ రీతిని డేరిజావద్ద ఉంచి మూడుతెగల తురకలున్ను తమతమ పాళ్యములో ఆయత్తపాటుతో జాగ్రత గలిగియుండిరి.

"రామలింగమనాయఁడు తురకల పాళ్యంవారి సమీపానకుపోయి యేనుగుల బారుమీద తొక్కనడచి మదహత్తీల తొండముల ఖండములుగా నరికి మావటీలను యీటెలతో కుమ్మితోసిరి. సుత్తాల పక్కెరలెత్తి కురుచయీటెలతోనున్ను పిడియీటెలతోనున్ను పందిబల్లెములతోనున్ను గుచ్చితోసేదిన్ని దోసకాయల చందాన పేటూరుతునకలుగా నరికేదిన్ని

2. *Commentaries of Affonso Dalbuquerque. II. PP. 74-77.*

3. *El. I. P. 363*

యీరీతి నొప్పించగా గుఱ్ఱాలు వెనుకముందై పార సాగెను. అప్పుడు నాలుగు వేల గుఱ్ఱం చాపకట్టగా పడగా అటువెనుక విచ్చుకత్తుల రవుతులమీద జగడ మియ్యంగా పరిచావులుగా ఆరువేలకు నాలుగు వేల రవుతులు పడిరి. అంతట రామలింగమనాయడు డేరీజు తాళ్లు తెగగోయించగా డెరిజా నేలకూలెను. ఆ క్షణాన్నె కృష్ణరాయలవారు, భేరితాడనం సేయించి మదహస్తి నెక్కుకొని ఉభయఛత్రములతోనున్ను, మకరటెక్కెములతో నూట యిరువై ఘట్టముల యేనుగ లున్ను అరవై వేల గుఱ్ఱాలున్ను అయిదులక్షల పాయ దళమున్ను పాట్లముగ నడచిరి.

“ఆక్షణాన్నె కృష్ణవేణి వుభయతీరాలున్ను ప్రవాహంనిండి రా సాగెను. జగడముఖానకు తురకల యేనుగల మొనచేస్తె గ్రీష్మకాలం యెండచేతను డస్సిన యేనుగులు గనక దగదప్పిపుట్టి చల్లగాలిచేత కొలుజారి కృష్ణవేణిలోబోయి పడెను. గుఱ్ఱాల రౌతులు “యేరు నీళ్లువచ్చెను. యికతలనుండి కార్యంకాదని గుఱ్ఱాల వారు యేనుగలవెంబడిని తిరిగిరి. మొదటి దొరలు ముగ్గురున్ను ‘దైవికంగా పెడతలపోటుగా ప్రవాహం వచ్చెగనక యిక్కడను పాళ్యందిగి జగడమిచ్చేమంటే రస్తుసామగ్రీలును అమరదు. అన్నింటికిన్ని యేఱుదాటి ఆవలనిల్చి సరిపోయినట్లు నడిపించుకొందాము.’ అని సీమకు తిరుగగానె యేరునిండారుగా వచ్చెను. రాయల వారున్ను వెంబడించినడచి జగడంసేయగా అందరున్ను విరిగి పారిపోయిరి. మూడు తెగల తురకలున్ను హత శేషులైన వారి గూర్చుక విజయాపురం గోలకొండ, అహముదానగరం చేరబోయినారు.

“కృష్ణరాయలవారు కృష్ణవేణి వొడ్డుకువచ్చి మూడు తెగల తురకల యేనుగ గుఱ్ఱాలున్ను నగర కట్టిపెట్టమనిన్ని గుడారులు, నిశానులు, నగారా మొదలైనది మొదట జగడానదొరికిందిగనక అదంతా నగరకట్టమని అప్పాజీ మొదలైన నియోగులతోనున్ను చెప్పి ముక్కుతిమ్మన్న మొదలైన కవీశ్వరుల దిక్కు జూచి ‘నేటిజయం యేరీతు?’ అని అడిగినందులకు ముక్కు తిమ్మన్న చెప్పిన పద్యం :—

నరసింహకృష్ణరాయా
దురమున నీ పేరు చేటు దురకల్రదుం చేక
కరిరాజవరదుడని యీ
కరిఘటములు నిన్నుజూచి గ్రక్కునదిరిగెన్”[4].

రాయవాచకమునందలి ఈ యుద్ధవర్ణననుగూర్చి విశేషించి వివరించి చెప్పవలసిన యంశము లెవ్వియు లేవు; కాని యించుకంత పరిశీలింపదగినవి రెండు మూడు విషయములు గలవు.

(౧) డెరిజా వేయుట:—ఈ యుద్ధవర్ణనయందు ‘డెరిజా’ కత్యంత ప్రాముఖ్యతగలదు-ఉ. ‘తురకలు కృష్ణవేణిదాంటివచ్చి డెరిజా వేసిదిగెట్టా?’; ‘డెరిజా తాళ్లు తెగకోసెను’; ‘డెరిజావద్ద జీరాసంకోకంతో’; ఒకచోట ‘డేరీజాతాళ్లు’ అనికలదు. ఈ యుద్ధవర్ణన యందే కృష్ణరాయ విజయమున ‘దేరిజత్రాళ్లు’ ‘దేరి జపుత్రాళ్లు’ అని యున్నది. కావున డెరిజా, డేరీజా, దేరిజ యనునవి సమానార్థకపదములనుట స్పష్టము. అవి యన్నియు హిందీభాషలోని ‘డేరా’ యను పదమునకు భ్రష్టరూపములు. వీనికన్నిటికిని ‘గుడారము’ లేక ‘పటగృహము’ అని యర్థము.

డెరిజా యర్థము విశదమైనది. ఇక డెరిజాను వేయుటయందు కల విశేష మేమో కనుగొనవలసి యున్నది. కాని డెరిజా యెవ్వరిదో మొదట తెలిసి కొనినగాని దాని నెత్తుటయందుగల విశేషము దెల్లముగా జాలదు. కృష్ణానదిని దాటివచ్చి పాళ్యముదిగి డెరిజా వేసినవారు మూడు తెగల (అనగా అహమదానగర విజాపురగోలకొండ) తురక రౌతులగుటచేత, డెరిజా వారిదనికాని వారి మొదటి దొరలదనికాని యభిప్రాయము సహజముగ గలుగ వచ్చును; కాని ఇది సరికాదు. ఏలన ‘డెరిజావద్ద జీరా సంకోకంతో విచ్చుకత్తులరౌతులు అరవై వేలున్ను

4. ఫోర్సెస్ ఆఫ్ విజయనగర హిస్టరీ, పుటలు ౧౧౯-౧౨౨. రాయవాచక ముద్రిత ప్రతులలో నీ కంద పద్య ద్వితీయపాదమున ‘నీ పేరు పేరం’ అనియు తృతీయ పాదము ‘కరిరాజవరదుడవనీ’ అనియు ముద్రితమై యున్నవి.

వారిని చుట్టుకనిందు సంఖోకం గుఱ్ఱాలు పదివేలున్నూ వార్లనుఅనుసరించుకయుండె మదహత్తులు వెయ్యింటికిని యీరీతిని డేరిజా వద్దవుంచి మూడు తెగల తురకలున్నూ తమతమపాళ్యములో ఆయత్తపాటుతో జాగ్రత కలిగి యుండగా' నను వాక్యము వలన డేరిజా మూడు తెగల తురకలకుగాని వారి నాయకులకుగాని చెందినది కాద నియు, వారికి 'వేలు వేలు' పాళ్యములుండెననియు స్పష్టమగుచున్నది. అట్లయిన డేరిజా మఱియెవ్వతిది ? అను ప్రశ్న కలుగుచున్నది. రాయవాచకమునం దెచ్చ టను చేర్కొనబడక పోయినను, ఆ డేరిజా పైమూడు తెగల తురకరాతులకును యేలికయైన బహమనీ సుల్తాను దనుటకు సంశయింపబని లేదు. ఇమ్మడిమహమూదుశాహు అందలు బహమనీసామంతులచే నింకను దమయధిపతిగ నంగీకరింపబడుచుండెను. విజయనగరముపై నతడు చేయుచుండిన జిహాదులన్నిటియందును పైవచింపబడిన మూడు తెగలతురకలును పాల్గొనుచు వచ్చిరి. కావున నీయుద్ధముగూడ సర్వసామంతులతో నెత్తివచ్చిన సుల్తాను నాధిపత్యముక్రిందనే నడచెను.

మహమ్మదీయరాజులు స్వయముగ దండయాత్ర లను నడపునప్పుడు తమ'తోగటిసుఁజారము'ను స్కంధా వారమధ్యమున నెత్తించికొనెడివారు; ఆగుడారున కిరు వంకలను సేనాధిపతులును సుత్రాలును నాయకులును విడియువారు. ఇది సుప్రసిద్ధము. అప్పటి కర్ణాట సామ్రాజ్యజనుల కిది సుపరిచయమే. ఆంధ్రకవు లీ యంశమును దమ గ్రంథములందు బొందుపఱచి యున్నారు. ఒక యుదాహరణము.

"దలమెుప్పన్ మరుపాదుశాహి
జగముల్ సాధింప దండెత్తి ము
త్తిల బ్రహ్మాండపు గొంపుదక్క
బురుసా డేరీజ నెత్తింప నం
దలి యస్తాచల పూర్వశైల
శిఖర స్తంభాగ్ర భాగంబులన్
గల మాణిక్యపు బిళ్లలో యన
దగన్ గంజాప్త చంద్రాకృతుల్"[౮].

———

౮. భాను. పరి. ౪ : ౫౪.

ఈ పద్ధతి మొదట ఢిల్లీసుల్తానుల కాలమున వాడుకయందుండినది; వారి ననుసరించి బహమనీసుల్తా నులు గూడ నీ పద్ధతి నవలంబించినట్లు ఫెరిష్తాచరిత్ర వలన దెలియుచున్నది. డేరిజా వేయుటయందు విశేష మేమనగా, శత్రులపై జయమో వారిచే బరాజయమో గలుగునంతవఱకు సుల్తా నచ్చట స్థిరుడై నిలచునని సూచన. డేరిజాను శత్రువుల చేబడనీయక గాపాడుచు జయము జేకూర్చుట దండనాయక సామంతాదుల విధి. డేరిజా కూలిన సుల్తాను పరాజయమందె నని యర్థము. విజయనగరమున నిది వెలిగుడారమను పేర బ్రసిద్ధి కెక్కినది.

ఇచట పరిశీలనార్హమైన విషయ మింకొకటి కలదు. ఇది కృష్ణరాయలకు మొదటి జగడమట. అనగా రాయ లంతకు పూర్వ మే శత్రువుతోడను జగడించ లేదని యర్థము. అట్లయిన కృష్ణరాయ లుమ్మత్తూరి దండయాత్రకు ముందే మూడు తెగల తురకలతో గోల కొండ సరదుస్థలమున యుద్ధము జేసె నని తేలుచున్నది. అనగా క్రీ. శ. ౧౫౦౯ - ౧౦ సం॥ న కృష్ణరాయల రాజ్యాభిషేకమైన క్రొత్తలో నీయుద్ధము జరిగిన ట్లున్నది.

మహమ్మదీయచరిత్రలయం దీ యుద్ధప్రస్తా పము గానరాదు; కాని బహమనీసుల్తాను రెండవ మహమూదొక పర్యాయము విజయనగరముపై జిహాదు వెడలి యుద్ధమున బలముగ గాయపడి పరాజితుడై పాఱిపోయినని కొందఱు మహమ్మదీయ చరిత్రకారులు వ్రాసియున్నారు. ఈ జిహాదువృత్తాంతము తారీఖి మహమ్మదు కుతుబుశాహీయను చరిత్రయం దిట్లు వర్ణిం పబడియున్నది.

"మరుసటియేడు, హి. ౯౧౧ (క్రీ. శ. ౧౫౦౬) వ సం॥ న, బీదరు సంధిప్రకారము సుల్తాను ఉమ్రాల నందఱిని వారివారిదళములతో గూడ రాజధానికి రాను త్తరవు లంపెను. ఆ ప్రకార ముమ్రాలందఱును వచ్చి యతని గూడుకొనినంతట మరల విజయనగరము వైపున నడ చెను. సుల్తానుదండు దెల్లివచ్చి చేరగనే హిందూదళ ములు వారి కడ్డపడినవి; ఘోరసంగ్రామము జరిగినది. శత్రుసైన్య వామపక్షమును మల్లిక్ కుత్బుల్ ముల్కు

భగ్నము గావించెను; కాని మధ్యభాగము చెదిరి పోరాడుచుండిన మహమూదుశాహువిజిగి గుఱ్ఱముమీది నుండి క్రిందికి ద్రోయబడి త్రొక్కుడువడి మృత్యువునోట బడ సిద్ధుడాయెను. కాని యతదదృష్టవశమున నిజాశ్వికులు గొందఱిచే గుర్తింపబడి పల్లకియందు శాహుమొహిబుల్లా కుమారుడగు మీర్జా లుత్ఫుల్లా శిబిరమునకు గొంపోబడెను. అచటినుండి సైన్యము రాజధానికి వెనుదిరిగి పోయెను. ఉమ్రాలందఱు యెవరి సీమలకు వారు పోయి చేరిరి[6]."

సయ్యదు అలీ ఇబన్ అబిజాల్లా తబాతబా కృత బుర్హాన్-ఇ-మఆసీర్ అనుచరిత్రయం దీ జివోదు మఱి కొంత విపులముగ వర్ణింపబడియున్నది.

"బష్తీరుఖుదావిందు ఖానునికి మరణశిక్ష జరుగుటకు పూర్వము (హి. ౯౨౩ = క్రీ. శ ౧౫౧౭), విప్లవకారుల బాఅదోలుటకొఱకు, గొప్ప సైన్యముతో గూడ వాస్థానమునకు రావలయునని రాజ్యమునందల్ల యెడల నుండు నమీరులకును గొప్పవారికిని [సుల్తాను] ఫర్మానా యొకటి సాదరుచేయబడెను. ఉత్తరువు ప్రకారము అమీరులెల్ల యుద్ధసామగ్రులను సేకరించుటయందు నిమగ్నులై తమ సైన్యములను గూర్చుకొనిరి ; కాని వా రాస్థానమునకు వచ్చిచేరుటకు ముందే సుల్తాను హృదయమున విప్లవకారులమూలమున పొడమిన భయము తీరిపోయినది. అమీరులు సుల్తానుసేవకు రానాజ్ఞాపింపబడినవా రగుటచేత, నందఱును ఆతనికి మ్రొక్కుటకు సత్వరముగవచ్చిరి. అందఱికంటె ముందు సుల్తాన్ అహమదు బహరీ తన సైన్యముతోగూడ వచ్చి రాజదర్శనమునుజేసి యతని మన్నన కత్యంతపాత్రుడాయెను ; అతని తరువాత పరెండా నుండి నూరీఖాను ఖ్వాజా-ఇ-జహానువచ్చి దర్శన మొనర్చుకొనెను. మజ్లిసి రఫీఅ ఆదిల్ ఖానుడు, మస్నద్-ఇ-అలీ ఇమా-దుల్-ముల్క్, దస్తూర్-ఇ-మమాలిక్ మున్నగు తక్కిన అమీరులును దొరలును,వీరు గాక ఇతరులు కొంద ఱమీరులును మల్లికులును, సుల్తానువచ్చి యాస్థానమును జేరెనని వినినంతటనె, లెక్కకెక్కువయైన దళములతో గూడ బయలుదేరి రాజధానికివచ్చి సుల్తానుకు నమస్కరించి సేవకు దాము సంసిద్ధులమని విన్నవించుకొనిరి.

తనపతాకపు క్రీనీడ గూడిన యీ మహాసైన్యమును జూడగనె, విగ్రహారాధకులపై మతయుద్ధముజేసి పుణ్యమును సంపాదింపవలయునను కోరిక సుల్తాను చిత్తమున గాఢముగ బాదుకొనెను. కావున దుర్జనులగు విగ్రహారాధకులను గూలద్రోయుటకు ధ్వజమెత్తి రాజధానినుండి బయలువెడలెను. దన్ని కడకు సుల్తాను జేరునప్పటి కతని యాగమనము శత్రువు లెఱిగి యుద్ధమునకు సంసిద్ధులై యతని సైన్యముతో బోరాడ సత్వరముగ వచ్చిరి. యుద్ధము సంఘటిల్లినది. కాని యాకస్మికముగ సుల్తానుసేన ఘోరవిపత్తు పాలైనది. సుల్తాను నిలిచి యుద్ధము సేయుచుండిన సేనామధ్యము తక్కిన భాగములనుంచి వేర్పడెను. అశ్వికులక్రందువలనను, ముందు వెనుకలకు బఱచు కాల్వ్వర సంచలనము వలనను ఇస్లామియాషాదుశాహు గుఱ్ఱముపైనుండి క్రిందబడెను. ఉభయసైన్యము లొండొంటిని తారసిల్లినపుడు దుమ్ము పెల్లురేగినది. ఇరువాగులవారును కలగాపులగముగ గలియుటవలన మిత్రులనుండి శత్రులను వేర్పఱచుటకు సాధ్యము గాదాయె. కావున పూతశరీరుడైన సుల్తాను నుత్తమాంగము బగిలి పలుతావుల గాయపడుటయును నతడేమైపోయినదియు నెవ్వరు నెఱుగజాలరైరి ; కాని యీసందడిలో గొందఱు నవుకరులు దమ యేలికను బొడగని, వెంటనె యాతని చెంతకుబోయి, గుఱ్ఱముల మధ్యనుండి వెలుపలికి గొని వచ్చి పల్లకియం దుంచి శాహుమహ-బ్బుల్లా కుమారుడగు మీర్జా లుత్ఫుల్లా శిబిరమునకు గొంపోయిరి.

"అమీరులును దొరలును సుల్తాను గాయపడుట నెఱిగిన వెంటనె కయ్యము సాలించి యతని దర్శనము జేసికొనబోయిరి. సుల్తానుగాంచి దుఃఖితులై కన్నుల నుండి జైహూన్ నదీ ప్రవాహమువలె రక్తాశ్రువులను గార్చిరి. తరువాత యుద్ధమును విరమించుకొని రాజధాని ముఖమై తిరిగిపోయిరి. బీదరుప్రాంతమును జేరగనె యమీరులును దొరలును సుల్తానునాజ్ఞ చేసత్కారమును బొంది యెవ్వరి సీమకు వారు వెడలిపోయిరి[7]."

6. *Briggs Ferishta, III. App. p p 350 – 51.*

7. *Burhan-i-Maajisr, I. A. XXVIII. p. 321.*

తారీఖ్-ఇ-ముహమ్మదు కుల్లీ కుతుబుశాహందును బుర్హాన్-ఇ-మ ఆసీరులోను వర్ణింపబడిన జిహాదొక్కటియే; కాని యది జరిగిన కాలము రెండు చరిత్రము లందును రెండువిధములుగ వ్యత్యస్తముగ వర్ణింపబడి యున్నది. తారీఖ్-ఇ-ముహమ్మదుకుల్లీ కుతుబు శాహులో హి. ౯౧౧ (క్రీ. శ. ౧౫౦౬) లో జరిగినట్లును, బుర్హాన్-ఇ-మఆసిరునందు హి. ౯౨౩ (క్రీ. శ. ౧౫౧౭) సం॥నకు ముందర నడచినట్లును వ్రాసియున్నది. కాని ఈ రెంటియందును జెప్పబడిన కాలము అంగీకరింపదగినదికాదు. ఏలనగా, తారీఖ్-ఇ-కుల్లీ కుతుబుశాహు రచయిత కుల్లీకుతుబుశాహు మొదలయిన బహమనీయుద్యోగు లందఱును హి. ౯౧౨ (క్రీ. శ. ౧౫౦౭) సం॥న సుల్తాను మహమూదుశాహు మరణానంతరమే స్వతంత్రులైరని ప్రకటించు నుద్దేశము గలవాడగుటచే నీ జిహాదు తత్పూర్వము హి. ౯౧౧ (క్రీ. శ. ౧౫౦౬) లో జరిగెనని వ్రాసెను; కాని మహమూదుశాహు హి. ౯౧౨ న మృతినందలేదు; వాస్తవముగ నతడు కాలధర్మ మందినది హి. ౯౨౪ (క్రీ. శ. ౧౫౧౮) వ వర్షమున నని ఫెరిస్తా, సయ్యద్ అలీమున్నగు చరిత్రకారులు వ్రాసియున్నారు. మఱియు హిందూ చరిత్రాధార గ్రంథములం దెచ్చటను క్రీ.శ. ౧౫౦౬లో బహమనీసుల్తానుపై నింతటి ఘనవిజయమును విజయనగర రాయలు పొందినట్లు చెప్పియుండ లేదు; కాని వీరనరసింహరాయల యేలుబడియందు మహమ్మదీయులతో నతడొకపర్యాయము యుద్ధముచేసినట్లు కలదు; కాని యతని ప్రతిపక్షి యేదులఖానుడు గాని సుల్తాన ఇమ్మడి మహమూదుశాహుబహమనీ కాదు.8 ఇక బుర్హాన్-మ ఆసిరులో-ఇ-హి. ౯౨౩ (క్రీ. శ. ౧౫౧౭) నకు ముందని చెప్పియున్నను ఎంతముందో నిశ్చయించుటకువీలు లేదు. కాని యా జిహాదు కాలనిర్ణయమునకు దోడ్పడగల చరిత్రాంశ మొకటి యందు గానవచ్చుచున్నది. ఈ జిహాదునందు సుల్తాను మహమూదు శాహుతో గూడ యుద్ధమునకు నడచిన యుద్యోగులలో మల్లిక్ అహ్మదుబహరీ నిజామ్-ఉ-ల్ ముల్కొక్కడని సయ్యద్ అలీ చెప్పియున్నాడు. మల్లిక్ అహ్మద్ బహరీ నిజామ్-ఉ-ల్ ముల్కు హి. ౯౧౬ (క్రీ. శ. ౧౫౧౦-౧౧) వఱకును జీవించియుండెను 9. కావున నతడు పాల్గొనిన జిహాదతని మరణకాలమునకు ముందే నడచియుండవలయును.

పై వివరించిన యంశములను బట్టి చూడగా నీ జిహాదు క్రీ. శ. ౧౫౦౯-౧౦ వ సంవత్సరమున, ననగా మల్లిక్ అహమదు బైరీ నిజామ్-ఉ-ల్ ముల్కు మరణమున కించుక పూర్వము నడచినట్లు తోచుచున్నది. ఈ యూహ సరియైన పక్షమున అల్బూకెర్క్ కామెం

---

8. క్రీ. శ. ౧౫౦౪ వ సంవత్సరమున వర్థెమా యను పాశ్చాత్య ప్రయాణికుడు గోవాకువచ్చి యుండినపుడు, సవాయి (అనగా,యూసుఫు ఆదిల్ ఖానుడు) నరిసింగరాజుతో యుద్ధముసేయుచుండె నని వ్రాసియున్నాడు. నరసానాయకుడు క్రీ. శ. ౧౫౦౩ వ సం. న శివసాయుజ్య మందెను. తరువాత ఇమ్మడి నరసింహరాయలు నామకార్థము సింహాసనాధిపతియై యుండినను, రాజ్యకార్యమంతయు నరసానాయకుని జ్యేష్ఠపుత్రుకు వీరనరసింహరాయలు మూలముననె జరుగుచుండినవి. కావున యొకవేళ హిందూచరిత్రాధారగ్రంథములు వివరించు యుద్ధ మిదియైనను గావచ్చును. (వర్థెమాయొక్క ఐటినెరరీ. పుట ౩౧౮.)

9. సయ్యదు అలీ తన బుర్హాన్-ఇ-మ ఆ సీరులో నీ మల్లిక్ అహమ్మదు క్రీ. శ. ౧౫౦౫-౬ న కించుక ముందు మృతి నందినట్లు వ్రాసియున్నాడు; ఫెరిస్తా ప్రకారమతని మరణము క్రీ. శ. ౧౫౦౮ లోనో, మఱి కొంచెము దరువాతనో సంభవించినది. అతడు క్రీ. శ. ౧౫౧౦ వ సంవత్సరమున జీవించియుండెననుటకు గొంత సాక్ష్యము గలదు. అత డా వర్షమున దస్తూర్-ఇ-మమాలికునకు ఇస్మాయిలు ఆదిల్ ఖానునితో యుద్ధము సేయుటకు సాయమొనర్చెను. (*Burhan-i-Maasir, I. A. XVIII. P.* 318)-గుజరాతు దేశపు (అరబీ) చరిత్రయందు మల్లిక్ అహ్మదుబహరీ హి. ౯౧౬ (౧౦ ఏప్రిలు ౧౫౧౦ మొదలు ౩౧ మార్చి ౧౫౧౧ వఱకు) లో కాలగతి నందెనని వ్రాసియున్నది. (*Arabic History of Gujerat III. Index. p.* 84)

టరీఖులో చెప్పినట్లు కృష్ణరాయలతో దక్కను రాజు క్రీ. శ. ౧౫౧౦ వ సంవత్సరమున ప్రారంభమున చేయుచుండిన యుద్ధవిజాపోటే కావలయును. మరియు రాయవాచకమున కృష్ణరాయలు గోలకొండ వరదు స్థలమునందు కృష్ణాతీరమున మూడు తెగల తురకలతో చేసినట్లు చెప్పియుండు సమరము ఇదియె కావలయును. ఈయభిప్రాయ మంగీకార్యమేని, రాయవాచక కృష్ణరాయవిజయములలోని ఈ యుద్ధవృత్తాంతము తారీఖ్-ఇ-మహమ్మదు కుతుబుషాహీ, బుర్హాన్-ఇ-మఆసీరు లలో చేర్కొనబడిన సుల్తాన్ ఇమ్మడి మహమూదు షాహుయొక్క జహోదు వర్ణనకు హిందూ పాఠాంతరముగ గ్రహింపవలసియున్నది.

హిందూమహమ్మదీయ వృత్తాంతములలో వర్ణింపబడి యుండు ముఖ్యాంశముల నొండొంటితో పోల్చి చూచినయెడల నీ యభిప్రాయమందలి లోటుపాటులు చక్కగ విశదముగాగలవు.

హిందూ గ్రంథములు:

౧. గోలకొండ వరదుస్థలమున కృష్ణ దక్షిణతీరమున యుద్ధమునడచినది.

౨. మూడు తెగల తురకలు, అనగా నవాబుదానగర విజాపుర గోలకొండ దొరలు రాయల నెదిర్చిరి.

౩. యుద్ధరంగమున సేనాముఖ్యమున (సుల్తాను?) చేరాయుండినది. మూడు తెగల తురకలకును చేర్వరు పాళెము లుండినవి. చేరా చుట్టును అశ్వదళములును యేనుగులును కాల్బలమును గాపుండెను.

౪. రాయల కమ్మ ఖాజా తురక సేనపైబడి వారి యశ్వసేనను చిందరవందర గావించి, యేనుగుల దళమును కాల్బలముల చెలపాలు గావించి, చేరా త్రొక్కను గోరి చేరాను గూల ద్రోసిరి. అంతట మూడు తెగల తురకలును నోడి రణరంగమును విడిచి పారిపోయిరి. హిందువులు విజయులైరి.

మహమ్మదీయ చరిత్రలు:

౧. విజయనగర బహమనీ రాజ్యముల నడి ప్రదేశమున దేవ్నీ తేక దేప్లీయను స్థలమున యుద్ధము నడచినది.

౨. సుల్తాన్ ఇమ్మడి మహమూదుషాహు బహమనీ నాయకత్వమున బహమనీ సామంతులందరును-ముఖ్యముగ నహమదునగర మల్లికు అహమదు బైరీ నిజామ్-ఉల్-ముల్కును, విజాపుర ప్రభువు ఏసులాఖానుడును, గోలకొండ పాలకుడు కుతుబ్-ఉల్-ముల్కును-ఏకమై హిందువులతో పోరిరి.

౩. యుద్ధరంగమున సేనాముఖ్యమున సుల్తాను ఇమ్మడి మహమూదుషాహు బహమనీ నిలిచియుండెను. అతని చుట్టును సుల్తాను ఫౌజు మెండుకొని యుండెను. దక్షిణపక్క కుతుబ్-ఉల్-ముల్కు దళము నడపు చుండెను.

౪. కుతుబ్-ఉల్-ముల్కు శత్రు సైన్య దక్షిణ పక్షమును భగ్నము గావించెను. కాని మధ్యమున సుల్తానాశ్వికుల త్రొక్కుడువలన గ్రిందపడి యశ్వములచే త్రొక్కుడు పడెను. బలమైన గాయములు దగిలినవి. అతని యుద్ధరంగమునుండి వెలుపలికి గొనిపోయిరి. బహమనీ సేనలు విరిగి యుద్ధమును త్యజించి పారిపోయెను. హిందువులు విజయులైరి.

ఈపట్టికలు రెంటి నొండొంటితో పోల్చి చూడగా వానియందు భేదములకంటె పోలికలె యధికముగ గానవచ్చుచున్నవి; కావున రాయవాచక కృష్ణరాయవిజయములను దారీఖ్-ఇ-మహమ్మదు కుతుబుషాహీ, బుర్హాన్-ఇ-మఆసీరులు వర్ణించు యుద్ధ మొక్కటియే యని మనము నిశ్చయము చేయవచ్చును.

అనుబంధము ౨.

యూసుఫు అదిల్ ఖానుని మరణకాలము

క్రీ. శ. ౧౫౦౯-౧౦ వ సంవత్సరమున బహమనీసుల్తానుతో జైన యుద్ధమున కృష్ణరాయలు యూసుఫు అదిల్ ఖానుని వధించెనని చెప్పితిని. ఈ యభిప్రాయ

మాను స్కమాల్యదలోని 'ఆలుకస్తోటకభట్టికా ఖురపుటీ' యనుపద్యముపై నాధారపడియున్నదని తెల్పితిని. ఈవిషయమున జక్క × కీ. శే. శ్రీ కొమర్రాజు వెంకట లక్ష్మణరావుపంతులుగారు ఆంధ్రసాహిత్య పరిషత్పత్రిక సప్తమసంపుటమున 'కృష్ణరాయల కొన్ని దిగ్విజయయాత్రలు' వ్యాసమున జర్చించియున్నారు. ఈ వ్యాసమున లక్ష్మణరావుగారు ఒకముఖ్యాంశమును జర్చింపక విడిచిపెట్టిరి. అందువల్ల నీ విషయమును మరల పరిశోధింపవలసివచ్చినది.

యూసుఫ్ ఆదిల్ ఖానుని మరణమును గూర్చి మహమ్మదు కాసిమ్ ఫెరిస్తా తన చరిత్రయం దిట్లు వ్రాసియున్నాడు.

"హిజరీ ౯౧౫ వ సంవత్సరమున క్రైస్తవులు (పోర్చుగీసులు) ఏమఱుపాటున గోవాపైబడి పురపాల కుని చెక్కి మహమ్మదీయులను వధించి దానిని స్వాధీనము చేసికొనిరి. ఈవిషయము తెలియవచ్చి నంతటనే యూసుఫ్ ఆదిల్ షాహు మూడువేల దిట్టల దక్కనీలను లాతివారిని గూర్చుకొని కడువేగముతో గూడిచేవిపోయి క్రైస్తవు లాడమరచియుండ పెక్కుమందిని చంపి యాకోటను దిరుగ కైవసముచు కొనెను; కొందఱు ఓడల నెక్కి సముద్రముపై దప్పించుకొనిపోయిరి. గోవాసంరక్షణకు దగిన యేర్పాటులను గావించి యూసుఫ్ఆదిల్ షాహు బిజాపూరునకు మరలి వచ్చి తన డెబ్బదిరెండవయేట మహోన్నైభవముతో నిరువదియొక సంవత్సరములు రాజ్యపాలనము చేసిన పిమ్మట బాపురే నగరులో మృతినందెను 1."

కృష్ణరాయడు కేదులఖానుని దన యుత్తర దిగ్విజయయాత్రయందు వధించెనని చెప్పుచుండ, దీనికి విరోధముగ ఫెరిస్తా యతడు బిజాపురమున రోగజాడ్య పీడితుడై మృతినొందెనని వక్కాణించుచున్నాడు.

వీరిలో నెవ్వరు నిజమాడుచున్నారో విచారింపవలసి యున్నది. ఫెరిస్తా చెప్పినట్లు యూసుఫ్ ఆదిల్ ఖానుడు బిజాపురమున మృతినందలేదని రుజువుచేయగల సాక్ష్యము కొంత కలదు. తారీఖ్-ఇ-ముహమ్మదుకుల్లీ కుతుబుషాహునందు 'యూసుఫ్ ఆదిల్ ఖానుడు కోవిల కొండయందు మృతినందె' నని వ్రాసియున్నది2. ఆట్లే బుర్హాన్-ఇ-మఆసీరునందుగూడ 'మజ్లిస్-ఇ-రఫీఅ ఆదిల్ ఖానుడు కోవిలకొండ కసుమాపు చేరలోనుండగ మరణించె' నని యున్నది. పై పేర్కొనిన మహమ్మదీయచరిత్రకారు లిరువురును ఫెరిస్తాకు సమకాలి కులే. వారిద్దరును యూసుఫ్ ఆదిల్ ఖానుడు కోవిల కొండలోనో దాని పరిసరములందో జచ్చెనని చెప్పుచుండగ, ఫెరిస్తాయొక్కనిమాటపై నాధారపడి యతడు బిజాపురమున కాలధర్మమునందెనని నమ్ముట యెట్లు? కృష్ణరాయలు యూసుఫ్ఆదిల్ ఖానునకు సమకాలికుడును బ్రతిపక్షియు. అతడు తా నాదిలు ఖానుని యుద్ధమున జంపితినని ఘంటాపథముగ జెప్పుచుండగ దరువాత డెబ్బది యెనుబది సంవత్సరములకు చరిత్రరచనకు గడంగిన ఫెరిస్తావ్రాతను నమ్మి యతడు రోగపీడితుడై నిజ రాజధానియందు దేహము చాలించె నని యొప్పుకొనుట యెట్లు?

మహమ్మదీయచరిత్రకారుల వ్రాతలను బట్టి యూసుఫ్ ఆదిల్ ఖానుని మరణకాలమును నిర్ణయించు టకు సాధ్యముగాదు. అతనిమరణకాలము నొక్కొక్క రొక్కవిధముగ జెప్పియున్నారు. ఈ రిట్టి భిన్నకాల ములను జబీరి యిట్లు సంగ్రహముగ బొందుపఱచి యున్నాడు. 'యూసుఫ్ ఆదిల్ ఖానుని మరణము తబకాత్-ఇ-యక్బరీ రచయిత ప్రకారము, హి. ౯౧౩ వను, మహమ్మదు కాసిమ్ ఫెరిస్తాప్రకారము, హి. ౯౧౬ వను, రఫీఉ-ద్దీన్ షీరాజీ, మీర్ ఇబ్రాహిమ్ అసద్ ఖానీలప్రకారము, హి-౯౧౫ వను సంభవించెను" 3. మఱియు సయ్యద్ అలీ బిన్ అజీజుల్లాతబాతబా యూదిల్ ఖానుడు మృతినందినది హి. ౯౧౫ వను దరువాత యనియు, తారీఖ్-ఇ-మహమ్మదు కుల్లీ కుతుబుషాహు రచయిత హి. ౯౧౦ లో ననియు 4, కాఫీఖా నొకచోట హి. ౯౧౬ లో ననియు, మఱి యొకచోట హి. ౯౧౮లో ననియు వ్రాసియున్నారు 5.

1. *Brigg's Ferishta, III. pp.* 29-30.
2. " " *III. p.* 350.
3. *Busatin-us-Salatin* P.22.
4. *Burhan-i-Maasir*, 2 A *XXVIII* P.319
5. *Muntakhab-ul-lubab*, *III* (*Biblio indnofo*) *pp.* 128, 280

పైచర్చవలన అల్బాకెర్కు క్రీ. శ. ౧౫౧౦ ఫిబ్రవరి నెల ౨౦ తేదీ నాడు గోవామీద నెత్తివచ్చుటకు ముందు యూసుఫ్ ఆదిల్ ఖానుడు మృతినొందెనని తేలుచున్నది. అంతకుముందెన్నడాతడు మృతినొందెనో కచ్చితముగ నిశ్చయించి చెప్పుటకు వీలులేదు; కాని యాతని మరణము సంభవించి యప్పటికింకను చాలకాలముగా లేదని నిశ్చయముగ జెప్పవచ్చును. అల్బాకెర్కు మొదటి తడవ గోవామీద యుద్ధము సేయ ప్రారంభించినపుడు, తిమ్మోజతో 'సబయు చెందినందలకధికసంఖ్యాకులైన గోవారక్షకుల విత్తమును హరించి సబైగో వారిని సాధింపవచ్చునని చెప్పెను[11]. అంతకు కొంతముందు, అల్మెడాచే నోడిపోయిన ఈజిప్టు సుల్తాను, నౌకానాయకులందొకడు నిజసామగ్రినంతయును గోవాయందు తలదాచుకొనెననియు, దానినే తన ముఖ్యస్థావరముగ జేసికొమ్మని సబైగో యాతని వేడుకొనెననియు చెప్పెను[12].

అల్మెడా క్రీ. శ. ౧౫౦౯ ఫిబ్రవరి 3 వ తారీఖున నీజిప్టునౌకాదళము నోడించెను. అతనిచే నిర్జితుడైన ఈజిప్టు నౌకాదళపతి యొక్కని గోవా యందే నిలువబడవలయునని సబైగో ప్రార్థించియుండిన నతనిప్పటికింకను సజీవుడైయుండెననుట నిశ్చయము. కావున సబైగో లేక యూసుఫ్ ఆదిల్ ఖానుడు క్రీ. శ ౧౫౦౯ ఫిబ్రవరి 3 వ తారీఖునకును క్రీ. శ. ౧౫౧౦ ఫిబ్రవరి ౨౦ వ తారీఖునకును మధ్య, అనగా క్రీ. శ. ౧౫౦౯–౧౦ వ సంవత్సరమున మృతినొందెనని నిస్సంశయముగ జెప్పవచ్చును.

యూసుఫ్ ఆదిల్ ఖానుని వెంటనే గోవాపై దెత్తి రావలసినదని అల్బాకెర్కు హిదల్కానుకంపిన సందేశములోని యీ క్రింది వాక్యమున విశదపఱచి యున్నాడు. "మీ తండ్రి సబైయో యెట్లు మా రాజుగారి మలబారు రేవుపట్టణము లందలి యోడలను పట్టుకొని పోవుచుండువాడో మీరు నట్లుగ జేసియుండవలయును; కావున నేను గోవాపై నెత్తిపోయి దాని నాక్రమణము జేసికొనవలసి వచ్చినది;... మీ తండ్రి నేటివఱకును బ్రదికియుండకపోయెనే యని నేను వాస్తవముగ వగచుచున్నాడను; బ్రదికి యుండిన చెప్పినంత సేయువాడ నని నన్నత డెఱిగి యుండును." (అల్బాకెర్కు కామెంటరీసు. సం. 3. పుటలు ౨౦-౨౧). కావున అల్బాకెర్కు యూసుఫ్ ఆదిల్ ఖాను మరణానంతరము జయించెననియు, పై చెప్పిన ప్రతిజ్ఞ నతడు మలబారుతీరమందుండిన పోర్చుగీసు రేవుపట్టణములమీద యూసఫ్ ఆదిల్ ఖానుదాడి వెడలుచుండిన కాలమున జేసియుండవలయు ననియు దృఢముగ జెప్పవచ్చును.

ఇంతవఱకు జేసిన చర్చవలన తేలిన సారాంశ మిది:—

౧. ఫెరిస్తా చెప్పినట్లు యూసుఫ్ ఆదిల్ ఖానుడు హిజరి ౯౧౬ అనగా క్రీ. శ. ౧౫౦౯-౧౦ వ సంవత్సరమున మృతినొందెను; కాని,

౨. అతడు ఫెరిస్తా చెప్పినట్లు విజాపురమున కాలగతి నందలేదు;

3. గోల్కొండ పరగణాలయందు కోవిలకొండయందో, లేక యాదుర్గము కనుచూపుదూరమునం దుండగనో యసువులు విడిచెను,

౪. మఱియు క్రైస్తవులు అనగా పోర్చుగీసు వారు యూసుఫ్ ఆదిల్ ఖానుని జయింపలేదు; వారినోడించి యాతడారేవు పట్టణమును మరల స్వాధీనపఱచుకొనను లేదు.

౫. పోర్చుగీసువారు ప్రప్రథమమున గోవాపట్టణము నాక్రమించుకొనినది యూసుఫ్ ఆదిల్ ఖానుడు గతించినపిమ్మట నతని కుమారుడు ఇస్మాయిల్ ఆదిల్ ఖానుని రాజ్యారంభకాలమునందు; వారిదగ్గరనుండి దాని మరల జయించి స్వాధీనపఱచుకొనినదియు నిస్మాయీలాదిల్ ఖానుడే.

ఇందువలన ఫెరిస్తాచరిత్ర యబద్ధకల్పనయని విదితమగుచున్నది. ఫెరిస్తా బుద్ధిపూర్వకముగ నబద్ధములు వ్రాయలేదనియు, నతడాధారములుగ గ్రహించిన గ్రంథములలోని విషయముల నెట్లుండినవానినట్లే పరిశీలింపక తనగ్రంథములోని కెక్కించుకొనెననియు కొందఱు చెప్పుదురు. మఱికొందఱు దీని నంగీకరింపక నతడు బుద్ధిపూర్వకముగ నబద్ధపురాణమును కల్పించె నందురు. ఇందేది సత్యమైనను ఫెరిస్తాచరిత్ర విజయనగరమునకు సంబంధించినంతవఱకు తప్పులకుప్ప. విశ్వాసార్హముగాదు.

11. అల్బాకెర్కు కామెంటరీసు. సం. ౨. పుట ౮౫.

12. ,, ,, పుట. ౮౨.

శబ్దవేధి

[శబ్దనాటిక]

శ్రీ వి. డి. ప్రసాదరావు

ఒకటవ రంగము

[ఆఫ్ఘనిస్తాన్ కొండలలో బల్లపరుపు కొండ వానకొని నిటారుగా ఉన్న కొండలలో మలచినట్లున్న గుహాముఖము. పృథ్వీరాజు కాళ్లకూ, చేతులకూ ఇనుపసంకెళ్లతో ఇటునటు తిరుగుతూన్న సంకెలల చప్పుడు. కాపలాకాస్తూ లోడీ, బాల్బన్‌లు. వరుసగా సంకెలలు కదలుతున్న చప్పుడు వినిపిస్తూంటుంది.]

లోడీ—అబ్బబ్బ, ఈ కాపలాతో నాకూ పిచ్చి ఎత్తేటట్లుంది. అస్తమానం ఆ సంకెలలు కదుపుతూంటూ, ఆ నడక ఆపడు. మాట మాట్లాడడు. తిండి తినడు. నీరు త్రాగడు. ఓయి మహారాజా! ఒక్క క్షణం ఆ సంకెలల చప్పుడాపవయ్యా. (సంకెళ్ల చప్పుడు ఏమీ మార్పు లేకుండా అల్లాగే బరువుగా వరుసగా వినబడుతుంటుంది)

బాల్బన్—ఒరే లోడీ, నీ పిచ్చిగానీ, మహారాజేమిటి, నీలాంటి నాలాంటి బానిసనౌకర్లతో మాట్లాడట మేమిటి? చిక్కిపోయిన ఈ మహారాజులో ఈ పొగరు బానిసలకు కూడ ఎంత నవ్వు పుట్టిస్తుందో కళ్లారా చూచి ఆనందించండిరా అని అన్నారు కాదా, సుల్తాన్ వారు?

లోడీ—ఆనందమా భాయీ. ఇది నన్ను హింస పెట్టటంగా ఉందిగాని, ఆ మహారాజును హింసిస్తున్నట్లే అనిపించటం లేదు. అబ్బా, ఆనాడు ఆ కొజ్జాలు ఈ మహారాజు కళ్లు పొడుస్తుంటే, కళ్లు తిరిగి నేను పడిపోయాను. ఆ మహారాజు మాత్రం కదల లేదు. తొణకలేదు. పెదవుల మందహాసం ఓడలేదు. గ్రుడ్డు చితికి నెత్తురైనా కారింది కాని కంట నీరు జారలేదు. అబ్బా! ఈ హింస నే చూడలేను. ఇదుగో, కైజారుతో ఈ మహారాజును చంపి, ఈ హింసను అంతమొందిస్తాను.

బాల్బన్—కామోష్, భాయీ! అల్లాంటి పని ఎప్పుడూ చేయకు. ఆనందించకపోతే కళ్లు మూసుకో. అంతేగాని అల్లాంటిపని చేశావా, సుల్తాన్ ఈ చిత్రవధలన్నీ నీమీద జరిపి పగ తీర్చుకుంటాడు. అయినా మహారాజా అంటూ ఈ మన్నన ఏమిటి? కాఫిర్ అరి అనరాదూ? ఈనాడు చిక్కిపోయాడని నీకు జాలితప్ప, రాజుగా వెలుగుతుంటే నిన్నూ నన్నూ బానిసలని జాలితలిచేవాడురా యీయన?

లోడీ—అరే. జాలి లేకనా ఈయన ఇల్లా అయాడు. అన్నిమాట్లు గోరీసుల్తానును విడిచిపెట్టాడు.

బాల్బన్—అది క్షమ కాదురా పిచ్చివాడా! సుక్షత్రియమైన కులంలో పుట్టుగా ఉండిన సర్వాధిపత్యంతో వచ్చే ఐశ్వర్యమదం. ఇతరులంటే క్రిమికీటకాదులకన్న తృణీకారం. తన పాటి రాజుల్ని అల్లాగే చూచాడు.

(గొలుసుల నడక చప్పుడు కొంచెం దూరంగా వినిపిస్తుంది)

లోడీ—ఓయి మహారాజా, మేము క్రిమికీటకాదులకన్న అల్పులమే, బానిసలమే! పోనీ, మాతో నీవు మాట్లాడక్కరలేదు. మమ్మల్ని హింసపెట్టక, అన్నం తిని నీరు త్రాగవయ్యా, నీ పాదాలు పట్టుకొంటాను!

బాల్బక్—ఓరి భాయీ. ఈతని జాలి అల్పుల పట్ల కాదురా, రాజులను కూల్చే సుల్తానులపట్ల. ఇత నంటే నీకు జాలి ఎందుకు?

పృథ్వీ—గురుదేవా, నమస్తే. హృదయం మార్చు కొన్నావు. కంఠం మార్చుకొన్నావు. వేషం కూడా మార్చుకొనే ఉంటావ్. కాని, కంఠంలో కవిత్వపు జీర మార్చుకోలేక పోతివే. ఈ విజ్ఞానభిక్షుకు ఇదే హృద యంతో నమస్కారం.

లోడీ—అ:. అ:. మహారాజా మాట్లాడాడు. ఇన్నాళ్లకు మహారాజా మాట్లాడాడు. మహారాజ్!

బాల్బక్—(ఆనందాన్ని కప్పిపుచ్చుతున్న వికిలి నవ్వుతో) అహ్హహ్హ! ఓరి లోడీ, ఈ మహారాజా మనతో మాట్లాడటం లేదోయి. మతి తప్పి, తన పౌరుషం విస్మరించి, మగతలో ఏదో అంటున్నాడు. అతని మనోవీథిలో ఎవరో కనబడి, వారితో దీను డయి మాట్లాడుతున్నాడు. మనతో కాదు.

లోడీ—హుఁ! బాల్బక్, వాగక. మహారాజా మనస్సు చెడగొట్టి మళ్లీ అస్వస్థుణ్ణి చేయకు మహా రాజ్!

బాల్బక్—(నవ్వుతూ) మనతో మాట్లాడడురా!

పృథ్వీ—గురుదేవా, క్షమించు. భాయీ లోడీ.

లోడీ—మహారాజ్, మహారాజ్! ఎవర్ని, నన్నేనా భాయీ అంది? నేను కేవలం గోరీసుల్తాన్ బానిసను. ఇక్కడ మీకు కాపలాదారును.

పృథ్వీ—కాదు భాయీ. నీవు మానవుడివి. యుద్ధంలో గోరీపక్షాన సైనికుడవే. ఆ డబ్బు తిన్న విశ్వాసం ఉంది. కాని మనస్సు హింసాకలుషితం కాలేదు. నీకున్నంత మానవం రాక్షసులమైన మాకు లేదు. ఇకముందు మానవలోకం సుల్తానులదీ, రాజులదీ కాదు. నీదే. ఆనాడు నీకు హీనత్వం ఉండదు.

బాల్బక్—ఉండదుట లోడీ, ఉండదు. ఆనాడు సుల్తాను తలెత్తుకొని ప్రపంచంలో ఉన్నతుడై తిరుగు తావు. ఆ మర్నాడో, ఈ మహారాజా అహంకారమే నీకు కలుగుతుంది. స్వజాతి పరజాతి అన్న భేదం లేక మానవులంతా నీకు అల్పులు, నీచులుగానే కనబడతారు. అంతేనా, మహారాజ్? అహ్హహ్హ! లోడీ. ఈయనకు పూర్తిగా మతి చలించింది. గోరీ చేతికి్కనానాడే ఈ మతి ఇల్లా చలించి ఉంటే, భారతదేశమే తరతరాలా బానిసత్వం చెందకుండా ఉండేది.

లోడీ—బాల్బక్, ఏమిటిది? ఎవరు నువ్వు? ఏ కాళ్లైన ఈ కొండెల్లోబడి తిరుగుతుంటే, జాలిపడి తీసుకువచ్చి, నాతోపాటు కాలికి ఇక్కడ ఉంచాను. నా పనికి విరుద్ధంగా ఎందుకీ మహారాజును రెచ్చగొట్టున్నావు?

పృథ్వీ—భాయీ లోడీ, కలతపడకు. ఇదిగో భుజిస్తున్నాను.

లోడీ—అల్లా చెయ్యి, మహారాజ్. మంచి నీళ్లు, ఆ ప్రక్కనే—ఏది ఎక్కడ ఉందో చెప్పక్కర లేకుండానే తీసుకొంటున్నావే. తీసుకో మహారాజ్.

బాల్బక్—(వికటంగా నవ్వుతూ) లోడీ! సుల్తాన్ గోరీ ఈయన ముక్కుపై నున్న కళ్లు పీకించాడు గాని, నోటికి చెవులకు మనస్సుకు ఉండే కళ్లు పీకించ లేకపోయాడు.

(ఇనుపగొలుసుల గట్టి కదలింపు.)

లోడీ—అ:. అ:. మహారాజ్. తినటం మాన కర్దు. (కోపంతో) బాల్బక్, ఇక నా మహారాజును రెచ్చగొడ్తే నిన్నిక్కడినుంచి తరిమేస్తాను.

పృథ్వీ—(శాంతుడయి) ఉండనీ లోడీ. కవి గురువును ఉండనీయి. గురుదేవ్! పరీక్షలో కొంత తేలిపోయాను. మళ్లీ కూడుకొంటున్నాను. భాయీ, లోడీ. నీదగ్గిర పాన్ సుపారీ ఉంటే నాకూ కొద్ది భాగం ఇస్తావా?

లోడీ—మహారాజ్, ఇదిగో నన్ను భాయీ అన్నావ్. నాతో పాన్ సుపారీలో భాగం పంచు కొన్నావు. సర్వంసహాచక్రవర్తివి. నేను బానిసను. ఇంతకన్నా నాకు అదృష్టమేముంటుంది?

బాల్బక్—ఉంది, లోడీ, ఉంది. సర్వంసహా చక్రవర్తిత్వంలోనే భాగం ఉంటుంది. గోరీ సుల్తాన్ ఈ పంపకం చూసి ఎంతో ఆనందిస్తాడు.

(గోరీ సుల్తాన్ ప్రవేశం)

గోరీ—ఏ పంపకం చూసి, గోరీ ఆనందించేది? ఢిల్లీ చక్రవర్తీ, కుమారుణ్ణీ, ఎల్లా ఉన్నారయ్యా, బానిసతో పంపకం కుదిరిందా? అహ్హాహా.

లోడీ—సలాం అలేఖుం సుల్తాన్ సాహేబ్.

గోరీ—హుం. ఏమి పృథ్వీరాజ్ ! మదమణిగిందా, కొత్త ఎంగిలిపడినట్లున్నావే?

పృథ్వీ—(కోపము పట్టలేక హుంకరించును)

గోరీ—ఓహోహో. ఇంకా పూర్తిగా దిగజారలేదే. ఆ అహంకారమే నాకు ఆనంద మిచ్చేది. పృథ్వీరాజ్ తెలిసిందా! నేను నిన్ను ఎందుకు ఒక్కసారిగా చంపి వేయలేదో ?

బాల్బక్—ఎందుకు తెలిసిరాదు సుల్తాన్ సాహేబ్ ? ఇప్పటికి తప్పకుండా తెలిసి వచ్చి ఉంటుంది. మీరు నేలకొరిగిన నాడు, మీ ముఖంలోని ప్రాణభీతి చూసి ఉవ్వెత్తైన గర్వంతో తృణీకారంతో ఏడుమార్లు క్షమించినవాడి అహంకారం అశక్తస్థితిలో హుంకారాలు చేస్తూంటే చూసి సంతోషించటం కన్నా ఆనంద మేముంటుంది సుల్తాన్ సాహేబ్.

గోరీ—(చకితుడై) ఆ. ఎవడురా వీడు? లోడీ...

లోడీ—(భయముతో) సుల్తాన్ సాహేబ్ మన్నించాలి. ఎవడో కొండలలో దారి తెలియక తిరుగాడుతుంటే తోడుగా ఉంటాడని తీసుకొని వచ్చాను. మీతో చెబ్దా మనుకొన్నాను; చెప్పలేదు. వాడూ ఒక బానిసే...

బాల్బక్—కాదు లోడీ. బానిస కాదు. ఆర్య రాజుల కొలువులో బానిసలు లేరు. ఉంటే భారతి సామ్రాజ్యం బానిసలకి హస్తగత మయేది. సుల్తాన్ సాహేబ్ ! నేను ఢిల్లీ సామ్రాట్ ఆస్థానంలోని ఆర్యకవిని. చాంద్ భట్టును. పృథ్వీరాజును జయించిన గోరీ సుల్తాన్ ఈనాడు ఢిల్లీ సామ్రాట్టు. అతని ఆస్థానంలో ప్రఖ్యాతి పొందాలని వచ్చాను.

లోడీ—అఁ. అఁ. మోసము. సుల్తాన్, వీడి నిప్పుడే ఖంగీ చేస్తాను. (కత్తి దూసిన చప్పుడు)

పృథ్వీ—చాంద్ భట్టు, ఈ వైపరీత్యము కూడా చూపించావా? హతవిధీ......

గోరీ—ఆగు లోడీ ఆగు. శహబాస్. చాంద్ భట్టు. పృథ్వీరాజును హింసించేందుకు నాకు మరో ఆయుధం సమకూర్చావ్. ఇప్పటినుంచీ నువ్వు నా ఆస్థాన కవివి.

చాంద్—అంతేకాదు సుల్తాన్. పృథ్వీరాజు తన విద్యను విదూషకునిలాగ నీయందు ప్రదర్శించి, నీ కోర్కెలకు పరిణతి తేవాలని కోరుతున్నాను.

పృథ్వీ—(హుంకరించి) ఏమిటి సుమకేనా, ఏమి యీ మార్పు? హుం.

గోరీ—ఓహో చాంద్‌భట్టు. ఆ అహంకార హుంకారమే నా కానందం. మళ్లీ తెప్పించు. జోగాను, విద్యాప్రదర్శనం చేయించు. ఏమ్ పృథ్వీరాజ్!...

చాంద్—అహంకార హుంకారం కాదు సుల్తాన్, సహజంగా చేతనైన గర్జన మాత్రమే. సింహం గర్జించటం సహజగుణం తప్ప పౌరుష ప్రదర్శనమన్న ఔన్నత్యం ఇచ్చుకోనక్కరలేదు.

గోరీ—శహబాష్! చాంద్‌భట్టూ, నువ్వు నిజంగా కవివే.

పృథ్వీ—చాంద్ భట్టు, కవి నామము రాక్షసగురువు కొక్కడికే. దాన్ని సార్థకం చేసుకుంటున్నావా?

చాంద్—సర్వసర్వంసహాధిపా, మిత్రమా, పృథ్వీరాజా...

గోరీ—అదే పద్ధతి, చాంద్‌భట్టూ. అతన్ని జ్ఞప్తికి తే. మనస్సునే హింసించాలి. అదే నా కోరిక.

పృథ్వీ—చాంద్‌భట్, దేవతాగురువు బృహస్పతివి. రాక్షసగురువు శుక్రుడుగా మారావే...

చాంద్—పొరపాటు చక్రవర్తీ పొరపాటు. మనలో దేవతలు లేరు. మనుష్యుడు ఈ బానిస లోడీ ఒకడే. మనము ముగ్గురమూ రాక్షసులము. నేను రాజుల కొలువులలో జన్మసిద్ధముగనే రాక్షసుడను.

గోరీ—చాంద్‌భట్ ఈ కాలయాపన ఎందుకు?

చాంద్—నిజం గోరీసుల్తాన్. ఈ గ్రుడ్డిరాజుకు బాణము, విల్లు ఇచ్చి, అస్త్ర ప్రదర్శనం చేయించి వినోదిద్దాం. ఇతని వీరత్వం చూసి ఆనందిద్దాం.

గోరీ—(నవ్వుతూ) హో. హో. చాంద్‌భట్టు, నిజంగా నువ్వు రాక్షసుడవే. మనుష్యుల కింత విశ్వాసఘాతుకత్వ ముండదు. ఇదిగో పృథ్వీరాజ్, విల్లు

అంబులు. (విసిరివేయును) లోడీ, అతనిచేతుల సంకెళ్లు తీసెయ్యి.

లోడీ—(కంగారుగా)వద్దు సుల్తాన్ సాహెబ్ వద్దు. ఈ రాజుకు చప్పుడునలన ఏది ఎక్కడ ఉందో తెలుసుకొనే విద్య తెలుసును. విల్లు అమ్ములు చేతి కిస్తే తన కంఠాన్ని విని తమ ప్రాణానికే మోసం తెస్తాడు.

చాంద్—ఏమిటీ! ఢిల్లీ సామ్రాట్టును నెగ్గిన గోరీసుల్తాన్, ఏకునూర్లు పట్టుదలతో భారతదేశంపై దండయాత్రలు జరిపి నెగ్గిన గోరీసుల్తాన్, బందీరాజు విద్యాప్రదర్శనాన్ని ప్రాణభయంతో చూడటం మానుతాడా! అరెరె. ఇంత పౌరుషహీనుని ఆస్థానంలో ఉంటానా—

గోరీ—(కేలతన్ని) లోడీ! చేతిసంకెళు విప్పు. చాంద్‌భట్టు, నిలు, గోరీ ధైర్యం చవిచూశాకే ప్రాణాలు వదులుదువుగాని.

చాంద్—శెహబాష్ సుల్తాన్. మీవంటి రసికుల చేతిలో నా ప్రాణాని కెప్పుడూ భయంలేదు. ఇక ఈ విద్య పరీక్షించండి. ఇదిగో ఈ చిన్నరాతిని ఆ ఎదుటి రాతిగోడపైకి విసరుతాను. రాయి ఎక్కడ తగులుతుందో పృథ్వీరాజు బాణంకూడా అక్కడే తగులాలి.

లోడీ—సుల్తాన్, వీరిమాటలు వినకండి.

గోరీ—ముందు సంకెళ్లు విప్పు. వెంటనే ఆ సంకెళ్లు చాంద్‌భట్టుకు తగిలించి ఉంచు.

లోడీ— అయితే సుల్తాన్, మీరు మాట్లాడకండి. కదలకండి. (సంకెళ్లు విప్పుతాడు.)

గోరీ—అగు లోడీ, చాంద్‌భట్టు రాయి విసిరిన తర్వాత ఆ విల్లు అమ్ములు అతనిచేతి కియ్యి. చాంద్‌భట్టుచేతికి సంకెళ్లు తగిలించు. నే నిక్కడనుంచి కదులుతాను.

(చాంద్‌భట్టు రాయి విసరిన చప్పుడు. సంకెళ్లు పృథ్వీరాజు చేతినుంచి విప్పి చాంద్‌భట్టుకు తగిలించిన ధ్వని. బాణము జువ్వుమంటూ రాయి తగిలినచోటే తగిలిన చప్పుడు)

లోడీ—అరెరే! ఆశ్చర్యం. సరిగా మొనవాని తప్పకుండా సరిగ్గా అక్కడే తగిలిందే.

పృథ్వీ—(హుంకరించి)అరే! మ్లేచ్ఛా, గోరీ!

లోడీ—(కంగారుగా) సుల్తాన్, పలుకవద్దు.

చాంద్—ఏమిసుల్తాన్ పలుకకుండా నావంక గుడ్లురిమి చూస్తున్నారు.

లోడీ—అరే లుచ్ఛా! ఏలాగైనా పలుకరించాలని చూస్తున్నావ్. సుల్తాన్, మాట్లాడకండి.

చాంద్—(గోరీకంఠంతో, గోరీఉన్న దిశనుంచి పలుకుతూన్న కంఠంతో) అరే, కాఫిర్, పృథ్వీరాజ్. (రుంయిమనిబాణధ్వని. గోరీ పడిపోతూ) అబ్బా, అల్లా!

లోడీ—(ఏడ్పుతో) హా సుల్తాన్, సుల్తాన్ హా. అరే నమ్మక్ హరాం. చాంద్‌భట్టు.

చాంద్—జై పృథ్వీ మహారాజ్. ఏ పిరికితనాన్ని, నీరసాన్ని నీలో చూచి ఆనందించటానికి గోరీ తపించాడో, ఆ పిరికితనాన్ని నీరసాన్ని, గోరీ మూగతనంలో కండ్లారా నేనూ, మనసారా నీవూ చూసి ఆనందించాం.

గోరీ—చాంద్‌భట్టు, ఆవవసరంగా ఆనందిస్తున్నావ్. నేను భయంతో మూగ నవలేదు. నీ శబ్ద పాండిత్యంకూడా చూడాలని ఆగాను. ఈనాటికి నాకు భయంలేదురా. హహ్హహ్హా. (అని నవ్వుతూ, అల్లా! అని ప్రాణం విడుస్తాడు.)

లోడీ—అరే చాంద్‌భట్టు. మగవాడవై తే కత్తి తీయరా, నీ ప్రాణాలు తీసి నా స్వామి ఋణం తీర్చుకొంటా.

పృథ్వీ—అక్కరలేదు లోడీ! మా యిద్దరి ప్రాణాలూ నిలువు. చాంద్‌భట్టు గురూజీ, తమ ఆజ్ఞ పాలించాను. కాని ఈ విషయంలో మీకూ కల్మషం అంటుకొంది. నా బాణంతోనే అది తీసి వేస్తాను.

చాంద్—పృథ్వీరాజ్ మిత్రమా, ఈ నాటకానికంతకూ క్షమ వేడుతున్నాను. రా! బందీ వయాత్రికన్న నీ కల్మషాన్ని నా ఘంటంతోనే కడిగి వేస్తాను. ఒక్కసారి తుది కౌగిలింపు ఇయ్యి.

చాంద్—(పృథ్వీరాజు కౌగిలించుకొంటాడు. ఘంటంతో పృథ్వీరాజును, బాణంతో చాంద్‌భట్టును ఒకరి నొకరు పొడుచుకొన్న చప్పుడు)

పృథ్వీ—ఆహ. నమస్తే గురూజీ. జై మహాదేవ్. (పడిపోతాడు.)

చాంద్—మిత్రమా, పృథ్వీరాజ్ నమస్తే! భాయీ లోడీ. రాక్షసులమంతా అంతరించాము. మనుష్యులు ఇక ఈ భూమి నీదే. జై మహాదేవ్! (పడిపోతాడు.)

వినోదవిమర్శలో వింత

శ్రీ తిమ్మావజ్ఝల కోదండరామయ్య గారు గత భారతియందు చేసిన వినోదవిమర్శనమందు రెండు అసత్యములు కలవు. వాని విషయము మాత్రమే ఇచట వ్రాయదలచితిని; వారు విమర్శించిన వావిళ్ళ వారి కుమారసంభవ ప్రకటనను గూర్చి కాదు.

(౧) "ఇక శ్రీ శ్రీపాద లక్ష్మీపతిశాస్త్రిగారు కుమారసంభవమును బరిష్కరించి యిచ్చిరన్న విషయము నయథార్థమే యనదగియున్నది. కుమారసంభవ విమర్శలో శ్రీ శ్రీపాద లక్ష్మీపతి శాస్త్రిగారు దశమాశ్వాసములోని నాగబంధమును జిత్రించి దిగువ 'భూరితరచారుసుఖప్రద' యని యుండరా దని, యట్లున్న బంధము కుదుర దని, 'భూరితరసారసుఖప్రద' యని యుండవలయునని వ్రాసిరి. వారే పరిష్కరించిన వావిళ్ళవారి కుమారసంభవములో నీ సవరణము కానరాదు. శ్రీరామకృష్ణకవిగారు ప్రకటించిన కుమారసంభవమునందు యథాతథముగానున్నది. కనుక లక్ష్మీపతిశాస్త్రిగారు కుమారసంభవమును బరిష్కరించి వావిళ్ల వారి కొసగిరను విషయము సందేహాస్పదమగుచున్నది." అని.

శ్రీ తిమ్మావజ్ఝలవారి యనుమానము లెట్లున్నను వావిళ్లవారికి శ్రీ శ్రీపాద లక్ష్మీపతిశాస్త్రిగారు సంస్కరించి యిచ్చినది మాత్రము వాస్తవము. శ్రీపాదవారే తాము వావిళ్ళవారికి కుమారసంభవమును బరిష్కరించి యిచ్చితిమని చెప్పినారు. ఇది కొంచె మెచ్చుతక్కువగ పదియేండ్లనాటిమాట. అప్పుడు మదరాసు విశ్వవిద్యాలయమున నన్నెచోడుని కుమారసంభవ పరిశీలనయం దాసక్తులైనవారము మేము నలుగుర ముంటిమి — నే నొకడను; శ్రీ మానవల్లి రామకృష్ణకవిగా రొక్కరు; కీ. శే. శ్రీ శ్రీపాదలక్ష్మీపతిశాస్త్రిగా రొక్కరు; శ్రీ హెచ్. శేషయ్యంగా రింకొక్కరు. శ్రీ రామకృష్ణకవిగారు మా కందరికంటె సకలవిధములను పెద్దవారు. విశ్వవిద్యాలయచరిత్రశాఖయందు మెకంజీ వ్రాత పుస్తకముల పరిశోధనము నాతో గూడ సేయుచుండి రందున మే మిరువుర మనుదినము కూడి పనిసేయవలసి యుండెడిది. ఇంతేకాక మా కిరువురకు ౧౯౨౦ వ సంవత్సరమునుండి మైత్రికలిగియుండినందున ఆయన కడ నా కధికమైన చనవు గలిగి యుండెడిది. కుమారసంభవకావ్యము గనిపెట్టి దానిని ప్రథమమున సంస్కరించి యాంధ్రప్రపంచమునకు బ్రసాదించిన పండితోత్తమునికడ నా కావ్యపఠనమున నాకు గల్గిన సంశయములను నివర్తిగావించుకొనుట యుక్తమని తలచి యనుదినమును గంట గంటన్నర కాలము కుమారసంభవమును చర్చించుచుండువాడను. శ్రీపాద లక్ష్మీపతిశాస్త్రులవారు విశ్వవిద్యాలయోద్యోగమున నంత కించుకపూర్వము ప్రవేశించియుండిరి. వీరు కాకినాడ ఆంధ్ర సాహిత్య పరిషత్తునను, సూర్యరాయాంధ్ర నిఘంటు కార్యస్థానమునందును పనిసేయుచున్నప్పటినుండియు నన్నెచోడుని కుమారసంభవమునుగూర్చి గాఢమైన పరిశ్రమ చేయుచుండిరనియు, విశ్వవిద్యాలయము తరఫున గూడ నా కార్యమును సాగింపబోవుచున్నారనియు గర్ణాకర్ణిగ వినవచ్చినది. మిత్రులు కోరాడ రామకృష్ణయ్యపంతులుగారి మూలమున వీరితో మైత్రి కుదిరినది. ఉత్తరాది పండితులయందు సామాన్యముగ గానవచ్చు స్థైర్యసాహసాది గుణములు మఱింత యతిశయముగ వీరియందు గానవచ్చినవి. చక్కని విద్వాంసులే కాని యాంధ్రసాహిత్య జ్ఞాన మంత గాఢమైనది కాదు. శ్రీరామకృష్ణకవిగారిచే ప్రకటితమైన కుమారసంభవము తప్పులకుప్ప యనియు, పెక్కుతావుల కవిహృదయము తెలుగజాలక గ్రంథము ననావశ్యకముగ సంస్కరించినాడనియు బహిరంగముగ జెప్పుటవలనను లక్ష్మీపతిశాస్త్రిగారికిని రామకృష్ణకవిగారికిని మనస్సు లొకప్పుడును గలిసినవి కావు. కాని నాకును లక్ష్మీపతిశాస్త్రులవారికిని కుమారసంభవపాఠనిర్ణయమునుగూర్చి తర్కము దరుచుగ జరుగుచుండెడిది. మాకు మధ్యవర్తి హెచ్. శేషయ్యంగారు. కర్ణాటశాఖయందప్పుడు జూనియర్

లెక్చరర్. ఉద్యోగమువలన జానియరు లెక్చరర్ నైనను పాండిత్యమున నందఱికంటె మీని వారనుకతప్పరు. కన్నడ భాషావాఙ్మయమందును, పరిశోధనాపద్ధతులందును, ప్రాచీనలిపిజ్ఞానమునను కర్ణాటక భూమండలమున శేషయ్యంగారిని మించినవారు లేరనుట యతిశయోక్తి గాదు. సంస్కృతభాషాపాండిత్యమున మొదటి బంతికి జెందినవాఁడు. ఆంధ్రభాషాజ్ఞాన మల్పమైనను మేధాశక్తివలన మా సంశయములను నభిప్రాయభేదము లను జక్కఁగ గ్రహించి యర్థనిర్ణయ పాఠనిర్ణయము లకు మార్గము చూపువాఁడు. అర్థము దెలియని 'నూతన' శబ్దాదిపదముల కెన్నిటి యర్థస్వరూపముకో వివరించువాఁడు. మఱియు పంప, పొన్న, రన్నాదులగు ప్రాచీన కర్ణాటకవుల కావ్యములకు నన్నెచోడని కుమారసంభవమునకు గాఢమైన పోలిక లుండుటవలన శ్రీ శేషయ్యంగారి సహాయ మత్యంతావశ్యక మగు చుండెడిది. కావున మేము ముఖ్యగ్రంథము పలుమారు కూడి నన్నెచోడని కుమారసంభవమునుగూర్చి వివ దించుచుంటి వారము. ఇట్టి సమయముల లక్ష్మీపతి శాస్త్రులవారు రామకృష్ణకవిగారి పాఠ మిట్టి దనియు, దానిని వావిళ్లవారి కిల్లు సంస్కరించి ఇచ్చితి మనియు చెప్పెడివారు. కావున వావిళ్ల శాస్త్రులవారు లక్ష్మీపతిశాస్త్రులవారిచే నన్నెచోడని కుమారసంభవ మును పరిష్కరింపించితి మని చెప్పినది బొల్లుకాదు, సత్యమే.

అనుచేని శ్రీ కోదండరామయ్యగారు చెప్పినట్లు వావిళ్లవారి ముద్రిత కుమారసంభవములో గాన వచ్చు పాఠములకును, లక్ష్మీపతిశాస్త్రులవారిచే నన్యత్ర ప్రకటితములైన పద్యములలో గానవచ్చు పాఠముల కును గల భేదమునకు గారణ మేమి? అను ప్రశ్న యొకటి బయలువెడలగలదు. దీనికి సమాధానము లేక పోలేదు. శ్రీ లక్ష్మీపతిశాస్త్రులవారికి చిరకాలము పాఠనిర్ణయమును గూర్చి కాని, యపూర్వపదముల యర్థ నిర్ణయమునుగూర్చి కాని స్థిరమైన యభిప్రాయము లుండినవి కావు. అప్పటప్పటికి నాయన నిజాభిప్రాయ ములను మార్చుకొనుచుండువాఁడు; కావున ప్రప్రథమ మున వావిళ్లవారికై శాస్త్రులవారు సంస్కరించిన ప్రతిలోని పాఠములకును, తరువాత వారిచే నన్యత్ర ప్రక టింపబడిన పాఠములకును భేద ముండిన నం దసహజ మేమియు లేదు. పూర్వము దా నంగీకరించిన పాఠ మునకంటె దరువాత దోచినపాఠము ఉత్తమమైనదని తలచినవాఁ డా నూతనపాఠమును ప్రకటించుటయందు తప్పులేదు; పూర్వపాఠమునకంటె నది భిన్నమగుట యందు వింతయు లేదు. మఱియొక కారణముగూడ నూహ్యము. శ్రీవావిళ్ల వేంకటేశ్వరశాస్త్రులవారు తమచే ప్రకటింపబడిన కుమారసంభవమునకు రచించిన యాంగ్ల పీఠికయం దిట్లు చెప్పియున్నారు.

"In the meanwhile, Sri Sripada Lakshmipati Sastri had casually mentioned to me that the Madras University was contemplating to publish this book—Nannichoda's Kumarasambhavamu. Since I was a member of the Telugu Board of Studies and member of the Senate of the Madras University, I thought it improper to publish the very book whicht he University was contemplating to print and publish."

పై వాక్యములవలన వావిళ్లవా రప్పుడు నన్నెచోడని కుమారసంభవ ముద్రణోద్యోగమును జాలించు కొనిరని తెల్లమగుచున్న దికదా. ముద్రణోద్యోగమును జాలించుకొనిన పిమ్మట లక్ష్మీపతిశాస్త్రులవారు తా మూనలజేసిన మార్పులను వావిళ్లవారి ప్రతియందు చేర్ప వలసిన యావశ్యకత యెద్దియు లేదు. ఈరెండుకారణ ములవల్లను వావిళ్లవారి ప్రతిలోని పాఠములకును, లక్ష్మీ పతిశాస్త్రులవారిచే నన్యత్ర ప్రకటితములైన పాఠముల కును భేదము గాన్పించుచున్నది కాని వావిళ్లవారికి లక్ష్మీపతిశాస్త్రులవారు కుమారసంభవమును సంస్కరిం పక పోవుటవలన గాదు.

(౨) శ్రీ కోదండరామయ్యగారి విమర్శయందు సత్యదూరమైన విషయము మఱియొకటి కలదు. కుమారసంభవమునం దన్యులు చేసిన సవరణలనుగూడ తమ గురువులవారగు బ్ర. శ్రీ వేటూరి ప్రభాకర శాస్త్రులవారి కంటగట్టినారు. వావిళ్లవారి ముద్రణమున కు. సం. ౧౧-౭౩ వ పద్యమును విమర్శింపుచు నిట్లు వ్రాసియున్నారు. "తరువాతి పద్య మిది చూడుడు.

"...... ......జాగియు
చే ననిరొ తలంచు లోభి యొప్పకు నవికిన్
జాననిరొ తలచు తిరుకు
జాననిరొ తలంచు పందపరి రొల్లతనో."

(రామకృష్ణకవిగారి ప్రతి. ౬౧౩ వ.)

"ఈ పద్యమున మాత్రము వావిళ్లవారి ముద్రణములో నొకింత మార్పు గోచరించుచున్నది. ఆ మార్పు కూడ వ్రాత ప్రతి ప్రమాణముతో గాక యూహతో చేయబడినది. అదియు నవిచారమూలకము. చూడుడు.

"చాననియె తలచు జాగియు
'ననియె తలంచు లోభి యొప్పకు ననికిన్
జాననియె తలచు వీరుడు
జాననియె తలంచు బంద సరి యెట్లగునో."

"ఇందు తొలిపాదములోని గ్రంథపాతము పూర్తి చేయబడినది కాని యచట 'ఈననియు' యని యుండవలయును. త్యాగి (చాగి) తనకున్న ధనమంతయు 'ఈన్ + అనియు'—ఇతరులకు ఇచ్చుటకే యని తలచును. లోభి తన ధనమును 'ఈన్ + అనియు'—ఇతరుల కీయజాలను అని తలచును. ఇట్లే తక్కిన రెండు పాదములకును నర్థము చెప్పుకొనవలయును. వీరుడు చాన్ + అనియు = యుద్ధములో జచ్చుటకే కోరును. పంద చాన్ + అనియు నేను చావజాలనని పాఱిపోవును. త్యాగి లోభి ప్రార్థనములు (?) పదసారూప్యమును నర్థవైవిధ్యము కలిగియున్నవి. కనుక త్యాగి లోభి, వీరుడు పంద సరి కాజాలరు.

ఇట్లు అర్థానుకూలముగా మూడునాలుగు పాదముల రెంటను 'చాననియు' యనియుండుటచే దొలి రెండుపాదములలో గూడ నట్లే యుండెబోలునని శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు ఆపాదము (ల, నట్లు పూరించిరి. ఇపుడున్నట్లు 'చాననియు' యని తొలి పాదము పూరింపబడిన పద్యార్థము చెడును."

ఇందువలన దమ గురువుగారైన వేటూరి ప్రభాకరశాస్త్రిగారు రచనాలోచితముగ జేసిన సవరణను గురువులవారిపైగల యభిమానము పెంపున శ్రీ కోదండరామయ్యగారు దిద్ది సరిచేయుటయే కాక పద్యమునొక్క వాస్తవార్థమును భారతి మూలమున వారికి బోధించినారు. బలే! బలే! శిష్యుడన్న నిట్లుకదా యుండవలయును!

వాస్తవము విచారించగా 'చాననియు' యని పైపద్య ప్రథమద్వితీయ పాదములనుగాని, యథవా ప్రథమ పాదము నీ కాని శ్రీప్రభాకరశాస్త్రిలవారు సవరించియుండలేదు. 'ఈననియు' యని తిద్దినట్లు శ్రీ కోదండరామయ్యగారు పొందుపఱచిన సవరణయు కోదండరామయ్యగారిది కాదు. అది తెరువాటుకొట్టిసంపాదించినది. ఋజువుకావలయునని కోరువారు భారతి, ౧౫ వ సంపుటము ౧౯౩౮ వ సంవత్సరము సెప్టెంబరుమాసమున ముద్రితమైన ౯ వ సంచిక ౨౭౩-౨౭౫ పుటలలో ప్రకటితమైన 'కుమారసంభవములోని కొన్ని అపపాఠములు' అను శీర్షికగల వ్యాసమును జూడుడు. అందు ఇట్లు కలదు.

'క......చు జాగియు
నీననియు తలంచు లోభి యొప్పకుననికిన్
జాననియుతలచు వీరుడు
జాననియు తలంచు బంద సరియెట్లగునో.'

(కుమా. ౧౧-౬౧౪)

ఈపద్యమున నష్టభాగమును ఉద్ధరించి పద్యమును పూర్తిచేయవచ్చును. ఇందు చాగి, లోభి, వీరుడు, పంద వీరినలుగురి తలపులు సమానములు. అవి యెట్లు సమానమగును? అని కవి పృచ్ఛించుచున్నాడు. మఱియు వీరుడును పందయు 'జావని తలంచెదరు' అని వారి తలంపులనుకవి యొలుకపఱచుచున్నాడు. తక్కిన ఇద్దఱి తలంపులును నట్టివిగానే యుండవలయును. ఇంతేకాదు; తృతీయ చతుర్థపాదములకు 'ననియు తలచు' అను పదము సామాన్యము. ప్రథమ పాదమందలి క్రియాపదమునకు గడపటియక్షరము 'చు' అని నష్టశేషమైన పాదభాగమువల్ల దెలియుచున్నది. కావున ప్రథమభాగమునొక్క క్రియాపదము నైతము 'తలచు' అనుట నిశ్చయము. క్రింది మూడుపాదముల యందును 'నని (యు) తల (ం) చు' అని యుండుట చేత ఇచ్చటను 'ననియుతలచు' అని యుండుట యొప్పగును. పైజెప్పిన నలుగురును 'చాననియు' తలతురని యనుకొనుట యసమంజసము గాదు. కావున పద్యమిట్లుండవలయును.

"చావనియో తలచు జాగియు
జావనియో తలంచు లోభి; చను నెడ ననికిన్
జావనియో తలచు వీరుడు
జావనియో తలంచు పంద సరి యెట్లగునో."

నా (ముద్రిత కుమారసంభవ) ప్రతియందు పై పద్యమున కెదుట నిట్లు వ్రాసుకొనియున్నాను.

"౬౧౩ రెండవ పాదము. 'చావనియు తలంచు లోభి; చను నెడ ననికిన్'—'శబి'" అని. ఇందువలన రెండవ పాదమును పైరీతిని సవరించి చెప్పినవారు శ్రీ మానవల్లి రామకృష్ణకవిగారని స్మరణకు వచ్చినది. "ఇపు డున్నట్లు 'చావనియు' యని తొలిపాదము పూరింపబడిన పద్యార్థము కెడును" అని సెలవిచ్చినారు శ్రీ కోదండరామయ్యగారు. నా యభిప్రాయ మట్టిది కాదు. "త్యాగి తన త్యాగమువలన దనకు చావు కలుగను, అమరత్వముగలుగును, అనగా నశించని శాశ్వతకీర్తికాయము గలుగునని తలచును; లోభి వానకు చావు లేదు; కావున జగత్తుకు మూలమైన ధనమును ఆర్జింతును అని యెంచును. వీరుడు యుద్ధమునకు బోవు నపుడు నాకు చావు లేదు. వీరస్వర్గమును చూఱగొని యమరత్వమును బొందగలనని నిశ్చయించును; పంద నేను చావజాలనని రణపరాఙ్ముఖు డగును" అని తలచి పైరీతిని పద్యమును సవరించితిని. తప్పో, ఒప్పో పై 'చావనియు' యను సవరణ నాదికాని ప్రభాకరశాస్త్రుల వారిది మాత్రము గాదు.

ఇక 'ఈవనియు' యను సవరణ శ్రీ కోదండరామయ్యగారు చెప్పుకొనినట్లు వారిచే సేయబడినది కాదనియు, వారి గురువులవారైన బ్ర. శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రులవారిదనియు, గురువు పేరును స్మరింపక దమ పేరనే ప్రకటించుకొనిరనియు నిరూపించుచున్నాడను. నా స్వంత ముద్రిత కుమారసంభవప్రతియందు పై నుదాహరింపబడిన కు. సం. ౧౧: ౬౧౩ వ పద్యమున నిట్లు వ్రాసుకొనియున్నాను:

'క॥ ఈవని తలచుం జాగియు - నీవనియో తలంచు'—వే. ప్ర. శా.

"పై పద్యమును (ఇట్లు) సవరించి చెప్పినది వే. ప్ర. శాస్త్రిగారు. (ఇది వారు) తిరుపతి యుద్యోగమునకు బోవుటకు ఒకటి రెండు దినములకు ముందు. అప్పు డచ్చటికి నాతోగూడ శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మగారుకూడ వచ్చియుండిరి. ఈ సంస్కరణ మద్రాసు విశ్వవిద్యాలయమువారు ప్రకటించుచుండు కుమారసంభవములోని కెక్కించవలయును. అట్లు తలచుటకు గారణ మిది. "తరువాత కొన్ని దినముల కొకనాడు నేను ఆఫీసులో శ్రీ. ల. (శ్రీపాద లక్ష్మీపతిశాస్త్రులవారి)తో మాటల సందర్భమున వేటూరి వారి సంస్కార మిట్టిదని తెలియబఱచియుంటిని. నేడు (౧౮-౩-౧౯౪౨) మధ్యాహ్నము శ్రీపాదవారిది తా మొనర్చిన సంస్కారమని తెల్పిరి. పైగా తా మింతకుపూర్వ మొకపారి నాతో నీ విషయమును జెప్పినట్లు (కూడ) నుడివిరి. పండితులకును సత్యమునకును నెంత దూరమో !"

తుదిమాట: ప్రభాకరశాస్త్రులవారి సవరణ సమంజసమని తోచుటచే వారు చెప్పినప్పుడే దాని నంగీకరించితిని. అర్థము పొందికమాట యటుండనిచ్చి శాస్త్రులవారి సవరణ వ్రాతప్రతిపాఠమున మార్పున కెడము లేకుండ చేసినది. నా సవరణవలన రెండవ పాదమున వ్రాతప్రతిపాఠము నించుక మార్పవలసిన యావశ్యకత కలిగినది. సాధ్యమైనంతవఱకు వ్రాతప్రతి మార్పక సవరించుట యుత్తమపరిష్కారపద్ధతి. కావున ప్రభాకరశాస్త్రులవారి సంస్కరణ నంగీకరించితిని.

నేలటూరి వెంకటరమణయ్య.

కాలగ … గాంపే

ప్రాచీన వినోదములు

ప్రాచీనభారతదేశములో జీవితము నేటికన్నా ఆనందమయముగాను, ఆకర్షకరముగాను ఉండేది. ప్రతిపౌరుని దైనందిన జీవితము సుఖకరమగుటకు కావలసిన అవకాశములను, ఉపపత్తులను ప్రభుత్వమే ఇచ్చుచుండెడిది. సంఘములో అనేకవర్గము లున్నప్పటికిని, ప్రతివర్గమునకు కావలసినంత స్వేచ్ఛతోబాటు వికాసము, విజ్ఞానముకూడా ఇవ్వబడేవి. లలితకళలు మొదలగువానిద్వారా అన్నివర్గములవారు తాదాత్మ్యము పొందుచుండెడివారు. కాని నేటి పరిస్థితులు సంఘీభావమును, ఏకత్వమును ఉన్మూలించుచున్నవి. సినిమాలు, రేడియోలు మొదలగునవి ఈ ఉత్తమమైన తాదాత్మ్యమునకు ఆటంకములను తెచ్చుచున్నవి. ధనికులకుమాత్రమే ఇవి అందుబాటులో నుండుటచే ప్రజలలో ఆనందప్రాప్తికి ఇవి విఘ్నములను కల్పించి, వర్గకలహములకు, ఈర్ష్యలకు దోహదము లగుచున్నవి. దీనితోబాటు, నేడనేకసమస్యలు బయలుదేరి, అన్నివర్గములు ఏకత్ర సమావేశమగుటకు అవకాశములనుగాని, వ్యవధినిగాని, ఉపపత్తులనుగాని కల్పించుట లేదు.

బుద్ధుని కాలమున కౌశాంబి యొక ముఖ్యనగరము. ఇందలి ప్రజ లాకాలమున అనేకఅభిరుచులు గలవారుగా కనబడుచున్నారు. ఇచ్చట వింతవింతలైన పగడాలు, బొమ్మలు, గృహవస్తువులు దొరకినవి. సంగీతనాట్యములు, శృంగారచేష్టలు, శుకక్రీడలు విశేషముగా నీకాలమున ఉన్నట్లు తెలియుచున్నది. ఇచట ఒక బొమ్మరథము కలదు. జనులు కూర్చొను ప్రదేశమున నొక చక్కని తివాసీ యేర్పాటున్నది. ఈ బొమ్మ రథమున లోపలిప్రక్కలలో శృంగార చేష్టలు చిత్రించబడియున్నవి. ముగ్గురు సంగీతనృత్యములలో వ్యాపృతులైనట్లున్నది. సమీపముననే విదూషకుడుకూడా కలడు. మధ్యభాగమున ఫలములు మెండలైన తినుబండారములు గలవు. లోపలనున్న దంపతుల ఆభరణాలంకారములు వారు ధనికవర్గమువారని చెప్పుచున్నవి. ఈ చిత్రము క్రీస్తుపూర్వము మొదటి శతాబ్దమునకు చెందినది. దీనినిబట్టి ఆకాలమున పిక్నిక్ (*Picnic*) అనబడు వినోదార్థమైన స్థానచలనములు కలవని చెప్పవచ్చును. తద్వారా నాటి సాంఘిక, ఆర్థికపరిస్థితులు కొంత తెలియవచ్చుచున్నవి. ఇది అలహాబాద్ మ్యూజియములో కలదు.

ఇచటనే సరోవరక్రీడాచిత్ర మొకటి లభించినది. శృంగారోద్రిక్తులైన దంపతులు కుర్చీపై నూగాడుచున్నారు. వారిపాదములు నీటిలో నున్నవి. ఈ చెరువునిండా పద్మములు వికసించియున్నవి. ఈ చిత్రమున ఎడమప్రక్కన నొక వానర మున్నది. ఇది గఢ్వాల్ మ్యూజియములో కలదు. ఇందు వానర మెందుకున్నదో, దాని భావమేమో తెలియదు.

ప్రాచీనకాలమున పక్షులను ప్రయోజనార్థము పెంచెడివారు. ఇవి వార్తాహరులుగామాత్రమే గాక స్త్రీలకు వినోదకరములుగా కూడా ఉండెడివి. నేర్చుకొనవలసిన అరువదినాలుగుకళలలో శుకక్రీడ యొకటి యని కామశాస్త్రము చెప్పుచున్నది. కుషానులకాలపు మధురాశిల్పములలో నీ శుకములు విరివిగా కన్పించుచున్నవి. చేతులలోగాని, పండ్లమీదగాని, ముత్యముల వద్దగాని ఈ పక్షులు చిత్రించబడియున్నవి. ఒక చిత్రమున ఒకానొక స్త్రీ యొక్క అధరోష్ఠమును శుకము స్పృశించుచున్నట్లు గలదు. భావుకు లనినట్లు దాడిమ ఫలమనుకొని కామినీ అధరమును సమీపించిన దేమో!

పసుపోషణ ప్రాచీనకాలపు మరియొక వినోదము. రెక్కలు గల సింహముతో మనుష్యుడు పోరాడుచున్న చిత్రమొకటి కౌశాంబిలో లభించినది. భారుట్ లోని స్తంభముపై కొన్ని మంచిచిత్రము లున్నవి. పుసదత్త అను సన్యాసిని ఈ స్తంభమును, దానిపై చిత్రములను ఇచ్చినది. మనుష్యుల భుజములపై మనుష్యులెక్కి … గంతకుల గోపురమువలె నిలబడినట్లు దీనిపై ఒక బొమ్మగలదు ఇది. ప్రస్తుతము అలహాబా

మ్యూజియములో గలదు. పాట్నా మ్యూజియములో కౌశాంబీలో దొరకిన ఒక స్త్రీచిత్ర మొకటి గలదు.

నృత్య మనేకచిత్రములపై గలదు. భారుట్ లోని గంధారశిల్పమున సంగీతనృత్యసూలు చాలా గలవు. ఈరీతిగా ప్రాచీనశిల్పములను గమనించితిమేని ఆ వినోదము లనేకములు అవగతములు కాగలవు.

పోతుకూచి సుబ్రహ్మణ్యశాస్త్రి.

పాలకురికి సోమనాథుడు

(ఒక లేఖ)

అయ్యా,

మైత్రికతో శ్రీ బండారు తమ్మయ్యగారు మొన్నటి ఆషాఢ 'భారతి' సంచికలో వ్రాసిన వ్యాసమును చదివినాను. నే నంతకుముందు 'భారతి'లో శ్రీ తమ్మయ్యగారి 'పాలకురికిసోమనాథకవి' అనే గ్రంథమును సమీక్షిస్తూ వ్రాసినది శ్రీ తమ్మయ్యగారిని కొలదిచేయవలెననే ఉద్దేశముతో వ్రాసినానని వా రనుకొనడమువల్ల నామనస్సు చివుక్కుమన్నది. నాకు శ్రీ తమ్మయ్యగారి యెడల చాల గౌరవభావమున్నది. వాదప్రతిలో 'శోచనీయము' 'దురభిమానము.' 'దురహంకారము' 'ప్రగల్భములు' ఇత్యాది పదములను కోర్లించడము వ్యాసకర్తల కలవాటు కావడము ఎవరి విషయమునైనను తప్పే. నే నట్టిమాటలను నా వ్యాసములో వాడనట్టు జ్ఞాపకము.

శ్రీ తమ్మయ్యగారికిని నాకును మూడువిషయములు (౧) సోమనాథునికాలము (౨) అతని కులగోత్రములు (౩) అతని జన్మస్థానము అనేవాటిని గురించి ఏకీభావము కుదురదని వారికి స్వయముగానే వ్రాసిన ట్లొప్పుకొన్నారు. ఇక నా విషయమై చర్చ ముగిసినట్టే అనుకొంటాను. పతకవిషయములనుగూర్చిన చర్చ అప్రస్తుతము. శ్రీ తమ్మయ్యగారు వాటిని స్మరించలేదు.

శ్రీ తమ్మయ్యగారున్ను, కీ. శే. చిదిరెమఠము వీరభద్రశర్మగారున్ను నాకు వ్రాసిన ఉత్తరములు, అందులో వారు నాకు తెలిపిన అభిప్రాయములు అన్నీ నావద్ద ఉన్నవి. వాటినుపయోగించుకొన్నాను. వారితో ఏకీభవింపలేనిచోట్ల నా అభిప్రాయమును తెలిపినాను. వారి సౌహార్దమును ప్రశంసిస్తున్నాను.

ఉరవకొండమఠము దావావిషయము శ్రీ తమ్మయ్యగారికి తెలిసిఉండకపోవచ్చును. దానిలోని రికార్డు వీరశైవులకు చాలా ముఖ్యమైనది. దానిలో శ్రీ సదాశివయ్యగారు, ధార్వాడ్ ప్రాంతమునుంచి వచ్చిన శ్రీ శేఖర ఎమ్. ఏ గారు, శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి గార్లుకూడా సాక్ష్యమిచ్చినారు. ఆ రికార్డు నంతటినీ ఎవరయినా ప్రచురింప సంకల్పిస్తే దానిని 'ఎడిటు' చేయడానికి సంసిద్ధుడనుగా ఉన్నాను. కాని ఎవరికి కావాలి?

శ్రీ ప్రభాకరశాస్త్రిగారు శ్రీ వేంకటేశ్వర ఓరియంటల్ ఇన్‌స్టిట్యూటుజర్నలులో వ్రాసిన పండితారాధ్య చరిత్ర విమర్శను నేను చూడలేదు. వారుగాని, శ్రీ తమ్మయ్యగారుగాని ఒక కాపీ నాకు పంపితే కృతజ్ఞుడనై ఉంటాను. తప్పులుంటే సవరించుకొంటాను. లోకములో సర్వజ్ఞు డెవడు? సమాధానము చెప్పవలసి ఉంటే, చెప్పగలిగితే చెప్పుకొంటాను.

కాని, శ్రీ సదాశివయ్యగారి వాఙ్మూలమును తమ్మయ్యగారు తప్పక చదవాలి. దాని ప్రతిని సంపాదింప యత్నిస్తున్నాను.

ఈమధ్య 'త్రిలిఙ్గ' పత్రికలో శ్రీ ఇవటూరి సుందరయ్యగారు పాలకురికి సోమనాథునిగురించి శ్రీ తమ్మయ్యగారికిన్ని నాకున్ను ఒక మహాసంగ్రామము జరుగుతున్నట్టు భావించి, ఎందుకో కలుగజేసుకొని, ఆరువ్యాసములు వ్రాసినారు. కాని వా రావ్యాసముల పెక్కడెక్కడనో ఆరంభించి, ఏవేవో దారులు త్రొక్కి, తుదకు తంగేటితుప్పలలో దారితప్పి, తంగేటిజున్ను శబ్దవిచారముచేస్తూ, తంగేటితుప్పలలో తుమ్మెదలు చిన్న "సుప్ప"లను పెట్టుతాయనీ, అవి పిప్పరమెంట్లవలె ఉంటాయనీ, వాటిని చప్పరిస్తే చప్పచప్పగా, తియ్యతియ్యగా ఉంటాయనీ చెప్పి ముగించినారు. వారు చెప్పదలచుకొన్నది ఇంకా ఏదో ఉండి ఉంటుంది. పూర్తిచేస్తే బాగుంటుంది. కాని శ్రీ సుందరయ్యగారి మాటలు నిజమనుకొని తంగేటితుప్పల వెంటబడినా ఒక 'జుప్ప' అయినా నాకు చిక్కలేదు. నా దురదృష్ట మనుకుంటాను.

చిలుకూరి నారాయణరావు.



విమర్శనము

ఆంధ్ర కవితరంగిణి

మొదటి ఐదుసంపుటములు. గ్రంథకర్త: చాగంటి శేషయ్యగారు, కపిలేశ్వరపురం, తూర్పుగోదావరి జిల్లా. ఒక్కొకభాగము వెల రూ 3.

ఆంధ్రకవిజీవితములను తొలుత శ్రీ గురుజాడ శ్రీరామమూర్తిపంతులుగారు ప్రారంభించి ముప్పదుగుర చరిత్రములను ప్రకటించిరి. ఆపనిని అందుకొని శ్రీ కందుకూరి వీరేశలింగముపంతులవారు రెండు వందల ముప్పదుగుర చరిత్రములను వ్రాసిరి. ఆ తొంటి పెద్దలు గతించి దాదాపు ముప్పదిసంవత్సరము లైనవి. ఈలోపల అధునాతన చరిత్రపరిశోధనవలన మొదటిరచయితల యభిప్రాయములు అచ్చటచ్చట మార్పవలసిన యావశ్యకత యేర్పడినది. నూతనకావ్యములు, కవుల నామధేయములును దొరకినవి. ఈకృషి నంతటిని ఒక కడకు చేర్చి మరల సమగ్రమైన కవిజీవితములను వ్రాయవలసిన యావశ్యకత కలిగినది. దీనిని గుర్తించిన పండితులు పలువురైనను అట్టిపనికి పూనుకొని సార్థకముగా నైదుసంపుటములు వెలయించు భాగ్య మేమి, లేదా సాహసమైన నేమి శ్రీ చాగంటి శేషయ్యగారిది.

వీరి ప్రయత్న మెంతయు కొనియాడదగినదే గాని ఇందు కొన్ని కష్టములు గలవు. కేవలకావ్యవిమర్శకు చారిత్రజ్ఞాన మావశ్యకముగాదు కాని వాఙ్మయ చరిత్రమునుగాని, కవుల జీవితముగాని వ్రాయువారి కత్యంతావశ్యకము. కవుల చరిత్రములను వ్రాయువారు కేవలము ఆంధ్రపండితులుగానో, లేక చరిత్రపరిశోధకులుగానో మాత్రమే ఉండక ఉభయవిద్యాకోవిదులై యుండవలయును. భాషాంతర సంవాదాదికపూర్వముగా కావ్యవిమర్శములను శాసనములను సమన్వయించుటయే ఈకృషి.

మఱి—ఎత్తుగడ చాల గొప్పది. అప్రకారమే విస్తారము విషయములను గుప్పించినారు ఏతత్కర్త. పద్యములు, పూర్తిఆశ్వాసములు కాకపోయినను, శైలీనిదర్శనార్థము ఎక్కువగా ముద్రింపబడినవి. శాసనములుకూడ వెదకుకొనవలసిన యక్కఱ లేకుండ సంపూర్ణముగా ముద్రించినారు. ఒక్కొకచోట తాము వ్రాయవలసిన యక్కఱ లేకయే పలానివారిట్లు వ్రాయుచున్నారని కొన్ని పుటలు ఉదాహరణములతో నింపి ప్రకరణమును సమాప్తి నొందించినారు. ఈయైదు సంపుటములను రెండుసంపుటములలో పూర్తినొందించి యుండవచ్చును. అందువలన గలిగెడి నష్టము లేదుగాని ఐదుసంపుటములు వ్రాసినంత తృప్తి రెండుసంపుటములవలన కలుగునా?

కాని—వీరి రచన శాస్త్రీయమార్గమున (*Scientific method*) నడువలేదు. అక్కరలేని విషయములు పెరిగినవి. ప్రసక్తానుసారము శాసనముల నుదాహరించియుండిన చాలును. వేంగీచాళుక్యుల చరిత్రము అంత దీర్ఘముగా వ్రాయక చాలవఱకు సంగ్రహించి యుండవచ్చును. శాసనపంక్తులను వలసినవానినిమాత్రము వ్రాసి వాని యాకరములను సూచించియుండదగు. చర్వితచర్వణ మధికము. ముద్దలుముద్దలుగా నుదాహరణము లిచ్చుట వికారముగా నున్నది.

కవుల విషయము—వీరు ఇతరుల యభిప్రాయములను సేకరించి వ్రాసినవారేగాని తాము సల్పిన కృషి యత్యల్పము. 'ఒరిజినల్ రిసర్చి' అనదగినది కానరాదు. అట్టి ప్రయత్నము లొనర్చినచోట ప్రమాదములు జరిగినవి.

నన్నయభట్టారకుడు కర్ణాటకు డనుటకు ఆధారములు లేవని వ్రాసిన వీరికి 'నన్నయ శుద్ధాంధ్ర బ్రాహ్మణు'డని గట్టిగా నొక్కి చెప్పుట కేమాధారము? 'నన్నిమభట్టు భీమనభట్టు యొక్క రెండవ కుమారుడో, లేక చేతన భట్టుయొక్క కుమారుడో' అని వ్రాయుటకును ఆధారము మృగ్యము. చేలవిడిచిన సాము ఇది. కవిచరిత్ర వ్రాయగడగిన శేషయ్యగారు చరిత్రాంశములకు స్వస్తి చెప్పి కల్పన యేల చేయవలసివచ్చెనో?

గ్రామసంఖ్య—'తొమ్మిదినందల సంవత్సరములకు పూర్వము ఒక్క దక్షిణాపథమున నేడు లక్షల యేబదివేల గ్రామము లుండెనని తలంచుట కవకాశము లేదు. అందుచే నది గ్రామ

సంఖ్య కానేరదు. రాజునకు వచ్చునాదాయము.' ఇది సరిగాదు. నాటి గ్రామముల కొలత వేఱు, నేటి గ్రామముల కొలత వేఱు. నేటివానికన్నను నాటివి చిన్నవి. ఆదాయ మనుటకు ఆధారము లేదు. ఆదాయ మగునేని ఎన్ని శతాబ్దములైనను ఏమాత్రము హెచ్చు తగ్గులు లేక ఒకవిధముగానే ఆదాయము వచ్చుచుండునా. అట్లైనచో నాదాయముప్రకారము భిన్న కాలములలో ఒక ప్రదేశమునకే భిన్నసంఖ్యలు రావలె నేమి? వేంగి ౧౮ ౦౦ గాను, పాకనాడు ౨౧౦౦౦ గాను ఎప్పుడును మార్పులేక ఉండుట కేమి కారణము? ఇది స్పష్టముగా గ్రామసంఖ్య. పులకేశి ఐహోల్ శాసనమున నీవిషయమును చక్కగా చెప్పినాడు.

"అనయ దధిపతిత్వం యోా మహారాష్ట్రకాణాం,
నవనవతి సహస్రగ్రామభాజాం త్రయాణామ్."

ఇంతదూరము పోనేల? పాకనాడు ౨౧౦౦౦ అని మంచన కంఠోక్తముగా చెప్పియున్నాడు.

"అరుసందర్ వెలనాటిచోడ మనుజేం
ద్రాజ్ఞాపనం బూనిరు
స్తరశక్తిం జని యేకవింశతి సహ
స్రగ్రామసంఖ్యాకమై
ధరణిం బేర్చిన పాకనాడు..." (కేయూ. I-౭౪)

వీరు రచించిన చారిత్రకవిషయములలో చాల ప్రమాదములు గలవు. ఉదాహరణముగా దానార్ణవునిం గూర్చి రచించిన దానిలో వీరికి చరిత్రజ్ఞానము పూర్తిగా లేదని తోచుచున్నది. దానార్ణవుని మరణము 'స్వాభావికముగ సంభవించెనో, శత్రువులవలన గలిగెనో తెలియదు' అనియు, ౨౭ సంవత్సరములు వేంగి అరాజకముగ నుండెననియు, 'చాళుక్యదాయాదులలో మఱి యొవ్వరో బహునాయకులు బయలువెడలి రాజ్యమును బరిపాలించియుందురు' అనియు వ్రాసినారు. దీనింబట్టి వీరు ౧౯౮౦ కి తర్వాత గడచిన చారిత్రక విమర్శనమును పూర్తిగా చదువలేదని తోచుచున్నది. రెండవ అమ్మరాజును యుద్ధమున చంపి దానార్ణవుడు శకము ౮౯౨ లో (క్రీ.శ. ౯౭౦-౭౧ లో) వేంగికి రాజాయెను. (పెన్నేరు కందాయము తామ్రశాసనములు. (*J. A. H. R. S. XI.* P 87) మూడుసంవత్సరములు పాలించెను. ముదిగొండచాళుక్యులకు పాత్తపెని పరిపాలించుట కొనగెను. కర్నూలు జిల్లాలోని పెదకల్లుపాలకుడైన జటాచోడ భీముడు దానార్ణవుని యుద్ధమునందు చంపి వేంగిని కళింగమును పాత్తపెని గ్రహించెను. చోళ రాజరాజు రాయిక్క సాయముతో దానార్ణవుని కొమారుడు శక్తివర్మ జటాచోడుని యుద్ధమున చంపి ౯౯౯ క్రీ.శ. లో వేంగిని మరల గ్రహించు అను జటాచోడభీముడె వేంగీకళింగములను పాలించుచుండెను. ఈ యరాజక మనబడు కాలమున వేంగి కితడే ప్రభువు. ఈ విషయమునంతయు పరిశోధించి శ్రీ నేలటూరు వెంకటరమణయ్యగారు బహుకాలముక్రిందనే విపులముగా చర్చించినారు. ఇతర చరిత్రకారులు అంగీకరించినారు. వస్తు విజ్ఞానశేషయ్యగారు పాతవిషయములనే వ్రాయుచు క్రొత్త విజ్ఞానమును గ్రహింపకపోవుట శోచనీయము. ఇట్టివి గమనింపని వ్రాత పనికిరాదు.

చారిత్రకవిషయములను రచించునెడ వీరి పద్ధతి నిలుకడ లేనిది. ఒకప్పుడు చరిత్రకారులమీద భారము వేయుదురు. ఒకచోట తామే సిద్ధాంతము వచింతురు. విజయాదిత్య రాజరాజనరేంద్రుల చరిత్రములను పరిశీలింపక వీరు వ్రాసిన దంతయు నిరుపయోగము. రాజరాజు కల్యాణిచాళుక్యులకు సామంతు డనుటకు వీరికి 'మనసొప్పకున్నది'. ఇట్టివిషయములలో చరిత్రకారుల వాస్తవము నరయవలయునే గాని తమ యభిమానములను చూపరాదు. రాజరాజనరేంద్రుడు కల్యాణీచాళుక్యుల చక్రవర్తియైన త్రైలోక్యమల్లాహవమల్లునికి సామంతుడుగా క్రీ.శ. ౧౦౫౧ మొదలు ౧౦౬౧ వఱకు నుండెననుట నిర్వివాదాంశము. చరిత్రకారు లొప్పుకొనిన విషయము. ఆధారములు దృఢముగా గలవు. విజయాదిత్యుడు పశ్చిమచాళుక్యులకడ సేనాధిపతిగా నుండెననుట వివాదాంశమైనదని వ్రాసినారు. 'వేంగీమండలేశ్వరుడు' అని పశ్చిమచాళుక్యశాసనములలో పూర్వచాళుక్యబిరుదములతో నీతడు కనబడుటయేగాక ఇంకను ఇతర కారణములచేత నీసోదరులలో విజయాదిత్యుడు కర్ణాటకుల నాశ్రయించెననుట ఒప్పియున్నది. 'వేంగీపురవరేశ్వర' బిరుదమేగాని కల్యాణీసామంతులకు వేంగీమండలేశ్వర బిరుదమును విష్ణువర్ధననామధేయమును పూర్వచాళుక్యబిరుదములును లేవు. ఈతడు ఆంధ్రకర్ణాటక దేశములు రెంటను వచ్చుచు పోవుచు సమరోన్ముఖుడుగా నుండెను. క్రీ.శ. ౧౦౬౭ వఱకు వేంగి చోళులకు స్వాధీనము కాలేదు. ఈ చరిత్రములో నొక యక్షరమైనను తరంగిణీకారులు గ్రహింపమియు, ప్రాతదో దిలోనే యుండుటయు విచిత్రముగా నున్నది.

నారాయణభట్టును ప్రత్యేకాంధ్రకవిగా నుద్రించుట పూర్వకవిచరిత్రకారులమీద నొక 'యింద్రావు

మెంటు.* నన్నయ్యకు సాయమొనరించెనేగాని యీతడు ప్రత్యేకాంధ్రగ్రంథ మేదియు రచించినవాడు గాడు. నారాయణభట్టు కవుకనియు, త్రైలోక్యమల్లుని ప్రధాని వే అనియు, నన్నయుపహోద్యాయి వే అనియు వీరి యభిప్రాయము. ఇరువురు నొకరేగాని భిన్న పురుషులు గారు. చరిత్ర పరిశోధించిన వీరికి తెలియును. త్రైలోక్యమల్లుని ప్రధానిగాని, యాతని కొమార్తెగాని శత్రుదేశమున జొచ్చి శాసనము లిఖించుట సామాన్యముగా సంభవింపదు. యుద్ధరంగము ననేగాక సామాన్యముగా శత్రువుగాని అతని జనులుగాని—ముఖ్యముగా స్త్రీలు—దొంకినయెడల చెరబట్టక సులువుగా పోనిచ్చు దినములు గావవి. అనుక్షణము రాజకీయులు ప్రాణరక్షణకై చేయు ప్రయత్నములు మన మెఱుగమా? అట్టి శాసన మేర్పడుటచే రాజరాజనరేంద్రుడు తప్పక త్రైలోక్యమల్లుని సామంతుడనుట ఒప్పియున్నది. దీనింబట్టి నారాయణభట్టును నన్నయ చరిత్రయందు పఠించుటయే యుక్తముగాని ప్రత్యేకించుట అరయింక చాలియుచేత. కొచాంజ నేయ యనది నారాయణభట్టుతండ్రికి నామాంతరమట. అయ్యది బిరుదుగాని నామాంతరము గాదు. బిరుదు వేఱు, నామము వేఱు. వీరికి ఎంతో చెప్పినను ఈ నారాయణభట్టు కర్ణాటక కవిచరిత్రమున కానరాడు.

నూతనకవులను ఏలుకొనుటలో వీరు ఏమాత్రము జాగ్రత వహింపలేదు. భోజుని, క్షేమేంద్రుని ఆంధ్రకవులలో చేర్చుట వింత. 'ఇత డాంధ్రకవియా'యని సందేహించుచునే అతని కొక పూర్తిప్రకరణమును వ్రాయుట మఱియు వింత. వృథాగా పుటలను నింపినారు. భోజుడు ఆంధ్రకవి గాడు. మాళవపతి, సంస్కృతకవి. ఈతని జీవితమంతయు చుట్టునున్న రాజులతో యుద్ధమొనరించుటతోనే గడచి తుద కీతడు రణనిహతుడాయెను. ఆంధ్రభాషను నేర్చుటకుగాని, అట్లు నేర్చినను కవిత్వము చెప్పుటకుగాని అవకాశములేని మాళవీయుని ఆంధ్రకవితరంగిణిలో చేర్చుట హాస్యాస్పదము. వీరు ఇటీవలి చారిత్రకవిమర్శమెంగమైనను చూచలేదనుటకు మరియొక నిదర్శన మేమనగా రాజరాజనరేంద్రుడు భోజునికన్న నదృష్టవంతు డనుట. భోజుడు తన రాజ్యమందే యుండి విజిగీషువై పోరాడుచుండెను. రాజనరేంద్రు డన్ననో తనరాజ్యమునుండి భ్రష్టుడై మామసాయముచేతను, బావమఱదుల సాయముచేతను మూడుపర్యాయములు, మరల మరల, తనరాజ్యము పొందియు నిర్వహించుకొనలేక తుదకు కల్యాణీ చాళుక్యుల సామంతు డాయెను. మఱియొక పొరపాటేమనగా ముంజుడు తన రాజ్యమును భోజున కీయలేదు. తన తమ్ముడైన సింధులున కిచ్చెను. సింధులుని యనంతరము భోజుడు రాజ్యము వహించెను.

వీరు రచించిన మంత్రిభాస్కరుని చరిత్ర దారితెన్నులేని గహనము. వ్రాయదలపెట్టిన విషయము వారి మనసునకే విశదమైనట్లు లేదు. విశదపడియుండిన నంతటి తిక్కటముక్కట కవకాశ ముండెడు. వ్రాయదలచిన విషయము చక్కగ నవగాహపడకపోవుట చేతనే ౬౩ పుటలు కావలసివచ్చినది. వీరి వ్రాతను బట్టి చూడగా వీరు భాస్కరరామాయణమునుగూర్చి విశేషము ప్రయాసపడి తాళపత్రముల చెక్కింటిని పరిశోధించి నూతనవిషయములను కనుగొనినట్లు తెలియవచ్చుచున్నది. వాస్తవముగ శేషయ్యగా రింత శ్రమపడలేదు. తిరుపతిలో ౧౯౪౦ వ సంవత్సరమున జరిగిన అఖిలభారత ఓరియంటల్ కాన్ఫరెన్సు తెనుగు సెక్షనులో బ్ర. శ్రీ. కోరాడ రామకృష్ణయ్యగారి యాధ్యక్షతక్రింద 'భాస్కర రామాయణ సమస్య' అను శీర్షిక గల స్వలిఖితవ్యాసమును డాక్టరు వేలటూరి వెంకటరమణయ్యగారు పఠించియున్నారు. తరువాత నీవ్యాస మాంధ్రపత్రిక ఉగాది సంచికయందు ప్రకటింపబడినది. శ్రీ చాగంటి శేషయ్యగారు తాము తాళపత్రప్రతులను పరిశోధించి కనుగొన్నట్లు చెప్పిన నూతనవిషయములు అందు కానవచ్చుచున్నవి. ఇందుల కేమి కారణమో? వెంకటరమణయ్యగారి వ్యాసమునైనను స్మరింపకపోవుటకు కారణ మేద్దియో? ఆంధ్రకవితరంగిణి ౧౦౩ వ పుటయందు ఈ క్రింది వాక్యము కనబడుచున్నది. "కొన్ని రామాయణ తాళపత్రప్రతులలో హుళక్కిభాస్కరుడు రచించినవని కొన్ని పద్యము లుదహరింపబడినట్లు శ్రీ వేలటూరి వెంకటరమణయ్యగారు వ్రాసియున్నారు" వెంకటరమణయ్యగారు ఎచ్చటను నిట్లు వ్రాసినట్లగపడదు. వ్రాసినవారు వేటూరి ప్రభాకర శాస్త్రిలవారు. భారతి యందు హుళక్కిప్రగడ రామాయణముపై వారొక వ్యాసమును ప్రకటించియున్నారు. ఆ వ్యాసమునందు తమకు వెంకటరమణయ్యగారు భాస్కరరామాయణ తాళపత్రప్రతులలో గానవచ్చు హుళక్కిప్రగడ రామాయణములోని పద్యములను మూడింటిని వ్రాసియిచ్చినట్లు చెప్పియున్నారు. ఇంతే.

తిక్కనతాతయైన మంత్రిభాస్కరుడే భాస్కర రామాయణ కర్తయని వీరు ప్రతిపాదించినది చాల వింత తిరుగుడే కాకుండ విశ్వసనీయముగ లేదు. మంత్రి భాస్కరుడు రామాయణము నాంధ్రీకరించెననియు ఆ విషయమును తిక్కన చెప్పమికి కారణము 'మహాత్ముల హృదయములు దురవగాహములు' అనియు వీరు వ్రాసినది విమర్శదృష్టికి చాల దూరము. మంత్రిభాస్కరుడే రైనచో తిక్కన చెప్పియేయుండును. 'సారకవితాభిరాముడు' అనెనేగాని కవియని చెప్పలేదు. మరి కేతన చెప్పలేదు. పూర్వుల గొప్పతనమును చెప్పుటకు మొదలిడినవాడు ఈ గొప్పవిషయమును దాచడు.

తిక్కనగృహనామము కొట్టరువువారని స్పష్టముగా కేతన చెప్పుచుండ 'వీరి గృహనామము గుంటూరువారనియు బిమ్మట కొట్టరువుగా మారెననియు కొందరందురు' అని వ్రాసినారు. ఆ అన్నవారెవరో, గ్రంథమేదో తెలుపలేదు. ఇంకను ఆధారము లేదు. గుంటూరివిభుడనుట మాత్రమున తండ్రినివాసము గుంటూరని కాజాలదు. కొట్టరువు గ్రామము కాదు. కోష్ఠాగారము. అనగా రాజుయొక్క కోశములలో నొకటి. దానిమీది యధికారము తొలుతనుండి క్రమముగా నింటిపేరైనది. కొట్టరువే కొటారు. 'పాట్ల కొటా' రను మదరాసు గూడ్సుషెడ్డులోని కొటారు కూడ అయర్థము గలదే. తిక్కనయు, నాతనిపూర్వులును నెల్లూరివారే యని మాపితామహులు శ్రీ వేదము వెంకటరాయశాస్త్రిగారు తమ తిక్కన సోమయాజివిజయమందు (క్రీ. శ. ౧౯౨౦ నాటికే) నిర్ణయించి యున్నారు.

తిక్కన హరిహరుని తన హృదయమున నిర్మించుకొనిన దేవుడనుటకు ఆయనమాటలె యుండగా మనమెట్లు కాదనగలము? "ఏను విన్నపంబు సేయు తెఱంగుగా నంతస్సన్నిధిం గలిగించుకొని యమ్మహాకావ్యంబు నర్థంబు సంగతంబు సేసెద" 'అంతస్సన్నిధిం గలిగించుకొని = మానసమున తత్సన్నిధిని భావించుకొని' కావున హరిహరనాథాలయము లుండుటచే వానిలో నొకదానియందు కూర్చుండి తిక్కన వ్రాసెనని శేషయ్యగారనుట అసంగతము.

విషయముల నగ్గడించుటయందు శాస్త్రీయదృష్టి వలయును. ఆధారము లేని వాక్యములు వ్రాయరాదు. 'తిక్కన ప్రభురాజ్యస్థాపనాచార్య డను బిరుదు వహించి' అని వ్రాసినారు. ఎచ్చట కల దీ బిరుదు? కేతనలో లేదు. శాసనములలో నింతవఱకును కానరాదు. ఇతరాకరములలో తెలియవచ్చు కథమాత్రమే. కాని బిరుదముగా చెప్పుటను ప్రసక్తము గాదు.

ఎఱ్ఱాప్రెగ్గడనుగూర్చి వ్రాయుటలో ఎఱపోతసూరి స్వప్నములో కవికి కనబడెనని వ్రాయుట పొరపాటు. కవివాక్యము నారయుడు. 'మును ప్రబంధకల్పనా కుతూహలాయత్తం బగు చిత్తంబుతో నొక్కనాడు తదనుసంధానానుబంధసమాధి నిమీలితేక్షణుండనై యుండు నవసరంబున —సీ ... ప్రజ్ఞాపవిత్రు . మదీయ భావంబున నావిర్భావంబు నొంది' భావమనగా స్వప్నమా? స్వప్నకథ తిక్కనది. శేషయ్యగారికి గ్రంథపరిచయము చాల తక్కువైనట్లు తెలియుచున్నది.

ఎఱపోతసూరి 'కరపత్రి కృతిమంతుడు' అనుట నుదాహరించి 'కరపత్రి' యనన దొక గ్రామముగా నెంచనని తలంచి దరి దరి శ్రమపడినారు. ముద్రితపాఠము కరణి (*Tax Collector*) పత్రి గాదు. అనగా వేగినాటియందు అవాలినారి సుంకాధికారి. ఈ కరణపని ఉద్యోగము నెఱపించిన వేగినాటు.

ఎఱ్ఱయ నృసింహపురాణమున భారతశేషమును తాను పూరించినట్లు చెప్పుకొనియుండగా, 'ఉన్నత సంస్కృతాది' పద్యమును తా ముదాహరించియు, వీరు నృసింహపురాణమే ఈతని ప్రథమగ్రంథమని వ్రాయుట వింత! 'ప్రాక్తనసంతామితుఃర్యవర్తనుండైన' ఆ మహాత్ముడు అసత్యము వచించునా? రామాయణహరివంశము లెప్పుడైన రచించునుగాక, మొదట భారతశేషమును పూరించి తర్వాతనే నృసింహపురాణమును ఎఱ్ఱన ఆంధ్రీకరించెను. 'కతిపయాతురపరగ్రహజనిత నైసర్గికచాపలంబుకతంబున' అను వాక్యములు ఎఱ్ఱనయొక్క వినయమును తెల్పుచున్నవేగాని యసత్యము గాదు.

అరణ్యపర్వశేషమనుటలో శేషమనగా శిథిలములయిన భాగములనియే యర్థము కానేరదని వీరు వ్రాసినారు. శేషమనగా వినాశమను నర్థముసైతము గలదు. తిక్కనకాలములో చక్కగానే యుండి అనంతరము చెడిపోగా ఏల ఎఱ్ఱన 'తద్రచనయా కా' పూరించియుండరాదు? 'తద్రచనయా కా' అనుట కర్థమేమి? భాస్కరరామాయణశేషములను రచియించినవారుగాని, పోతన భాగవతమును పూరించినవారుగాని 'తద్రచ

నయకా' ఏల పూరింపలేదు? ఈగంటను 'తద్రచన' పొత్తుగా లేక నన్నయలో 'తద్రచన' కొంత యుండినందున ఎఱ్ఱన నన్నయభారతారణ్యపర్వమందలి క్రిమిదష్టభాగములనే పూరించియుండు ననుట కవకాశము కలుగుచున్నది. కావున శేషయ్యగారు తలంచినట్లు శిథిలశబ్దముచే నూతనచరిత్రాంశము లాగుటకు ప్రయత్నించుట ఊకదంపు.

ధవదూరు డను నొక క్రొత్తకవిని చేర్చినారు. (మూడవసంపుటము సంఖ్య ౩౦) భాస్కరధవదూర మహీపతియని యాతని పూర్తినామధేయమైనట్లు వ్రాసినారు. 'వినుతు లొనస్తా నాంధ్ర' ఇత్యాదిపద్యమందు 'ధవదూరు వేమ' అన్న భాగమును సమాసముగా గొనవచ్చును. ధవమును దూరునట్టి వేముని, అనగా వేదాంతియైన వేమన్నను అని యర్థము చెప్పవచ్చును. పై భాస్కరుడు కవియని యెచ్చటను లేదు. గండికోట శాసనమున నీతడు బుక్కరాయలమంత్రియని యున్నది. బుక్కరాయల కామాగుడంట ఔపచారికము. ఈతడు రాయల లెంక గావలయు. కావున కవియైన ధవదూరుడు లేడు, భాస్కరధవదూరుడు లేడు.

శ్రీగిరికవి శ్రీరంగమాహాత్మ్యమును రచించెనని తెలియుచున్నది అని వ్రాసినారు. ఎచ్చటనో? భావివిమర్శకుల సౌకర్యముకొఱకై పుటలంపుటలుగా శాసనముల నొసంగిన వీరు రెఫరెన్సులు చక్కగా నొకచోటనైన నొసంగలేదు.

మడికిసింగయ్యకు అనంతయ్య యను సోదరుడు కలడు. కాని ఇతడు వీరివిమర్శచే కవిగా నెలకొన్నాడు. వీరి కాధారము నామసామ్యమే. ఈయనంతకవియొక్క పెద్దలును మడికిసింగన పెద్దలును నామసామ్యము వహించుటచేతను, గోత్రము లొకటే యగుట వలనను, విష్ణుమాయానాటక గ్రంథకర్తయైన యనంతకవియు మడికియనంతయ్యయు నొకరేయని వీరి నిర్ణయము. వీరు మఱచిపోయినది, లేక వీరికి తెలియని విషయ మొకటి కలదు. రాధామాధవ మతము మడికి సింగనకాలమున నాంధ్రదేశమున లేదు. భాగవతకథలనుగొని రచించిన పారిజాతాపహరణాదులుకూడ తర్వాతివే. ౧౬ వ శతాబ్దమధ్యమువఱకును ఈమతానుసారిగ్రంథములు బయలువెడలలేదు. రాధామాధవమతాభినివేశముతో రచితమైన యావిష్ణుమాయానాటకము రాధామాధవకవిదేగాని మడికి అనంతయ్యది గాదు. తర్వాతి అనంతయ్య దొంగ యగుటచేతను, మడికి అనంతయ్య చాల ప్రాచీనుడగుటచేతను, చారిత్రకదృష్టిలేని శేషయ్యగారి మతము నిలువదు. శ్రీ కోరాడ రామకృష్ణయ్యగారి యభిప్రాయమే సమంజసము. ఏదో నూతనసిద్ధాంతము నెలకొల్పుచున్నా మను భావముతో వీరు అసలువిషయమును చూడలేదు

రుద్రదేవుడు 'నీతిసార'మను గ్రంథమును వ్రాసినాడని వీరు చెప్పినారు. దీని కాధారము శ్రీ మానవల్లి రామకృష్ణకవిగారి యభిప్రాయము. అదియు నిరాధారమైనదే. అధునాతనపద్ధతుల ననుసరించి కవితరంగిణి వ్రాయమొదలుపెట్టిన శేషయ్యగారు నిరాధారమైన యభిప్రాయమును ఊతగా గొని రుద్రదేవుని తెనుగుకవులలో చేర్చుట వింతలపరంపరలో నొకటి, మఱియు నీరుద్రదేవునికి ప్రతాపరుద్రుడను నామాంతర ముండినట్లు వ్రాసినారు. ఆధునికచరిత్రకారు లెన్ని పోకల బోయినను కాకతిరుద్రునకు ప్రతాపరుద్రు డను నామాంతరము లేదు. రుద్రదేవుడు వేఱు, ప్రతాపరుద్రుడు వేఱు. ఇంతేకాదు. కాకతిరుద్రుడు గ్రంథకర్త కాడు. రామకృష్ణకవిగారు బద్దెననీతిశాస్త్రముక్తావళి వ్రాతప్రతులలో నొకదానియం దాద్యమున గానవచ్చుచున్నదని యుదాహరించిన 'పరువడి నాంధ్రభాష' యను నజ్ఞాతచాటుపద్యమందు 'సంస్కృతంబులో బరగ ప్రతాపరుద్రనరపాలునిచే రచియింపబడ్డ యా నరవరు నీతిసారము' అనియే యున్నది. కావున నీతిసారము తెనుగుగ్రంథమునుం గాదు, దానిని కాకతిరుద్రుడు రచియింపను లేదు. విషయ మిట్లుండ కాకతిరుద్రుడు తెనుగు కవి ఎట్లాయెనో? ఇది చాలక వీరు సందుచేసికొని కాకతీయుల చరిత్రను ముదిగొండ చాళుక్యుల చరిత్రను సంకేతవృత్తములతోగూడ నిండేల చొప్పించిరో తెలియుటలేదు.

ఐదవసంపుటమం దధికముగా శ్రీనాథుని చరిత్రమే. ఇచ్చటను వీరు క్రొత్తగా కనిపెట్టిన దేదియు

లేదు. క్రొత్తవి వీరి పొరపాట్లు—గుంటూరు జిల్లా రేపల్లెతాలూకాలోని నల్లూరు కొల్పట్టణమని వీ రుపపాదించుట హాస్యాస్పదముగా నున్నది. ఐదువందల సంవత్సరములకు పూర్వము సముద్ర మెంత సమీపమున నున్నను నల్లూరు 'వారిధి తటీ కొల్పట్టణ'మనుటకు అవకాశము లేదు. జియాలజీ తెలియనివారి వ్రాత యిది. మదరాసుకోటకడనుండి దాదాపు నాలుగు వందలసంవత్సరములుగా సముద్రము అరమైలుదూరముకూడ తొలగిపోలేదు. పదిమైళ్లుపోవుటకు ఎంతకాలము పట్టును ?

నల్లూరనగా, 'నల్ల + ఊరు = నల్లూరు' అనుట వింత. నల్లూరన నగ్రహారమని యర్థము. ఏమాత్రము శాసనములను చూచియుండినను తెలియును. నల్లిల్లు వంటి శబ్దము. శ్రీనాథుని బాల్యసఖుడైన పెట్టి నెల్లూరివాడగుటచేతను, నెల్లూరు పాకనాటిలోని దగుటను, 'వారిధి తటీ కొల్పట్టణము' నెల్లూరికృష్ణా పట్టణమనుట కేల సందియమో ? మండలాభిమానమా ?

'నాకవిత్వంబు నిజము కర్ణాటభాష' యనుటపై నేమో వ్రాసినారు. నేలటూరి వెంకటరమణయ్యగారి యభిప్రాయము నుదహరించుచు 'ఈ వాక్యములనుబట్టి ఉత్తరాంధ్రమండలి భాష యాంధ్రమనియు, దక్షిణాంధ్ర మండలి భాష కర్ణాటకమనియు శ్రీనాథుని కాలమున వాడుచుండిరని యర్థమగుచున్నది.' అని వీరు విమర్శించినారు. నేలటూరివారి వాక్యములు వీరి కర్థమైనట్లు లేదు. 'శ్రీనాథుడు కర్ణాటకుడగుట నిశ్చయము. కాని కన్నడిగుడు మాత్రము కాజాలడు' అని నే. వెం. గారి వాక్యము. విజయనగర సామ్రాజ్య మేర్పడినది మొదలు దక్షిణాంధ్రదేశమునకు కర్ణాటనామము రూఢికెక్కినది. కర్ణాటకభాష యనగా కర్ణాటకదేశమందలి (యాంధ్ర) భాషయేగాని కన్నడము గాదు. కన్నడాంధ్రదేశము లనగా సరిగా కన్నడాంధ్రభాషలు మాటలాడు దేశములని తలంచుట పొరపాటు. నెల్లూరు జిల్లాలో చేరిన ఉదయగిరిని 'కర్ణాటకటకమధ్యస్థిత' అని (నెల్లూరి శాసనములు *III-O-72*) చెప్పుట చేతను శ్రీనాథుడు కర్ణాటకటకపద్మవనహేళి యనుటచేతను, ఈ ప్రదేశమందలి పలుకుబడులకును, కృష్ణా గోదావరుల పలుకుబడులకును చాల భేద ముండుటచేతను, శ్రీనాథుని కర్ణాటభాష కర్ణాటకదేశమందలి యాంధ్రభాష యని యేర్పడుచున్నది.

శ్రీనాథునకు అవచితిప్పయ బాల్యస్నేహితుడు. అట్టివాడు 'కుమారగిర్యధీశ్వరుని వసంతవైభవము సర్వము నొక్కట నిర్వహించు' వయసువాడై యుండ శ్రీనాథునకు కుమారగిరియాస్థానమున ప్రవేశము కలుగకపోవుటకు కారణ మాతని బాల్యమని వ్రాయుట విచిత్రముగ నున్నది. శ్రీనాథునికి వయసు చాలదు. అందుచే పాండిత్యము చాలదు. సమవయస్కునికి సెట్టికి వ్యాపారప్రజ్ఞ కలదా ? కుమారగిరిరెడ్డి కేల అంకితమీయలేదని ప్రశ్నించిన వీరు పెదకోమటి వేమునికి శ్రీనాథుడు ఏల అంకిత మీయలేదో చర్చింపలేదేమి ? కావున నిట్టి శుష్కవాదములవలన ప్రయోజనము లేదు. ఈ గ్రంథమున నిట్టి విమర్శలు తండోపతండములు.

హరవిలాసము రాజశేఖరుని హరవిలాసమున కాంధ్రీకరణముగా నుండునేమో యని వీ రనుమానించిరి. రాజశేఖరుడు ఔత్తరాహుడు. కేవల దాక్షిణాత్య కథలైన చిరుతొండ చరిత్రాదు లుండుటచే శ్రీనాథునిది స్వతంత్రగ్రంథముగా నున్నట్లు తోచుచున్న దేగాని రాజశేఖరుని గాదు.

ఇది స్థాలీపులాకన్యాయమున కవి జీవితాదుల విషయ స్వరూపము. మఱి వీరి రచన—శైలిలో ఏ మాత్రమును సొంపులేదు. భాషయు కొన్నిట అవ్యవస్థితముగా నున్నది. 'ధ్రువపడు' అనుటకు సర్వత్ర 'ధృవపడు' అనియే యున్నది. 'విడచి', 'పలికి' ఇత్యాద్యనిష్టరూపములు పెక్కులు. 'తమనుగూర్చి' - తమ్ముంగూర్చి అని వ్రాయవచ్చునే. అట్లే తనను 'గంటేరువాడి...పిలువబడు చుండెడిది.' అచేతనములను పిలుచుట తెనుగుమర్యాదకాదు. 'ధృవ, శర్మ'—ధ్రువశర్మ సాధువు. 'కాణిదెనచోడులని పిలుచుచున్నారు'—పిలచు తప్పు. పిలుచు ఒప్పు. వారి కాలములో 'పిలిచి' యుండదు. నేడు అందరేగాని

లువరు. ఇది ఇంగ్లీషు *call* నుండి వచ్చిన దాకరికము. 'చోళతిక్కరాజును తిరుకాళత్తి దేవుడని పిలచెదరు'. 'ఉదహరించు'—ఉదాహరించు అనవలయును.

అసందిగ్ధవాక్యరచనకు ఉదాహరణము—'అయ్యలార్య డీభాగమున పెదవేదగిరి నాయనింగారి ప్రేరణచే రచియింపబడినట్లు తాళపత్రప్రతులలో నున్నది.' అయ్యలార్యుడు రచియించునేగాని రచియింపబడడు. 'విన్నకోటవా రిప్పుడు నాగ్రామమునం దుండిరని తెలియుచున్నది.' ఇప్పుడు—ఉండిరి అనుట తెనుగా? 'ఇప్పుడు నున్నారు' అనరాదా?

ఇవియేగాక ప్రూఫులు దిద్దుటలో ప్రమాదముచే దొరలు అక్షరముల తప్పులు కొన్నివందలు గలవు. కొన్నిట పదవిభాగముకూడ లేదు. పద్యములలో యతులు తప్పులుగా పడినవి. ముద్రణమున జాగ్రత వహించియుండదగును.

ఇందు నీ రొనర్చిన భాషావాఙ్మయవిమర్శనము ఏమియు కానరాదు. వాఙ్మయపరిణామముగాని, కవిత్వపరిణామముగాని, తద్విశేషములుగాని, ఛందోలంకారాదికముగాని, వర్ణనాంశములనుగాని, వేనిని విమర్శింపలేదు. సాహిత్యవిమర్శ సున్న. శైలి చూడుడని ముద్దలుముద్దలుగా పద్యములను ముద్రించుటవలన నేమి ప్రయోజనము? విమర్శింపవలదా? ఎచ్చోనైనను పొరబాటున కావించిన కొద్ది గ్రంథవిమర్శ గ్రంథచౌర్యము. ఉదా—మా తాతగారి శృంగారనైషధము నుండి విస్తారము గ్రహించియు సంజీవనీవ్యాఖ్య పేరైన నెత్తలేదు. అట్లే భాస్కరరామాయణముంగూర్చి నేలటూరి వేంకటరమణయ్యగారి యభిప్రాయమును గ్రహించియు పేరు చెప్పలేదు.

ఈ యాంధ్రకవితరంగిణియందు వివాదగ్రస్తములైన విషయములు పెక్కులు గలవు. తప్పులు త్రవ్వితండములు. సరియైన కవిచరిత్ర ఇందువలన తెలియునని తలంపరాదు. పెక్కువిధముల దీనికన్నను శ్రీ కందుకూరి వీరేశలింగముపంతులవారి యాంధ్రకవిచరిత్రయే మేలుగా నున్నది.

వేదము వెంకటరాయశాస్త్రి

గ్రంథస్వీకారము

నాటక విమర్శనము

కర్త: శిష్టా రామకృష్ణశాస్త్రిగారు, యం. ఏ., ప్రాప్తిస్థానము: శిష్టావారి గృహము, బచ్చుపేట, బందరు.

కాలచక్రము

నవల. కర్త: భోగరాజు నారాయణమూర్తిగారు, ప్రకాశకులు: వాణీగ్రంథమండలి, రాజమహేంద్రవరము. వెల రూ. ౨౩.

విశ్వజ్ఞ వాస్తుసుధ

కర్తలు: అయినంపూడి ప్రసాదరావుచౌదరి, లావేటి రాజారావు ఆచార్యులుగార్లు, నిడమానూరు, విజయవాడ తాలూకా. వెల రూ. ౪.

పశువుల దివాణం

పెద్దకథ. జార్జి ఆర్వెల్ మూలము. అనువాదకుడు: జవమంచి రామకృష్ణగారు, 3, లలితాపురంవీథి, రాయపేట, మద్రాసు ౧౪. వెల రూ. ౧.

---

i అహల్యా గౌతమము (పద్యకావ్యము)
ii అభిషేక నాటకము (అనువాదము)

రచయిత: బులుసు వేంకటేశ్వర్లుగారు, బి. ఏ., రామారావుపేట, కాకినాడ. వెల: రెండేసి రూపాయలు.

సూర్యహాసను

కావ్యము. కర్త: దుగ్గిరాల రాఘవచంద్రయ్య సచ్చాస్త్రిగారు. ప్రకాశకులు: సద్బ్రహ్మాశ్రమము, బెజవాడ. వెల రూ. ౧.

పండితరాయలు

కావ్యము. కర్త: కొండూరి నరసింహంగారు, బి. జి. యం. హైస్కూలు, భీమవరము. వెల రూ. ౧౺.

గాంధీ భారతము - నిర్వాణ పర్వము

రచయిత: డా. యం. శేషాచార్యులుగారు, బందరు. వెల రూ. ౨౹.

ప్రథమ స్వతంత్ర యుద్ధము

చిన్న నాటకము. రచయిత: వైహారే. వెల రూ. ౧.

సీతమ్మ పెండ్లికత

కల్పితమైన చిన్నకథ. కొంతభాగము పద్యములలోను నిబద్ధమై యున్నది. రచయిత: శ్రీ పానగంటి పార్థసారథి రాయనింగారు, పానగల్ మహల్, పానగల్లు.

యస్. యస్. యల్. సి. నోట్సు

౧౯౩౦ యస్. యస్. యల్. సి. విద్యార్థులకు తెలుగు డిటెయిల్డు-నాన్‌డిటెయిల్డు పాఠ్య పుస్తకాలకును, సంస్కృత పాఠ్యపుస్తకమునకును, ఇ. యస్. యల్. సి. విద్యార్థులకు నెల్సన్ ఇంగ్లీషు రీడరుకును (III) విడివిడిగా సుప్రసిద్ధ విద్వాంసులచేత వ్రాయించిన టీకాతాత్పర్య గ్రంథము లివి. ఆయా విద్యార్థులు తెలుసుకోదగిన సమస్త విషయములు ఇంగులో తేట తెల్లముగా రచింపబడియున్నవి. ప్రకాశకులు: లిటిల్ ఫ్లవర్ కంపెనీవారు, విల్లుపురము. వెలలు, వరుసగా:—రూ. ౩-౮-౦; రూ. ౩-౨-౦; రూ. ౧-౯-౦.


దక్షిణదేశభాషాసారస్వతములు - దేశి

రచయిత: కోరాడ రామకృష్ణశాస్త్రిగారు, యం. ఏ., 33 సింగరాచారి వీథి, తిరువల్లికేణి, మద్రాసు. వెల రూ. ౨-౮-౦.

యోగసూత్ర సిద్ధాంతము

రచయిత: టంగుటూరి ప్రకాశంగారు. ప్రకాశకులు: శిల్పిప్రచురణలు, ౧౦ నరసింగాపురం వీథి, మౌంటురోడ్డు, మద్రాసు. వెల రూ. ౨౹.

Printed and Published by S. Sambhu Prasad, at the Andhra Patrika Press. No. 7, Thambu Chetty St., G. T., Madras. Editor— S. Sambhu Prasad.



హళేబీడులోని హొయిసలేశ్వర దేవాలయమునందలి కుడ్యశిల్పసంపద